

ఈనాడు



కరీంనగర్ 4-8-2017 శుక్రవారం సిటీ సంపుటి 43 సంచిక 356
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 20+16
www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



నిరుద్యోగులకు పోలీసు సాయం

'జాబ్ కనెక్ట్' సంచార వాహన సేవలు

ప్రారంభించిన డీజీపీ అనురాగ్ శర్మ -17లో



వలసకు పాయింట్ల లెక్క

- 'రైజ్' పేరుతో అమెరికాలో కొత్త చట్టానికి ప్రయత్నం
- సమర్థించిన ట్రంప్ -3లో
- భారత్ వంటి దేశాలకు మేలు



విశ్రాంతి, వినోదం

- జాతీయ రహదారుల పక్కనే ప్రయాణికులు, డ్రైవర్లకు సౌకర్య కేంద్రాలు -5లో
- రెస్టారెంట్లు, పార్కింగ్, మరమ్మతులకు ఏర్పాట్లు
- సరికొత్త విధానం ఆవిష్కరించిన నితిన్ గడ్కరీ

పశువైద్యం దైవాధీనం!

రాష్ట్రంలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. పశువుల దవాఖానాలు అస్తవ్యస్తంగా మారాయి. ఒకవేళ అవి బాగా ఉన్నాయనుకున్న చోట్ల వైద్యులు ఉండడంలేదు. దీంతో మూగజీవాలను కాపాడుకోవడం రైతులకు తలకుమించిన భారంగా మారిపోతోంది. ముఖ్యంగా వానాకాలంలో పశువులకు పలురకాల వ్యాధులు సోకుతుంటాయి. కొత్తగా మొలిచే గడ్డిలో అనేక రకాల క్రిమికీటకాలను తినడం వల్ల వాటికి రోగాలు వచ్చి చనిపోతుంటాయి. అలాగే పాముల బెడద కూడా ఎక్కువ. ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటికి సకాలంలో వైద్యం అందడం గగనంగా మారిపోయింది. వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది ఒక సమస్య అయితే తగిన మందులు లేకపోవడం మరో సమస్య. ఒకవైపు ప్రభుత్వం లక్షలాదిగా గొర్రెలను పంపిణీ చేస్తోంది. అందుకు తగినట్లుగా పశువైద్యులను కూడా నియమించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

- వివరాలు 17లో



తెలంగాణలోని పశువైద్యశాలల్లో ఖాళీలు

ఉద్యోగాల పేరు	మొత్తం పోస్టులు	ఖాళీలు
వెటర్నరీ అసిస్టెంటు సర్జన్	960	73
పశు గణాభివృద్ధి అధికారి	210	57
జూనియర్ వెటర్నరీ అధికారి	426	136
పశుగణ సహాయకులు	652	113
పశువైద్య సహాయకులు	778	744
ఉప సంచాలకులు	23	20
సహాయ సంచాలకులు	194	32

వైద్యం అందితే జీవాలు బతికేవి

గొర్రెలు, మేకల పెంపకమే మాకు జీవనాధారం. అవి రోగాల బారిన పడుతున్నా అందుబాటులో పశువైద్యశాలలు లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. మూడు నెలల క్రితం అంతుచిక్కని వ్యాధితో మూడు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వ్యాధిని నిర్ధారించి సరైన మందులను అందిస్తే అవి బతికేవి.

గోపెన బాపు,
వెంచపల్లి, మంచిర్యాల జిల్లా

ఆరేళ్లకే అరవై కిలోలు


యామిని

ఊబకాయంతో బాధపడుతున్న చిన్నారి

తోటి పిల్లలతో ఆడుతూపాడుతూ గడపాల్సిన ఆ చిన్నారికి.. నడకే నరక ప్రాయమైపోయింది. ఆరేళ్ల వయసులోనే అరవై కిలోల బరువుతో సతమతమవుతూ మంచానికే పరిమితమైంది. వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక.. కళ్లముందే బిడ్డపడుతున్న కష్టం చూడలేక ఆ అమ్మాయి తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణనాతీతం.

- వివరాలు 2లో

స్థిరాస్తి అక్రమాలకు చెల్లు

- చట్టబద్ధ అనుమతి ఉంటేనే క్రయవిక్రయాలు
- అభివృద్ధిదారు, ఏజెంటు ఇద్దరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా
- తెలంగాణ స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి నిబంధనలు నేటి నుంచి
- 2017 జనవరి 1 తర్వాత అనుమతి పొందిన అన్ని ప్రాజెక్టులకూ వర్తింపు

ఈనాడు – హైదరాబాద్

స్థిరాస్తి వ్యాపారంలో అక్రమాలకు కళ్లెం పడనుంది. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య, సొంతింటి స్థలాల క్రయవిక్రయాలకు చట్టబద్ధత లభించనుంది. కాగితం మీద గీతలు గీసి లేఅవుట్లుగా చెప్పడం, నోటిమాట మీద నమ్మించి వివాదాలున్న నిర్మాణాలు, స్థలాల విక్రయం... అనుమతి లేకుండా అపార్ట్‌మెంట్లు నిర్మించి ప్రజలకు టోపీ పెట్టడం లాంటి అక్రమ దందాలకు ఇకపై అడ్డుకట్ట పడనుంది. ఒక స్థలం, ఫ్లాటు కొనాలంటే ముందుగానే ఆ ప్రాజెక్టు వివరాల్ని ప్రభుత్వ వెబ్‌సైట్లో సరిచూసుకోవచ్చు. ప్రాజెక్టు అభివృద్ధిదారుడు సకాలంలో అప్పగించకున్నా, పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహించినా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు వీలు కలిగింది. ఇకపై ప్రతి ప్రాజెక్టు వివరాలూ సమగ్రంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి నిబంధనలు జారీ అయ్యాయి. జులై 31వ తేదీ జారీచేసిన జీవోనెం.202లో తెలంగాణ స్థిరాస్తి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ పేర్కొంది. శుక్రవారం గెజిట్‌లో ప్రచురించనున్నట్లు వెల్లడించింది. గెజిట్‌లో ప్రచురించినప్పటి నుంచి ఇది అమల్లోకి వస్తున్నట్లు స్పష్టంచేసింది. అంటే శుక్రవారం నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

నగరాలు, పట్టణాల్లో 2017 జనవరి 1 నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందిన అన్ని ప్రాజెక్టులకూ ఇది వర్తిస్తుంది. పట్టణాభివృద్ధి సంస్థలు, డీటీసీపీ, నగరపాలికలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, టీఎస్ఐఐసీ సంస్థలకు నిబంధనలు వర్తిస్తాయి.

కొనసాగుతున్న ప్రాజెక్టులు అంటే ఇవీ..

ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులకు ప్రత్యేక వివరణ ఇచ్చారు. 2017 జనవరి 1 తరువాత అనుమతులు పొంది నిర్మాణంలో (మిగతా 2లో)

భగీరథ ఎట్లుంది?

- ఊర్లో పేకాట పూర్తిగా పోయిందా..
- కేశవరం, లక్ష్మాపూర్ గ్రామస్థులతో ముచ్చటించిన కేసీఆర్
- ఫామ్‌హౌస్‌కు వెళుతూ మధ్యలో ఆగిన ముఖ్యమంత్రి

శామీర్‌పేట, న్యూస్‌టుడే: వారంలో ఒకసారి రాజీవ్ రహదారి మీదుగా ఫామ్‌హౌస్‌కు వెళ్లే ముఖ్యమంత్రి కేసీఆర్.. గురువారం దారి మార్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్-లక్ష్మాపూర్ మార్గంలో వెళ్లారు. దీంతో సీఎంను చూసేందుకు కేశవరం, లక్ష్మాపూర్ గ్రామస్థులు రహదారిపైకి వచ్చారు. కారులో వెళుతున్న కేసీఆర్‌ను చూద్దామనుకున్న జనాన్ని.. సీఎం ఒక్కసారిగా ఆశ్చర్యపరిచారు. తన వాహనశ్రేణిని ఆపించిన ఆయన.. కారులోంచి దిగి ప్రజల వద్దకు వచ్చారు. మిషన్ భగీరథ గురించి అడిగి తెలుసుకొన్నారు. తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కేశవరం గ్రామస్థులు అడగ్గా.. సున్నితంగా తిరస్కరించారు. ఎక్కువ నిధులిచ్చి సమస్యలను తీర్చుతానని హామీ ఇచ్చారు. 'పేకాట పూర్తిగా పోయిందా' అంటూ మహిళలను పలకరించారు. లక్ష్మాపూర్ గ్రామస్థులతో మాట్లాడుతూ.. 'కరెంట్ సరఫరా ఎలా ఉంది? రైతులకు 24 గంటలు ఇస్తే ఎలా ఉంటుంది?' అని సీఎం అడగ్గా.. నిరంతరాయంగా 15 గంటలు (మిగతా 2లో)


శామీర్‌పేట మండలం కేశవరంలో గ్రామస్థులతో ముచ్చటిస్తున్న సీఎం కేసీఆర్

రూ.5,000 వేతనం -17లో

పొదుపు సంఘాల సహాయకురాలికి సర్కారు సాయం



టికెట్ తీసుకోండి... తర్వాత చెల్లించండి

- తత్కాల్ టికెట్లకు కొత్త పథకం
- ప్రైవేటు భాగస్వామ్యంతో ఐఆర్‌సీటీసీ ద్వారా అమలు

దిల్లీ: 'టికెట్‌ను ఇప్పుడు బుక్ చేసుకోండి... తర్వాత డబ్బు చెల్లించండి' (బుక్ నౌ... పే లేటర్) పేరుతో తత్కాల్ టికెట్లకు సంబంధించిన కొత్త సదుపాయాన్ని 'భారతీయ రైల్వే ఆహార విహార సంస్థ' (ఐఆర్‌సీటీసీ) అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ అభిమతాన్ని ఎంచుకునే వారు టికెట్టును మరింత సులభంగా తీసుకునేందుకు వీలుంటుంది. ఈ ప్రయోగాత్మక పథకంలో ప్రతీ లావాదేవీపైనా- వర్తించే పన్నులకు అదనంగా 3.5% సేవా రుసుం పడుతుంది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా టికెట్‌ను తీసుకున్నవారు ఆ డబ్బును 15 రోజుల్లోగా ఆ వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. దీని కోసం అర్థశాస్త్ర ఫిన్‌టెక్ ప్రై.లి. అనే సంస్థతో ఐఆర్‌సీటీసీ ఒప్పందం కుదుర్చుకొంది.

కట్టకపోతే 36% వడ్డీ

'ఈ- పే లేటర్' అభిమతం ద్వారా ఇ-టికెట్‌ను తీసుకునేవారికి ఆ మొత్తం చెల్లింపు నిమిత్తం ఒక సంక్షిప్త సందేశం పంపడంతో పాటు, ఈ-మెయిల్ అనుసంధానత కల్పిస్తారు. 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని చెల్లించని పక్షంలో నూటికి ఏడాదికి 36 రూపాయలు చొప్పున అపరాధ వడ్డీ విధిస్తారు. ఆ ప్రయాణికుల ఐఆర్‌సీటీసీ ఖాతాను భవిష్యత్తులో వాడుకోవడానికి వీల్లేకుండా స్తంభింపజేస్తారు. ఒక పీఎన్‌ఆర్‌పై నలుగురు వరకు తత్కాల్ రిజర్వేషన్ తీసుకోవచ్చు.

మోదీ పర్యటన తర్వాత విశ్వసనీయత పెరిగింది

- తెలుగు రాష్ట్రాల్లో మూడు వ్యవసాయ కేంద్రాలు
- యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం
- ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కేర్మెన్ హామీ

ఈనాడు – హైదరాబాద్

భారత ప్రధాని నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పర్యటన తర్వాత రెండు దేశాల మధ్య విశ్వాసం, విశ్వసనీయత పెరిగి ద్వైపాక్షిక సంబంధాలు కొత్త రూపు సంతరించుకున్నాయని భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కేర్మెన్ చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, వాణిజ్య రంగం, రక్షణ-భద్రతా రంగాల్లో కలసికట్టుగా ముందుకు సాగడానికి మార్గాలు మరింత సుగమయ్యాయని అన్నారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ఇజ్రాయెల్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పరిశోధన రంగంలో ఉమ్మడి పెట్టుబడులు రెండు దేశాల మధ్య అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డేనియల్ కేర్మెన్ 'ఈనాడు' కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులతో ఆయన ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు.



తెలంగాణలో ఒకటి, ఏపీలో రెండు

భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఇజ్రాయెల్ విజయాలను చేరువచేస్తూ నెలకొల్పిన వ్యవసాయ విజ్ఞాన, నైపుణ్య కేంద్రాలు(వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు) చక్కటి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. మొత్తం 26 కేంద్రాలు నెలకొల్పాల్సి ఉండగా.. 15 ఏర్పాటయ్యాయని తెలిపారు. మరో నాలుగు రాష్ట్రాల్లో మిగిలిని వాటిని నెలకొల్పుతామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు, తెలంగాణ రాష్ట్రంలో ఒకటి చొప్పున వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉద్యాన పంటలకు సంబంధించి మూడు కేంద్రాలు ఉంటాయన్నారు. ఇజ్రాయెల్ ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంలో సాధించిన విజయాల్ని ఇవి చేరువ చేస్తున్నాయని చెప్పారు. ఈ కేంద్రాలను చూసి ఇతర దేశాల ముఖ్యులు ఆ దేశాల్లో కూడా ఇలాంటివే ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. వ్యవసాయం, సాగునీటి రంగంలో నీటి వినియోగం, పాడి పరిశ్రమలో రెండు దేశాలు పూర్తిగా సహకరించుకునేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు.

రెండు దేశాలకు ఉగ్రవాదం సమస్య

రెండు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, సామాజిక బంధాలను బలోపేతం చేసుకోవడానికి, పరస్పర ప్రయోజనాలు పొందడానికి ఉన్న అంశాలపై దృష్టి సారించామని డేనియల్ కేర్మెన్ తెలిపారు. ఆవిష్కరణలు, నీరు, వ్యవసాయం ఈ మూడు రంగాల్లో భారత్‌తో ఇజ్రాయెల్ కలసి పనిచేస్తుందన్నారు. రెండు దేశాల మధ్య శాస్త్ర సాంకేతిక రంగాల్లో చక్కటి అవగాహన ఉందని, రక్షణ రంగం సహా అనేక రంగాల్లో సహకరించుకుంటున్నాయని చెప్పారు. భారతదేశంలో స్టార్టప్ సంస్థలకు, కొత్త ఆవిష్కరణలకు ముందుకు వచ్చేవారికి ఇజ్రాయెల్ పూర్తి తోడ్పాటును ఇవ్వడమే కాకుండా వారి ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతిక తోడ్పాటును ఇస్తుందని హామీ ఇచ్చారు. భారత దేశం, ఇజ్రాయెల్ రెండూ దేశాలకు ఉగ్రవాదం సమస్యగా ఉందని, దీనిపై ఉమ్మడి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2018 నుంచి ఐదేళ్ల పాటు పరిశోధన-అభివృద్ధి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు రెండు దేశాలు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖల వారీగా పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను గుర్తించామని, వీటి ఆధారంగా ముందుకు వెళ్తామని చెప్పారు. నవజాత శిశువుల్లో ఆరోగ్య పరమైన అంశాలను గుర్తించేందుకు హైదరాబాద్‌కు చెందిన యువ ఆవిష్కర్త ప్రత్యూష రూపొందించిన పరికరాన్ని అభివృద్ధి చేసేందుకు ఇజ్రాయెల్ అన్ని విధాలా తోడ్పాటును అందిస్తుందన్నారు.

మరో మూడురోజులు భారీ వర్షాలు లేనట్లే

ఎగువన తగ్గిన కృష్ణా వరద

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంపై వరుణుడు కరుణించడంలేదు. ఈ నెల 7వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు లేవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయని, అంతకుమించి వర్షాలు ఉండవని తెలిపింది. మరోవైపు ఆలమట్టి ఎగువన కృష్ణానదికి ప్రవాహం తగ్గిపోతోంది. గురువారం 21,003 క్యూసెక్కులే నమోదైంది. ఆలమట్టి నుంచి 20వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ పూర్తిస్థాయిలో నిండింది. జూరాలకు 3,846 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

జలాశయం	పూర్తిస్థాయి నీటిమట్టం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటిమట్టం (టీఎంసీల్లో)
ఆలమట్టి	129.72	128.19
నారాయణపూర్	37.64	37.04
జూరాల	9.66	5.52
తుంగభద్ర	100.86	40.96
శ్రీశైలం	215.81	19.62
నాగార్జునసాగర్	312.05	116.26
పులిచింతల	45.77	3.21

రాజ్యసభలో కమలం కొత్త చరిత్ర

- తొలిసారి అతిపెద్ద పార్టీగా అవతరణ
- భాజపా - 58, కాంగ్రెస్ - 57

దిల్లీ: రాజ్యసభలో భాజపా తొలిసారి అతిపెద్ద పార్టీగా అవతరించి చరిత్ర సృష్టించింది. దశాబ్దాల తరబడి ఆధిక్యతను కొనసాగిస్తున్న కాంగ్రెస్‌ను ఒక్క స్థానంతో వెనక్కి నెట్టి ప్రథమంగా నిలిచింది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన భాజపాకు చెందిన సంపతీయ ఉయికే గురువారం ప్రమాణ స్వీకారం చేయడంతో.. 65 ఏళ్ల పాటు అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్‌ను భాజపా దాటింది. కేంద్ర మంత్రి అనిల్ మాధవ్ దవే మృతితో ఇక్కడ ఎన్నిక ఉపఎన్నిక జరిగింది. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్‌కు 57 మంది సభ్యులుండగా.. భాజపా బలం 58కి పెరిగింది. అయితే ఎగువసభలో భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం మాత్రం ఇంకా మైనారిటీలోనే ఉంది. 2018 వరకూ కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ. . ఈ ఏడాది ఇద్దరు సభ్యుల మృతితో ఆ పార్టీ బలం తగ్గింది. వచ్చేవారంలో పశ్చిమ్ బెంగాల్‌లో 6, గుజరాత్‌లో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ భాజపా ఆధిక్యం చెక్కుచెదరని పరిస్థితే కనిపిస్తోంది. గుజరాత్‌లో 2 స్థానాలను భాజపా సునాయాసంగా గెలుచుకునే వీలుండగా.. మరో స్థానంలో కూడా కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్‌కు గట్టి పోటీ ఇస్తోంది. పశ్చిమ్ బెంగాల్‌లో ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల పదవీకాలం ముగుస్తుండగా.. ఈ రెండింటిలో ఒక స్థానమే ఆ పార్టీకి దక్కే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించిన నేపథ్యంలో మిగతా 5 స్థానాలూ దాదాపుగా ఆ పార్టీ ఖాతాలోకే వెళతాయి. అలాగే వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో 9 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా. . భాజపా 8 గెలుపొందే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. దీంతో ఆ పార్టీ బలం మరింత పెరుగుతుంది. తమకున్న ప్రజాదరణతో సహజంగానే తాము అతిపెద్ద పార్టీగా అవతరించినట్లు కేంద్ర మంత్రి, భాజపా రాజ్యసభా పక్ష నేత అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ అని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ఎన్డీఏ ఎంపీలకు నేడు నమూనా ఓటింగ్

- హాజరు కానున్న తెరాస, వైకాపా, అన్నాడీఎంకే సభ్యులు
- రేపు ఉప రాష్ట్రపతి ఎన్నిక

దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఒక రోజు ముందు ఎన్డీఏ ఎంపీలకు శుక్రవారం నమూనా ఓటింగ్ నిర్వహిస్తున్నారు. చెల్లని ఓట్లు అనేవి లేకుండా చేసే దిశగా ఈ ప్రక్రియను చేపడుతున్నారు. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుకు మద్దతిస్తున్న తెరాస, వైకాపా, అన్నాడీఎంకే ఎంపీలు కూడా ఇందులో పాల్గొంటున్నట్లు భాజపా వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఓట్లను కోరుతూ ఎంపీలనుద్దేశించి వెంకయ్య నాయుడు మాట్లాడుతారని వెల్లడించాయి. సభ్యులందరికీ విందు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం ఉందని.. ఆయన ఎంపీలతో మాట్లాడుతారని భాజపా వర్గాలు తెలిపాయి. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా మొత్తం 77 ఓట్లు చెల్లకుండా పోగా.. వాటిలో 21 వివిధ పార్టీలకు చెందిన ఎంపీలవే ఉన్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటు ఉభయ సభల సభ్యులు మాత్రమే ఓటు వేస్తారు. ఈమేరకు ఎన్డీఏకు లోక్‌సభలో 337, రాజ్యసభలో 80 మంది సభ్యుల బలం ఉంది. తెరాస, వైకాపా, అన్నాడీఎంకే సభ్యులు ఉభయ సభల్లో వరుసగా 50, 17 మంది ఉన్నారు. మొత్తంగా ఎలక్టోరల్ కాలేజీలో ఓటేసే వారి సంఖ్య 790 కాగా.. వీరిలో వెంకయ్యనాయుడుకు 484 మంది ఇప్పటికే మద్దతు పలికారు.

ఆరేళ్లకే అరవై కిలోలు!

- ఊబకాయంతో బాధపడుతున్న చిన్నారి
- వైద్యానికి ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రుల దైన్యం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలం, కన్నారావుపేట గ్రామ పంచాయతీ శివారు బుచ్చిరెడ్డిపల్లికి చెందిన లునావత్ తార, దేవ్‌సింగ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్నకుమార్తె యామిని 2011లో 3 కిలోల బరువుతో జన్మించింది. నెలకు రెండు కిలోల చొప్పున.. ఏడాదికి సగటున పది కిలోల దాకా బరువు పెరుగుతోంది. 60 కిలోల బరువుతో ప్రస్తుతం యామిని కదల్లేని స్థితికి చేరింది. నిరుపేద కుటుంబమైనా, తల్లిదండ్రులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి బాలికను పలు ఆసుపత్రుల్లో చూపించారు. కానీ ఫలితం లేకపోయింది. రూ.3 లక్షల వరకూ ఉచితంగా చికిత్స అందిస్తారని తెలిసి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లామనీ... కానీ, అక్కడి వైద్యులు పట్టించుకోవడం లేదని దేవ్‌సింగ్ వాపోయారు. తమ ఆర్థిక పరిస్థితి, బిడ్డ పడుతున్న ఇబ్బందిని చూసిన నర్సంపేటకు చెందిన వైద్యుడు ఉచితంగా చికిత్స అందిస్తున్నారన్నారు. అయినా, నయం కావడంలేదని, కుమార్తె బరువు ఎందుకు పెరుగుతోందో వైద్యులు చెప్పడం లేదన్నారు. పెద్దకుమార్తె శ్రుతి పుట్టినప్పుడు మొదటి మూడేళ్లలో కొంత బరువు పెరిగినా ప్రస్తుతం బాగానే ఉందన్నారు. ఎటూ తిరగలేక ఇంటి వద్దే ఉంటున్న యామిని ఆలనాపాలనా చూడటానికి తల్లి తార ఇంటికే పరిమితమైంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చూపించి, బిడ్డకు మంచి వైద్యం అందించడానికి తమ ఆర్థిక స్థోమత సరిపోవడం లేదంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆపన్నహస్తం అందించి బిడ్డను ఆదుకోవాలని కోరుతున్నారు.



తల్లిదండ్రులు, సోదరితో యామిని

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షపత్రం లీకైందంటూ ఆందోళన

- తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రశ్నపత్రాల దహనం.. విగ్రహాలు ధ్వంసం
- లీకేజి అవాస్తవమంటూ నిర్ధారించిన కమిటీ

ఈనాడు, హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం ప్రారంభం కావాల్సిన పీహెచ్‌డీ, ఎంఫిల్ ప్రవేశపరీక్ష పత్రం లీకైందంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఒక విద్యార్థి చేతిమీద 'ఏబీసీడీ' అక్షరాలు రాసుకుని రావడంతో అలజడి మొదలయింది. దీంతో రిజిస్ట్రార్ వచ్చి చేతిమీద రాతలు ఉన్న విద్యార్థిని బయటకు పంపారు. అతడు వర్సిటీలో తాత్కాలిక ఉద్యోగి కావడం అనుమానాలకు తావిచ్చింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాలను వర్సిటీ ద్వారం ఎదుట దహనం చేశారు. కొందరు వర్సిటీ ఆవరణలోని కొన్ని విగ్రహాలను ధ్వంసం చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. వారి ప్రవేశాన్నీ విద్యార్థులు వ్యతిరేకించారు. వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ విద్యార్థులను వారించారు. వారితో చర్చలు జరిపి, వారి వినతి మేరకు కమిటీ వేశారు. కమిటీ సభ్యులు రాజునాయక్ (ఇఫ్లూ), లక్ష్మీనారాయణ (హెచ్‌సీయూ), సూర్య ధనంజయ్ (ఉస్మానియా) రోజంతా విచారించి.. ప్రశ్నపత్రం లీకేజి అవాస్తవమని తేల్చారు. చేతిపై రాసుకున్న 50 జవాబుల్లో అయిదు మాత్రమే సరైనవిగా గుర్తించినట్లు తెలిసింది. ఆ ఉద్యోగిని విధుల్లోంచి తొలగించడంతో పాటు, మూడేళ్ల పాటు వర్సిటీకి సంబంధించి పరీక్షల విధులకు అనర్హుడని ప్రకటించారు.



ప్రశ్నపత్రం లీకైందంటూ తెలుగు విశ్వవిద్యాలయంలో వీసీ సత్యనారాయణను చుట్టుముట్టిన విద్యార్థులు

పరీక్షలన్నీ రద్దు..

ఆందోళన చేస్తూ విద్యార్థులు ప్రశ్నపత్రాన్ని బయటకు పట్టుకువచ్చిన నేపథ్యంలో ఈ పరీక్షను రద్దు చేస్తున్నాం. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తాం. రాజమండ్రి, శ్రీశైలం కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అక్కడ పరీక్షను రద్దు చేయాలా? వద్దా? అనే అంశాన్ని న్యాయనిపుణుల సలహా మేరకు నిర్ణయిస్తాం. రెండు మూడురోజుల్లో జరగాల్సిన పరీక్షలన్నీ రద్దు చేస్తున్నాం.

– ఎస్వీ సత్యనారాయణ, ఉప కులపతి

ఇది కుట్ర

తెలుగువిశ్వవిద్యాలయం పరువు తీసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారు. గదుల్లో ప్రశ్నపత్రాల పంపిణీ ఇంకాపూర్తి కాకుండానే ప్రశ్నపత్రం లీకైందంటూ ఆందోళనకు దిగడంపై విచారణ జరిపించాలి.

– నిరీక్షణ్‌బాబు, వర్సిటీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి

భగీరథ ఎట్లుంది?

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తే సరిపోతుందని రైతులు చెప్పారు. రోజంతా కరెంటు ఉంటే భూగర్భ జలాలు తగ్గిపోవడమేగాక మోటార్లు చెడిపోతాయని గ్రామస్థులు వివరించారు. తమ గ్రామానికి నక్షా లేకపోవడంతో భూసమస్యలు తీవ్రంగా ఉన్నాయని సీఎం దృష్టికి తెచ్చారు. మీ తహసీల్దార్ పేరేంటని కేసీఆర్ అడగ్గా.. శ్రీకాంత్‌రెడ్డి అని చెప్పారు. పింఛను పొందే వయసున్నా ఆధార్‌కార్డులో పేరు తప్పుగా ఉన్నందున తమకు రావడం లేదని వృద్ధులు ఫిర్యాదు చేశారు. సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని విన్నవించేందుకు సమయాన్ని కేటాయించాలని కోరగా.. మీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని పంపిస్తానని, రెండు మూడు నెలల్లో సమస్యల్ని తీర్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పిన కేసీఆర్ అక్కడి నుంచి ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కేశవరంలో, మధ్యాహ్నం 2 గంటలకు లక్ష్మాపూర్ గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం స్థానిక అధికారులకు సమాచారం అందించడంతో అధికార యంత్రాంగం రెండు గ్రామాల్లో గ్రామసభను ఏర్పాటు చేసేందుకు పరుగులు తీశారు.

గ్రహం అనుగ్రహం

4–8–2017 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
ద్వాదశి: సా. 6-25 తదుపరి త్రయోదశి
మూల నక్షత్రం: రా. 9-41 తదుపరి పూర్వాషాఢ
అమృతఘడియలు: మ. 2-32 నుంచి 4-19 వరకు
వర్జ్యం: రా. 7-54 నుంచి 9-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-08 వరకు తిరిగి మ. 12-32 నుంచి 1-23 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-42; సూర్యాస్తమయం: సా.6-29
వరలక్ష్మీ వ్రతం

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	22.3	32.3
మహబూబ్‌నగర్	23.0	32.5
హైదరాబాద్	23.8	33.5
అనంతపురం	24.3	37.5
ఖమ్మం	25.0	34.0
నిజామాబాద్	25.0	34.0
కరీంనగర్	25.0	37.0
హన్మకొండ	25.5	35.0
నరసాపురం	25.8	34.0
శ్రీకాకుళం	26.0	36.0
గుంటూరు	26.0	36.0
కర్నూలు	26.0	36.5
రామగుండం	26.8	34.8
సూర్యాపేట	27.0	36.0
తిరుపతి	27.3	36.7

స్థిరాస్తి అక్రమాలకు చెల్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటూ... నివాస యోగ్యత పత్రం లేదా పూర్తయిన ధ్రువీకరణ పత్రం పొందని వాటికి వర్తిస్తుంది. జనవరి 1కి ముందు అనుమతి పొంది కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఈ చట్టం నుంచి మినహాయించారు. కేంద్ర చట్టం ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి అమల్లోకి రాగా నిబంధనలు రూపొందించుకునేందుకు రాష్ట్రాలకు 3నెలల గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర పురపాలకశాఖ నిబంధనలు విడుదల చేసింది.

ప్రతి ప్రాజెక్టుకూ నమోదు తప్పనిసరి

అభివృద్ధిదారుడు స్థిరాస్తి ప్రాజెక్టు చేపట్టాలంటే సంబంధిత స్థిరాస్తి నియంత్రణ సంస్థ వద్ద నమోదు చేయించాలి. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చే వరకు ఫారం-ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం సంబంధిత నియంత్రణ సంస్థకు ఉంటుంది. రిజిస్ట్రేషన్‌ను అవసరమైతే రద్దుచేసే అధికారాన్ని నిబంధనల్లో పేర్కొన్నారు. అభివృద్ధిదారు ఫొటో, చిరునామా, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ తదితర వివరాలతో పాటు పాన్‌కార్డు ధ్రువీకరణ కాపీని సమర్పించాలి. గత మూడేళ్లలో చేపట్టిన ప్రాజెక్టుల వార్షిక, ఆడిట్ నివేదికలు సమర్పించాలి. ప్రాజెక్టులో పార్కింగ్ వివరాలు, ఆ స్థలంపై అభివృద్ధిదారుడికి ఉన్న న్యాయపరమైన హక్కుపత్రాలు, వాటి లింకు డాక్యుమెంట్లు, ఈసీ జతచేయాలి. హక్కులు, యాజమాన్య హోదా, వివాదాలు తదితర వివరాలతో తాకట్టులేదని పేర్కొంటూ పదేళ్ల ప్రాక్టీసు ఉన్న న్యాయవాది లేదా తహశీల్దారు ర్యాంకుకు తక్కువ కాకుండా రెవెన్యూ అధికారితో ధ్రువీకరించాలి. ఒకవేళ అభివృద్ధిదారుడు ఆ భూమిపై హక్కులు లేకుంటే అసలు యజమానితో కుదిరిన ఒప్పంద పత్రం వివరాలు, ప్రాజెక్టు ఛైర్మన్, భాగస్వాములు, డైరెక్టర్ల చిరునామా వివరాలు పేర్కొనాలి. ప్రాజెక్టు రిజిస్ట్రేషన్‌కు ఫీజు చెల్లించాలి.

- ■ సమూహ గృహ నిర్మాణ ప్రాజెక్టులు అయితే... నిర్మాణ స్థలం 1000 చ.మీ..లోపు ఉంటే... చ.మీ.కు రూ.5 చొప్పున, అంతకు మించితే రూ.10 చొప్పున చెల్లించాలి. అయితే ఈ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 లక్షలకు మించి ఉండకూడదు.
- ■ నివాస, వాణిజ్య అభివృద్ధి ప్రాజెక్టు అయితే 1000 చ.మీ..లోపు స్థలానికి చ.మీ..కు రూ.10 చొప్పున, అంతకు మించితే రూ.15 చొప్పున గరిష్ఠంగా ఏడు లక్షలు కట్టాల్సి ఉంటుంది.
- ■ వాణిజ్య ప్రాజెక్టుల్లో స్థలం విస్తీర్ణం 1000 చ.మీ. లోపు అయితే చ.మీ.కు రూ.20, అంతకు మించితే చ.మీ.కు రూ.25 చొప్పున గరిష్ఠంగా రూ.10 లక్షలు ఫీజుగా వసూలుచేస్తారు.
- ■ నివాస ప్లాట్లుగా చేస్తే చ.మీ.కు రూ.5 చొప్పున... గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఫీజు ఉంటుంది. ఫీజు చెల్లించే సమయంలో విక్రయించేవారి పట్ల ఎలాంటి వివక్ష చూపబోమని ధ్రువీకరించాలి.
- ■ ఒకవేళ అప్పటికే ప్రాజెక్టు నిర్మాణంలో ఉండి... నివాస యోగ్యత పత్రం జారీ కాకుంటే అనుమతించిన ప్రణాళిక, అందులో చేసిన సవరణలు, తొలుత మంజూరైన ప్రణాళిక వివరాలతో మూడునెలల్లోగా దరఖాస్తు చేయాలి.
- ■ ప్రాజెక్టు నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి తీసుకున్న మొత్తం... ఇప్పటివరకు ఖర్చుచేసినది, మిగిలినది పేర్కొనాలి. ప్రాజెక్టు నిర్మాణస్థితి తెలియజేయాలి. ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తిచేయాలి? ఎందుకు ఆలస్యమైంది? తదితర విషయాలు స్ట్రక్చరల్ ఇంజినీరు, ఆర్కిటెక్ట్, సీఏతో ధ్రువీకరించి ఇవ్వాలి.
- ■ నిర్మిత స్థలం, కార్పెట్ ఏరియా వివరాలు పేర్కొనాలి. ప్లాట్లను లేఅవుట్ ప్రకారం విక్రయించారా? లేదా? తెలియజేయాలి.
- ■ రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన గడువులోగా ప్రాజెక్టు పూర్తికాకుంటే ఆ అనుమతిని పొడిగించుకునేందుకు మూడునెలల ముందే దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో తొలి రిజిస్ట్రేషన్‌లో సగాన్ని చెల్లించాలి.

ఎవరు డీఫాల్ట్ అయినా జరిమానే

అభివృద్ధిదారుడు నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేయకున్నా, నివాసాన్ని అప్పగించకున్నా అప్పటి బ్యాంకు వడ్డీరేటుకు అదనంగా 2 శాతం చెల్లించాలి. అదే కొనుగోలుదారుడు సకాలంలో చెల్లిచంకుంటే ఇదే నిబంధన వర్తిస్తుంది. చట్టంలోని నిబంధనలకు లోబడి జరిమానా, వడ్డీలు అభివృద్ధిదారుడు నిర్మాణదారుడికి 90 రోజుల్లో కట్టాలి.

స్థిరాస్తి ఏజెంట్లు...

స్థిరాస్తి వ్యాపారం నిర్వహించే ఏజెంట్లు ఇక నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాన్‌కార్డు, ఫొటో, చిరునామా వివరాలతో దరఖాస్తు చేయాలి. వ్యాపారం నిర్వహిస్తున్న ప్రాంతం, ఆ చిరునామా తెలియజేయాలి. ఒక్కరే వ్యాపారం నిర్వహించే వారైతే రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.10 వేలు, సంస్థలుగా నిర్వహిస్తే రూ.50 వేలు చెల్లించాలి. నియంత్రణ సంస్థ వివరాలతో సంతృప్తి చెందితే ఐదేళ్ల కాలపరిమితితో కూడిన రిజిస్ట్రేషన్ మంజూరు చేస్తుంది. కాలపరిమితి ముగిసిన తరువాత పునరుద్ధరణకు వ్యక్తి రూ.5 వేలు, సంస్థ ద్వారా అయితే రూ.10 వేలు ఫీజుగా చెల్లించాలి. పునరుద్ధరణ కాలపరిమితి ఐదేళ్లు. ఏజెంటు..లావాదేవీల పుస్తకాన్ని నిర్వహించి, అవసరమైన పన్నులు చెల్లించాలి.

స్థిరాస్తి నియంత్రణ సంస్థ...

స్థిరాస్తి చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఈ సంస్థలో ఛైర్మన్, సభ్యుల స్థానాలను భర్తీచేస్తుంది. అథారిటీకి కొన్ని విధి విధానాలు, అధికారాలు కల్పించారు. యేటా ఈ సంస్థ ఇచ్చిన అనుమతులు, వాటి స్థితి, వేసిన జరిమానాల వివరాలతో సర్కారుకు నివేదిక ఇవ్వాలి. నియంత్రణ సంస్థ నిర్ణయాలపై స్థిరాస్తి వ్యాపారులు తెలంగాణ స్థిరాస్తి అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను అప్పీలు చేసుకునేందుకు అవకాశమిచ్చారు. అక్రమాలకు పాల్పడిన అభివృద్ధిదారుడు ఏజెంట్లపై జరిమానాలు విధించే అధికారం నియంత్రణ సంస్థకు కల్పించారు. అక్రమాలు జరిగినట్లు నిర్ధారణయితే జరిమానాలు విధించవచ్చు. ప్రాజెక్టు, అపార్ట్‌మెంటు, ప్లాటు సంబంధిత లావాదేవీకి అనుగుణంగా మొత్తం ధరలో కనీసం 10 శాతం జరిమానా ఉండేలా నిబంధనలు రూపొందించారు.

వివరాలన్నీ వెబ్‌సైట్లో...

అథారిటీ వద్ద నమోదైన అభివృద్ధిదారుల చిరునామా, గత అనుభవం, చేపట్టిన స్థిరాస్తి ప్రాజెక్టుల వివరాలన్నీ వెబ్‌సైట్లో పెడతారు. గత ఐదేళ్లలో అభివృద్ధిదారు చేపట్టిన నిర్మాణాలు, వాటి స్థితి ఉంటుంది. ప్రతి అభివృద్ధిదారుడికి ప్రత్యేక లింకు ద్వారా వివరాలన్నీ తెలిపేలా ఏర్పాట్లుచేస్తారు. స్థిరాస్తి ప్రాజెక్టుకు సంబంధించి ఇచ్చిన ప్రకటనలు అందులో ఉంటాయి. ఏజెంట్ల వివరాలు, చిరునామా, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్‌ల వివరాలన్నీ లభ్యమవుతాయి. ప్రాజెక్టు స్థలం కచ్చితంగా అంతర్జాల మ్యాప్‌లో పొందుపరుస్తారు. ప్రాజెక్టు అభివృద్ధి ప్రణాళిక, అక్కడ కల్పించే కనీస మౌలిక సదుపాయాలు... అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రాజెక్టు ప్రారంభం తరువాత అభివృద్ధి దారుడికి లభించిన అనుమతులు, భూమి వినియోగ పత్రాలు, భూమి హక్కు పత్రాలు, తాకట్టు వివరాలు వెబ్‌సైట్లో ఉంటాయి.

ఇదీ సంగతి!



పాకిస్థాన్ దేశ ప్రభుత్వ అధికార వెబ్‌సైట్‌ను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు కొద్ది సమయం పాటు హ్యాక్ చేశారు. హ్యాకింగ్‌కు పాల్పడ్డవారు భారత పతాకాన్ని, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఉండే సందేశాన్ని అందులో ఉంచడం గమనార్హం. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు అనే సందేశంతో పాటు, భారత త్రివర్ణ పతాకాన్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. భారత జాతీయ గీతాన్ని కూడా ఉంచారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కొందరు సెలవులో ఉండగా మరికొందరిని ప్రస్తుత పోస్టు నుంచి మరోచోటకు బదిలీ చేశారు

వలసకు పాయింట్ల ఆధారిత వ్యవస్థ

- 'రైజ్' పేరుతో కొత్త చట్టానికి అమెరికా ప్రయత్నం

వాషింగ్టన్: దేశంలోకి చట్టబద్ధంగా ప్రవేశించే వలసదారుల సంఖ్యను తగ్గించేందుకు ఉద్దేశించిన కీలక చట్టానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు తెలిపారు. దీని కింద ప్రతిభ ఆధారిత వీసా పథకం అమల్లోకి వస్తుంది. భారత్ వంటి దేశాల నుంచి వచ్చే ఉన్నత విద్యావంతులు, సాంకేతిక నిపుణులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

'రిఫార్మింగ్ అమెరికన్ ఇమిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్' (రైజ్) అనే ఈ చట్టం వల్ల ప్రస్తుత లాటరీ ఆధారిత వ్యవస్థ రద్దవుతుంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదించి, చట్ట రూపంలోకి వస్తే.. గ్రీన్ కార్డు సాధించడానికి పాయింట్ల ఆధారిత వ్యవస్థ అమలవుతుంది. అప్పుడు వలస కోసం దరఖాస్తు చేసినవారిలో ఆంగ్ల భాషా నైపుణ్యం, విద్య, అధికవేతనాలతో కూడిన ఉద్యోగ ఆఫర్, వయసు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. రైజ్ చట్టానికి తన మద్దతు తెలియజేయడానికి ఆయన గురువారం ఇక్కడ వైట్ హౌస్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఈ చట్ట రూపకర్తలు, సెనేటర్లు అయిన టామ్ కాటన్, డేవిడ్ పెర్‌డ్యూలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. దాదాపు 50 ఏళ్లలో ఇది గణనీయమైన వలస సంస్కరణ అని చెప్పారు. ప్రస్తుతం అమల్లో ఉన్న తక్కువ నైపుణ్య వ్యవస్థకు ఇది మంగళం పలుకుతుందని, గ్రీన్ కార్డు అందుకోవడానికి పాయింట్ల ఆధారిత వ్యవస్థను ఇది ప్రవేశపెడుతుందని తెలిపారు. "ఈ రైజ్ చట్టం.. పేదరికాన్ని తగ్గిస్తుంది. వేతనాలను పెంచుతుంది. వందలకోట్ల డాలర్ల మేర పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఆదా చేస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఆంగ్లం మాట్లాడగలిగే; ఆర్థికంగా తమకు, తమ కుటుంబాలకు అండగా ఉండగలిగే, అమెరికా ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటును అందించగలిగే వారి దరఖాస్తులను మాత్రమే సానుకూలంగా పరిశీలించడానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు. అమెరికా ఉద్యోగులకు అవకాశాలను హరించకుండా ఇది నిరోధిస్తుందని చెప్పారు. నైపుణ్యరహిత వలసలను తగ్గించడం వల్ల అమెరికా ఉద్యోగుల జీతాలు పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత వలస విధానం అమెరికా పౌరులు, ఉద్యోగుల పట్ల సక్రమంగా లేదన్నారు. అమెరికాకు ఒకప్పుడున్న పోటీతత్వ ఆధిపత్యాన్ని ఇది తిరిగి తెచ్చిపెడుతుందని తెలిపారు. "ఇబ్బందుల్లో ఉన్న అమెరికన్ కుటుంబాల పట్ల మన సహృదయాన్ని ఈ చట్టం తెలియజేస్తోంది. వీరి అవసరాలను, అమెరికాకు ప్రాధాన్యం ఇచ్చే వలస వ్యవస్థను సాకారం చేయాలి" అని పేర్కొన్నారు.

దక్షిణాసియావాసులకు నష్టం

ట్రంప్ మద్దతిస్తున్న రైజ్ చట్టం వల్ల అమెరికాలోకి చట్టబద్ధంగా వచ్చే వలసదారుల సంఖ్యను సగానికి తగ్గిస్తుందని దక్షిణాసియా పౌర హక్కుల సంస్థ 'సౌత్‌ఏషియన్ అమెరికన్స్ లీడింగ్ టుగెదర్' (సాల్ట్) పేర్కొంది. ఇది దక్షిణాసియా సమాజంపై ప్రభావం చూపుతుందని తెలిపింది. కుటుంబాలను విడదీసే, వలసలదారుల్లో తప్పుడు వర్గీకరణలు తెచ్చే విధానాలు సరికాదని సంస్థ డైరెక్టర్ లక్ష్మి శ్రీధరన్ పేర్కొన్నారు.

వేలానికి రాజీవ్ స్వ'గృహాలు'

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయింపు
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్మించిన ఫ్లాట్లను ఆగస్టు చివరివారం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నపాటి పనులు మినహా అన్ని వసతులతో నిర్మించిన గృహాలను యథాతథంగా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిదశలో బండ్లగూడలో ఉన్న 2,245, పోచారంలోని 1474 ఫ్లాట్లను విక్రయిస్తామన్నారు. ప్రతి ఫ్లాట్‌కు ప్రత్యేక ధరను నిర్ణయిస్తామని, త్వరలోనే వెబ్‌సైట్‌లో విక్రయ మార్గదర్శకాలు, నమోదును అందుబాటులోకి తెస్తామన్నారు. విభజన తర్వాత తెలంగాణ వాటాగా వడ్డీతో కలిపి రూ.1,069 కోట్లు రాజీవ్ స్వగృహపై భారం పడిందని, ఇప్పటివరకు రూ.820 కోట్ల రుణాలను తీర్చినట్లు వివరించారు. ఆర్థికశాఖ ఆమోదం తర్వాత త్వరలో బకాయిలను పూర్తిగా తీర్చుతామన్నారు. ఫ్లాట్ల విక్రయం ద్వారా రూ.545 కోట్ల ఆదాయం రానుందని మంత్రి పేర్కొన్నారు.

'వీఆర్వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి'

మలక్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో వీఆర్వోలు చాలీ చాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం ఓ సారి ఆలోచించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శివశంకర్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వీఆర్వోల సంక్షేమ సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. వీఆర్వోల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వీఆర్వో సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉపేంద్రరావు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లోని నాయకులు ఆధిపత్య పోరుతో దాడులకు దిగుతున్నారన్నారు. తక్షణమే తమ డిమాండ్లని పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'మైన్' సాంకేతికతతో చిన్నారుల్లో అంధత్వం గుర్తింపు

మైక్రోసాఫ్ట్‌తో తెలంగాణ సర్కారు ఒప్పందం: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: చిన్నారుల్లో దృష్టి సమస్యలను ముందుగానే గుర్తించి, చికిత్స అందించేందుకు వీలుగా... తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా మైక్రోసాఫ్ట్ ఇంటెలిజెంట్ నెట్‌వర్క్ ఫర్ ఐకేర్ (మైన్) క్లౌడ్ సాంకేతికతను వినియోగించనున్నట్లు ఐటీ మంత్రి కేటీఆర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మైక్రోసాఫ్ట్ సమన్వయంతో ఐటీ, ఆరోగ్యశాఖలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా 'రాష్ట్రీయ బాలస్వాస్థ్య' కార్యక్రమంలో మైన్ టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించింది. మైక్రోసాఫ్ట్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా, అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 18 ఏళ్ల వయసున్న యువత ఆరోగ్య వివరాలను అధ్యయనం చేస్తారు. తద్వారా చిన్నారుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం వీలవుతుందని మంత్రి వెల్లడించారు. మైక్రోసాఫ్ట్‌తో ఈ-పరిపాలన, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, నైపుణ్య రంగాల్లో సహకారం తీసుకునేందుకు డిసెంబరులో ఒప్పందం చేసుకున్నా... తొలుత ఆరోగ్య రంగాన్ని ఎంచుకున్నట్లు ఐటీశాఖ కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. మైన్ టెక్నాలజీతో చిన్నారుల్లో అంధత్వాన్ని దూరం చేసేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల ఎల్వీప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు జీఎన్‌రావు హర్షం వ్యక్తంచేశారు.

బాలీవుడ్ దిగ్గజం దిలీప్ కుమార్‌కు అస్వస్థత

ముంబయి: ప్రముఖ బాలీవుడ్ దిగ్గజం.. సీనియర్ నటుడు దిలీప్ కుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 94 ఏళ్ల దిలీప్ కిడ్నీ సంబంధిత సమస్యలతో బుధవారం సాయంత్రం ముంబయిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఆయన్ను తొలుత ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. గురువారం ఉదయానికి ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని దిలీప్ సతీమణి సైరాబాను తెలిపారు. 'నిన్నటి కన్నా ఈరోజు (గురువారం) ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. ఇక్కడి వైద్యులు దిలీప్ పట్ల ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందిస్తున్నారు' అని సైరాబాను చెప్పారు. ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలించినట్లు తెలిపారు. అయితే గురువారం సాయంత్రం మళ్లీ కొన్ని పరీక్షల కోసం తిరిగి ఐసీయూకి తీసుకెళ్లనున్నట్లు వైద్యులు చెప్పారు. ఆరు దశాబ్దాలపాటు చిత్రసీమలో రాణించిన దిలీప్ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి ట్రాజెడీ కింగ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఇసుక మాఫియా

మురళీధర్‌రావు విమర్శ

వేములవాడ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇసుక మాఫియానే నడిపిస్తోందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు విమర్శించారు. గురువారం వేములవాడలో నేరెళ్ల ఘటన బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. రోజుల తరబడి యువకులపై పోలీసుల చిత్రహింసలు కొనసాగాయన్నారు. తెరాస అండతోనే పోలీసులు ఇంత ఘోరానికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వరే దాడికి సంబంధించి బాధ్యులైన ఎస్పీ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ జిల్లా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

35 వేల ఇళ్లను నిరుపేదలకు అందించాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు నిరుపేదలకు ఇచ్చిన రెండు పడకల ఇళ్ల హామీ అమలు చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ఆరోపించారు. హైదరాబాద్ శివారులో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సుమారు 35 వేల ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయని, కొన్ని నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారన్నారు. వాటిని పేదలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం గ్రామం పరిధిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో నిర్మించిన సుమారు 6 వేల గృహాలను పార్టీ నేతలతో కలిసి లక్ష్మణ్ పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. మూడేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ రెండు పడకల ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షల హడావుడి చేస్తున్నారే.. తప్ప అమలు చేయడం లేదన్నారు. నేరెళ్ల సంఘటనలో బాధ్యులైన పోలీసులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సీఎం సమాధానం చెప్పాలన్నారు.





ఈనాడు


మన బడికి దిద్దాల్సిన ఒరవడి!

బుద్ధిని వికసింపజేసి, ఊహలకు రెక్కలు తొడిగి జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించేది బడి. అంతటి విశిష్ట ప్రాధాన్యం కలిగిన సరస్వతీ నిలయాల్లో వార్షిక పరీక్షలు గట్టెక్కినా లేకున్నా, పైతరగతికి పంపించే (నో డిటెన్షన్) విధానంపై వేటు వేయాలని కేంద్ర మంత్రిమండలి తాజాగా నిర్ణయించింది. దేశంలో 2010 ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన విద్యాహక్కు చట్టంలోని ముఖ్యాంశాల్లో- ఎనిమిదో తరగతి వరకు కల్పించిన ఆ వెసులుబాటు ఒకటి. ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా పైతరగతికి వెళ్లిపోయే సౌలభ్యం క్షీణ ప్రమాణాలకు ప్రబల హేతువవుతున్నదంటూ వివిధ రాష్ట్రాలు రెండేళ్లుగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. 2015లో 18కి పరిమితమైన వాటిసంఖ్య, ఇటీవల రెండు డజన్లకు పైబడింది! నో డిటెన్షన్ విధానం రద్దుకు కేంద్ర విద్యా సలహా మండలి (సీఏబీఈ) ఏడాదిక్రితమే ఓటేసింది. మెజారిటీ రాష్ట్రాల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుని కేంద్రం వెల్లడించిన నిర్ణయానుసారం- వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల్ని అయిదు, ఎనిమిది తరగతుల్లో నిలిపివేసేందుకు సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అది ఆమోదముద్ర పొందిన దరిమిలా- చదువుపై శ్రద్ధ, విద్యార్థుల్లో పోటీతత్వం ఇనుమడిస్తాయని కేంద్రప్రభుత్వంతోపాటు సంఖ్యాధిక రాష్ట్రాలూ దృఢంగా విశ్వసిస్తున్నాయి. అదే తరగతిలో విద్యార్థుల నిలిపివేతకు ముందు మరోసారి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తామనడం సముచితంగానే ఉంది. ఉత్తీర్ణత సాధిస్తేనే పైతరగతికి పంపించే పద్ధతికి మళ్లడం[?] ద్వారా పునాది చదువుల అమాంతం తేటపడి, ప్రమాణాల మెరుగుదల సుసాధ్యమైపోతుందా? కానే కాదు. ఎనిమిదో తరగతి వరకు ఎలా చదివినా నడిచిపోతుంది లెమ్మన్న ఉదాసీన ధోరణులకిది విరుగుడైనా- ప్రమాణాల బాగుసేతను లక్షించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సత్వరమే మరిన్ని అంశాలపైనా దృష్టి సారించాల్సి ఉంది!

ఒకటో తరగతిలో చేరింది మొదలు ఎనిమిదో తరగతి వరకు విద్యార్థి గ్రహణ శక్తి, మార్కులతో నిమిత్తం లేకుండా మెట్టు ఎక్కించే విధానం తాలూకు పర్యవసానాలు కళ్లకు కడుతూనే ఉన్నాయి. అసర్ నివేదికలు, రాష్ట్రాల విద్యా పరిశోధన శిక్షణ మండళ్ల (ఎస్‌సీఈఆర్‌టీలు) అధ్యయనాలు ఎప్పటికప్పుడు ప్రమాణాల పతనానికి అద్దం పడుతూనే ఉన్నాయి. వాటన్నింటి పట్ల అవగాహనతోనే కావచ్చు- పాఠశాల విద్య పటిష్ఠతపై నియుక్తమైన గీతాభుక్కల్ ఉపసంఘం నాలుగేళ్ల క్రితమే డిటెన్షన్ పద్ధతిని గట్టిగా సిఫార్సు చేసింది. మరోవైపు, 'నో డిటెన్షన్'కు సమర్థంగా కొన్ని రాష్ట్రాలు భిన్నగళంతో స్పందిస్తున్నాయి. ఏనాడో 1975లోనే ఆరో తరగతి వరకు ఆ పద్ధతిని ప్రవేశపెట్టిన తెలుగుగడ్డపై, అనంతర కాలంలో తొమ్మిదో తరగతి దాకా అనుత్తీర్ణత లేకుండా చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ- డిటెన్షన్‌కు మళ్లితే అర్థాంతరంగా చదువు మానేసేవారి సంఖ్య పెరుగుతుందని, కాపీయింగ్ జోరెత్తుతుందని ఆందోళన చెందుతున్నాయి. ఈ విరుద్ధ వాదనల నేపథ్యంలో మధ్యేమార్గంగా, అమలు స్వేచ్ఛను రాష్ట్రాలకే వదిలిపెట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రకటించింది. 'నో డిటెన్షన్'పై ఏకీభావానికి రాలేపోయిన రాష్ట్రాలన్నీ ఉమ్మడిగా[?] ప్రస్తావిస్తున్న సమస్యల పరిష్కారంలో కేంద్రం నిర్ణాయక భూమిక వహించాల్సి ఉంది. తరతమ భేదాలతో అన్నిచోట్లా విద్యాప్రమాణాల పతనం, బోధన సిబ్బంది ఖాళీలు- మౌలిక లోటుపాట్లను ప్రస్ఫుటీకరిస్తున్నాయి. నియామకాలు, శిక్షణ ఏర్పాట్లు, బడుల్లో ప్రాథమిక సదుపాయాలు... ఎటుచూసినా వడివడిగా[?] పూడ్చాల్సిన కంతలెన్నో కనిపిస్తున్నాయి. అందులో సుస్థిర పురోగతి- వ్యవస్థాగతంగా సాధించాల్సిన ఉత్తీర్ణత!

మానవ వనరులకు పదునుపెట్టి వారి శక్తియుక్తుల్ని జాతి శ్రేయానికి ఉపయుక్తంగా మలచుకోవడంలో ప్రాథమిక చదువుల ప్రాశస్త్యం ఎనలేనిది. ఆ యథార్థాన్ని ఆకళింపుచేసుకొన్న దక్షిణ కొరియా, ఫిన్‌లండ్, తైవాన్, హాంకాంగ్ ప్రభృత దేశాలు బోధకుల నిరంతర శిక్షణకు పెద్దపీట వేస్తున్నాయి. చిన్న తరగతుల ఉపాధ్యాయులకు ఆకర్షణీయ వేతనాలు ముట్టజెప్పి, వారు విద్యార్థుల్లో దాగి ఉండే సహజసిద్ధ ప్రతిభకు మెరుగులద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. విద్యపై స్థూల దేశీయోత్పత్తిలో వ్యయశాతం ప్రాతిపదికన న్యూజిలాండ్ (21.6), మెక్సికో (20.5), బ్రెజిల్ (19.2), దక్షిణ కొరియా (16.5) వంటివి భారత్ (ఒకటిన్నర శాతం లోపు) కన్నా యోజనాల దూరం ముందున్నాయి. వ్యక్తిని విశ్వమానవుడిగా తీర్చిదిద్దగలిగేది విద్యేనంటున్న మోదీ ప్రభుత్వానికి- ప్రపంచంలోనే అత్యుత్తమ ఉపాధ్యాయుల సృష్టి అత్యావశ్యకమన్న ఐబీఎస్‌సీ (ఇండియన్ బిజినెస్ స్కూల్ కాన్ఫరెన్స్) ఉద్బోధ శిరోధార్యం కావాలి. 'ఆక్స్‌ఫామ్' నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు ఆరున్నర లక్షల మంది ఉపాధ్యాయులకు సరైన బోధన శిక్షణ లేదు; అయిదు లక్షల బోధన సిబ్బంది ఖాళీల్ని భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పుడున్న సిబ్బంది నాలుగేళ్ల గడువులో[?] కనీసార్హతలు సాధించి తీరాలంటూ ఇటీవలే విద్యాహక్కు చట్టాన్ని సవరించిన కేంద్రం- నాణ్యమైన ప్రాథమిక విద్యాగంధాన్ని అందరికీ పంచడమే లక్ష్యంగా పటిష్ఠ కార్యాచరణకు ఉపక్రమించాలి. పాఠ్యాంశాల్లో సహేతుక మార్పులు, ఖాళీల భర్తీ, ప్రమాణాల ఉన్నతి, విస్తృతావసరాలకు అనుగుణమైన బడ్జెట్ కేటాయింపులు, సకల విధాల పాఠశాలల పటిష్ఠీకరణ... ఇదీ, సమగ్ర అజెండా. పకడ్బందీ కార్యాచరణకు ప్రజాప్రభుత్వాలు మనసా వాచా కర్మణా నిబద్ధత చాటితే- తరగతిలో ప్రతి విద్యార్థీ ఆణిముత్యమే. అత్యుత్తమ ప్రాథమిక విద్యాబోధనకు, 'శ్రేష్ఠభారత్' ఆవిష్కరణకు దిద్దాల్సిన ఒరవడి అదే!

చేలలో క్రాంతి... కళ్లలో కాంతి!



చెరుకూరి వీరయ్య

నాగార్జున సాగరం... ఎంత అందమైన పేరు! గతకాలపు గర్వోన్నత స్మృతులను తలపింపజేసే పేరు. పేదరికాన్ని, కరవు కాటకాలను పారదోలి, తెలుగుజాతికి పాడిపంటల్ని, భోగభాగ్యాల్ని సమృద్ధిగా సమకూర్చిన పేరు. ఆ పేరు తలచుకొన్న మాత్రానే ప్రతి తెలుగువాడి మనసూ పులకరిస్తుంది. ఆనందంతో పరవశిస్తుంది. అలాంటి నాగార్జున సాగరానికి ఇది స్వర్ణోత్సవం. తెలుగు వారందరికీ సంబర సమయం.

నల్గొండ జిల్లాలో నిర్మించిన నాగార్జున సాగర్- కామధేనువుగా, కల్పతరువుగా తెలుగు వారందరి భాగ్యోన్నతికి విశేషంగా తోడ్పడింది. నందికొండ గ్రామ పరిధిలో ఈ ప్రాజెక్టును నిర్మించారు. నాగార్జున సాగర్ డ్యాముకు ఎగువన ఉన్న ఈ గ్రామం, జలాశయం ఏర్పడిన తరవాత ముంపునకు గురైంది. ఆ గ్రామం పేరుతో తొలుత ఈ ప్రాజెక్టును నందికొండ ప్రాజెక్టు అనే పిలిచేవారు. రెండో శతాబ్దంలో ఆ ప్రాంతంలో బౌద్ధ మత ప్రచారం చేసిన ఆచార్య నాగార్జునుడి పేరిట ఈ ప్రాజెక్టుకు తరవాత నాగార్జున సాగర్‌గా నామకరణం చేశారు. అప్పట్లో విజయపురి అనే పట్టణం నాగార్జున కొండపై, కృష్ణానదికి ఇరువైపులా వెలసి, ఎంతో ప్రసిద్ధి పొందింది. డ్యాముకు ఇరువైపులా ఉన్న జనావాసాలకు అదే పేరును స్థిరీకరించారు.

ఆధునిక దేవాలయం

నాగార్జున సాగర్ డ్యాముకు 1955 డిసెంబరు 10న నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. 'ఇది నవ భారత మానవతా మందిరానికి పునాది. దేశమంతటా మనం నిర్మించబోయే మరెన్నో ఆధునిక దేవాలయాలకు నాంది' అని ఆనాడు నెహ్రూ అన్నమాటలు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయి. గడచిన 60 ఏళ్లలో దేశంలో ఎన్నో భారీ, మధ్యతరహా నీటి పథకాలు రూపుదాల్చి ఆహార రంగాన్ని సుసంపన్నం చేశాయి. నాగార్జున సాగర్ రూపశిల్పి డాక్టర్ కేఎల్‌రావు పేర్కొన్నట్లు- అంతర్జాతీయ ప్రాముఖ్యం గల ఈ బృహత్తర బహుళార్థ సాధక ప్రాజెక్టు రూపకల్పనలో, నిర్మాణంలో విదేశీ నిపుణుల ప్రమేయం లేకపోవడం; పూర్తిగా భారతీయ, ముఖ్యంగా రాష్ట్ర ఇంజినీర్లే ఇందులో కీలక పాత్ర పోషించడం గర్వకారణం. శంకుస్థాపన జరిగిన పుష్కర కాలంలోనే ఈ ప్రాజెక్టు జలాలు బిరాబిరా ఉరికి, బీళ్లను సస్యశ్యామలం చేశాయి.

సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం, 1967 ఆగస్టు 4న నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దీనికి ప్రారంభోత్సవం జరిపారు. ఎడమ వైపున ఉన్న లాల్ బహాదుర్ కాలువలోకి, కుడివైపున ఉన్న జవహర్ కాలువలోకి కృష్ణా జలాలను ఆమె విడుదల చేశారు. అప్పటి నుంచి ఈ అర్ధ శతాబ్దిలో రెండు కాలువల కింద సాగుభూమి క్రమంగా విస్తరించింది. ఎడమ కాలువ కింద నల్గొండ, ఖమ్మం, కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 10.10 లక్షల ఎకరాలు, కుడి కాలువ కింద గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 11.18 లక్షల ఎకరాలు- వెరసి 21.28 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.

దేశంలో గంగ, గోదావరి తరవాత మూడో పెద్దనది అయిన కృష్ణపై నిర్మించిన భారీ డ్యాము ఇది. ఎన్నో అవరోధాలు అధిగమించాకగానీ ఇది సాకారం కాలేదు. ఈ ప్రాజెక్టు కోసం ఆందోళన జరుగుతున్న సమయంలోనే భిన్న స్వరాలు వినిపించాయి. ప్రాజెక్టు స్థలంలో ఉన్న ప్రసిద్ధ శిల్ప శిథిలాలు నీటిలో మునిగిపోయి చారిత్రక ప్రశస్తి కనుమరుగైపోతుందని పురావస్తుశాఖలోని కొందరు పరిశోధకులు అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తపరచారు. జలాశయం మధ్యలో ఉన్న కొండపై శిథిలాలను భద్రపరచి మ్యూజియం ఏర్పాటు చేయవచ్చునని, బౌద్ధమతాచార్యుడు నాగార్జునుడి పేరే ప్రాజెక్టుకు పెట్టవచ్చునన్నది అందుకు సమాధానంగా వచ్చిన సూచన. చివరకు అదే జరిగింది. అక్కడి కొండపై మ్యూజియం వెలసింది. నందికొండ ప్రాజెక్టు 'నాగార్జున సాగర్' ప్రాజెక్టుగా నామాంతరం చెందింది.


నాగార్జున సాగర్ డ్యాము రూపకల్పన, నిర్మాణంలో డాక్టర్ కేఎల్‌రావు పాత్ర ఎంతో విశిష్టమైనది. నాగార్జున సాగర్ డ్యామును సిమెంటు, కాంక్రీటుతో నిర్మించాలా, లేక రాతితో నిర్మించాలా అన్నది అప్పట్లో ఎదురైన సమస్య. అప్పటికే భాక్రా-నంగల్ డ్యామును కాంక్రీటుతో కట్టాలని నిర్ణయించారు. సహజంగా, పుష్కలంగా దొరికే అత్యంత నాణ్యమైన గ్రానైట్ రాతిని ఉపయోగించి డ్యాము నిర్మించాలని దక్షిణ భారత ఇంజినీర్లు వాదించారు. దానిపై డాక్టర్ కేఎల్‌రావు చొరవ తీసుకొన్నారు. సిమెంటు-రాతితో కట్టిన నమూనా ఫలకాలను తయారుచేయించారు. వాటిని అమెరికాలోని డెన్వర్ ప్రయోగశాలకు పంపించి, పరీక్ష చేయించారు. ఫలితాలను తెప్పించి, కాంక్రీటు కన్నా రాతి కట్టడమే మేలని ప్రభుత్వానికి నచ్చజెప్పారు. ఆ ఫలితాలు ఎంతో సంతృప్తికరంగా ఉండటంతో, నాగార్జునసాగర్ డ్యామును సిమెంటు-రాతితో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనివల్ల 30 వేలకు పైగా కార్మికులు, శ్రామికులకు 10 సంవత్సరాలకు పైగా నిరంతరాయంగా ఉపాధి లభించింది. వారందరి కృషి ఫలితంగానే నాగార్జునసాగర్ నేడు మన ముందు నిలిచింది. ప్రపంచంలోని అన్నింటికన్నా పొడవైన, ఎత్తయిన రాతి కట్టడమిది. దేశంలోనే అతిపెద్ద మానవ నిర్మిత జలాశయాన్ని ఇది కలిగి ఉంది. దీని కోసం ఎంతో మంది ఎన్నో త్యాగాలు చేశారు. బతుకుల్నే బలిదానం చేశారు. వారందరి సంకల్పానికి కొనసాగింపుగా దేశం వివిధ ప్రాంతాలకు చెందిన శ్రామిక, కార్మికవర్గ సమైక్య కృషికి నిదర్శనంగా చరిత్రలో నిలిచిపోయిన అపూర్వ కట్టడం నాగార్జునసాగర్.

నందికొండ ప్రాజెక్టు ప్రతిపాదన

మనిషికీ ప్రకృతికీ మధ్య జరిగిన వీరోచిత సంఘర్షణ ఫలితమే నాగార్జునసాగర్ ప్రాజెక్ట్. ప్రకృతి ప్రకోపానికి ఎదురొడ్డి నిలిచి, మానవ విజ్ఞానం



నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 1955 డిసెంబరు 10న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసినప్పటి దృశ్యం



నాగార్జునసాగరం స్వర్ణోత్సవం

సాధించిన మహత్తర విజయానికి నిలువెత్తు నిదర్శనం ఈ ప్రాజెక్టు. మనిషి రేయింబవళ్లూ ఓర్పుతో, నేర్పుతో, నిర్భీతితో, దృఢ విశ్వాసంతో భౌతిక శక్తులతో పోరాడి, ఎగరేసిన విజయ పతాక ఇది. ఉరుకులతో, పరుగులతో గర్జిస్తూ, గాండ్రిస్తూ కొండల్నీ-కోనల్నీ చుట్టుకొని ముందుకు సాగిపోతున్న నదీ ప్రవాహాన్ని అతడు నిరోధించగలిగాడు. కృష్ణమ్మ పావన జలధారలను తెలుగు మాగాణం వైపు మళ్లించి- ఆహారోత్పత్తికి, విద్యుదుత్పాదనకు వినియోగించుకొంటున్నాడు.

తొలుత కృష్ణానదిపై నందికొండ వద్ద ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదన చేసిన ఘనత నాటి హైదరాబాద్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఎడమకాలువకు రూపకల్పన చేసి, దానికి కుడికాలువనూ జోడిస్తే భారీ ప్రాజెక్టును నిర్మించవచ్చునని ఆ ప్రభుత్వం భావించింది. ఇదే విషయాన్ని అప్పటి మద్రాసు ప్రభుత్వానికి తెలిపి, సహాయపడవలసిందిగా కోరింది. కృష్ణపై సిద్దేశ్వరం వద్ద కృష్ణా-పెన్నారు ప్రాజెక్టు నిర్మించి, కృష్ణ నీటిని మద్రాసుకు తరలించాలని తలపోసిన మద్రాసు ప్రభుత్వం, హైదరాబాద్ సర్కారు ప్రతిపాదించిన నందికొండ ప్రాజెక్టును తిరస్కరించింది. దరిమిలా- ఈ ప్రాజెక్టుల్లో దేనివల్ల కృష్ణా బేసిన్ అవసరాలు తీరతాయో, ఏది అధిక ప్రయోజనదాయకమో పరిశీలించి నివేదిక సమర్పించాలని అప్పటి కేంద్ర జలవిద్యుత్ సంస్థ ఛైర్మన్, ప్రముఖ ఇంజినీరు డాక్టర్ ఖోస్లాను కేంద్రప్రభుత్వం ఆదేశించింది. ఖోస్లా కమిటీ నందికొండ డ్యాము స్థలాన్ని సందర్శించకుండా చేయడానికి మద్రాసు ప్రభుత్వం ఎన్నో ఆటంకాలు కల్పించింది. నందికొండ ప్రాజెక్టు ప్రతిపాదనను ప్రణాళిక సంఘానికి సాధికారికంగా నివేదించలేదని, అదీకాకుండా రోడ్డులేని కారణంగా ప్రాజెక్టు స్థలానికి వెళ్లలేమనీ మద్రాసు చీఫ్ ఇంజినీర్ అభ్యంతరాలు చెప్పారు. కేంద్ర జలసంస్థ డైరెక్టర్ డాక్టర్ కేఎల్‌రావు వెంటనే ముక్త్యాల రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్‌కు ఆ విషయం తెలిపారు. దానికి వెంటనే స్పందించిన రాజా, సొంత ఖర్చుతో అటవీ ప్రాంతంలో మాచర్ల నుంచి 20 కిలోమీటర్ల పొడవునా చెట్లు నరికించారు. రాళ్లు రప్పలు తొలగింపజేశారు. కేవలం నాలుగు రోజుల్లో డ్యాము స్థలానికి పోవడానికి జీపు బాట ఏర్పాటు చేశారు. మద్రాసు నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీరు వెంకటాచారి, ప్రభుత్వానికి భయపడి ఖోస్లా కమిటీతో డ్యాము ప్రాంతానికి వెళ్లకుండా గుంటూరులోనే ఆగిపోయారు. తన బృందంతో ఆ ప్రాంతాన్ని సందర్శించిన డాక్టర్ ఖోస్లా, సంతృప్తి వ్యక్తీకరించారు. కృష్ణా బేసిన్ అవసరాలను పూర్తిగా తీర్చకుండా, బేసిన్ బయట ఉన్న మద్రాసుకు కృష్ణా జలాలను తరలించాలన్న మద్రాసు ప్రభుత్వ ప్రతిపాదన అసమంజసమని డాక్టర్ ఖోస్లా కమిటీ భావించింది. కృష్ణా బేసిన్ అవసరాలకు పూర్తిగా ఉపయోగపడే నందికొండ ప్రాజెక్టునే చేపట్టాలని సిఫార్సు చేసింది. ప్రణాళిక సంఘం వెంటనే దానికి ఆమోదం తెలిపింది. దానివల్ల కుడికాలువ కింద విస్తారమైన భూమి సాగులోకి వచ్చింది.

నాగార్జునసాగర్ జలాశయానికి సంబంధించి మట్టి డ్యాముల నిర్మాణం, కుడి ఎడమ వైపుల ప్రధాన రెగ్యులేటర్లు, డ్యాము రాతికట్టల నిర్మాణం 1957లో ప్రారంభమై 1967 నాటికి పూర్తయింది. కేంద్ర జలవిద్యుత్ సంస్థ అనుమతించకపోయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని జలాశయం నుంచి దిగువ నదిలోకి నీటిని విడుదలచేసే స్పిల్‌వే గేట్ల అమరికను 1974 నాటికి పూర్తిచేసింది. నాగార్జునసాగర్ డ్యాముకు గేట్లు అమర్చడంవల్ల అదనంగా నిల్వ ఉండే నీటిలో తమకూ వాటా పంచాలని మహారాష్ట్ర, కర్ణాటక పట్టుపట్టాయి. ఎగువ రాష్ట్రాల వాదనను బచావత్ ట్రైబ్యునల్ తిరస్కరించింది. కృష్ణా డెల్టాకు, నాగార్జునసాగర్ కాలువలకు విశ్వసనీయంగా అవసరమైనమేర నీరు అందించాలంటే క్రస్ట్‌గేట్ల నిర్మాణం ఎంతో అవసరమని సిఫార్సు చేసి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఇప్పించింది. ఈ విధంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు అవతరణలో అప్పటి రాష్ట్ర గవర్నర్ సీఎం త్రివేదీ, డాక్టర్ కేఎల్‌రావు, రాజా మహేశ్వర ప్రసాద్, పార్లమెంటు సభ్యులు మోటూరు సత్యనారాయణ, వావిలాల గోపాలకృష్ణయ్య, పిల్లలమర్రి వేంకటేశ్వర్లు సహా ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ నాయకులు నిపుణులూ తమ వంతు కీలకపాత్ర పోషించారు.

వ్యయం అతిస్వల్పం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 1960లో కేంద్రం అనుమతించిన అంచనా వ్యయం రూ. 91.12 కోట్లు. 1969లో ప్రణాళిక సంఘం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.163.54 కోట్లకు పెంచింది. తరవాత ప్రాజెక్టు పరిధిలో ఎన్నో మార్పులు జరిగాయి. ప్రాజెక్టు విస్తరించింది. అయినప్పటికీ ప్రాజెక్టుపై వెచ్చించిన మొత్తం వ్యయం 2005 నాటికి రూ.1600 కోట్లకు మించలేదు. అంటే, నిర్మాణ వ్యయం ఎకరాకు రూ. 7,500కు మించలేదు. ప్రస్తుతం ఏ భారీ ప్రాజెక్టు నిర్మించాలన్నా, దాని వ్యయం ఎకరాకు లక్ష రూపాయలకు తగ్గడం లేదు. నాగార్జునసాగర్ నుంచి 30 ఏళ్లుగా ఏడాదికి కనీసం రూ. 1500 కోట్ల విలువైన ఫలసాయం, రూ. 400 కోట్ల విలువైన విద్యుత్తు లభిస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి లభించే రాబడి, ప్రాజెక్టు మొత్తం నిర్మాణ వ్యయం కన్నా ఎక్కువన్నమాట. ఇంత చౌకగా నిర్మించిన, ఈ స్థాయిలో బహుళ ప్రయోజనాలు చేకూరుస్తున్న ప్రాజెక్టు ప్రపంచంలో మరేదీ లేదనడం అతిశయోక్తి కాదు!

(రచయిత- సాగునీటి రంగ నిపుణులు)

స్వేచ్ఛపైనా కత్తెర వేటు?



ఎ.సూర్యప్రకాశ్

కాంగ్రెస్ పార్టీ అనవసర వివాదానికి ఆజ్యం పోస్తోంది. మధుర్ భండార్కర్ నిర్మించిన 'ఇందు సర్కార్' చిత్రంపై కాంగ్రెస్ కారాలూ మిరియాలూ నూరుతోంది. కాంగ్రెస్ తీరు విడ్డూరంగా ఉంది అనుకుంటుంటే- మరోవంక ఆ చిత్రంలోని కొన్ని భాగాలకు అడ్డంగా కోతపెట్టి సెన్సార్ బోర్డు మరింత ఆశ్చర్యపరచింది. ఆత్యయిక స్థితి ప్రధానాంశంగా ఆ చిత్రాన్ని నిర్మించలేదు. ఎమర్జెన్సీ నేపథ్యంలో కొందరు వ్యక్తుల మధ్య పెల్లుబికిన ఉద్వేగాల ఆధారంగా అల్లిన కథ అది. ఆ సినిమాపై పనిగట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు ప్రేరేపించడం, మితిమీరి సెన్సార్ బోర్డు జోక్యం చేసుకోవడం వంటివి- ప్రజాస్వామ్య హితైషులను కలవర పరుస్తున్నాయి.

భావప్రకటన స్వాతంత్ర్యానికి బంధనాలేల?

స్వాతంత్ర్యానంతర భారతంలో 1975-'77 మధ్యకాలం ఓ చీకటి అధ్యాయం. ఇందిర సారథ్యంలో నిరంకుశస్వామ్యం సాగిన కాలమది. దేశం నెత్తిన ఆత్యయిక స్థితిని రుద్ది రాజకీయ ప్రత్యర్థులందరినీ ఇందిరాగాంధీ జైలుపాలు చేశారు. ప్రశ్నించిన ప్రజాస్వామ్య గళాలను కర్కశంగా నొక్కేశారు. స్వతంత్ర భారతావనికే మాయని మచ్చలా మిగిలిన ఆ చీకటి పాలనను విమర్శిస్తే కాంగ్రెస్ పార్టీ ఎందుకు అంతగా ఉడుక్కోవాలి? యూపీఏ హయాము ముగిసి 2014లో మోదీ జమానా మొదలైనప్పటినుంచీ దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ గురించి మిద్దెలూ మేడలూ ఎక్కి కాంగ్రెస్ పార్టీ గావు కేకలు పెడుతోంది. అంతవరకు బాగానే ఉంది. నిన్నటిదాకా స్వేచ్ఛకోసం మాట్లాడిన పార్టీ- ఉన్నఫళంగా ప్లేటు ఫిరాయించి ప్రజాస్వామ్య స్వరాలను తొక్కేసేందుకు ఎందుకు అంతగా ప్రయత్నిస్తున్నట్లు? ఒక పార్టీగా కాంగ్రెస్‌కు రాజకీయ ఇబ్బందులేవైనా ఉంటే ఉండవచ్చు! కానీ, సెన్సార్ బోర్డుకు ఏమైంది? ప్రజాస్వామ్య పురోగతికి పాటుపడటం దేశంలోని వ్యవస్థల బాధ్యత. సెన్సార్ బోర్డు బాధ్యతలూ అందుకు భిన్నం కాదు. చిత్రంలో ఎమర్జెన్సీకి సంబంధించి ఉటంకించిన పచ్చి వాస్తవాలపైనా సెన్సార్ బోర్డు కత్తెర వేటు పడటాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

ఆత్యయిక స్థితినాటి అమానుషకాండపై ఇప్పటికే ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి, పత్రికల్లో వేల సంఖ్యలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఓ పుస్తక రచయితకు, వ్యాసకర్తకు ఉన్నపాటి స్వేచ్ఛ సినీ దర్శకుడికి ఎందుకుండకూడదు? ఎమర్జెన్సీ అధ్యాయంలో బలవంతపు కుటుంబ నియంత్రణ అత్యంత పాశవికమైనది. ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు లక్షల మంది ప్రజలను ఇళ్లలోంచి ఈడ్చుకుపోయి మరీ బలవంతంగా కు.ని. శస్త్ర చికిత్సలు చేయించారు. దేశంలో జనాభాను కట్టడి చేయాలంటే అధికారబలంతో ప్రజలను బెదిరించి, లొంగదీసుకుని కు.ని. ఆపరేషన్లు చేయించడం తప్ప మరోదారి లేదని నాటి ప్రధాని ఇందిర తనయుడు సంజయ్ గాంధీ గట్టిగా విశ్వసించారు. ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారందరినీ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స క్యాంపులకు బలవంతంగా తరలించారు. ఆ ప్రక్రియను



తీరు మారని కాంగ్రెస్, సెన్సార్

మరింత వేగవంతం చేయడంకోసం ప్రతి రాష్ట్రానికీ లక్ష్యాలు నిర్దేశించారు. కు.ని. ఆపరేషన్లకు ఇష్టపడని ఎందరో ఉపాధ్యాయులను 'మీసా' చట్టం కింద బలవంతంగా జైళ్లలో బంధించినట్లు ఎమర్జెన్సీ అరాచకాలపై విచారణ జరిపిన షా కమిషన్ నివేదికలో వెల్లడైంది. కు.ని. చికిత్స చేయించుకున్నట్లు వైద్య ధ్రువీకరణ పత్రాలు చూపితే తప్ప టీచర్లను జైళ్లనుంచి విడుదల చేయలేదు. ఎమర్జెన్సీ అంధ యుగంలో చోటుచేసుకున్న ఈ అన్యాయంపై చిత్రంలో వినిపించిన సంభాషణలపైనా కత్తెర వేటు వేసేందుకు సెన్సారు బోర్డు సంసిద్ధమైందట! ఆ మాత్రం స్వేచ్ఛకూ ముకుతాడు వేస్తే ఇక ప్రజాస్వామ్య భారతావనికి అర్థమేముంది?

నిరంకుశత్వానికి చెల్లుచీటి!

సినిమాల సెన్సారింగ్‌పై శ్యామ్ బెనెగల్ కమిటీ సూచనలను తక్షణం అమలు పరచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. సినిమాలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం తప్ప 'బోర్డు'కు మరే అధికారాలూ ఉండరాదని బెనెగల్ కమిటీ సూచించింది. చలన చిత్రాల్లో ఏ భాగానికీ కత్తెర వేసే అధికారం 'బోర్డు'కు ఉండదు. చిత్రం గనుక సినిమాటోగ్రఫీ చట్టంలోని 5బి(1) నిబంధనను ఉల్లంఘించినట్లయితే దానికి ధ్రువీకరణ పత్రం జారీ చేయకుండా నిలిపివేసే అధికారం 'బోర్డు'కు ఉంటుంది. సెన్సార్ బోర్డుకు అపరిమిత అధికారాలు కట్టబెడితే అవి దుర్వినియోగమయ్యే ప్రమాదమే ఎక్కువ. అమర్త్యసేన్‌పై నిర్మించిన ఓ డాక్యుమెంటరీ చిత్రానికీ సెన్సార్ బోర్డు అడ్డదిడ్డంగా కత్తెర వేసినట్లు దర్శకుడు సుమన్ ఘోష్ ఇటీవల వాపోయారు. ఆ చిత్రంలోని 'గుజరాత్', 'గోవు', 'హిందుత్వ దృక్పథంలో భారత్' వంటి మాటలు వినిపించకుండా 'బీప్'తో కప్పిపుచ్చారట! గోరక్షణ పేరిట ఈ దేశంలో కొన్ని అల్లరి మూకలు ఏ స్థాయిలో అరాచకం సృష్టిస్తున్నాయో అందరికీ తెలుసు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆవులను కాపాడే సాకుతో సాగుతున్న దాడులపై ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసాకాండ చెలరేగడానికి కారణమవుతున్న శక్తులను నిర్దాక్షిణ్యంగా కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో 'గుజరాత్', 'గోవు' వంటి మాటలు సెన్సార్ బోర్డుకు ఎందుకు అంటరానివిగా మారాయో అంతుపట్టదు! శ్యామ్ బెనెగల్ నివేదికను సాధ్యమైనంత సత్వరం అమలు చేయడమే చిత్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న అనేక సమస్యలకు పరిష్కారం. మధుర్‌భండార్కర్ సినిమాపై పుణె, నాగ్‌పూర్ వంటి చోట్ల కాంగ్రెస్ పార్టీ నిరసనలు కొనసాగిస్తూనే ఉంది. ఎమర్జెన్సీ నాటి నిరంకుశ భావజాలమే నేటికీ కాంగ్రెస్ నరనరాల్లోనూ ప్రవహిస్తున్నట్లుంది! ఆత్యయిక స్థితి కొనసాగుతున్న కాలంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం విఖ్యాత గాయకుడు కిశోర్ కుమార్‌పై కత్తిగట్టింది. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లలో ఆయన పేరు వినిపించకుండా, ఆయన బొమ్మ కనిపించకుండా నిషేధాజ్ఞలు విధించింది. చివరికి ఆయన పాటలను విక్రయించే గ్రామ్‌ఫోన్ కంపెనీలపైనా కిశోర్ రికార్డులను మార్కెట్లోకి విడుదల చేయవద్దని అప్పటి ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చింది. కిస్సా కుర్సీకా, ఆంధీ వంటి సినిమాలనూ ఇందిర సర్కారు నిషేధించింది. అదే ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పుడు మధుర్‌భండార్కర్ చిత్రం గొంతుకోయాలని కాంగ్రెస్ పార్టీ పంతం పట్టడం పెడధోరణులకు దాఖలా. నిరంకుశ భావజాలం పాతుకుపోయిన పార్టీ, కాలం మారినంత మాత్రాన భిన్నంగా వ్యవహరిస్తుందా?

(రచయిత- ప్రసారభారతి ఛైర్మన్)

లక్షణ శక్తి

సృష్టిలోని ప్రతి అంశానికీ ఒక 'లక్షణం' ఉంటుంది. సూర్యుడికి వెలుగు, గాలిలో ప్రాణం, చంద్రుడి వెన్నెల, నీటిలో రసత్వం... వంటివి. వీటితో పాటు కంటి చూపు, చెవి వినికిడి- ఇలా ఉన్న లక్షణాలే ఆయా అంశాలకు శక్తులు. ఈ లక్షణాల్ని ఏ ఒక్కరూ కృత్రిమంగా సృష్టించలేరు. ఇవన్నీ ప్రాకృతిక శక్తులు!

పరమేశ్వరుడి నుంచి వ్యక్తమయ్యే శక్తి విశేషాలే ఇవి- అని భక్తులు విశ్వసిస్తారు. నిజానికి ఈ లక్షణ శక్తులే అసలైన ఐశ్వర్యాలు. ఈ ఐశ్వర్య రూపాలైన లక్షణ శక్తుల సమాహార స్వరూపమే 'లక్ష్మీదేవి'.

సనాతన ధర్మంలోని ఈ లక్ష్మీభావన- ప్రకృతి రూపంలో గోచరించే పరమాత్మ విభూతిగా ఆరాధన అందుకుంటోంది. విజ్ఞులు మరో కోణంలో- శాస్త్రపరంగా గల అర్థాన్ని వివరించారు. జగతిలో అణువు మొదలు బ్రహ్మాండం వరకు గల అన్నింటినీ లక్షిస్తూ (గమనిస్తూ), ఎవరికి ఎప్పుడు ఎక్కడ ఏమిటి ఎలా ఇవ్వాలో నిర్ణయించి అనుగ్రహించే శక్తినే వారు 'లక్ష్మి'గా నిర్వచించారు.

ఈ శక్తికే 'శ్రీ' (సిరి) అని మరొక పేరుంది. ఇదే నామాన్ని శాస్త్రాలు ఒక మహామంత్రంగా భావిస్తున్నాయి. సృష్టి స్థితి లయలను నిర్వహించే పరమాత్మను ఆశ్రయించుకున్న శక్తినే 'శ్రీ' అంటారు. ఈ ఆశ్రయం అత్యంత ప్రత్యేకం. ఇది సూర్యుణ్ని ఆశ్రయించిన కాంతి, చంద్రుణ్ని ఆశ్రయించిన చంద్రిక వంటిది. భగవంతుణ్ని ఎన్నడూ ఎడబాయని ఆయన చిచ్ఛక్తి(చిత్, శక్తి)నే 'శ్రీ'గా పరిగణిస్తారు. ఆ శక్తే మానవాళి పాలిట ఆశ్రయం!

మానవాళికి ఆధారమయ్యే శక్తి, పరమాత్మను ఆశ్రయించుకున్న శక్తి... 'శ్రీ'. 'లక్షణశక్తి'యే ఈ 'శ్రీ'! ఈ శబ్దానికి నిఘంటుపరంగా శోభ, కాంతి, కళ, జ్ఞానం, విద్య అని అర్థాలున్నాయి. ఈ అర్థాలన్నింటి ఏకరూపమే శ్రీలక్ష్మి. ప్రతివారూ భక్తిపూర్వకంగా కోరుకొనేది ఈ లక్ష్మినే! 'వరం' అనే మాటకు 'కోరుకొనేది' అని అర్థం. అందుకే ఈ తల్లిని 'వరలక్ష్మి'గా పిలుస్తారు.

విష్ణుపురాణ కథనం ప్రకారం- జగత్కారకుడైన పరమాత్మే శ్రీమహావిష్ణువు. భృగు ప్రజాపతి తపస్సు ఫలితంగా సంతానంగా పొందిన పరాశక్తి లక్ష్మి. ఆమె విష్ణువును వివాహమాడింది. ఈ తల్లి నిత్య, అనంత, ఆదిలక్ష్మి. నారాయణుడి వద్ద స్వాభావిక శక్తిగా గల ఈ మహాలక్ష్మిని- ఆయా లోకాల జీవుల యోగ్యతను అనుసరించి 'విష్ణు కృపామూర్తి'గా వివిధ రూపాల్లో వ్యవహరిస్తారు. స్వర్గలక్ష్మి, భూలక్ష్మి, ధనలక్ష్మి, గృహలక్ష్మి, ధాన్యలక్ష్మి, విద్యాలక్ష్మి, ధైర్యలక్ష్మి,



అంతర్యామి

వీరలక్ష్మి, విజయలక్ష్మి, సంతానలక్ష్మి- ఇలా పలు అభివ్యక్తులతో అలరారుతుంది అమ్మ. ధనధాన్యాదులే జీవులు కోరే వరమైన అవసరాలు. ఈ సమస్త లక్ష్ముల ఏక స్వరూపమే 'వర'లక్ష్మి!

భృగు ప్రజాపతి ప్రాధాన్యం కలిగిన 'భృగు'(శుక్ర)వారంనాడు, ప్రతి మాసంలోనూ లక్ష్మి ఆరాధనను శాస్త్రం నిర్దేశించింది. మాసాల్లో 'ఆర్ద్రత'కు ప్రధానమైన వర్షరుతువు మొదటి మాసమే శ్రావణం. అందులో వృద్ధిచెందే చంద్రకళకు నెలవైన శుక్లపక్షం, శుక్రవారం అత్యంత ప్రధానమైనవని ధార్మిక గ్రంథాలు ప్రస్తావించాయి. 'ఆర్ద్రాం పుష్కరిణీం...' అని శ్రీసూక్తం వర్ణించిన 'ఆర్ద్ర'శక్తి- శాంతికి, పంటకు, ఐశ్వర్యానికి సంకేతం. శ్రావణం లక్ష్మీదేవికి ప్రధానమైంది.

స్త్రీలో లక్ష్మీకళ ఉందని 'దేవీ భాగవతం' వంటి పురాణ వాఙ్మయం చెబుతుంది. అందుకే 'స్త్రీలను గౌరవించడం భారతీయుల ధర్మం' అని రుషులు అనుశాసించారు. స్త్రీమూర్తులు లక్ష్మీకళతో తేజరిల్లుతూ లక్ష్మీదేవిని ఆరాధించే పర్వమే- శ్రావణ శుద్ధ శుక్రవారం.

సౌశీల్య, సౌజన్య, సౌమ్య, సాత్త్విక, శాంత, సద్గుణ, సంపదల సాకారమే మహాలక్ష్మి. దేవిని ఆరాధించడం వల్ల అందరిలోనూ ఆ దివ్య భావనా కిరణాలు జాగృతమై ప్రకాశిస్తాయని, ప్రకాశించాలని విజ్ఞులు ప్రబోధించారు.

వరలక్ష్మి వ్రతకథలో- సిద్ధి పొందిన కథానాయిక చారుమతి. మంచి మతి (బుద్ధి) మాత్రమే దేవీకృపకు పాత్రమవుతుంది అని మానవాళికి ఆ పాత్ర సంకేతమిస్తుంది. సంపదల్ని అడిగే ముందు 'చారు' (చక్కని) మతి కలిగి ఉండాలన్నదే దాని అంతరార్థం. ఆ సందేశం అర్థమైతే- వ్యక్తికి, సమాజానికి సౌభాగ్యప్రదం!

- సామవేదం షణ్ముఖశర్మ

జాతీయ రహదారుల పక్కనే విశ్రాంతి, వినోదం

- ప్రయాణికులు, డ్రైవర్ల కోసం సౌకర్య కేంద్రాలు
- ఐదెకరాలకు పైబడి స్థలమున్న వ్యక్తులు సొంతంగానూ నెలకొల్పవచ్చు
- భూమి మార్పిడి, పెట్రోలు బంకుల ఏర్పాటులో ప్రభుత్వ సహకారం

ఈనాడు – దిల్లీ

దేశంలోని అన్ని జాతీయ రహదారుల పక్కన ప్రయాణికులు, డ్రైవర్ల కోసం ప్రతి 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున సౌకర్య కేంద్రాలు (వేసైడ్ ఎమినిటీ సెంటర్లు) అభివృద్ధి చేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ నిర్ణయించింది. కారు, బస్సు ప్రయాణికులతోపాటు భారీ వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకొనేందుకు వీటిలో సదుపాయాలు కల్పించనున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఈ బాధ్యతలను చూసుకుంటుంది. అమెరికా, జర్మనీ తరహాలో ఈ కేంద్రాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు సరికొత్త విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ఆవిష్కరించారు. ఈ కేంద్రాల్లో కార్లు, బస్సులు, ట్రక్కుల పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తారు. పెట్రోల్ బంకులు, వాహన మరమ్మతు కేంద్రాలు, విశ్రాంతి గదులు, డార్మిటరీలు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, దాబాలు, వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో రాబోతున్న ఎలక్ట్రిక్ కార్లను దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు ఛార్జింగ్ వ్యవస్థలు నెలకొల్పుతారు. మూడు విభాగాలుగా ఈ కేంద్రాలు ఏర్పాటవుతాయి. తొలి విభాగంలో సాధారణ ప్రయాణికులు, భారీ వాహనాల డ్రైవర్ల అవసరాలకు తగినట్లుగా, రెండో విభాగంలో ప్రత్యేక తరగతి ప్రయాణికుల అవసరాలు తీర్చేలా సదుపాయాలు ఉంటాయి. మూడో విభాగాన్ని ట్రక్ డ్రైవర్లకు కేటాయిస్తారు. మొత్తం స్థలంలో 20 శాతంలోనే నిర్మాణాలు ఉంటాయి. మిగతా 80% పార్కింగ్, ఇతర వినోద సదుపాయాలకు కేటాయిస్తారు.



'జాతీయరహదారి గ్రామం లోగో, నెస్ట్'ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నేటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

- ఇప్పటివరకు తాను భూసేకరణ చేసిన 183 చోట్ల ఎన్‌హెచ్ఏఐ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో సౌకర్య కేంద్రాలు ఏర్పాటు చేయనుంది.
- తొలి దశ కింద 34 కేంద్రాలకు టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల ఆఖరి వారంలోగా మరో 30 కేంద్రాలకు, సెప్టెంబరు చివర్లోగా మిగతా 119 కేంద్రాలకు టెండర్లు పిలుస్తారు..
- ఐదు ఎకరాల లోపు స్థలంలో ఏర్పాటయ్యే కేంద్రాన్ని 'హైవే నెస్ట్' అని, అంతకన్నా ఎక్కువ స్థలంలో నెలకొల్పే కేంద్రాన్ని 'హైవే విలేజ్' అని పిలుస్తారు.
- ఐదు ఎకరాలకు పైబడి స్థలం ఉన్న వ్యక్తులు సొంతంగానూ ఈ కేంద్రాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ముందుకొచ్చే వారికి ప్రభుత్వమే జాతీయ రహదారుల అనుసంధానాన్ని కల్పిస్తుంది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల కోసం మార్చడంలో తోడ్పాటు అందిస్తుంది. పెట్రోలు బంకుల ఏర్పాటుకు అనుమతుల విషయంలో సహకరిస్తుంది.
- ప్రైవేటు భూముల్లో ఏర్పాటు చేసే కేంద్రాలపై ప్రభుత్వానికి ప్రత్యేకంగా ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వమూ ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలూ కల్పించదు. కేవలం వాటిని ఎన్‌హెచ్ఏఐ అధీకృత కేంద్రాలుగా ప్రకటిస్తుంది. అక్కడ అందించే సేవల నాణ్యతను పర్యవేక్షిస్తుంది.
- ఈ కేంద్రాల లేవుట్, ఆకృతి అంతా ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన విధంగానే ఉండాలి.
- జాతీయ రహదారులకు ఆనుకొని భూములున్న ప్రైవేటు వ్యక్తులు ఆగస్టు 4 నుంచి తమ ఆసక్తిని వ్యక్తంచేస్తూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో సెప్టెంబరు 21లోపు దరఖాస్తులు దాఖలు చేయొచ్చు. www.nhai.org, e-tender potal, etenders.gov.in వెబ్‌సైట్లలో పెట్టిన పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని సెప్టెంబర్ 20లోపు ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో అందించవచ్చు.

టెండర్లు ఆహ్వానించిన 34 కేంద్రాల్లో ఏపీలో ఏర్పాటయ్యే రెండు కేంద్రాలు..

1. తిరుపతి-తిరుత్తని-చెన్నై సెక్షన్‌లో ఎన్‌హెచ్ 205పై, ఎస్వీపురం గ్రామం వద్ద (చిత్తూరు జిల్లా).
2. అనంతపురం-బెంగళూరు సెక్షన్‌లో రేగాటిపల్లి గ్రామం వద్ద (అనంతపురం జిల్లా).



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట బగుళ్లగుట్ట వద్ద దొరికిన పెద్ద కొండచిలువను ఇది. హరితహారంలో అక్కడ మొక్కలు నాటేందుకు కూలీలు గుంతలు తవ్వుతుండగా 13 అడుగుల పొడవున్న కొండచిలువ కనిపించింది. కర్రలు, గడ్డ పారలతో దానిని చంపారు. ఇలా అరుదైన పాములు లేదా వన్యమృగాలు కనిపించినప్పుడు వాటిని చంపేయవద్దని, తమ శాఖకు సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ముత్తారం.

మంత్రి శివకుమార్ ఇంట్లో 5 లాకర్లు

- మూడింటిని తెరిచేందుకు నిరాకరించిన కర్ణాటక అమాత్యుడు
- గురువారమంతా కొనసాగిన సోదాలు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక మంత్రి డి.కె. శివకుమార్ ఆస్తులు, వ్యాపార సంస్థలు, స్నేహితులు, బంధువుల ఇళ్లపై బుధవారం ఆరంభించిన ఆదాయపుపన్ను శాఖ దాడులు గురువారమంతా కొనసాగాయి. సోదాలు చేసిన సంస్థలు, నివాసాలు, కార్యాలయాల సంఖ్య 39 నుంచి 62కు పెరిగింది. దాదాపు 300 మంది సిబ్బంది పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న నగదు రూ.11.43 కోట్లుగా తేలింది. ఇందులో రూ.8.8 కోట్లు దిల్లీ నివాసం నుంచి స్వాధీనం చేసుకున్నారు. శివకుమార్ అప్పుడు, విధానపరిషత్తు సభ్యుడు రవి నివాసం నుంచి రూ.22 కోట్ల విలువ చేసే ఆస్తుల పత్రాల్ని వశపరచుకున్నారు. బుధవారం ఉదయం ఆరంభించిన సోదాలు, అనుమానితుల్ని ప్రశ్నించటం, దస్త్రాల పరిశీలనను అర్ధరాత్రి వరకూ కొనసాగించారు. సిబ్బంది సోదాలు జరుపుతున్న చోటే భోజనాలు చేసి అక్కడే నిద్రించారు. తిరిగి ఉదయం ఆరున్నర గంటలకే విధుల్ని ప్రారంభించారు. మైసూరులో శివకుమార్ మామ తిమ్మయ్య నివాసంలోనూ అధికారులు నిద్రించారు.


మంత్రి శివకుమార్‌కు చెందిన ఓ భవంతి తలుపులు తీస్తున్న ఐటీ అధికారుల బృందం

లాకర్లు తెరిచేందుకు యత్నం: బెంగళూరు సదాశివనగర నివాసంలో శివకుమార్ నివాసంలో ఐదు రహస్య లాకర్లను గుర్తించారు. వాటిలో రెండింటిని శివకుమార్ సాయంతో తెరిచారు. మిగిలిన లాకర్లను తెరిచేందుకు ఆయన సహకరించకపోవటంతో నిపుణుల సాయంతో తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. బసవేశ్వర నగరలో ఉంటున్న సోదరి పద్మ నివాసంలోనూ సోదాలు సాగుతున్నాయి. ప్రైవేటు రవాణా సంస్థ యజమాని సునిల్‌కుమార్ నివాసం, హాసన్‌లో మాజీ మంత్రి శివరాం అల్లుడు, వ్యాపారి సచిన్ నారాయణ, ఆయన సోదరుడు చేతన్ నారాయణకు చెందిన హోటల్, నివాసాలు, కార్యాలయాలు, పెట్రోలు బంకులపై సోదాలు నిర్వహించారు. అల్లుడితో కలసి విదేశాల్లో వ్యాపారాల్ని ప్రారంభించినట్లు అనుమానిస్తున్నారు. మైసూరులో బావమరది సత్యనారాయణ, ఆయన భార్యను నజర్‌బాద్‌లోని ఆదాయపుపన్ను శాఖ కార్యాలయానికి రప్పించుకుని విచారణ జరిపారు. దిల్లీలో వ్యక్తిగత సహాయకుడు ఆంజనేయ, కారు డ్రైవరు నాగరాజుల విచారణను కొనసాగించారు. శివకుమార్ వ్యక్తిగత జ్యోతిష్యుడి ద్వారకానాథ్ భార్య, కూతురు, కొడుకునూ గురువారం విచారించారు. వారు నడుపుతున్న ఆస్పత్రికి మంత్రి పెట్టుబడి పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఐటీ దాడులు, సీఆర్‌పీఎఫ్ కదలిక‌ల్ని కనిపెట్టడంలో నిఘావిభాగం విఫలమైనందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహించారు. ఆ విభాగాధిపతి ప్రసాద్‌ను తమ నివాసానికి గురువారం పిలిపించుకుని మాట్లాడారు.

సర్కారు నిరసన: ఆదాయపన్ను శాఖ దాడుల కోసం జవాన్లను సాయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరసన తెలిపింది. ఈ మేరకు కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శికి సంబంధిత అధికారి లేఖ రాశారు. పోలీసుల విధి నిర్వహణ వైఖరిని దేశ ప్రజలు అనుమానించే స్థితి దాపురించిందన్నారు.

★ దాడులకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా కేంద్రాల్లో ఆందోళనజరిపారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట మోదీ, అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

★ శివకుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని.. లేని పక్షంలో ఆయన్ను పదవి నుంచి తొలగించాలని భాజపా డిమాండు చేసింది.

ముగ్గురు గుజరాత్ శాసనసభ్యులకు అస్వస్థత : బెంగళూరు ఈగల్టన్ విడిదిలో బసచేసిన గుజరాత్ కాంగ్రెస్ విధానసభ సభ్యుల్లో ముగ్గురు అస్వస్థులయ్యారు. వారికి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఐటీ దాడులతో గుజరాత్ ఎమ్మెల్యేలు ఆందోళనకు గురయ్యారు. మరో చోటకు తరలించాలని కోరుతున్నట్లు సమాచారం.

కర్ణాటక నుంచి ఏఐసీసీకి ముడుపులు?

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక మంత్రి శివకుమార్ నివాసంపై దాడి జరుపుతున్న ఆదాయపు పన్ను శాఖ అధికారులకు లభించిన ఓ డైరీ కీలకంగా మారింది. వారు స్వాధీనం చేసుకున్న పుస్తకంలో.. అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి గత జనవరి ఐదున రూ.3 కోట్లు చెల్లించినట్లు రాసి ఉందని సమాచారం. బుధవారం సోదా సందర్భంగా శివకుమార్ కొన్ని దాఖలాల్ని చించివేసినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో వెల్లడించారు. చించేసిన కాగితాల్ని ఆదాయపుపన్ను శాఖ అతికించినపుడు నిధుల చెల్లింపు వివరాలు బహిర్గతమయినట్లు తెలుస్తోంది.

రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'పై స్టేకు నిరాకరణ

- కాంగ్రెస్ అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

దిల్లీ: గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలట్ పత్రంపై 'నోటా' ఐచ్ఛికాన్ని అనుమతించే ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. శాసనసభ్యుల బేరసారాలను నోటా ప్రోత్సహిస్తుందని, దీనిపై స్టే ఇవ్వాలంటూ గుజరాత్‌లో కాంగ్రెస్ చీఫ్ విప్ శైలేష్ మనుభాయ్ పార్మర్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాజ్యసభ ఎన్నికల్లో నోటా రాజ్యాంగపరంగా చెల్లుతుందా, లేదా అనే అంశంపై చర్చ జరగాల్సి ఉందంటూ, దీనిపై పరిశీలనకు జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ అమితావ రాయ్, జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. ఎన్నికలు జరిగి ఫలితాలు ప్రకటించిన తర్వాత కూడా నోటా చెల్లుబాటుపై విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. పూర్తిస్థాయి వాదనలు వినేందుకు విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది. రెండు వారాల్లో పిటిషన్‌పై స్పందనతెలపాలని ఈసీని ఆదేశించింది. నోటిఫికేషన్‌తో సంబంధంలేనందున కేంద్రప్రభుత్వాన్ని ప్రతివాదుల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు చెప్పింది. కేసు విచారణలో సహకారం అందించాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను కోరింది. పిటిషనర్ శైలేష్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ- "గుజరాత్‌లో తొలిసారిగా మూడు స్థానాలకు నలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. గట్టి పోటీ నెలకొంది. నోటాను అనుమతిస్తే అవినీతికి దారితీస్తుంది. తమ ఓట్లు చెల్లకుండా ఉండేలా శాసనసభ్యులు నోటాను ఎన్నుకొనే అవకాశముంది" అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ- ''ఓడిపోతామని భయపడుతున్నారా" అని ప్రశ్నించింది. భయపడట్లేదని, స్టే ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు అవతలి పక్షం నుంచి డబ్బు తీసుకొని నోటాను ఉపయోగించుకొనే ఆస్కారముందని సిబల్ బదులిచ్చారు. నోటా ప్రత్యక్ష ఎన్నికలకు ఉద్దేశించినదని, రాజ్యసభ ఎన్నికలు నైష్పత్తిక ప్రాతినిధ్యం కలిగిన పరోక్ష ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. నోటాపై కాంగ్రెస్, భాజపా రెండూ ఒకే వైఖరితో ఉన్నాయని పిటిషనర్ తరపు మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ చెప్పారు. 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ 2014లో నోటాను ప్రవేశపెట్టామని ఈసీ తరపు సీనియర్ న్యాయవాది అశోక్ దేశాయ్ చెప్పారు. తదనంతర ఎన్నికల్లో అది తమకు సానుకూలంగానే ఉండటంతో కాంగ్రెస్ అభ్యంతరం చెప్పలేదని పేర్కొన్నారు.

గుజరాత్‌తోపాటు పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌ల కోసం ఈసీ నోటిఫికేషన్ ఇచ్చిందని, ఇప్పుడు జోక్యం చేసుకొంటే అన్ని చోట్లా ఎన్నికలకు విఘాతం కలుగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. నోటిఫికేషన్ తనకు సానుకూలంగానే ఉండటంతో 2014-15 నుంచి కాంగ్రెస్ ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని, ఇప్పుడు రాజ్యాంగ విరుద్ధమంటోందని వ్యాఖ్యానించింది. గుజరాత్‌లో మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 8న ఎన్నికలు జరుగనున్నాయి. నలుగురు అభ్యర్థులు- కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్, భాజపా అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఇటీవల కాంగ్రెస్ నుంచి భాజపాలో చేరిన బల్వంత్ సిన్హ్ రాజ్‌పుత్ పోటీపడుతున్నారు.

డీఎస్సీ అక్రమాలపై హైకోర్టులో పిటిషన్

ప్రతివాదులకు నోటీసులు జారీ

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ 1998 అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ ఉమ్మడి హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అర్హత మార్కుల కంటే తక్కువగా వచ్చినవారు ఎంపికయ్యారని.. అక్రమాలు వాస్తవమేనని కలెక్టర్‌కు నివేదిక వచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని, దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన కె.వేణు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది అర్జున్ కుమార్ వాదనలు వినిపిస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొన్న దానికంటే తక్కువగా మార్కులు వచ్చినప్పటికీ వరంగల్‌లో జిల్లాలో ఎస్జీటీలుగా ఎంపిక చేశారన్నారు. 1998 డీఎస్సీ అక్రమాలపై సీనియర్ ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ధ్రువీకరించినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. వరంగల్ డీఎస్సీ ఛైర్మన్ (కలెక్టర్), డీఈఓల అనుమతి లేకుండానే 65 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్నారన్నారు. 2014లో వరంగల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డీఈఓతో దర్యాప్తు చేయించారని.. అవకతవకలపై నివేదిక ఇచ్చినా చర్యల్లేవన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులైన తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, వరంగల్ అర్బన్ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 2 వారాలకు వాయిదా వేశారు.

ఆర్థిక అధికారాల పెంపుపై అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: వివిధ స్థాయుల్లోని ఉన్నతాధికారులకు ఆర్థికపరమైన అధికారాలను విస్తృతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక అధ్యయనం చేయనుంది. సచివాలయ శాఖలు, శాఖాధిపతులు, ప్రాంతీయ, జిల్లా కార్యాలయాలకు వ్యయ, ఆర్థిక అధికారాలు పెంచే అంశంపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు బి.ఆర్.మీనా, అదర్‌సిన్హా, రామకృష్ణారావు, నవీన్‌మిట్టల్, ఆర్థికశాఖ సంయుక్తకార్యదర్శి సాయిప్రసాద్‌లను నియమించారు. ఈ మేరకు ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

'మత్తు' దందాకు గత ప్రభుత్వాలే కారణం

- పేకాట క్లబ్‌ల నుంచి మామూళ్లను పంచుకున్నారు
- నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- త్వరలో డీఎస్సీ నిర్వహిస్తామని వెల్లడి

సంగారెడ్డి అర్బన్ - న్యూస్‌టుడే

గత కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు మాదకద్రవ్యాల దందాను పెంచి పోషిస్తే.. తమ ప్రభుత్వం తుంచేస్తోందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గతంలో గుడుంబా తయారీ దారులపై కేసులు బనాయించి జైలుకు పంపిస్తే.. తాము మాత్రం వారితో ఆ వృత్తి మాన్పించి, ఆర్థిక సహకారం అందజేసి ఉపాధికి బాటలు వేస్తున్నామన్నారు. ఇంతకుముందు పేకాట క్లబ్‌ల నుంచి మామూళ్లను ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం వరకు పంచుకున్నారని ధ్వజమెత్తారు. గురువారం సంగారెడ్డి జిల్లాలో మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. మొదటగా హరేకృష్ణ హరేరామ సంస్థ ఆధ్వర్యంలో లక్ష మంది



బూట్లు వేసుకుంటున్న విద్యార్థికి సహాయం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో హరేకృష్ణ హరేరామ సంస్థ నిర్వాహకులు సత్యగౌరి చంద్రదాసస్వామి, ఎంపీలు బీబీ పాటిల్, ప్రభాకర్ రెడ్డి తదితరులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్ల పంపిణీలో, అనంతరం గుడుంబా తయారీని వదిలేసిన వారికి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గుడుంబా తయారు చేసిన వారిని గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. రాష్ట్రంలో 7,086 మందికి ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ. 157 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. ఇంకా ఎవరైనా రుణాలు అందని వారుంటే నివేదిక ఇవ్వాలని.. గుడుంబా తయారీ మానివేసిన కుటుంబాల వారందరికీ ఆర్థిక సహాయం అందించేందుకు సీఎం కేసీఆర్, ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కల్తీ కల్లు, అనుమతులు ఇతరత్రా కారణాల పేరుతో గీత కార్మికులను వేధించవద్దన్నారు. ఈత మొక్కలు పెంచాలని, సీఐ, ఎస్‌ఐలకు గ్రామ, మండలం, జిల్లాల వారిగా లక్ష్యాలను నిర్దేశించాలని సూచించారు. బాగా మొక్కలు నాటి సంరక్షించిన వారికి ప్రభుత్వం ఆగస్టు 15, జూన్2న అవార్డులు, ప్రశంసాపత్రాలు అందిస్తుందని తెలిపారు. ప్రతి వారం దీనిపై తనకు నివేదిక ఇవ్వాలని ఉమ్మడి జిల్లా ఆబ్కారీ శాఖ ఉప కమిషనర్ కె.ఎ.బి.శాస్త్రిని ఆదేశించారు. అనంతరం గుడుంబా మానివేయాలని మంత్రి ప్రతిజ్ఞ చేయించారు.

విద్యాసంవత్సరానికి ముందే పాఠ్యపుస్తకాలు

గత ప్రభుత్వ హయాంలో లేని విధంగా విద్యాసంవత్సరానికి ముందే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 ఆంగ్ల మాధ్యమ గురుకులాలు ఏర్పాటు చేశామని, బాలికల విద్య బలోపేతానికి సీఎం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. త్వరలో డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ సమస్య త్వరలో కొలిక్కి వస్తుందన్నారు. లక్ష మంది విద్యార్థులకు బూట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిన హరే కృష్ణ హరేరామ సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంగారెడ్డి జిల్లాలో 70 వేల మందికి, రంగారెడ్డి జిల్లాకు చెందిన 30 వేల మంది విద్యార్థులకు బూట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ నిర్వాహకులు సత్యగౌరి చంద్రదాస స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, బాబూమోహన్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భూపాల్‌రెడ్డి, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేకుంటే వధువుపేరిట కల్యాణ లక్ష్మి చెక్కు

ఈనాడు, హైదరాబాద్: కల్యాణ లక్ష్మి పథకం కింద తల్లిదండ్రులు లేని అనాథ మహిళల వివాహానికి ప్రభుత్వం ఆ వధువు పేరిట రూ.75116ల చెక్కును ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ కవితకు కర్ణాటక సీఎం అభినందనలు

సురక్షిత డ్రైవింగు ద్వారా ప్రాణ రక్షణ కోసం నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత చేపట్టిన జాతీయ స్థాయి ప్రచార కార్యక్రమాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వాగతించారు. ఆమె కృషి అభినందనీయమని తన ట్విట్టర్‌లో ప్రశంసించారు.

కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు: డీఎస్

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్లే ప్రసక్తి లేదని తెరాస రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ స్పష్టంచేశారు. గురువారం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్తానంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని అవన్నీ అవాస్తవాలని తేల్చిచెప్పారు. తెరాసలో గౌరవంగా ఉన్నానని, సీఎం కేసీఆర్‌తో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగిందని, ఆ పార్టీలో ఉన్నప్పుడే చెప్పానని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తాను విశ్వసిస్తున్నానని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కారణంగానే ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ గురించి తాను మాట్లాడనని తాను తెరాసకు చెందినవాడినని డీఎస్ చెప్పారు.

మారని కాంగ్రెస్ తీరు

మంత్రి ఈటల రాజేందర్ విమర్శ

ఈనాడు, హైదరాబాద్: అధికారం కోసం కుట్ర రాజకీయాలు చేసే కాంగ్రెస్‌కు తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ప్రజలు బుద్ధి చెబుతున్నా ఆ పార్టీ తీరు మారడం లేదని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. తెరాస ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోందని మండిపడ్డారు. గురువారమిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం ప్రాజెక్టుల పనులేవీ సవ్యంగా జరగలేదన్నారు. ఫలితంగానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.16 వేలకోట్ల నుంచి 35 వేల కోట్లకు పెరిగిందన్నారు. మిడ్‌మానేరును రెండేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా, పదేళ్లయినా 30శాతం పనులు కూడా చేయలేదన్నారు. 10 టీఎంసీల సామర్థ్యంతో రాష్ట్రప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తిచేసిందని ఈటల తెలిపారు. కాంగ్రెస్‌లో అనుభవమున్న సీనియర్ నేతలు వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడటం తగదన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై వేసిన కేసులకు కాంగ్రెస్‌కు సంబంధం లేదంటూ జానారెడ్డి, షబ్బీర్‌అలీ చేసిన వ్యాఖ్యలు అవాస్తవాలని.. 168 కేసుల్లో ఆపార్టీ నేతలు మహేందర్‌రెడ్డి వంటివారే ఉన్నారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టుపై పిటిషన్ వేసిన ఆరుగురిలో తుమ్మల శ్రీనివాస్, రాంరెడ్డి, పోచయ్య సహా ముగ్గురు కాంగ్రెస్ వారేనన్నారు. 'హిమాన్షు' మోటార్స్ సంస్థ ఉన్నా.. 2007 నుంచి ఎలాంటి కార్యకలాపాలు జరగలేదని.. ప్రభుత్వంతో ఆ సంస్థ లావాదేవీలు జరపలేదని మంత్రి పేర్కొన్నారు.

ఈటలకు ఎస్సారెస్పీ పునరుజ్జీవన సభ ఏర్పాట్ల బాధ్యత

ఈనెల పదో తేదీన జరిగే ఎస్సారెస్పీ పునరుజ్జీవన సభ బాధ్యతలను ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌కు అప్పగిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకొన్నారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని నిర్ణయం తీసుకొన్న ప్రభుత్వం, ఈనెల పదిన పనులకు పునాది వేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా పోచంపాడు వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులను సమన్వయం చేసి సభను విజయవంతం చేసే బాధ్యతను తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరగా మంత్రి అంగీకరించారు.

అన్నింటికీ రాజకీయ రంగు కాంగ్రెస్ నైజం

ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అన్నింటికీ రాజకీయ రంగు పులమడం కాంగ్రెస్ నైజమని మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న ఆ పార్టీ నేతలు ప్రజల్లో అభాసుపాలవుతున్నారని అన్నారు. గురువారం ఆయన తెరాస శాసనసభా పక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతీ సంఘటనతో రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయస్థానాల్లో కేసులు వేస్తోందన్నారు. నేరెళ్లలో ఇసుక లారీ ప్రమాదంలో ఓయువకుడు మరణించడం, ఆ తర్వాత జరిగిన సంఘటనలను కాంగ్రెస్ వివాదాస్పదం చేసి, అశాంతిని సృష్టించిందనిన్నారు. జానారెడ్డి, షబ్బీర్‌అలీలు విజ్ఞత మరిచి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని అన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఏమాత్రం క్షమించరు: ఎంపీ బాల్క సుమన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఏ మాత్రం క్షమించరని పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ అన్నారు. ఆ పార్టీ చేస్తున్న ద్రోహాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఇవన్నీ ఎప్పటికప్పుడు బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల నిజస్వరూపాన్ని సీఎం కేసీఆర్ బయటపెట్టడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు జానారెడ్డి ఆవేశపడుతూ మాట్లాడుతున్నారని, ఆయన ఇకనైనా వాస్తవాలను అంగీకరించాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా 196 కేసులు వేసింది కాంగ్రెస్ నేతలు కాదా? అని ఆయన ప్రశ్నించారు. తెదేపా నాయకుడు రేవంత్‌రెడ్డికి దళితుల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు.

కేంద్ర బీసీ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు: మంత్రి జోగు రామన్న

ఈనాడు, హైదరాబాద్: కేంద్రం ప్రవేశపెట్టే బీసీ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతిస్తుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. గురువారం ఆయన బీసీ సంక్షేమ సంఘాధ్వర్యంలో చేపట్టిన 'చలో దిల్లీ' గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీ కమిషన్ బిల్లుకు రాజ్యాంగ హక్కును కల్పించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రధానిని కలిసి మద్దతు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్నట్లు కేంద్రంలోనూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలని ఆకాంక్షించారు. బీసీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపడుతున్న పథకాలకు కేంద్రం గ్రాంటు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నదుల పునరుద్ధరణకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రత్యేక ప్రాజెక్టులు: శ్రీశ్రీ రవి శంకర్

హైదరాబాద్: దేశంలో 30కిపైగా నదుల పునరుద్ధరణకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ శ్రీకారం చుట్టింది. దీని కోసం ప్రత్యేక ప్రాజెక్టులను మొదలుపెట్టింది. కర్ణాటకలోని చిక్కమగళూరులో వేదవతి నది పరిసరాల్లో పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ ఇటీవల సందర్శించారు. శాస్త్రీయ అంచనాలు, పక్కా ప్రణాళికలతో వీటిని చేపట్టడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తు తరాలకు సురక్షితమైన మంచినీరు అందించాల్సిన అవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనం పెంపు: దత్తాత్రేయ

ఈనాడు, దిల్లీ: అసంఘటిత రంగ కార్మికుల రోజువారీ వేతనాన్ని సుమారు 42 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. గురువారమిక్కడ మీడియాతో మాట్లాడుతూ.. జాతీయ కనీస వేతనాల సలహా బోర్డు వైస్ చైర్మన్ గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక కనీస వేతనాల సలహా బోర్డు క్రియాశీలకంగా పనిచేస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ప్రస్తుతం రూ.211 ఉండగా రూ.300, వ్యవసాయేతర కార్మికులకు రూ.250 నుంచి రూ.350కు పెంచామని తెలిపారు.

పోలీసుల కోసం 30వేల నివాస భవనాల నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్: పోలీసు కుటుంబాల కోసం రాష్ట్రంలో 30 వేల నివాస భవనాలు (క్వార్టర్లు) నిర్మిస్తున్నామని తెలంగాణ పోలీసు గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ కోలేటి దామోదర్ వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హడ్కో ద్వారా రుణం తీసుకొనైనా క్వార్టర్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలోని 116 ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్ భవనాలు, క్వార్టర్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.93.07 కోట్లు మంజూరు చేసిందని.. వీటిలో రూ.43 కోట్లతో 74 పనులు ఇప్పటికే చేపట్టగా మిగతా పనులు టెండర్ల దశలో ఉన్నాయన్నారు. 13 జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలు, రెండు కమిషనరేట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.375 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ఓబీసీ బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు తగదు: కృష్ణయ్య

గన్‌ఫౌండ్రి(హైదరాబాద్), న్యూస్‌టుడే: జాతీయ ఓబీసీ కమిషన్ బిల్లుకు రాజ్యసభలో సవరణలు ప్రతిపాదించి.. అనంతరం వ్యతిరేకించి కాంగ్రెస్ పార్టీ తన నైజాన్ని బహిర్గతం చేసుకుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఇది ఆ పార్టీకి ఏ మాత్రం తగదన్నారు. జాతీయ ఓబీసీ కమిషన్ బిల్లుకు రాజ్యాంగబద్ధత కల్పించేలా యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు ఆమోదముద్ర వేసే బాధ్యత ప్రతి పార్టీపై ఉందన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించబోమన్నారు. ఈనెల 5న 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, వివిధ పార్టీల అధినేతలను కలుస్తామని కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి డీఫార్మసీ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండేళ్ల డీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఇంతకుముందే రాష్ట్ర సాంకేతిక, శిక్షణ మండలి(ఎస్‌బీటీఈటీ) ఇంటర్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 400 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్ మార్కుల ఆధారంగా ఎస్‌బీటీఈటీ అధికారులు ర్యాంకులు కేటాయించారు. వారి ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం జరగనుంది. ఉదయం 9గంటలకు ఎంపీసీ, 11కి బైపీసీ అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తారు. ఈనెల 4, 5 తేదీల్లో ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 8న సీట్లు కేటాయిస్తామని ప్రవేశాల కన్వీనర్ వాణీప్రసాద్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హైదరాబాద్‌లోని సాంకేతిక విద్యాభవన్‌తోపాటు వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పూర్తివివరాలను tsdpharm.nic.in ద్వారా తెలుసుకోవచ్చు.

'బడి సంచి బరువు తగ్గించే వ్యవస్థ అవసరం'

ఈనాడు, హైదరాబాద్: బడి సంచి బరువును తగ్గించాలని జీఓ 22 ద్వారా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు నిఘా కమిటీలను నియమించాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం(టీపీఏ) సూచించింది. విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రుల ప్రతినిధులు, బాలల హక్కుల కార్యకర్తలతో ఈ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరింది. ఈమేరకు గురువారం సంఘం ప్రతినిధులు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్యతో టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగటి నారాయణ, ప్రధాన కార్యదర్శి పగడాల లక్ష్మయ్య సమావేశమయ్యారు. జీఓను అమలు చేసే యంత్రాంగం ప్రస్తుతం లేదని, సంచి బరువును తగ్గించని పాఠశాలలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని రంజీవ్‌ఆచార్య హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆచార్య తిరుపతిరావు కమిటీ ఆలస్యం చేస్తున్నందున జీఓ 42పై హైకోర్టులో ఉన్న స్టే ఉత్తర్వులను తొలగించి ప్రైవేట్ పాఠశాలల్లో రుసుములను నియంత్రించాలని కోరారు.

వైద్యవిద్య యాజమాన్య కోటా సీట్ల భర్తీ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు వైద్యకళాశాలల్లోని యాజమాన్య కోటా(బి) సీట్ల భర్తీ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ప్రవేశాలయ్యాక బి కేటగిరీలో 268 ఎంబీబీఎస్.. 353 బీడీఎస్ సీట్లు మిగిలాయి. మైనారిటీ వైద్యకళాశాలల్లో 137 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. తొలివిడత బి కేటగిరీ సీట్ల భర్తీకి శుక్రవారం ఆఖరిరోజు. 5న ప్రవాస భారతీయ కోటా(సి) సీట్లను భర్తీ చేస్తారు. సి కేటగిరీ కింది ప్రైవేటు వైద్యకళాశాలల్లో 258 ఎంబీబీఎస్ సీట్లు, 150 బీడీఎస్ సీట్లుండగా.. మైనారిటీ వైద్యకళాశాలల్లో సి కేటగిరీ కింది 61 ఎంబీబీఎస్ సీట్లున్నాయి.

'గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయమందించాలి'

హైదరాబాద్, న్యూస్‌టుడే: గల్ఫ్ మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు, టీపీసీసీ ఎన్నారై విభాగం ఛైర్మన్ నంగి దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. సౌదీలో 23 రోజుల క్రితం మరణించిన మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం పోలేపల్లికి చెందిన తడ్కలి మల్లయ్య(40) మృతదేహం గురువారం ఇక్కడకు చేరుకుందన్నారు. మృతదేహాన్ని పంపించేందుకు ఎన్నారై విభాగం అంబులెన్స్ సౌకర్యం కల్పించిందన్నారు.

చేప పిల్లల పంపిణీపై అవగాహన సదస్సులు: తలసాని

ఈనాడు, హైదరాబాద్: చేపపిల్లల పంపిణీ విధివిధానం, పథకం అమలును మత్స్యకారులకు వివరించేందుకు రిజర్వాయర్ల వద్దనే అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేఖలు రాయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తెలిపారు. పథకం అమలుపై గురువారం ఆ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సీజన్‌లో మొత్తం 24,200 నీటి వనరుల్లో 70 కోట్ల చేప పిల్లలను వదలనున్నట్లు తెలిపారు.

660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాది 660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ శ్రీధర్ సూచించారు. గురువారం సింగరేణి భవన్‌లో అన్ని ప్రాంతాల జనరల్ మేనేజర్లతో సమీక్ష జరిపారు.

కాంగ్రెస్ అంటే కేసీఆర్‌కు భయం మొదలైంది

- సోనియాగాంధీ కాళ్లు మొక్కినప్పుడు కాంగ్రెస్ పిశాచిలా కనబడలేదా?: ఉత్తమ్
- ముఖ్యమంత్రి భాష దారుణం: జానారెడ్డి



గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్, వామపక్ష నేతలు ధ్వజమెత్తారు. చిల్లర మాటలు మాట్లాడే వ్యక్తి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా దొరకడం దౌర్భాగ్యమని ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించగా, హామీల నుంచి తప్పించుకునేందుకే తమపై అబాండాల వేస్తున్నారని జానారెడ్డి విమర్శించారు. గురువారం వేర్వేరు సందర్భాల్లో నేతలు సీఎం తీరును తప్పుపట్టారు.

'రోజు రోజుకు కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతుంది. కేసీఆర్‌లో ఓటమి భయం మొదలైంది. నేరెళ్ల ఘటన తర్వాత రాష్ట్రంలో దళితులు వ్యతిరేకమవుతారనే భయం పట్టుకుంది. అందుకే ప్రెస్‌మీట్‌లో అసహనంగా, పచ్చి అబద్ధాలు మాట్లాడారు' అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేసీఆర్ మాట్లాడిన తీరు, వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సోనియాగాంధీ కాళ్లు మొక్కినప్పుడు కాంగ్రెస్ పిశాచిలా కనపడలేదా? అని ప్రశ్నించారు. పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, మల్లు భట్టివిక్రమార్కతో కలిసి గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడారు. విద్యుత్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కోర్టుకు ఎవరు వెళ్లారో తెలియదని, ఆ కేసుతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. మీరాకుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలన్నారు. నేరెళ్ల ఘటనలో దళితులు, బీసీలపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తే, కనీసం సానుభూతి చూపకుండా నిర్లక్ష్యంగా మాట్లాడిన కేసీఆర్‌కు తెలంగాణ సమాజం బుద్ధి చెబుతుందన్నారు. వెంకయ్యనాయుడు కుటుంబానికి చెందిన హర్ష మోటార్స్ నుంచి కేటీఆర్ డైరెక్టర్‌గా ఉన్న హిమాన్షు మోటార్స్ 300 వాహనాలు కొనుగోలు చేసింది వాస్తవం కాదా? జైరాం రమేష్ కాదు.. మూడేళ్ల దోపిడీ చేసిన కేసీఆరే సచివాలయం ముందు ముక్కు నేలకు రాయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను సింగిల్ టెండర్ బేస్ విధానంతో ఒక దగ్గర కూర్చొని తెలంగాణను ఆంధ్రా గుత్తేదార్లకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో పబ్ కల్చర్‌కు కేసీఆరే కారణమని, మూడేళ్లలో 50కి పైగా పబ్‌లకు అనుమతులిచ్చారన్నారు. ఏ పథకాన్ని, ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకుందో చెప్పాలన్నారు. మియాపూర్ భూకుంభకోణం గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. మోదీని చూసి ఎందుకు వణుకుతున్నారో చెప్పాలన్నారు. ప్రజల్లో తిరుగుతానని కేసీఆర్ చెప్పడం సంతోషమని, వాస్తవాలు ప్రజలకు చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మూడేళ్లుగా డ్రగ్స్ విచ్చల విడిగా అమ్ముతుంటే ఎందుకు నియంత్రించలేదని భట్టివిక్రమార్క ప్రశ్నించారు. పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ 2019లో 111 సీట్లు మీవే అని సర్వేలు చెప్పినప్పుడు ఎందుకు సహనం కోల్పోతున్నారని నిలదీశారు.

సీఎం అవగాహనారాహిత్యానికి నిదర్శనం: జానారెడ్డి

న్యూస్‌టుడే, హైదరాబాద్: కాంగ్రెస్‌ను పిశాచి అని వ్యాఖ్యానించడం సీఎం అవగాహనారాహిత్యానికి నిదర్శనమని సీఎల్పీ నేత కె.జానారెడ్డి అన్నారు. గురువారం షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడాల్సిన బాష కాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఖరి ఆధిపత్యధోరణి, అహంకారానికి నిదర్శనమని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కడుపు మండిన వారు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయిస్తుంటే కాంగ్రెస్‌పై అబాండాలు వేయడం సరికాదున్నారు. సింగరేణి ఉద్యోగుల వారసులకు కొలువుల విషయమై తెలంగాణ జాగృతినేత న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వాదించిన న్యాయవాది గతంలో తెరాసతో ఉన్నారన్నారు. గతంలో సాధారణ ఎన్నికల కంటే ముందు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ప్రకటనను నిలిపేయాలని న్యాయస్థానానికి వెళ్లి నిలిపి వేయించిందని వారేనని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు దేనిని ఆశించి కుర్చీలో కూర్చోబెట్టారో.. . వాటికోసం పని చేయాల్సింది పోయి హెచ్చరించే ధోరణిలో వ్యవహరించడం ఏం పద్ధతి? ఇది ప్రజాస్వామ్యం కాదా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల దళితుల పట్ల ముఖ్యమంత్రి చులకనగా మాట్లాడుతున్నారని.. పోలీసులపై చర్యలు తీసుకోకుండా వారికి మద్దతు చెప్పడం దారుణమన్నారు. కమ్యూనిస్టు పార్టీలనుద్దేశించి ముఖ్యమంత్రి ఉపయోగించిన భాష దారుణమన్నారు. ముఖ్యమంత్రి కంటే మూడు రెట్ల పదజాలాన్ని, యాస, భాషను ఉపయోగించి మాట్లాడగలం. కానీ అది హుందాతనం అనిపించుకోదన్నారు. ప్రగతిభవన్ వద్ద మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ శాసనమండలి పక్షనేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ కేటీఆర్ హిమాన్షు కంపెనీ డైరెక్టరా? కాదా? కేటీఆర్ ఆబిడ్స్ చౌరస్తాకు రండి... మీరు చెప్పేదే నిజమైతే ముక్కును నేలకు రాస్తానని సవాలు విసిరారు.

కృతజ్ఞత తెలియని కేసీఆర్: మల్లు రవి

కాంగ్రెస్ పట్ల కేసీఆర్ తీరు 'ఓడ దిగాక బోడ మల్లన్న' లా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు కేసీఆర్‌కు నైతికపరమైన హక్కు లేదన్నారు. నయీం కేసులో వెలుగులోకి వచ్చిన తెరాస నాయకులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని, అధికార పార్టీ ఎమ్మెల్యే మహిళా కలెక్టరు చేయి పట్టుకొన్నా చర్యలు లేవన్నారు.

న్యాయవ్యవస్థను కించపరుస్తున్నారు: జీవన్‌రెడ్డి

ఈనాడు, కరీంనగర్: కేసీఆర్‌కు మతిస్థిమితం సరిగా లేనట్లుందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలపైరెండేళ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్మిక సంఘం ఎన్నికల కోసం హడావుడి చేశారన్నారు. తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం విభేదాలతోనే అది కోర్టు వరకు చేరిందన్నారు. ఇసుక మాఫియాతో నిరుపేద వర్గాలు బలవుతున్నాయన్నారు. క్వారీకి సంబంధించిన సంతోష్‌రావు ఎవరి బంధువో తేల్చాలని డిమాండ్ చేశారు.

ప్రగతి భవన్ ముట్టడి యత్నం ఉద్రిక్తం

- క్రమబద్ధీకరణ కోసం ఏఎన్‌ఎంల నిరసన
- నర్సు ఆత్మహత్యాయత్నం
- కవరేజికి వెళ్లిన పాత్రికేయులపై ఏసీపీ దురుసుతనం

హైదరాబాద్, న్యూస్‌టుడే: వైద్యారోగ్య శాఖలో 20ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలో అదనపు ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలంటూ చేసిన ప్రగతిభవన్ ముట్టడియత్నం ఉద్రిక్తంగా మారింది. బుధవారం వారు ప్రగతిభవన్ రాగా పోలీసులు అదుపులోకి తీసుకుని కోఠిలో వదిలిపెట్టారు. సీఎంను కలిసేదాకా హైదరాబాద్ నుంచి వెళబ్లోమన్న వారు గురువారం ప్రగతిభవన్‌ను ముట్టడించేందుకు వచ్చారు. ఆసమయంలో మహేశ్వరం ప్రాంతానికి చెందిన శోభ అనే నర్సు కిరోసిన్ తాగి, ఒంటిపై పోసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆమెను ఉస్మానియాఆస్పత్రికి తరలించారు. మరోవైపు పోలీసులు ఏఎన్‌ఎంలను అడ్డుకుని అరెస్టుచేశారు. ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ..తాము గొడవకు రాలేదని, సీఎంకు గోడు వినిపించాలని వచ్చామన్నారు. పోలీసులు తమపై దురుసుగా ప్రవర్తించారన్నారు. అరెస్టు చేసినవారిని గోషామహల్‌కు తరలించారు. 82మందిని అరెస్టు చేసినట్లు పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. నిరసన కార్యక్రమం కవరేజీకి వెళ్లిన పాత్రికేయులు రాధిక, నరేందర్‌ను పంజాగుట్ట ఏసీపీ వెంకటేశ్వర్లు తిడుతూ, నెట్టివేయడం వివాదాస్పదమైంది. ఏసీపీ తీరుపై పాత్రికేయులు నిరసన తెలిపారు. ప్రొ.విశ్వేశ్వర్‌రావు, మాజీఎమ్మెల్సీ చెరుకుపల్లి సీతారాములు, పాత్రికేయ సంఘాల నాయకులు పంజాగుట్ట ఠాణాలో ఏసీపీపై ఫిర్యాదుచేశారు. దాడిపై టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి విరాహత్‌అలీ, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, శంకర్‌గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియాసెల్ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో డీజీపీ అనురాగ్‌శర్మకు ఫిర్యాదుచేశారు. శోభను ఉస్మానియాలో రాష్ట్ర మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఉద్యోగుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు సాయిరెడ్డి, ఏఎన్‌ఎంల సంఘం అధ్యక్షురాలు ప్రసన్న, సీఐటీయూనేతలు, మహిళాసంఘాల ప్రతినిధులు పరామర్శించారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉస్మానియాలో చికిత్స పొందుతున్న నర్సు శోభను పరామర్శిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన ఏఎన్‌ఎంలు

పోరాటం కొనసాగిస్తాం..: గోషామహల్‌లో ఏఎన్‌ఎంల సంఘ నేత మట్టేపల్లి సీత మాట్లాడుతూ..'2002లో ఎంపికై 2003లో బాధ్యతలు చేపట్టిన మాకు రూ.10,020 చెల్లిస్తున్నారు. మమ్మల్ని క్రమబద్ధీకరించాలని సీఎంను కలిసి సమస్యల్ని విన్నవిద్దామనుకుంటే అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. పదులసంఖ్యలో మహిళలు గాయాలపాలయ్యాం. ఏం జరిగినా హక్కుల సాధనకు పోరాడతాం' అన్నారు.

వృత్తి నిపుణుల వాణికి కాంగ్రెస్ వేదిక కానుంది: గీతారెడ్డి

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వాల పనితీరుపై వృత్తి నిపుణులు ఎప్పటికప్పుడు తమ ఆలోచనలు వివిధ మార్గాల ద్వారా పంచుకుంటూ ఉంటారని, అలాంటివారికి తమపార్టీ ఓ వేదిక కానుందని కాంగ్రెస్ నిపుణుల కమిటీ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త గీతారెడ్డి తెలిపారు. కమిటీ ఛైర్మన్ శశిథరూర్‌తో కలిసి గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. అన్నివర్గాల వారికి పార్టీని చేరువ చేయడానికి ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన మంచి ఆలోచన వల్లే వృత్తినిపుణుల కమిటీ ఏర్పాటైందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు వృత్తినిపుణుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. వారిని రాజకీయాలకు దగ్గర చేయడానికి కాంగ్రెస్ వేదికగా ఉంటుందన్నారు. శశిథరూర్ మాట్లాడుతూ..రాజకీయ అంశాలపై నిరంతరం వృత్తినిపుణులు చర్చ జరుపుతూ ఉంటారన్నారు. రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలవారీగా వృత్తినిపుణులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని తెలిపారు. రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కమిటీ పదాధికారుల సమావేశం బుధవారం నిర్వహించారని, దక్షిణాదిలో ప్రభావశీల నాయకురాలైన గీతారెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించడం హర్షణీయమన్నారు.

సీఎం నోటిని అదుపులో పెట్టుకోవాలి: తమ్మినేని

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: కమ్యూనిస్టులను విమర్శిస్తున్న ముఖ్యమంత్రి, ఒకనాడు వామపక్షాలతో పొత్తు కోసం పాకులాడిన చరిత్రను మరచిపోయారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బీసీలు, ఇతర అణగారిన వర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నేరెళ్ల ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తమ్మినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నోటిని అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కేటీఆర్ ఒక సంస్థలో డైరెక్టర్ అన్న విషయం ఎన్నికల సందర్భంలో సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టంగా ఉందన్నారు. 2016 వార్షిక నివేదికలోనూ డైరెక్టర్‌గా వ్యవహరించారని, కాని ఏడేళ్ల క్రితమే వదిలేశానని కేటీఆర్ చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. అదే కంపెనీతో ప్రభుత్వం రూ.350 కోట్ల విలువైన మోటారు సైకిళ్ల కొనుగోలు ఒప్పందం చేసుకుందని, ఒక మంత్రి డైరెక్టర్‌గా ఉన్న ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు చేయడం చట్టవిరుద్ధం కదా అని ప్రశ్నించారు. శాసనసభా చట్టప్రకారం కేటీఆర్ మంత్రిగా, ఎమ్మెల్యేగా కొనసాగడానికి అనర్హుడన్నారు. లారీలను తగలబెడితే ఊరుకోవాలా అని నేరెళ్ల ఘటనలో సీఎం అనడం సమంజసం కాదన్నారు. ఆయన తీరు ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని భావించేలా ఉందన్నారు. విమలక్క, ఆచార్య పి.ఎల్.విశ్వేశ్వరరావు, తెలంగాణ లోక్‌సత్తా అధ్యక్షుడు మన్నారం నాగరాజు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం హుందాతనాన్ని దిగజార్చాయి.. చాడ: సీఎం కేసీఆర్ ఉపయోగించిన భాష, వ్యవహరించిన తీరు ఆ హోదాకున్న గొప్పదనాన్ని, హుందాతనాన్ని దిగజార్చాయని సీపీఐ తెలంగాణ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓప్రకటనలో విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు.. బృహత్తరం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీపీ ఆచార్య
- ప్రాజెక్టు పనులు పరిశీలించిన ఐఏఎస్ అధికారులు



రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు సొరంగాలను పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారులు

రామడుగు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలకు సాగు నీరందించే బృహత్తరమైన ప్రాజెక్టు 'కాళేశ్వరం' అని సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీపీ ఆచార్య అన్నారు. గురువారం ఆయన సారథ్యంలో 8 మంది సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీల పనులను పరిశీలించింది. బృందంలో వై.శ్రీలక్ష్మి, పార్థసారథి, రామకృష్ణ, బీఎమ్‌డీ ఎక్కా, ఉమర్‌జలీల్, సవ్యసాచి జోషి, అధర్‌సిన్హా ఉన్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు 8వ ప్యాకేజీ, అంతర్గాం మండలం వేంనూరు, ధర్మారం మండలం నందిమేడారం వద్ద 6వ ప్యాకేజీ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సొరంగాలు, సర్జ్‌పూల్, పవర్‌హౌస్, పంపులు, విద్యుత్ మోటార్లను ప్రత్యేకంగా పరిశీలించారు. లక్ష్మీపూర్‌లో బీపీ ఆచార్య మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయని, వచ్చే డిసెంబరులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రతి ఒక్కరూ చూడాల్సిన ప్రాజెక్టు అని, అందుకే ప్రాజెక్టుపై డాక్యుమెంటరీ చిత్రీకరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఐఏఎస్ అధికారుల వెంట కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

వంటగ్యాస్ నింపడం ఉత్పత్తిలాంటిదే

- ఐటీ మినహాయింపులు వర్తిస్తాయి: సుప్రీం కోర్టు

దిల్లీ: గృహ అవసరాలకు ఉపయోగించే వంటగ్యాస్ (ఎల్‌పీజీ)ను సిలిండర్లలోకి నింపడం 'ఉత్పత్తి', 'తయారీ' అన్న నిర్వచనాల పరిధిలోకి వస్తుందని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల ఆ ప్రక్రియకు ఆదాయపు పన్ను (ఐ.టి.) చట్టం కింద మినహాయింపులు పొందేందుకు అర్హత ఉందని తీర్పునిచ్చింది. ఆదాయపు పన్ను చట్టంలోని 80హెచ్‌హెచ్, 80-ఐ, 80-ఐఏ కింద మినహాయింపులు పొందవచ్చంటూ హైకోర్టులు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. చమురు శుద్ధి కర్మాగారాల్లో తయారైన గ్యాస్‌ను నేరుగా ఇళ్లకు సరఫరా చేయరని, దీన్ని సిలిండర్లలోకి నింపడానికి తగిన సాంకేతిక ప్రక్రియను ఉపయోగించాల్సి ఉంటుందని పేర్కొంది. సిలిండర్లలో నింపడం మినహా కొత్తగా గ్యాస్ తయారు చేయడం లేదని, అందువల్ల పన్నులో మినహాయంపులు అవసరం లేదంటూ ఆదాయపు పన్ను కమిషనర్ చేసిన వాదనను తిరస్కరించింది.

పసుపుపై ప్రత్యేక దృష్టి సారించండి

- రైతులకు కనీస మద్దతు ధర అందేలా చూడాలి
- దిగుమతులను నియంత్రించాలి
- ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి
- ప్రధాని మోదీకి ఎంపీ కవిత విజ్ఞప్తి

ఈనాడు – దిల్లీ



పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలసి దిల్లీలో ప్రధాని మోదీని కలసిన నిజామాబాద్ ఎంపీ కె.కవిత

దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో విస్తారంగా పండే పసుపు పంటపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీకి తెరాస ఎంపీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రధానితో భేటీ అయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు చెప్పిన అంశాలను మోదీ ఆలకించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. పసుపు సాగులో ఇప్పటికీ శాస్త్రీయ పద్ధతులే అనుసరిస్తున్నారని, పసుపు అభివృద్ధికి చొరవ చూపాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. కొత్త వంగడాల సృష్టికి సరైన పరిశోధనలు జరగడం లేదన్నారు. దేశంలో పసుపు రైతుకు కనీస మద్దతు ధర లభించాలన్నా, దిగుమతులు తగ్గాలన్నా ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాల్సిందేనని చెప్పినట్లు తెలిపారు. దిగుమతులపై నియంత్రణ విధించాలని కోరామన్నారు. ఈ అంశంపై మూడేళ్లుగా తాను పోరాడుతూనే ఉన్నానని, లోక్‌సభలో ప్రైవేటు మెంబర్ బిల్లు కూడా ప్రవేశపెట్టానని ఆమె గుర్తుచేశారు. 10 నెలలపాటు సాగు చేయాల్సిన పసుపు పంటకు భారత సంస్కృతితో విడదీయరాని బంధం ఉందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ప్రధాని సానుకూలత చూస్తుంటే త్వరలోనే పసుపు రైతులకు మంచి రోజులు వస్తాయన్న భావన కలుగుతోందని కవిత పేర్కొన్నారు.

దిగుమతి అవుతోందా..!

దేశంలో పసుపు దిగుమతులపై ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతున్నప్పుడు మోదీ ఆశ్చర్యం వ్యక్తంచేసినట్లు తెలిసింది. పసుపు దిగుమతి అవుతోందా? ఎంతమేర అవుతోంది? అనే వివరాలు కవితను అడిగి తెలుసుకొన్నట్లు సమాచారం.

మీ ఆలోచనను ఉపయోగించుకుంటా

రాఖీ పండగ రోజు సోదరుడికి శిరస్త్రాణం బహుమతిగా ఇవ్వాలన్న కవిత ఆలోచనను ప్రధాని మోదీ అభినందించారు. గురువారం ఈ అంశాన్ని ఆమెతో ప్రత్యేకంగా చర్చించారు. ఆలోచన బాగుందని ఏదైనా సందర్భంలో తాను ఉపయోగించుకుంటానని సరదాగా కవిత అనుమతి కోరగా.. మన్‌కీ బాత్ వంటి కార్యక్రమాల్లో చెప్పాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బంకుల్లో పెట్రోలు పోయించుకునేటప్పుడు హెల్మెట్ ధరించాలన్న నిబంధన పెడదామా అని మోదీ కొద్దిసేపు చర్చించారు. ఈ నిబంధన తప్పుదోవ పట్టే అవకాశం ఉందని, శిరస్త్రాణం వాడకం అందరికీ అలవాటయ్యేలా ఏదైనా ఆలోచన చేయాలని సూచించారు.

ప్రధానితో సమావేశం అనంతరం ఎంపీ కవిత నిజామాబాద్ జిల్లాలోని సమస్యలపై పలువురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు.

ఆ ఆరోపణలు నిరూపించండి..

సింగరేణి కారుణ్య నియామకాలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని కవిత ఆరోపించారు. సీఎల్పీ నేత జానారెడ్డి ఆరోపించినట్లు సతీశ్‌కుమార్‌తో జాగృతి సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్‌కు చెందిన శంకర్‌ముదిరాజ్‌కు సతీశ్ సన్నిహితుడని తెలిపారు. వ్యక్తి పేరు, చిరునామా చెబుతున్నానని.. ఆరోపణలు నిరూపించాలని సవాలు చేశారు.

పోలీసుల అదుపులో మావోయిస్టు సానుభూతిపరులు!

దుబ్బాక, న్యూస్‌టుడే: మావోయిస్టు సానుభూతిపరులుగా భావిస్తున్న నలుగురిని గురువారం సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తాళ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో రెండు రోజులుగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆశ్రయం పొందుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆశ్రయమిచ్చిన వ్యక్తితోపాటు ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నట్లు, విచారణ నిమిత్తం సిద్దిపేట పట్టణంలోని ఓ ఠాణాకు తీసుకెళ్లినట్లు తెలిసింది. వారి నుంచి ఒక ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో కీలక వ్యక్తి చిన్నకోడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందినవాడని, అతనికి మావోయిస్టులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు విశ్వసిస్తున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడంలేదు.

జీఎస్టీ మండలి పర్యవేక్షకుడిని అరెస్టు చేసిన సీబీఐ

- మునుపటి కొలువులో వసూళ్ల పర్వం

దిల్లీ: 'వస్తు-సేవల పన్ను' (జీఎస్టీ) పాలక మండలి పర్యవేక్షకుడు మొనీష్ మల్హోత్రాను, అతని సన్నిహితుడైన దళారీ మానస్ పాత్రాను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అధికారులు బుధవారం దిల్లీలో అరెస్టు చేశారు. జీఎస్టీ రావడానికి ముందు మల్హోత్రా సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో పర్యవేక్షకునిగా పనిచేసినప్పుడు వ్యాపారులతో కుమ్మక్కై, వారిపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు లంచాలు స్వీకరించేవారనే ఆరోపణలు ఉన్నాయి. నెలనెలా మామూళ్లు స్వీకరించడంలో ఈ అధికారికి మానస్ పాత్రా సహాయపడుతున్నట్లు సీబీఐ దృష్టికి వచ్చింది. ఎవరికీ దొరక్కుండా చూడడానికి పాత్రా ముందుగా ఈ లంచం డబ్బును తన ఖాతాలో వేసుకుని, ఆ తర్వాత మల్హోత్రా భార్య, కుమార్తెల ఖాతాలకు బదలాయించేవాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సెంట్రల్ ఎక్సైజ్ పనుల కోసం కొన్ని రోజులుగా చేసిన వసూళ్లకు సంబంధించిన వివరాలను ఒక కాగితంపై రాసుకుని, దానిని, ఆ డబ్బును మల్హోత్రాకు అందజేయడానికి పాత్రా అతని ఇంటికి వస్తున్నట్లు సమాచారం అందుకున్న సీబీఐ...అదే సమయంలో దాడి చేసింది. వెంటనే ఆ ఇంట్లో సోదాలు నిర్వహించి, రూ.7లక్షల నగదు స్వాధీనం చేసుకొంది. ఇద్దరినీ అరెస్టు చేసింది. లంచం సొమ్మును, కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకొంది. వసూళ్లు చేసిన డబ్బు కూడా సెంట్రల్ ఎక్సైజ్ లావాదేవీలకు సంబంధించినవేనన్నారు. నిందితులిద్దరినీ గురువారం సీబీఐప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా ఈ నెల 16వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు.

డిసెంబరు నాటికే భగీరథ నీరు!

- ప్రతి పల్లెకూ సరఫరా
- సీఎం నిర్ణయంతో పనులు వేగవంతం
- ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ విజయ్‌ప్రకాశ్ వెల్లడి



హుస్నాబాద్, న్యూస్‌టుడే: వచ్చే డిసెంబరు నాటికి రాష్ట్రంలో ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందించే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2018 నాటికి ఇంటింటికి రక్షిత తాగునీటిని అందించాలని లక్ష్యం పెట్టుకోగా... ఏడాది ముందుగానే నీరందించాలని సీఎం నిర్ణయించారన్నారు. ఆ మేరకు పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 2,200 గ్రామాలకు రోజుకు రెండుసార్లు తాగునీటిని ఇస్తున్నామన్నారు. ఇదివరకు ఒక్కో వ్యక్తికి రోజుకు 40 లీటర్ల చొప్పున నీరివ్వాలనే ప్రాతిపదికన పథకాలు నిర్మించారనీ, ఇప్పుడు 100 లీటర్ల చొప్పున ఇచ్చేందుకు రూపకల్పన చేశామన్నారు. గ్రామాల్లో అవసరమైనచోట సిమెంటు రహదారుల్లో తవ్వకాలు చేపట్టి పైపులైన్లు వేసిన తర్వాత వాటికి మళ్లీ మరమ్మతులు చేస్తామని సీఈ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా నిమిషానికి ఐదు లీటర్ల నీరు సరఫరా అవుతోందన్నారు. ఏ అంతస్తులో ఉన్నా నీరు ఒకేలా అందుతుందని, నీరు అధికంగా రావాలని మోటార్లు వినియోగిస్తే నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదముందన్నారు. ఇళ్లు, విద్యాలయాలు, కార్యాలయాలకు ఉచితంగానే ఈ కనెక్షన్లను ఇస్తామన్నారు. విశ్రాంత సీఈ నర్సింగరావు, ఈఈ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

మాదిగలను విస్మరించడం భాజపాకు తగదు

- దిల్లీలో మాదిగ, ఉపకులాల సదస్సులో వక్తలు

ఈనాడు, దిల్లీ: ఎన్నికల సమయంలో వర్గీకరణకు హామీ ఇచ్చి అక్కున చేర్చుకొన్న భాజపా. ప్రస్తుతం మాదిగలను విస్మరించడం తగదని పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. గురువారమిక్కడ తెలంగాణ, ఏపీ భవన్‌లో జాతీయ మాదిగ మహిళాఫోర్స్ అధ్యక్షురాలు పెబ్బె జీవ మాదిగ అధ్యక్షతన మాదిగ, మాదిగ ఉపకులాల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, ఏపీ అధ్యక్షుడు దండు వీరయ్య తదితరులు పాల్గొన్నారు. వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసనలు తెలుపుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. మాదిగలను విస్మరించడం అంటే రాజకీయ ఆధిపత్యానికి సమాధి కట్టుకోవడమేనని అన్నారు. నవంబరులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశానికి హాజరైన తెరాస ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. సదస్సులో రాయికంటి రాందాస్, వినాయక్‌రావు, శ్రీరాములు తదిరులు మాట్లాడారు.

శాంతికి సుముఖతను చేతల్లో చూపించాలి: చైనా

బీజింగ్: సరిహద్దుల్లో శాంతి నెలకొనాలని భారత్ భావిస్తున్నట్లయితే దానిని చేతల్లో చూపించాలని చైనా సూచించింది. తమ సరిహద్దు పరిధిలో రహదారి నిర్మించుకోవాలని ప్రయత్నిస్తే భారత్ తరఫున పెద్దఎత్తున సైనిక బలగాలు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశాయని ఆరోపించింది. భారత్ తరఫు చర్యలు బాధ్యతా రాహిత్యంగా, నిర్లక్ష్యంగా ఉన్నాయని చైనా విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డోక్లాం వద్ద బుధవారంవరకు 48 మంది భారతీయ సైనికులు, ఒక బుల్‌డోజర్ ఉండడం గురించి ప్రస్తావిస్తూ అది చైనా ప్రాదేశిక సరిహద్దులో చొరబడడమే అవుతుందని అన్నారు. శాంతి కావాలని భారత్ కోరుకుంటే తమ బలగాలను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ పరిధిలో రహదారి నిర్మించుకోవడంపూర్తిగా న్యాయసమ్మతమేనని చెప్పారు.

తెలంగాణకు మరో ట్రిపుల్‌ఐటీ ఇవ్వండి

కాంగ్రెస్ ఎంపీ రాపోలు డిమాండ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు మరో ట్రిపుల్ఐటీ ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం రాజ్యసభలో ట్రిపుల్ఐటీ బిల్లు(సవరణ)పై ఎంపీ రాపోలు మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్నత విద్యకు కేంద్రం సహకరించాలని కోరారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కానరాక ఆందోళనతో పురుగుమందు తాగి యువరైతు ఆత్మహత్య చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా బూర్గుపల్లికి చెందిన గంగారం నర్సింలు(28) తండ్రి సత్తయ్యకు రెండెకరాల ప్రభుత్వ మిగులు భూమి ఉంది. దీంతోపాటు మరో మూడెకరాలు నర్సింలు కౌలుకు తీసుకొని రెండెకరాల్లో పత్తి, మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి రూ.40వేల పంట రుణం తీసుకున్నారు. మరో రూ.3లక్షల అప్పు చేశారు. పరిస్థితులు అనుకూలించి పంటలు పండితే చేసిన అప్పులో సగం వరకైనా తీర్చొచ్చని ఆశలు పెట్టుకున్నారు. వర్షాల్లేక పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన నర్సింలు ఉదయం పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు

కశ్మీర్‌లో గస్తీ బృందంపై ఉగ్రవాదుల కాల్పులు

- **సైనికాధికారి, జవాన్ మృతి; ముగ్గురికి గాయాలు**

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్ జిల్లాలైన షోపియాన్, కుల్‌గామ్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు ఉగ్రవాదులతో పాటు ఒక సైనికాధికారి, ఒక జవాను మరణించారు. మరో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. షోపియాన్ జిల్లా జైనపోరలో గురువారం తెల్లవారుజామున 62 రాష్ట్రీయ రైఫిల్ బృందం గస్తీ తిరుగుతుండగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ఐదుగురు సైనికులు గాయపడ్డారని వివరించారు. వీరిలో మేజర్ కమలేశ్ పాండే, జవాన్ టంజిన్ చుల్తిమ్ మరణించారని వెల్లడించారు. మేజర్ పాండే ఉత్తరాఖండ్‌కు చెందినవారు కాగా.. జవాను టంజిన్ హిమాచల్ ప్రదేశ్ వాసి. వీరి మృతదేహాలకు జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఘనంగా నివాళులు అర్పించారు. టంజిన్ కుటుంబానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం ప్రకటించింది.

కుల్‌గామ్‌లో ఎన్‌కౌంటర్: కుల్‌గామ్ జిల్లా గోపాల్‌పురలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల కదలికలపై కచ్చితమైన సమాచారం అందటంతో సైనిక బలగాలు వారిని చుట్టుముట్టాయని రక్షణశాఖ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రాజేశ్ కైలా తెలిపారు. లొంగిపోవాలని ఆదేశించగా వారు కాల్పులు జరిపారని, సైనిక బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని వివరించారు. ఘటనా స్థలంలో రెండు ఆయుధాలు లభ్యమయ్యాయని వెల్లడించారు. మరణించిన ఉగ్రవాదులను అఖిబ్ హుస్సేన్, సోహాయిల్ అహ్మద్ రథర్‌గా గుర్తించారు. వీరిలో ఒకరు గత మే నెలలో బ్యాంకు వ్యానుపై జరిగిన దాడిలో పాలు పంచుకున్నాడని అధికారులు తెలిపారు. ఈ దాడిలో వ్యాను కాపలాదారులతో పాటు ఐదుగురు పోలీసులు మరణించారు.

ఫారం – 6

(చట్టం–30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్–1 రూల్19 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ప్రాథమిక నోటిఫికేషన్

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G1/1858/2017 తేది. 7-7-2017
ఫైలు నెం: ఎ/34/2017, తేది. 29-06-2017
గెజిట్ నెం. 59/2017 తేది. 7-07-2017

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి-భువనగిరి జిల్లా, **బి.పోచంపల్లి** మండలం, **జిబ్లక్‌పల్లి** గ్రామములో భూమి విస్తీర్ణం ఎ. 3.24 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం **పిల్లాయిపల్లి** కాలువ **జిబ్లక్‌పల్లి** గ్రామము, **బి.పోచంపల్లి** మండలం **పిల్లాయిపల్లి కాలువ** కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

రిక్విజిషన్ అథారిటీ లేఖను సమర్పిస్తూ ఇట్టి ప్రాజెక్టు ఇ.ఐ.ఎ. చేయబడినది అని తెలిపినారు. కావున చట్టం 2013లోని సెక్షన్ 6(2) ప్రకారము ఎస్.ఐ.ఎ.ను మినహాయించనైనది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేటు యాదాద్రి-భువనగిరి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 19, రెవిన్యూ (జె.ఎ. అండ్ ఎల్.ఎ), తేది: 11.02.2015 ప్రకారము ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి-భువనగిరి జిల్లా, **బి.పోచంపల్లి** మండలంలోని **జిబ్లక్‌పల్లి** గ్రామంలో విస్తీర్ణం ఎ. 3.24 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా: యాదాద్రి–భువనగిరి **మండలం: బి.పోచంపల్లి** **గ్రామం: జిబ్లక్‌పల్లి**

సర్వేనెం/భూమి స్వభావము హక్కు స్వభావము విస్తీర్ణం(ఎ.గుం)	భూసేకరణ విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు(ప) / అనుభవదారు(అ) పేరు మరియు తండ్రి / భర్త పేరు	చెట్లు/ కట్టడములు
1	2	3	4
5 ఖుష్కి/పట్టా 0.20	-	ఆకిటి క్రిష్టారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	-
	-	సిరిపంగి లక్ష్మమ్మ భర్త చంద్రయ్య	-
	-	సిరిపంగి బుచ్చయ్య తండ్రి గంగయ్య	-
	-	ఆకిటి మల్లమ్మ భర్త బాల్‌రెడ్డి	-
	-	ఆకిటి రామయ్య తండ్రి రాజయ్య	-
	-	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	-
	-	గూడూరు మల్లారెడ్డి తండ్రి యాదిరెడ్డి	-
	-	సురకంటి జంగారెడ్డి తండ్రి మల్లారెడ్డి	-
	-	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	ఆకిటి శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	ఆకిటి జగదాంబ భర్త రాజిరెడ్డి	-
	-	ఆకిటి కలమ్మ భర్త శేఖర్‌రెడ్డి	-
		కందిమళ్ళ జానకిరాంరెడ్డి తండ్రి క్రిష్టారెడ్డి	---
		పోది వివరాలు	
	0.05	ఆకిటి పద్మరెడ్డి తండ్రి కిష్టారెడ్డి	---
	0.05	ఆకిటి జనార్దన్‌రెడ్డి తండ్రి కిష్టారెడ్డి	---
	0.05	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	---
6 ఖుష్కి/పట్టా 0.18	---	ఆకిటి క్రిష్టారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి సత్తిరెడ్డి తండ్రి క్రిష్టారెడ్డి	---
	---	సిరపంగి బుచ్చయ్య తండ్రి గంగయ్య	---
	---	సిరిపంగి లక్ష్మమ్మ భర్త చంద్రయ్య	---
	---	ఆకిటి మల్లమ్మ భర్త బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి వెంకట్‌రెడ్డి తండ్రి యాదిరెడ్డి	---
		ఆకిటి రామయ్య తండ్రి రాజయ్య	
	---	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	---
	---	సురకంటి జంగారెడ్డి తండ్రి మల్లారెడ్డి	---
	---	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	---
	---	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి.)పిల్లాయిపల్లి కెనాల్	---
	---	ఆకిటి శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	---
	---	ఆకిటి జగదాంబ భర్త రాజిరెడ్డి	---
	---	ఆకిటి కలమ్మ భర్త శేఖర్‌రెడ్డి	---
	---	ఆకిటి రంగారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి	---
		పోది వివరాలు	
	0.09	ఆకిటి శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	---
	0.09	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	---
7 ఖుష్కి/పట్టా 0.16	---	సురకంటి జంగారెడ్డి తండ్రి మల్లారెడ్డి	---
	---	సురకంటి నర్సిరెడ్డి తండ్రి మల్లారెడ్డి	---
	---	సురకంటి రఘుపతిరెడ్డి తండ్రి మల్లారెడ్డి	---
	---	ఆకిటి క్రిష్టారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి సత్తిరెడ్డి తండ్రి క్రిష్టారెడ్డి	---
	---	సిరిపంగి బుచ్చయ్య తండ్రి జంగయ్య	---
	---	సిరిపంగి లక్ష్మమ్మ భర్త చంద్రయ్య	---
	---	ఆకిటి మల్లమ్మ భర్త బాల్‌రెడ్డి	---
	---	ఎగ్జిజక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి) పిల్లాయిపల్లి కెనాల్	---
	---	ఆకిటి రామయ్య తండ్రి రాజయ్య	---
	---	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	---
	---	చినలచ్చి యాదయ్య తండ్రి నర్సయ్య	---
	---	చినలచ్చి చంద్రయ్య తండ్రి నర్సయ్య	---
	---	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	---
	---	ఆకిటి శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	---
	---	ఆకిటి జగదాంబ భర్త రాజిరెడ్డి	---
	---	ఆకిటి కలమ్మ భర్త శేఖర్‌రెడ్డి	---
		పోది వివరాలు	
	0.08	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	---
	0.08	ఆకిటి రంగారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి	---
11 ఖుష్కి/పట్టా 0.24	---	ఆకిటి క్రిష్టారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి సత్తిరెడ్డి తండ్రి క్రిష్టారెడ్డి	---
	---	ఆకిటి మల్లమ్మ భర్త బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి రామయ్య తండ్రి రాజయ్య	---
	---	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	---
	---	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి)పిల్లాయిపల్లి కెనాల్	---
	---	సురకంటి జంగారెడ్డి తండ్రి మల్లారెడ్డి	---
	---	చినలచ్చి యాదయ్య తండ్రి నర్సయ్య	---
	---	పకీర్ చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి యాదిరెడ్డి	---
	---	ఆకిటి రామనర్సమ్మ భర్త యాదిరెడ్డి	---
		పోది వివరాలు	
	0.09	ఆకిటి రంగారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి	---
	0.09	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	---
	0.03	చినలచ్చి నర్సింహ్మ తండ్రి యాదయ్య	---
	0.03	చినలచ్చి చంద్రయ్య తండ్రి నర్సయ్య	---
12 ఖుష్కి/పట్టా 0.21	---	ఆకిటి సత్తిరెడ్డి తండ్రి క్రిష్టారెడ్డి	---
	---	కంద్రేద్దుల లక్ష్మీకుమారి తండ్రి మోహన్‌రెడ్డి	---
	---	ఆకిటి మల్లమ్మ భర్త బాల్‌రెడ్డి	---
	---	ఆకిటి రంగారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి	---
	---	ఆకిటి రామయ్య తండ్రి రాజయ్య	---
	---	ఆకిటి రామచంద్రారెడ్డి తండ్రి ఎట్టయ్య	---
	-	ఆకిటి మనోహర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి	-
	-	సురకంటి జంగారెడ్డి తండ్రి మల్లారెడ్డి	-
	-	చినలచ్చి యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	చినలచ్చి చంద్రయ్య తండ్రి నర్సయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి) పిల్లాయిపల్లి కెనాల్	-
	-	పకీర్ చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి యాదిరెడ్డి	-
	-	ఆకిటి రామనర్సమ్మ భర్త యాదిరెడ్డి	-
	-	**పోది వివరాలు**	
	0.07	నల్ల కిష్టయ్య తండ్రి లింగయ్య	-
	0.07	ఆకిటి రాజిరెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	0.07	ఆకిటి శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	తంగడపల్లి నర్సయ్య తండ్రి గాలయ్య	-
	-	చినలచ్చి యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	చినలచ్చి శంకరయ్య తండ్రి చంద్రయ్య	-
	-	సిరిపంగి సాలయ్య తండ్రి పెద గోపయ్య	-
	-	మీసాల యాదయ్య తండ్రి పోచయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి) పిల్లాయిపల్లి కెనాల్	-
	-	తంగడపల్లి లక్ష్మమ్మ భర్త వెంకయ్య	-
	-	తంగడపల్లి వెంకటయ్యయ తండ్రి నర్సయ్య	-
	-	తంగెడపల్లి పెంటయ్య తండ్రి గాలయ్య	-
	-	చినలచ్చి నర్సయ్య తండ్రి లక్ష్మయ్య	-
	-	మాచర్ల ఎల్లయ్య తండ్రి ఎల్లయ్య	-
	-	తంగడపల్లి చంద్రయ్య తండ్రి రామయ్య	-
	-	పల్లెం మైసయ్య తండ్రి ముత్తయ్య	-
	-	సిరిపంగి అచ్చయ్య తండ్రి దుర్గయ్య	-
22 ఖుష్కి/ఇనాం 0.02	-	సిరిపంగి నర్సింహ్మ తండ్రి దుర్గయ్య	-
	-	నల్లా యాదగిరి తండ్రి ముత్తయ్య	-
	-	నల్లా లక్ష్మమ్మ భర్త నర్సయ్య	-
	-	సిరిపంగి చిన గంగయ్య తండ్రి నర్సయ్య	-
	-	కొక్కుల రాజయ్య తండ్రి లక్ష్మయ్య	-
	-	కొక్కుల యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి)పిల్లాయిపల్లి కెనాల్ -	-
	-	సిరిపంగి నర్సయ్య తండ్రి చిన దుర్గయ్య	-
	-	నల్లా పెంటయ్య తండ్రి వీరయ్య	-
	-	సిరిపంగి రామయ్య తండ్రి గోపయ్య	-
	-	తంగడపల్లి లచ్చయ్య తండ్రి కాశయ్య	-
	-	సిరిపంగి సరోజ భర్త చంద్రయ్య	-
	-	సిరిపంగి యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	సిరిపంగి చంద్రయ్య తండ్రి గంగయ్య	-
	-	సిరిపంగి లక్ష్మమ్మ భర్త రామయ్య	-
	-	మీసాల రామయ్య తండ్రి మైసయ్య	-
	-	చినలచ్చి మైసయ్య తండ్రి ఎల్లయ్య	-
	-	నల్లా కిష్టయ్య తండ్రి లింగయ్య	-
	-	సిరిపంగి నర్సయ్య తండ్రి కనకయ్య	-
		పోది వివరాలు	
	0.01	పాకల యాదయ్య తండ్రి నర్సయ్య	-
	0.01	పాకల నర్సయ్య తండ్రి రామయ్య	-
23 ఖుష్కి/పట్టా 0.08	-	కొమ్ము నర్సింహ్మ తండ్రి రామయ్య	-
	-	కొమ్ము పర్వతాలు తండ్రి సీతయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి)పిల్లాయిపల్లి కెనాల్	-
	-	కొమ్ము లక్ష్మయ్య తండ్రి సీతయ్య	-
	-	కొమ్ము నర్సయ్య తండ్రి సీతయ్య	-
	-	కొమ్ము స్వామి తండ్రి బాలయ్య	-
	-	కొమ్ము శంకరయ్య తండ్రి బాలయ్య	-
	-	కొమ్ము వెంకటయ్య తండ్రి బాలయ్య	-
		పోది వివరాలు	
	0.02	కొమ్ము స్వామి తండ్రి బాలయ్య	-
	0.03	కొమ్ము శంకరయ్య తండ్రి బాలయ్య	-
	0.03	కొమ్ము వెంకటయ్య తండ్రి బాలయ్య	-
24 ఖుష్కి/ప్రభుత్వ 0.11	-	ప్రభుత్వభూమి	-
	-	మీసాల మంగమ్మ భర్త రామయ్య	-
	-	మీసాల రాములమ్మ భర్త బుచ్చయ్య	-
	-	మీసాల యాదయ్య తండ్రి రామయ్య	-
	-	మీసాల మైసయ్య తండ్రి రామయ్య	-
	-	మీసాల నర్సయ్య తండ్రి రామయ్య	-
	-	తంగెడపల్లి నర్సయ్య తండ్రి గాలయ్య	-
	-	తంగెడపల్లి పెంటయ్య తండ్రి గాలయ్య	-
		పోది వివరాలు	
	0.11	తంగెడపల్లి నర్సింహ్మ తండ్రి గాలయ్య	-
25 ఖుష్కి/పట్టా 0.06	-	పోచంపల్లి సుధాకర్‌రావు తండ్రి రామారావు	-
	-	మీసాల నర్సింహ్మ తండ్రి పోచయ్య	-
	-	నల్లా వెంకటయ్య తండ్రి మల్లయ్య	-
	-	కొక్కుల యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి) పిల్లాయిపల్లికెనాల్	-
	-	చినలచ్చి శంకర్ తండ్రి దేవయ్య	-
	-	మీసాల ముత్తయ్య తండ్రి మైసయ్య	-
	-	చినలచ్చి బుచ్చయ్య తండ్రి నర్సయ్య	-
	-	సిరిపంగి సాలయ్య తండ్రి గోపయ్య	-
	-	తంగడపల్లి యాదయ్య తండ్రి చంద్రయ్య	-
	-	పోచంపల్లి సీతారాంమనోహర్‌రావు తండ్రి రామారావు	-
	-	పోచంపల్లి సుదర్శన్‌రావు తండ్రి రామారావు	-
	-	పోచంపల్లి మాధవరావు తండ్రి రామారావు	-
	-	పోచంపల్లి శ్రీధర్‌రావు తండ్రి రామారావు	-
	-	పోచంపల్లి అచ్చుత్‌రామారావు తండ్రి రామారావు	-
	-	పోచంపల్లి అనంతలక్ష్మి భర్త రామారావు	-
	-	మీసాల శ్రీరాములు తండ్రి పోచయ్య	-
	-	మీసాల మల్లయ్య తండ్రి పోచయ్య	-
		పోది వివరాలు	
	0.06	నల్లా వెంకటయ్య తండ్రి మాల్లయ్య	-
26 ఖుష్కి/పట్టా 0.16	-	పోచంపల్లి ఇందిరాబాయి భర్త యాదగిరిరావు	-
	-	పోచంపల్లి గోపాల్‌కిషన్‌రావు తండ్రి శ్రీనివాసరావు	-
	-	పోచంలపల్లి పాండురంగారావు తండ్రి శ్రీనివాసరావు	-
	-	పోచంపల్లి రామచందర్‌రావు తండ్రి శ్రీనివాసరావు	-
	-	పోచంపల్లి మధుసుధన్‌రావు తండ్రి యాదగిరిరావు	-
	-	చినలచ్చి చంద్రమ్మ భర్త మైసయ్య	-
	-	నల్లా యాదయ్య తండ్రి ముత్తయ్య	-
	-	తంగడపల్లి గోరయ్య తండ్రి చంద్రయ్య	-
	-	సిరిపంగి రామయ్య తండ్రి గోపయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి)పిల్లాయిపల్లికెనాల్	-
	-	నల్లా వెంకటయ్య తండ్రి మల్లయ్య	-
	-	కొక్కుల శివమ్మ భర్త యాదయ్య	-
	-	సిరిపంగి యాదయ్య తండ్రి గంగయ్య	-
	-	మీసాల మైసయ్య తండ్రి ముత్తయ్య	-
	-	మీసాల రాములమ్మ భర్త బుచ్చయ్య	-
	-	కొక్కుల కిషన్ తండ్రి శ్రీరాములు	-
	-	తంగడపల్లి యాదయ్య తండ్రి చంద్రయ్య	-
	-	తంగడపల్లి బుచ్చయ్య తండ్రి గాలయ్య	-
	-	నల్లా వెంకటయ్య తండ్రి నర్సయ్య	-
		పోది వివరాలు	
	0.16	సిరిపంగి రామయ్య తండ్రి గోపయ్య	-
33 ఖుష్కి/పట్టా 0.02	-	సిరిపంగి నర్సయ్య తండ్రి కనకయ్య	-
	-	సిరిపంగి రామయ్య తండ్రి పెద గోపయ్య	-
	-	సిరిపంగి సాలయ్య తండ్రి పెద గోపయ్య	-
	-	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ.బి) పిల్లాయిపల్లికెనాల్	-
	-	సిరిపంగి నర్సింహ్మ తండ్రి రామయ్య	-
	-	చినలచ్చి బుచ్చయ్య తండ్రి నర్సయ్య	-
	-	చినలచ్చి వెంకయ్య తండ్రి లక్ష్మయ్య	-
	-	చినలచ్చి మల్లయ్య తండ్రి లక్ష్మయ్య	-
	-	చినలచ్చి లక్ష్మయ్య తండ్రి చంద్రయ్య	-
	-	చినలచ్చి ఇస్తారి తండ్రి చంద్రయ్య	-
	-	చినలచ్చి సుధాకర్ తండ్రి చంద్రయ్య	-
	-	చినలచ్చి శామయ్య తండ్రి లక్ష్మయ్య	-
	-	సిరిపంగి అన్నపూర్ణ భర్త చంద్రయ్య	-
	-	సిరిపంగి యాదగిరి తండ్రి రామయ్య	-
	-	చినలచ్చి యాదగిరి తండ్రి రామయ్య	-
	-	చినలచ్చి కిష్టయ్య తండ్రి నర్సయ్య	-
	-	సిరిపంగి యాదయ్య తండ్రి నర్సయ్య	-
	-	సిరిపంగి మల్లయ్య తండ్రి నర్సయ్య	-
	-	సిరిపంగి రాములు తండ్రి నర్సయ్య	-
		పోది వివరాలు	
	0.02	సిరిపంగి సరోజన భర్త చంద్రయ్య	-
	3.24		

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమియొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టరు యాదాద్రి-భువనగిరి గారికి లిఖిత పూర్వకంగా తెలియచేయవలసిఉన్నది. ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియచేయవలసి ఉన్నది.

సం/–, ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి–భువనగిరి జిల్లా **సం/–, సంయుక్త కలెక్టర్ యాదాద్రి–భువనగిరి జిల్లా** **సం/–, జిల్లా కలెక్టర్ యాదాద్రి–భువనగిరి**



ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుకు దిల్లీలోని ఆయన నివాసంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న తెరాస, తెదేపా, కాంగ్రెస్, వైకాప ఎంపీలు, నాయకులు

వెంకయ్యనాయుడికి తెలుగు ఎంపీల మద్దతు

ఈనాడు, దిల్లీ: ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడికి తెలుగు ఎంపీలు మద్దతు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన భాజపా, తెరాస, తెదేపా, వైకాపాకు చెందిన ఎంపీలు వెంకయ్యనాయుడితో గురువారమిక్కడ ఆయన నివాసంలో భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాలకు ఆయన చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఎంపీలు ఆకాంక్షించారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఎంపీలకు బుధవారం వెంకయ్యనాయుడు లేఖ రాసిన విషయం విదితమే.

మద్దతు తెలిపిన గుత్తా: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడికి మద్దతు ఇస్తున్నట్లు గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొంత కాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉండడంతోపాటు తెరాసలో చేరిన విషయం విదితమే. గురువారం వెంకయ్యనాయుడిని కలిసి పుష్పగుచ్ఛంఇచ్చి అభినందించారు.

అందరూ అనుమానితులే!

మత్తు మందుల కేసు విచారణ
వీడియోలు పరిశీలిస్తున్న అధికారులు


ఈనాడు, హైదరాబాద్: మత్తు మందుల కేసులో విచారణకు హాజరైన వారంతా అనుమానితులేనా? అవుననే అంటున్నారు ఆబ్కారీ అధికారులు. దాంతో సరైన ఆధారాలు దొరికితే వీరిని నిందితులుగా మార్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ఆబ్కారీ అధికారులు పెద్ద కసరత్తే మొదలుపెట్టారు. విచారణకు హాజరైన వారిలో ఎవరి ప్రమేయం ఎంత ఉందన్న విషయాన్ని తేల్చేందుకు నడుం కట్టారు. దీనిలో భాగంగా విచారణ జరుపుతుండగా నమోదుచేసిన వీడియో దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సినీ పరిశ్రమకు చెందిన మొత్తం 12 మంది విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. వీరిలో ఒక్కొక్కరికి సుమారు ఆరు గంటల చొప్పున అంటే దాదాపు 72 గంటల వీడియో దృశ్యాలను ఇప్పుడు పరిశీలిస్తున్నారు. దీని ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకోబోతున్నారు. మత్తుమందుల కేసులో నెదర్లాండ్స్ దేశానికి చెందిన మైక్ కమింగతోపాటు మొత్తం 21 మందిని ఆబ్కారీ అధికారులు అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. వీరి నుంచి మత్తుమందులు కొనుగోలుచేసిన వారి ప్రమేయం ఈ కేసులో ఎంత వరకు ఉందన్న విషయాన్ని తేల్చేందుకు 12 మంది సినీ ప్రముఖులు, 27 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు మరికొందర్నీ విచారించారు. వీరిలో సినీ ప్రముఖుల విచారణ చర్చనీయాంశంగా మారింది. వీరు నిజంగా వాడేవారేనా, వీరిలోనూ సరఫరాదారులు ఉన్నారా అన్నది ఆబ్కారీ అధికారులు తేల్చబోతున్నారు. దీని ఆధారంగానే వారిని బాధితులుగా చేర్చాలా, నిందితులుగా మార్చాలా, లేకపోతే సాక్షులుగానే పరిగణించాలా? అన్నదానికి సంబంధించి కసరత్తు మొదలుపెట్టారు. విచారణకు సంబంధించిన వీడియో రికార్డులను పరిశీలిస్తున్నారు. నటులు ఎవరూ తాము మత్తుమందులు వాడుతున్నట్లు ఒప్పుకోలేదు. ఆబ్కారీ అధికారులు తమకు కావాల్సిన సమాచారం తెప్పించుకునేలా తెలివిగా ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా తమవద్ద ఉన్న ఫొటోలు, వాట్సప్ సంభాషణల వంటి వాటిని ముందు పెట్టి ప్రశ్నించారు. ఇలాంటి సందర్భాల్లో మాత్రం కొందరు సినీ ప్రముఖులు తమకు తెలియకుండానే కొంత సమాచారాన్ని వెల్లడించారు. ఈ సమాచారం ఎంత వరకు ఉపయోగపడుతుందనేది ఇప్పుడు అధ్యయనం చేయబోతున్నారు. దీని ఆధారంగానే వారిపై పట్టు బిగిస్తారు. మత్తుమందులు వాడుతున్నప్పటికీ.. వారిని బాధితులుగా చూడాల్సిన పనిలేదని, తీవ్రతను బట్టి వారిని అరెస్టు చేయవచ్చని, అటువంటి వారికి ఆరు నెలల వరకూ జైలుశిక్ష పడే అవకాశం కూడా ఉందని ఒక అధికారి స్పష్టం చేశారు. ఒకవేళ తమ తోటి వారికి పంచిపెట్టేందుకు మత్తు మందులు తెప్పించుకున్నట్లు ఆధారాలు లభిస్తే అటువంటి సందర్భాల్లో వారిని నిందితులుగా చేర్చవచ్చని కూడా ఆ అధికారి వెల్లడించారు. విచారణకు హాజరయ్యే వారిలో ఎవరిపాత్ర ఏమిటన్నది ముందుగా తేల్చాల్సి ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి

వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రసవాల్లో అనవసర శస్త్రచికిత్సలను నివారించాలంటే ప్రభుత్వ దవాఖానాల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన అవసరముందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఈ ఏడాది జనవరిలో 33 శాతం ఉంటే ఇప్పుడు 41 శాతానికి చేరుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఇది 50శాతానికి చేరుకోవాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. 'కేసీఆర్ కిట్' పథకం అమలుతీరుపై గురువారం మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ప్రసవాల్లో అత్యధికంగా 82 శాతంతో ఆదిలాబాద్ జిల్లా ముందు నిలవగా.. 5శాతం ప్రసవాలతో మేడ్చల్ ఆఖరి స్థానంలో నిలవడంపై మంత్రి ఆరాతీశారు. మేడ్చల్ జిల్లాలోని ఆసుపత్రుల్లో ప్రసవాల శాతం పెరగడానికి లోటుపాట్లు సరిచేయాలని, సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత 6నెలల ప్రసవాల శాతాన్ని సమీక్షించగా.. జనవరిలో 33శాతం, ఫిబ్రవరిలో 30, మార్చిలో 35, ఏప్రిల్‌లో 39, మేలో 40, జూన్‌లో 41శాతంగా నమోదవడం పట్ల హర్షం వ్యక్తంచేసిన మంత్రి.. అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బందిని అభినందించారు. కేసీఆర్ కిట్ పథకాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, అన్ని వివరాలనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణ, అన్ని జిల్లాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఔరా దొంగ.. బాధపడొద్దంటూ లేఖ!



ఈ చిత్రంలో తప్పుల తడకగా ఉన్న రాతలేమిటని చదివే ప్రయత్నం చేస్తున్నారా.. ఇది ఓ దొంగ రాసిన లేఖ.. 'మీ బంగారం ఎత్తుకపోయిందు అని బాధపడొద్దు. దేవుడు మీకు ఇంకా ఇస్తాడు. మీరు చూస్తూ ఉండండి' అని దొంగతనం చేసిన ఇంట్లోనే ఈ లేఖ రాసి వెళ్లాడు. నిజామాబాద్ నగరంలోని హమాల్‌వాడి ప్రాంతానికి చెందిన భాస్కర్ కుటుంబం తమ ఇంటికి తాళం వేసి బుధవారం రాత్రి బోర్గాం గ్రామానికి వెళ్లింది. గురువారం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. తాళం ధ్వంసమై లోపల సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. నగర సీఐ సుభాష్ చంద్రబోస్, మూడో ఠాణా ఎస్సై శ్రీహరి ఇంటిని పరిశీలిస్తుండగా దొంగ ఓ డైరీలోని పేపరులో స్కెచ్ పెన్‌తో పై విధంగా రాసిన లేఖ కనిపించింది. దీని ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తి పక్కా స్థానికుడై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మొత్తం 10 తులాల బంగారు నగలు, రూ.25 వేల నగదు చోరీకి గురయ్యాయి. – నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే

తీర ప్రాంత రక్షణకు కొత్తగా సీబీపీఎఫ్: రాజ్‌నాథ్

దిల్లీ: తీర ప్రాంత రక్షణకు సరికొత్త భద్రతా దళాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఇక్కడ జరిగిన కేంద్ర సాయుధ బలగాల అధిపతుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని చెప్పారు. తీర సరిహద్దు పోలీసు దళం (కోస్టల్ బోర్డర్ పోలీసు ఫోర్స్-సీబీపీఎఫ్) పేరుతో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూభాగానికి సమీపంలో ఉన్న సముద్ర తీరాన్ని కాపాడడం కోసం దీన్ని నెలకొల్పుతామని చెప్పారు. ప్రస్తుతం సముద్ర గస్తీని తీర గస్తీ దళం నిర్వహిస్తోంది. దానికి అదనంగా సీబీపీఎఫ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర దళాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడం, వైద్యుల కొరత తీర్చడం, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఆసుపత్రి నెలకొల్పడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

ఫారం – 6

(చట్టం–30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్–1 రూల్19 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ప్రాథమిక నోటిఫికేషన్

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G1/2226/2017 తేది. 26-7-2017
ఫైలు నెం: బి/13/2017, తేది. 26-07-2017
గెజిట్ నెం. 66/2017 తేది. 26-07-2017

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి- భువనగిరి జిల్లా, **రామన్నపేట** మండలం, **బోగారం** గ్రామములో భూమి విస్తీర్ణం ఎ. 2-11 1/2 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం **ధర్మారెడ్డిపల్లి** కాలువ నిర్మాణం కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

రిక్విజిషన్ అథారిటీ లేఖను సమర్పిస్తూ ఇట్టి ప్రాజెక్టు ఇ.ఐ.ఎ. చేయబడినది అని తెలిపినారు. కావున చట్టం 2013లోని సెక్షన్ 6(2) ప్రకారము ఎస్.ఐ.ఎ.ను మినహాయించనైనది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేటు యాదాద్రి-భువనగిరి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 19, రెవిన్యూ (జె.ఎ. అండ్ ఎల్.ఎ), తేది: 11.02.2015 ప్రకారము ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి-భువనగిరి జిల్లా, **రామన్నపేట** మండలంలోని **బోగారం** గ్రామంలో విస్తీర్ణం ఎ. 2-11 1/2 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా: యాదాద్రి–భువనగిరి **మండలం: రామన్నపేట** **గ్రామం: బోగారం**

సర్వేనెం/భూమి స్వభావము హక్కు స్వభావము విస్తీర్ణం(ఎ.గుం)	భూసేకరణ విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు(ప) / అనుభవదారు(అ) పేరు మరియు తండ్రి / భర్త పేరు ఖుష్కి / పట్టా	చెట్లు/ కట్టడములు
229 ఖుష్కి/పట్టా 0.25	-	ధర్మారెడ్డి కాలువ	-
	-	మారం పిచ్చమ్మ భర్త కాంతయ్య	-
	-	మారం రంగారెడ్డి	-
	-	గొరిగే పారిజాత భర్త శేఖర్	-
	-	గొరిగే పుల్లమ్మ భర్త మారయ్య	-
	-	మారం రంగారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి	-
	-	మారం నారాయణరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి	-
	-	మారం పాండురంగారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	-
	-	మారం రంగారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి	-
	-	మోటే యాదయ్య తండ్రి యల్లయ్య	-
	-	మారం అంజమ్మ భర్త పాండురంగారెడ్డి	-
		పోది వివరాలు	
	0.06	రోడ్డు	-
	0.11	గొరిగే పారిజాత భర్త శేఖర్	-
	0.08	మోటే యాదయ్య తండ్రి: యల్లయ్య	-
	0.25		
230 ఖుష్కి/పట్టా 1.09	-	ధర్మారెడ్డి కాలువ	-
	-	పున్నా విఠలయ్య తండ్రి సత్తయ్య	-
	-	పున్నా పిచ్చమ్మ భర్త విఠలయ్య	-
	-	పున్నా దశరథ తండ్రి విఠలయ్య	-
	-	**పోది వివరాలు**	
	0.17	పున్నా విఠలయ్య తండ్రి సత్తయ్య	-
	0.16	పున్నా పిచ్చమ్మ భర్త విఠలయ్య	-
	0.16	పున్నా దశరథ తండ్రి విఠలయ్య	-
	1.09		
237 ఖుష్కి/పట్టా 0.13	-	గంగుల నిర్మల భర్త శ్యామ్‌సుందర్‌రెడ్డి	-
	-	గంగుల రామ్‌మోహన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	-
	-	ఊట్కూరి బుగ్గయ్య తండ్రి గోపయ్య	-
	-	ఊట్కూరి పోషయ్య తండ్రి లింగయ్య	-
	-	ఊట్కూర్ బీరమ్మ తండ్రి లింగయ్య	-
	-	ఊట్కూరి మల్లయ్య తండ్రి లింగయ్య	-
	-	ఊట్కూరి మద్దిరాములు తండ్రి సాయన్న	-
	-	ఊట్కూరి చెన్నయ్య తండ్రి సాయ్య	-
	-	ఊట్కూరి యాదమ్మ తండ్రి సాయన్న	-
	-	ఊట్కూరి బుగ్గయ్య తండ్రి గోపయ్య	-
		పోది వివరాలు	
	0.06	గంగుల రాంమోహన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	-
	0.03	ఊట్కూరి బుగయ్య తండ్రి గోపయ్య	తాడి-1, బోరుబావి చిన్నదేవాలయం
	0.01	ఊట్కూరి కనకయ్య	-
	0.01	ఊట్కూరి మల్లయ్య తండ్రి లింగయ్య	-
	0.01	ఊట్కూరి పోషయ్య తండ్రి లింగయ్య	తాడి-2
	0.01	ఊట్కూరి మద్దిరాములు తండ్రి సాయన్న	-
	0.13		
275 ఖుష్కి/పట్టా 0.04 1/2	-	కట్టా గోపాల్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	కట్టా శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	కట్టా గోపాల్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	కట్టా శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	కట్టా గోపాల్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	-	కట్టా శేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
		పోది వివరాలు	
	0.02 1/2	కట్టా గోపాల్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-
	0.02	కట్టా శేఖర్‌రెడ్డి తండ్రి: రాంరెడ్డి	-
	0.04 1/2		
మొత్తం విస్తీర్ణం	**2.11 1/2**		

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమియొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టరు యాదాద్రి-భువనగిరి గారికి లిఖిత పూర్వకంగా తెలియచేయవలసిఉన్నది. ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియచేయవలసి ఉన్నది.

సం/–, ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి–భువనగిరి జిల్లా **సం/–, సంయుక్త కలెక్టర్ యాదాద్రి–భువనగిరి జిల్లా** **సం/–, జిల్లా కలెక్టర్ యాదాద్రి–భువనగిరి**



ఇలానూ తగ్గొచ్చు...

బరువు తగ్గాలంటే రోజంతా వ్యాయామాలే చేయాల్సిన అవసరం లేదు. దినచర్యలో భాగంగా మనం చేసే చిన్నచిన్న పనులు కూడా బరువుని తగ్గిస్తాయి!

నిలబడండి: బస్సు కోసమో, మరెవరి కోసమో ఎదురు చూస్తున్నారు. అలాంటప్పుడు ఏదో ఒక స్థలం చూసుకుని కూర్చుండిపోవద్దు. వీలైనంతవరకూ నిలబడి ఉండేందుకే ప్రయత్నించండి. గంటసేపు నిలబడితే 50 కెలోరీలు కరుగుతాయి. అదే నడిస్తే గంటకు 255 నుంచి 350 కెలోరీలు వరకు ఖర్చవుతాయి.

నెమ్మదిగా తినండి: నెమ్మదిగా తినడం వల్ల మెదడు ఆకలి తీరిందనే సందేశాన్ని శరీరానికి పంపగలుగుతుంది. అదే గబాగబా తినేస్తే అది సాధ్యం కాకపోవడం అటుంచితే ఎక్కువగా కూడా తినేస్తాం. అలా తెలియకుండానే కెలోరీలు పెరిగిపోతాయి.

స్ట్రెచెస్: నిదానంగా చేసే స్ట్రెచింగ్ తరహా వ్యాయామాల వల్ల త్వరగా కెలోరీలు కరిగించుకోవచ్చు. నడకా, పరుగు వంటి వాటితో పోలిస్తే.. వీటి వల్ల ఎక్కువ లాభాలుంటాయి.

రష్యా పర్వతంపై..

నిండు చీకటి. తీవ్ర తుపాను. అలాంటి పరిస్థితుల్లో మొదటి దీపాన్ని వెలిగించడమే కష్టం! ఓసారి అది వెలిగాక ఎన్నో జ్యోతుల్ని వెలుగులతో నవ్విస్తుంది. తెలుగు రాష్ట్రాలకి చెందిన పూర్ణ.. రెండేళ్లకిందట ఎవరెస్ట్ ఎక్కడం అలాంటి దీపం వెలిగించడంలాంటిదే. అదే నేడు శ్రీవిద్యని రష్యాలోని అతి దుర్గమమైన ఎల్‌బ్రస్ పర్వతం అధిరోహించేలా చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు గురుకుల విద్యాలయంలో ఇంటర్ రెండో ఏడాది చదువుతోందీ అమ్మాయి. ఆ గురుకుల విద్యాలయ కార్యదర్శి ప్రవీణే శ్రీవిద్యని ప్రోత్సహించారు. నాలుగేళ్ల కిందటి నుంచే ఈమెకి పర్వతారోహణపై శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. 2015లో ఎవరెస్టు



ఎక్కే బృందంలో సభ్యురాలిగా చేరింది. శిక్షణలో భాగంగా డార్జిలింగ్ కూడా వెళ్లింది. కానీ అవకాశం తృటిలో తప్పిపోయింది. కిలిమంజారో అధిరోహణ కూడా సాంకేతిక కారణంతో ఆగిపోయింది. అయినా పట్టుదలతో శ్రమించి రష్యా పర్వతాన్ని అధిరోహించింది శ్రీవిద్య. ఈనెల 27న ఏడుగురితో కూడుకున్న ఈ బృందం పర్వతాన్ని అధిరోహించి అక్కడ మన జాతీయ పతకాన్ని రెపరెపలాడించింది. శ్రీవిద్యది నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని పరందేవిపురం అనే చిన్న గ్రామం. నాన్న సైదులు కౌలురైతు. అమ్మ వ్యవసాయ కూలి. ఐదో తరగతిలోనే ఆలేరు గురుకుల విద్యాలయంలో చేరింది. త్వరలోనే ఎవరెస్ట్ ఎక్కేందుకు తయారవుతోంది.

వసుంధర

టాప్‌లేపే... సీకో టాప్‌లు

ఉద్యోగినులకు సౌకర్యంగా ఉండాలన్నా... కాలేజీకెళ్లే అమ్మాయిలు హుందాగా కనిపించాలన్నా... కుర్తాలే మొదటి ఎంపికలో ఉంటాయి. అందులోనూ సౌకర్యంగా ఉండే కాటన్ కుర్తాలంటే ఇష్టపడని అమ్మాయిలు ఎవరుంటారు... కాటన్, సీకో వస్త్రాలతో తయారుచేసిన అలాంటి టాప్‌లే ఇవి. ఓ లుక్కేయండి.



ముదురు, లేత నీలం రంగుల కలయికతో కనువిందు చేస్తున్న సల్వార్ సూటు.



పసుపూ, ఆకుపచ్చ వర్ణాల మేళవింపు చూడచక్కగా ఉంటుంది. అందుకే పసుపు రంగు కుర్తాపై ఆకుపచ్చ రంగు వృషభాలు భలేగా ఆకట్టుకుంటున్నాయి.



ముదురురంగు టాప్‌పై చిన్న జరీ అంచుతో... ప్యాచ్‌వర్క్ చేసిన బుల్ డిజైన్లు... కొత్తగా ఉంది కదూ!




స్ట్రెయిట్‌కట్ ప్యాంటుపై చక్కగా అమరిపోయిన బ్లాక్‌ప్రింట్ గోధుమరంగు టాప్.

మోడల్: దేవిక
ఫొటోలు: దండా శ్రీనివాసరావు

బంగారం వెండి

3న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,711	2,736
వెండి (గ్రా)	40.60	41.70



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	29,600	29,700	29,600	29,600	28,990	29,260	29,490	29,780
ఆర్నమెంట్	-------	-------	27,500	27,500	27,410	27,470	27,110	27,360	27,130	27,400
వెండి(కిలో)	-------	-------	39,500	39,600	39,700	39,700	38,000	39,000	39,900	39,900

నా పాటకు అందరూ ఫిదా!

ఊపూ ఉత్సాహం, ఆనందం ఆహ్లాదం, ఆర్ద్రతా, ఆవేదనా.. ఇన్నింటినీ తన పాటల్లో సునాయాసంగా ఒలికించగలదు మధుప్రియ! కాకపోతే ఆమె కూడా ఈ పాటల్లానే!! భలే ఆనందంగానే ఉన్నట్టనిపిస్తుంటుంది. 'నవ్వితే బావుందే!' అనుకునేంతలో కడవెడు కన్నీరూ కార్చేస్తుంది. ఎంతగా అంటే 'పాతాళ గంగమ్మ' అనుకునేంత!! కానీ కళాకారుల మనసు ఇలాకాకుండా ఇంకెలా ఉంటుంది? ఆ సున్నితత్వం నుంచే కదా.. కమ్మటి పాటలు వచ్చేది! సరే! విషయం ఏమిటంటే బిగ్‌బాస్ ఇంటి నుంచి తనింటికొచ్చిన మధుప్రియ.. 'ఫిదా'లో తన పాటకొస్తున్న స్పందన చూసి ఆశ్చర్యపడిపోతోందట. ఆ ఆనందాన్నే ఇలా పంచుకుంది..

శేఖర్ కమ్ములసార్ సినిమాకి పాట పాడాలనగానే చాలా ఉత్సాహంగా అనిపించింది. ముందుగా నేనెలాంటి సాధనా చేయలేదు. అసలు పాటేమిటో తెలిస్తే కదా చేయడానికి! మామూలుగానే స్టూడియోకి వెళ్లాను. సన్నివేశం వివరించి పాడమన్నారు. 'మధుప్రియే పాడుతుందని మాకు అనిపించాలి. సినిమాకు పాడుతుంది అన్నట్టుగా కాకుండా నీకు ఎలా అనిపిస్తే అలా పాడు!' అని శేఖర్ కమ్ముల చెప్పారు. అంత స్వేచ్ఛ ఇస్తే ఇంకేముంది.. దున్నేస్తాంగా! కథానాయికని కాకుండా నన్ను నేను ఊహించుకుని గొంతెత్తి పాడేశాను. అందుకే 'వచ్చిండే



మెల్లామెల్లగా వచ్చిండే..' పాట అంత బాగా వచ్చిందనుకుంటున్నా! పరిశ్రమలో చాలామంది మెచ్చుకుంటున్నారు. శేఖర్ కమ్ముల గారైతే 'మధుప్రియ పాటకు మేమంతా ఫిదా అయ్యాం!' అన్నారు. దిల్‌రాజు గారూ ప్రశంసించారు అంతకంటే ఇంకేం కావాలి?

అలా ఎందుకు చేశానో!

నేను పాడటం మొదలుపెట్టిన కొత్తల్లో వేదికపైకి ఎక్కగానే కొందరు నన్ను చూసి తిరస్కారంతో దిగివెళ్లిపోయేవారు. నా అవకాశాలనీ అడ్డుకున్నారు. అలా అవమానాలకు గురిచేసిన వాళ్లతో సమానంగా గౌరవ మర్యాదలు అందుకోగలిగాను. అదే కదా విజయమంటే! 'బిగ్ బాస్' అవకాశం వచ్చినప్పుడు ఎంత సంతోషించానో.! కానీ అక్కడికెళ్లాక నేనెదుర్కొన్న సమస్యల్ని ఎవరితోనూ చెప్పలేను. ప్రత్యేకంగా దానికోసం ఏడ్చానంటే ఎవరూ నమ్మరు. మాధ్యమాల్లో రకరకాలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. చేసుకోనివ్వండి. అవి నేను పట్టించుకోను.

సినిమాలు చూడటం తక్కువ..

ఫిదాలోని పాటలాంటి అవకాశమొస్తే మళ్లీమళ్లీ పాడతా. కానీ అలాంటివి ఎన్ని పాడినా సామాజిక చైతన్య గీతాలు పాడటానికే నా ప్రాధాన్యం. ఆ పాటలే కదా.. నన్ను మీ ముందుకు తీసుకొచ్చాయి మరి! 'ఆడపిల్లనమ్మా నేను ఆడపిల్లనాని' తర్వాత అంతేస్థాయిలో 'మాయదారి మత్తూ.. అవ్వ మాకు సిత్తూ' బాగా పేరుతెచ్చింది. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల వచ్చే అనర్థాలని వివరిస్తుందీ పాట. యూనివర్సల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, తెలంగాణ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా దీన్ని నిర్మించారు. సమాజాన్ని పీడించే అనేక సమస్యలను ఇలా నా గళం ద్వారా వినిపించడంలో ఉన్న ఆనందం ఇంకెందులోనూ లేదు! నేను మొదట్లో ఏదో పాటలు రాసుకుంటూ అలా పాడటం మొదలుపెట్టాను. కానీ గొంతులో అనేక భావాలు పలికించాలంటే... అదొక్కటే చాలదు కదా.. కొంత సాధనా కావాలి. అందుకే సంగీతం నేర్చుకున్నాను. రామాచారిగారూ, వైజుర్సు బాలసుబ్రమణ్యంగారు, మోహన్ కృష్ణ.. ఇలా అందరి దగ్గరా నేర్చుకున్నాను. నేను రాసి పాడిన పాటలు దాదాపు ఇరవైకి పైగా ఉన్నాయి. సినిమాలు తక్కువగా చూస్తాను. అందులోనూ కామెడీ సినిమాలకే ప్రాధాన్యం. మా నాన్న మల్లేష్ సింగరేణిలో పని చేస్తారు. అమ్మ సుజాత గృహిణి. అక్కా, చెల్లీ ఉన్నారు. ఇక మా ఆయన శ్రీకాంత్ నన్ను అన్నిరకాలుగా ప్రోత్సహిస్తారు. నేను బిగ్‌బాస్ దాకా వెళ్లానంటే అది కచ్చితంగా ఆయన ప్రోత్సాహమే!

పాపాయికి రక్షగా.. స్మార్ట్ పరికరం!

ఓ శిశువు జననం ఎంత ఆనందం నింపుతుందో.. అంతకంత వేదన కలిగిస్తుంది వాళ్లకి ఏ చిన్న సమస్యో ఉందని తెలిస్తే! ఒక్కోసారి గుండె కొట్టుకోవడంలో తేడా రావొచ్చు. ఉష్ణోగ్రతా పడిపోవచ్చు. శరీరం నీలిరంగులోకి మారిపోతుంటుంది కొందరికి!! ఇలాంటి సమస్యలకి వెంటనే చికిత్స అందించాలి. కానీ శిశువు పుట్టినప్పటి నుంచీ ఒక్క నిమిషం కూడా వదలకుండా చూసుకునేంతగా మన ప్రభుత్వాసుపత్రుల్లో సిబ్బంది సంఖ్య ఉండదు! దానికి పరిష్కారంగా 'స్మార్ట్ బేబీ మానిటర్' అనే సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించారు ప్రత్యూషా పారెడ్డి!

చూడ్డానికి ఇదో చిన్న బ్యాండులా ఉంటుంది. పిల్లలకు మేజోడులా తొడిగితే సరిపోతుంది. ఇది పిల్లల నాడీ కొట్టుకునే తీరునీ, ఉష్ణోగ్రతలనీ ఎప్పటికప్పుడు అంచనావేస్తుంది. తేడా వస్తే వెంటనే వైద్యులూ, నర్సులని హెచ్చరిస్తుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగితే జ్వరం వచ్చిందని అంటాం కదా! అదే చిన్నపిల్లల్లో 35 డిగ్రీల కంటే ఉష్ణోగ్రత పడిపోతుంటుంది. దీన్ని హైపోథెర్మా అంటారు. పిల్లలు గుక్కపెట్టినప్పుడు ఒక్కోసారి శ్వాస అందక ఇబ్బంది పడతారు. ఇవన్నీ ప్రాణాంతక పరిస్థితులుగానూ మారొచ్చు. ఇలాంటి వాటన్నింటినీ ఈ పరికరం ఇట్టే పట్టేస్తుంది. ఇది ఇటీవలే మన భారత్ ఇజ్రాయెల్ దేశంతో కలిసి నిర్వహించిన 'స్టార్ టెల్అవైవ్' పోటీల్లో ఉత్తమ సాంకేతిక ఆవిష్కరణగా ఎంపికైంది. ఇప్పుడు దీని తయారీకి ఇరవై వేల రూపాయలు ఖర్చవుతోంది. కానీ 'ధరతోపాటూ ఈ పరికరం పరిమాణం తగ్గించే పనిలో ఉన్నా'నంటున్నారు ప్రత్యూష. ఆమె ఇలాంటి



పరికరాల తయారీ కోసమే నిమోకేర్ అనే సంస్థ స్థాపించారు. ఆమెది హైదరాబాద్. ఇంజినీరింగ్ నేపథ్యం. కానీ డిజైనింగ్‌పై ఆసక్తితో ఎన్ఐడీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్)లో చేరారు. దానికి సంబంధించిన ప్రాజెక్టు వర్క్ చేస్తున్నప్పుడే గ్రామాల్లో నొప్పులొచ్చిన గర్భిణుల్ని ఆసుపత్రికి తీసుకువెళ్లలేక పడే ఇబ్బందుల్ని గమనించారు. వాళ్లకి ఉపయోగపడేలా ప్రత్యేక స్ట్రెచర్ తయారుచేశారు. ఆ తర్వాత ఫిలిప్స్ వంటి బడా సంస్థల కోసం యాప్‌లూ రూపొందించారు. మళ్లీ వైద్య అవసరాలవైపే దృష్టిసారించారు. ఐఐటీ-హైదరాబాద్ అందించిన 'సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' ఫెలోషిప్‌లో చేరారు. రోగుల అవసరాలకు తగ్గ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరికరాల రూపకల్పనపై అధ్యయనం చేశారు. అందులో భాగంగానే నవజాత శిశువులకొచ్చే సమస్యల్ని గమనించారు! ఆ సమస్యలకి పరిష్కారంగానే ఈ పరికరాన్ని రూపొందించారు.

ఏడ్చేయకండి...

భావోద్వేగాలు.. అదుపులో ఉండాలంటే వాస్తవాలని అంగీకరించగలగాలి. సమస్య లోతుని తెలుసుకోగలగాలి. పరిష్కారం కోసం ఆలోచించాలి.

- ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలనే ఉద్దేశంతో మీ సహజ లక్షణాలకి భిన్నంగా ఉండొద్దు. దానివల్ల ఇంకా కుంగిపోతారు. ఇలాంటప్పుడు అందరితో కలవడానికి ప్రయత్నించండి.
- ఏ పరిస్థితులు దానికి కారణం అవుతున్నాయనేది తెలుసుకునేందుకు ప్రయత్నించండి. వేళకు ఆహారం తీసుకోకపోవడమా, పని ఒత్తిడా, ఇతర సమస్యలా అనేది గమనించుకోండి. అలానే కుటుంబ సమస్యలు ఉంటే వాటి భారం మీపై ఎంత పడుతుందనేది అంచనా వేయండి. పరిస్థితులను బట్టి ఆ మార్పులు చేసుకునేందుకు ప్రయత్నించండి.

సెన్సెక్స్ ▼239 **32238**

నిఫ్టీ ▼ 68 **10014**

రూపాయి 63.69 ▲ (ఒక అమెరికా డాలరుకు) 1 పైసలు

బంగారం 28,550 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 30

వెండి 37,525 ▼ ముంబయిలో కిలో రూ.లలో 385

ముడి చమురు 52.22 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	22,032	+16
నాస్‌డాక్	6,347	–15
నిక్కీ 225 (జపాన్)	20,029	–51
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	27,531	–77
షాంఘై(చైనా)	3,273	–12
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,475	+63
డాక్స్ (జర్మనీ)	12,156	–27

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.93	67.17
పౌండ్ స్టెర్లింగ్	76.56	88.81
యూరో	68.63	79.58
జపనీస్ యెన్/100	52.34	60.69
ఆస్ట్రేలియా డాలరు	45.95	53.18
సింగపూర్ డాలరు	42.88	50.80
థాయ్ బాత్/100	174.02	208.11
బహ్రెయిన్ దీనార్	156.95	179.77
కువైట్ దీనార్	174.41	217.19
ఒమన్ రియాల్	153.58	175.75
సౌదీ రియాల్	15.40	18.26

గురువారం నిఫ్టీ కదలికలు



ఐఓసీ నిరాశాజనకం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) నికర లాభం 45 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థకు రూ.8,268.98 కోట్ల లాభం రాగా ఈసారి ఇది రూ.4,548.51 కోట్లకు పరిమితమైంది. లాభం తగ్గడానికి ప్రధాన కారణం ముడిచమురు శుద్ధిపై వచ్చే లాభాలు తగ్గడమేనని సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఒక బ్యారెల్ ముడిచమురును ఇంధనంగా మార్చినందుకు 9.98 డాలర్ల (సుమారు రూ.650)ను ఆర్జించగా ఈసారి ఇది 4.32 డాలర్ల (రూ.276)కు తగ్గినట్లు తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో రూ.1,29,418.11 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ.1,07,670.95 కోట్లు మాత్రమే.

బీఎస్ఈలో షేరు ధర 4.60% లాభంతో రూ.386.90 ముగిసింది.

బీఎస్ఈ లాభం రూ.524 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) ఏకీకృత ప్రాతిపదికన రూ.523.70 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వచ్చిన లాభం రూ.43.70 కోట్లతో పోలిస్తే ఇది 1098 శాతం ఎక్కువ. అనుబంధ సంస్థలో వాటాను విక్రయించడం వల్ల సంస్థకు రూ.451.18 కోట్ల లాభం రావడం ఇందుకు ప్రధాన కారణం. సమీక్షిస్తున్న త్రైమాసికంలో సంస్థకు రూ.158.38 కోట్ల ఆదాయం సమకూరింది. 2016-17 ఇదే సమయంలో వచ్చిన ఆదాయం రూ.142.73 కోట్లతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.

ఎన్ఎస్ఈలో షేరు 0.22% లాభంతో రూ.1069.60 వద్ద స్థిరపడింది.

కోల్గేట్ అమ్మకాలు రూ.1110 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కోల్గేట్ పామోలివ్ ఇండియా రూ.136.38 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.125.72 కోట్లతో పోలిస్తే ఇది 8.47 శాతం ఎక్కువ. సమీక్షిస్తున్న త్రైమాసికంలో సంస్థ నికరంగా రూ.1,109.88 కోట్ల విలువైన అమ్మకాలు జరిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో విక్రయాల విలువ రూ.1,141.54 కోట్లతో పోలిస్తే ఇది 2.77 శాతం తక్కువ. ఇక వ్యయాల విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో రూ.969.46 కోట్లను ఖర్చు చేయగా, ఈసారి ఇది రూ.934.03 కోట్లకు తగ్గింది.

బీఎస్ఈలో షేరు 4.25% లాభంతో రూ.1082.95 వద్ద స్థిరపడింది.

స్టాక్ మార్కెట్లలో మరింత సాంకేతికత

- అధ్యయన బృందం ఏర్పాటు: సెబీ

దిల్లీ: తాజా ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్టాక్ మార్కెట్లలో ఎలా ఉపయోగించుకోవచ్చన్నదానిపై అధ్యయనం చేయడానికి ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ వెల్లడించింది. మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ టి.వి. మోహన్‌దాస్ పాయ్ ఆధ్వర్యంలోని పది మంది సభ్యుల బృందం పరిశీలించి సెబీకి సలహాలనిస్తుంది. ఇతర సభ్యుల్లో పేటీఎమ్ చీఫ్ విజయ్ శేఖర్ శర్మ, ఎన్‌పీసీఐ ఎండీ, సీఈఓ ఎ.పి. హోతా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ మాజీ ఎండీ, సీఈఓ అనూప్ బాగ్చి; ఆధార్ మాజీ సాంకేతిక రూపశిల్పి ప్రమోద్ కె. వర్మలు కూడా ఉన్నారు.

జీఆర్‌టీ జువెలర్స్‌కు ప్లాటినం గిల్డ్ పురస్కారాలు

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్‌కు నాణ్యత, శుద్ధత, విక్రయాల విభాగంలో మూడు పురస్కారాలు లభించాయి. 'సీజన్ ఆఫ్ లవ్' ఉత్సవాల సందర్భంగా ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఈ అవార్డులను అందించినట్లు సంస్థ వెల్లడించింది. జాతీయ, ప్రాంతీయ స్థాయిలో తాము అందిస్తున్న నాణ్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించినట్లు తెలిపింది. ఈ పురస్కారాలు తమపై ఎంతో బాధ్యతను పెంచాయని భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పని చేస్తామని జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అనంత పద్మనాభన్ అన్నారు.

బ్యాంకింగ్ షేర్ల బేజారు

- 239 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- తోడైన అంతర్జాతీయ మార్కెట్లు



సమీక్ష

వరుసగా రెండో రోజూ సూచీలు డీలాపడ్డాయి. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమీక్ష మార్కెట్లను మెప్పించకపోవడంతో.. మదుపర్లు అమ్మకాలు కొనసాగించారు. ఈ నేపథ్యంలో రేట్ల ఆధారిత బ్యాంకింగ్, స్థిరాస్తి, వాహన షేర్లు నీరసపడ్డాయి. బ్యాంకింగ్ షేర్లలో పీఎన్‌బీ అత్యధికంగా 5.98% కోల్పోయింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 3.16%, యెస్ బ్యాంక్ 2.42%, ఎస్‌బీఐ 2.24%, యాక్సిస్ బ్యాంక్ 2.01%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.99%, ఫెడరల్ బ్యాంక్ 1.52%, కోటక్ బ్యాంక్ 1.32%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.04%, ఇండస్ఇండ్ 0.86%లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి రెండేళ్ల గరిష్ఠానికి చేరినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇక ఆసియా మార్కెట్లు నష్టపోగా, ఐరోపా షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 32,502.55 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. అనంతరం నష్టాల్లోకి జారిపోయిన సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 32194.58 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. చివరకు 238.86 పాయింట్ల నష్టంతో 32,237.88 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 10,000 స్థాయి దిగువకు చేరింది. చివరకు 67.85 పాయింట్ల నష్టంతో 10,013.65 దగ్గర స్థిరపడింది.

బాటా పరుగులు: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలు నమోదు చేసిన నేపథ్యంలో బాటా ఇండియా షేర్లు దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 7.11 శాతం పెరిగి రూ.625 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 6.61 శాతం లాభంతో రూ.622.05 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.496.06 కోట్లు పెరిగి రూ.7,995.06 కోట్లకు చేరింది.

- ఆర్‌బీఐ సమీక్ష నిరాశపరచడంతో స్థిరాస్తి షేర్లు డీలాపడ్డాయి. యునిటెక్ 8.88% కుదేలైంది. హెచ్‌డీఐఎల్, ఫీనిక్స్ మిల్స్, డీఎల్ఎఫ్, గోద్రేజ్ ప్రోపర్టీస్, శోభా షేర్లు 2.80% వరకు నష్టపోయాయి.
- వాహన షేర్లలో టాటా మోటార్స్ 1.74% తగ్గింది. మారుతీ సుజుకీ, టీవీఎస్ మోటార్ అదే బాటలో నడిచాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 డీలాపడ్డాయి. లుపిన్ 3.80%, కోల్ ఇండియా 3.36%, ఎస్‌బీఐ 2.24%, డాక్టర్ రెడ్డీస్ 2.02%, యాక్సిస్ బ్యాంక్ 2.01%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.99%, టాటా మోటార్స్ 1.74%, హెచ్‌డీఎఫ్‌సీ 1.61%, విప్రో 1.60%, సిప్లా 1.57% చొప్పున నష్టపోయాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.01 శాతం పెరగగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.38%, బజాజ్ ఆటో 1.17%లు రాణించిన వాటిలో ఉన్నాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటం, ఆర్‌బీఐ తదుపరి రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం ప్రభావం చూపే అవకాశం ఉందని డీలర్లు చెబుతున్నారు. మరిన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు వెలువడనుండటంతో షేరు ఆధారిత కొనుగోళ్లు చోటుచేసుకోవచ్చు. అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు కళతప్పాయి. దీంతో పాటు ఇటీవల పెరిగిన షేర్లలో మదుపర్ల లాభాల స్వీకరణ కొనసాగొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమీప భవిష్యత్‌లో దేశీయ మార్కెట్లు స్తబ్దుగా కదలాడొచ్చని, అయితే దేశీయ, విదేశీ సంస్థాగత మదుపర్ల అండతో మళ్లీ పెరగొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. నేడు నిఫ్టీ 9980- 10060 పాయింట్ల శ్రేణిలో చలించొచ్చని అంటున్నారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వడ్డీ రేట్ల ప్రకటన, గవర్నర్ మార్క్ కార్నీ వ్యాఖ్యలపై మదుపర్లు దృష్టి పెట్టే అవకాశం ఉంది. నేడు త్రైమాసిక ఫలితాలు వెల్లడించనున్న నేపథ్యంలో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు వెలుగులోకి రావొచ్చు.

కాగ్నిజెంట్ లాభంలో 86% వృద్ధి

- ఏప్రిల్- జూన్‌లో రూ.3,000 కోట్లు
- ఆదాయ అంచనాలు పెంపు

Cognizant

దిల్లీ: ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో కాగ్నిజెంట్ నికర లాభం 86% వృద్ధితో 47 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.3,000 కోట్లు) చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నికర లాభం 25.2 కోట్ల డాలర్లుగా (దాదాపు రూ.1,600 కోట్లు) నమోదైంది. ఆరోగ్య సంరక్షణ సహా అన్ని విభాగాలు రాణించడం లాభంలో వృద్ధికి తోడ్పడింది. ఆదాయం 8.9 శాతం పెరిగి 367 కోట్ల డాలర్లకు చేరింది. కంపెనీ అంచనాలైన 363 - 368 కోట్ల డాలర్లకు మించి ఆదాయం నమోదుకావడం గమనార్హం. మరోవైపు పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనాలను కాగ్నిజెంట్ సవరించింది. 2017-18లో ఆదాయం 9-10 శాతం (1470-1484 కోట్ల డాలర్లు) పెరగొచ్చని తెలిపింది. అంతకుముందు ఆదాయంలో 8-10 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేసింది. మూడో త్రైమాసికంలో (జులై- సెప్టెంబరు) ఆదాయం 373- 378 కోట్ల డాలర్ల మధ్య నమోదుకావొచ్చని పేర్కొంది. రెండో త్రైమాసికానికి కాగ్నిజెంట్ మెరుగైన ఫలితాలను ప్రకటించింది. డిజిటైజింగ్‌కు సంబంధించి క్లయింట్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విషయంలో మా తోడ్పాటు కొనసాగుతుందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమ'ని కాగ్నిజెంట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ఫ్రాన్సిస్కో డిసౌజా తెలిపారు. అలాగే కీలక వ్యాపారాల్లో పెట్టుబడులు కొనసాగిస్తామని తెలిపారు. మార్జిన్లను మెరుగుపర్చుకోవడం, మూలధన ప్రతిఫలాలను అందించడంపైనా దృష్టి సారిస్తామని అన్నారు.

మార్కెట్ కబుర్లు

- **కొచ్చిన్ షిప్‌యార్డ్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) చివరి రోజు 76.12 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 3.39 కోట్లకుగాను 246 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఈ ఇష్యూ ద్వారా రూ.1,468 కోట్లు సమీకరించాలని కొచ్చిన్ షిప్‌యార్డ్ భావిస్తోంది.
- రైల్వేల విద్యుదీకరణ పనుల నిమిత్తం రూ.1,081 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని **కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్** తెలిపింది.
- వివిధ మదుపర్లకు బాసెల్-3 బాండ్ల జారీ ద్వారా రూ.2,000 కోట్లను సమీకరించే యోచనలో **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** (ఎస్‌బీఐ) ఉంది.
- మొబిక్విక్ సిస్టమ్స్‌లో 10.83 శాతం వాటాను **బజాజ్ ఫైనాన్స్** కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ.225 కోట్లు వెచ్చించనుంది.
- బోనస్ షేర్ల జారీ విషయాన్ని పరిశీలించేందుకు ఈ నెల 10న **పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్** డైరెక్టర్ల బోర్డు సమావేశం కానుంది.
- శరీరంలో అధికంగా ఉన్న కొవ్వును తగ్గించేందుకు తోడ్పడే రోసువాస్టాటిన్ కాల్షియమ్ మందు బిళ్లలకు అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతులు లభించాయని **లుపిన్** తెలిపింది.
- రష్యాలోని అనుబంధ సంస్థ గ్రాండ్‌ను స్కోడా గ్రాండ్, కాఫీ ప్యాక్‌కు **టాటా గ్లోబల్ బేవరేజెస్** విక్రయించింది. ఈ ప్రక్రియ వచ్చే మూడు నాలుగు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. విక్రయ అనంతరం కూడా గ్రాండ్‌కు చెందిన ఉత్పత్తులు అదే బ్రాండ్‌పై విక్రయిస్తారని టాటా గ్లోబల్ బేవరేజెస్ తెలిపింది.
- **హిందుస్థాన్ కాపర్‌**లో 6.83 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో ప్రభుత్వం విక్రయించింది. తద్వారా రూ.400 కోట్లు సమీకరించింది.
- బహిరంగ లావాదేవీ రూపేణా **ఇన్ఫీబీమ్ కార్పొరేషన్‌**లో 3.63 లక్షల షేర్లను విదేశీ సంస్థ ఎల్‌టీఎస్ ఎన్వెస్ట్‌మెంట్ ఫండ్ కొనుగోలు చేసింది.
- బెంగళూర్ వాటర్ సప్లయ్ అండ్ సీవేజ్ బోర్డునుంచి రూ.386 కోట్ల విలువైన ఆర్డరు లభించిందని **వా టెక్ వాబాగ్** తెలిపింది.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
రామ్‌కో సిమెంట్	155.81	155.93	1,150.49	1,092.82
వీఐపీ ఇండస్ట్రీస్ (కన్సా)	40.98	31.43	406.57	374.46
బజాజ్ ఎలక్ట్రికల్స్	20.50	22.87	1,029.41	959.36
నారాయణ హృదయాలయ	10.90	17.20	521.10	452
సియట్	1.38	103.26	1638.95	1651.83
కమిన్స్ ఇండియా	220	181.18	1,387.69	1,317.42
జ్యోతీ ల్యాబ్స్ (కన్సా)	24.30	44.90	385	452.60
ఎలికాన్ ఇంజినీరింగ్	(38.75)	2.50	180	193.33
ఇక్రా	22.46	27.50	62.40	65.25
గుజరాత్ ఆల్కలీస్	95.36	86.26	612.20	590.76
జిందాల్ సా	64.04	65.78	1,519.65	1,365.84
హెచ్‌సీసీ	14.50	10.90	991.1	1,041.8
ఉజ్జీవన్ ఫైనాన్షియల్	0.66	4.31	1.92	6.94
బాంబే బర్మా ట్రేడింగ్	(1.69)	(3.67)	59.86	72.50
తేజాస్ నెట్‌వర్క్స్ (కన్సా)	20	(1.75)	223.81	149.92
టైటన్ కంపెనీ (కన్సా)	237.97	120.89	4,049.57	2,840.56
జేకే లక్ష్మీ సిమెంట్	28.30	28.64	1,013.37	882.23
గ్రీవ్స్ కాటన్	41.20	38.50	454	445
పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్	184.80	95.90	1,192.27	862.87
కమిన్స్ ఇండియా	222.16	181.18	1387.69	1317.42

నేటి బోర్డు సమావేశాలు


★ ఆంధ్రా బ్యాంక్ ★ హెచ్‌పీసీఎల్ ★ మహీంద్రా అండ్ మహీంద్రా ★ ఎంఆర్ఎఫ్ ★ మోన్‌శాంటో ★ డాబర్ ★ వీఆర్ఎల్ లాజిస్టిక్స్ ★ టీటీకే హెల్త్‌కేర్ ★ శోభా ★ అరవింద్ ★ అపోలో టైర్స్ ★ షీలా ఫోం ★ రెప్కో హోం ఫైనాన్స్ ★ మంగళం డ్రగ్స్ ★ ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్ ★ కిర్లోస్కర్ ఆయిల్ ★ ఇండియన్ హోటల్స్ ★ ఫోర్టిస్ హెల్త్‌కేర్ ★ ఈఐడీ ప్యారీ ★ బెర్జర్ పెయింట్స్

ఐఓసీ



రూ.372 వద్ద ప్రారంభమై రూ.371– 395 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.370.10తో పోలిస్తే రూ.16.95 (4.58%) లాభంతో రూ.387.05 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,71,49,114.

లుపిన్



రూ.1032 వద్ద మొదలై రూ.985– 1060 మధ్య చలించి క్రితం ముగింపు రూ.1034.95తో పోలిస్తే రూ.41.55 (4.01%) నష్టంతో రూ.993.40 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 78,52,897 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

ఏసీసీ	1817.80
అవంతీ ఫీడ్స్	1804.70
రిలయన్స్ ఇండస్ట్రీస్	1664.90
రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	737.50
కావేరీ సీడ్	705.80
హెచ్‌పీసీఎల్	407.50


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

డాక్టర్ రెడ్డీస్	2314.35
అజంతా ఫార్మా	1329.45
లుపిన్	985.00
యూఎఫ్ఓ మూవీస్	361.15
టాటా మోటార్స్ డీవీఆర్	253.05
కోల్ ఇండియా	241.10

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
03/08	5,534	5,510	24	3,069	3,458	–389
02/08	4,062	3,588	474	2,671	2,904	–233
01/08	4,516	5,461	–946	4,313	2,923	1,391
31/07	5,485	6,682	–1,197	4,865	3,096	1,768
28/07	5,141	5,364	–223	3,627	3,202	425

3వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	310	వరంగల్	312
చిల్లరగా (ఒక గుడ్డు)	3.70	విశాఖపట్నం	318
బెంగళూరు	360	చెన్నై	372
4న		చిత్తూరు	365
విజయవాడ/గోదావరి	308	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1810.60 (1772.10) 891266
ADANI PORT & 407.35 (411.25) 2541125
AMBUJA CEMEN 272.10 (266.60) 3813836
ASIAN PAINTS 1146.10 (1144.50) 997619
AUROBIND PHA 741.30 (731.05) 3436769
AXIS BANK LT 506.00 (516.90) 4140945
BAJAJ AUTO L 2834.25 (2802.90) 325945
BANK OFBAROD 158.20 (163.40) 9337691
BHARTI AIRTE 424.20 (415.85) 2535067
BHARTI INFRA 403.95 (397.85) 3426255
BOSCH LTD 24849.55 (25029.75) 19217
BPCL 490.00 (486.30) 6212375
CIPLA 557.15 (568.55) 1065451
COAL INDIA L 241.75 (250.85) 9661464
DR. REDDYS 2323.95 (2378.55) 777585
EICHER MOTOR 30726.05 (31153.80) 34412
GAIL 370.55 (369.90) 1334233
HCL TECH 875.75 (882.00) 1272005
HDFC 1736.75 (1766.40) 3975454
HDFC BANK 1779.95 (1791.65) 1064196
HERO MOTOCOR 3838.35 (3802.60) 424548
HINDALCO IND 220.95 (228.20) 10254636
HINDUSTAN UN 1169.90 (1168.75) 597333
ICICI BANK 295.70 (301.85) 14389817
INDIABULLS H 1199.75 (1195.75) 1153794
INDIAN OIL 387.05 (370.10) 17149615
INDUSINDBANK 1645.20 (1658.75) 462668
INFOSYS LTD 984.00 (993.35) 2320174
ITC 281.40 (285.45) 10199231
KOTAK MAHIND 996.40 (1010.90) 1152115
LARSEN & TOU 1174.75 (1176.80) 1426006
LUPIN 993.40 (1034.95) 7852897
M&M 1416.50 (1414.60) 563019
MARUTI SUZIK 7737.40 (7795.50) 287116
NTPC LTD 172.55 (171.85) 6035392
ONGC 165.70 (165.40) 6902925
POWER GRID C 222.95 (221.80) 2973119
RELIANCE IND 1650.10 (1629.20) 4504776
SBI 300.55 (307.70) 14459919
SUN PHARMA 515.85 (523.55) 4531774
TATA CONSULT 2489.45 (2473.80) 941274
TATA MOT DVR 253.60 (260.45) 1483140
TATA MOTORS 431.45 (440.35) 6197142
TATA POWER 82.65 (82.60) 2966583
TATA STEEL L 559.30 (569.25) 3286455
TECH MAHINDR 407.15 (402.05) 4650231
ULTRATECH 4084.40 (4087.45) 195349
VEDANTA LIMI 279.95 (280.95) 5892361
WIPRO 289.10 (293.80) 3645825
YES BANK LTD 1785.45 (1829.00) 2997605
ZEE ENTERTAI 539.95 (540.30) 1906088

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1409.85 (1414.65) 57741
ASHOK LEYLAN 108.90 (109.35) 7702651
BAJAJ FINANC 1701.75 (1707.20) 775709
BAJAJ FINSER 5115.05 (5002.35) 311578
BEL 180.60 (182.05) 2205014
BHEL 138.65 (141.20) 4474664
BRITANNIA 3873.95 (3864.10) 74679
CADILA HEALT 546.25 (540.80) 751793
COLGATE PALM 1083.30 (1039.25) 1577611
CONTAINER 1179.75 (1172.50) 647280
CUMMINS INDI 949.30 (992.75) 1144787
DABUR INDIA 305.10 (300.70) 1518665
DIVIS LAB 670.05 (669.05) 604522
DLF LIMITED 190.25 (193.10) 6009655
EMAMI LIMITE 1140.90 (1105.05) 883600
GLAXOSMI CON 5417.50 (5440.60) 5565
GLAXOSMI PHA 2361.50 (2367.65) 5792
GLENMARK PHA 702.30 (703.30) 925857
GODREJ CONSU 970.15 (920.25) 6342025
HAVELLS INDI 486.15 (472.80) 2145689
HINDUSTAN ZI 282.70 (283.80) 825082
HPCL 396.80 (385.00) 9960727
ICICI PRU LI 441.05 (443.50) 538981
IDEA CELLULR 93.25 (92.35) 10304736
INTERGLOBE A 1272.10 (1281.40) 328706
JSW STEEL LT 223.35 (219.75) 6614853
LIC HOUS.FIN 681.00 (693.15) 2258508
MARICO LIMIT 327.80 (326.10) 3186048
MCDOWELL 2611.70 (2598.30) 435511
MOTHERSON 331.05 (333.15) 2180725
NHPC LTD 29.85 (30.10) 3577315
NMDC LTD 121.30 (124.05) 2167755
OIL INDIA 285.25 (282.05) 354716
ORACLE FIN S 3615.75 (3639.00) 20033
P&G HYG&HEAL 8015.15 (8015.10) 838
PETRONET LNG 208.40 (212.95) 6161170
PIDILITE IND 806.85 (800.00) 314026
PIRAMAL ENTE 2902.10 (2912.05) 211729
PNB 149.30 (158.95) 19702626
POWER FIN CO 126.30 (122.20) 10375986
RURAL ELEC C 173.50 (172.20) 6713413
SAIL 60.75 (63.20) 5498245
SHREE CEMENT 18134.65 (18426.55) 17560
SHRIRAM TRAN 995.90 (1018.30) 792067
SIEMENS 1379.20 (1368.45) 180118
SUN TV LTD 796.50 (798.50) 882736
TITAN IND 558.05 (552.80) 4333554
TORRENT PHAR 1254.05 (1274.80) 89554
UNITED BREWE 801.80 (809.50) 90500
UPL LIMITED 880.75 (889.00) 947932

ఘనం (+)

నిఫ్టీ	3న	మార్పు %
IOC	387.05	4.58
ACC	1810.60	2.17
AMBUJA CEME	272.10	2.06
BHARTI AIR	424.20	2.01
BHARTI INFR	403.95	1.53
AUROBINDO PHA	741.30	1.40
RELIANCE INDU	1650.10	1.28

గ్రహణం (-)

నిఫ్టీ	3న	మార్పు %
LUPIN LIM	993.40	-4.01
COAL INDIA	241.75	-3.63
HINDALCO IND	220.95	-3.18
BOB	158.20	-3.18
TATA MOTORS	253.60	-2.63
YES BANK	1785.45	-2.38
SBI	300.55	-2.32

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 179.75 (182.25) 399734
ADANI ENTERP 137.75 (141.95) 2488880
ADANI POWER 32.50 (33.20) 8434608
ALL BANK 71.35 (73.85) 2911007
AMARA RAJA 817.65 (842.70) 256160
ANANT RAJIND 59.50 (62.40) 1549064
ANDHRA BANK 54.95 (56.25) 2261342
APOLLO HOSPI 1267.55 (1277.55) 230588
APOLLO TYRES 270.85 (277.75) 5013187
APTECH 202.05 (205.75) 173043
BAJAJ ELECT. 328.25 (329.00) 444329
BAJAJ HIND 15.50 (15.90) 9260948
BAJAJ HOLDIN 2403.10 (2413.35) 68358
BALAJI TELE 168.65 (172.85) 518969
BALLARPUR IN 16.00 (16.20) 1064306
BALRAMPUR CH 175.40 (172.25) 5063985
BANK OF MAHA 27.95 (28.50) 83317
BANK OFINDIA 154.75 (161.55) 5438753
BATA INDIA 621.50 (585.00) 8481663
BGR ENERGY S 143.65 (146.10) 70482
BHARAT FORGE 1162.45 (1156.35) 836930
BHUSHAN STEE 67.35 (70.20) 476515
BIOCON LTD 374.85 (384.35) 1579103
BOMBAY DYE 79.40 (82.15) 780684
CANARA BANK 347.60 (360.25) 2308310
CEAT LIMITED 1903.65 (1927.05) 1184529
CENTRAL BANK 86.65 (88.95) 558115
CHAMBAL FERT 138.40 (141.40) 1058256
CHENNAI PETR 410.20 (406.80) 1577486
CITY UNIBANK 170.95 (171.25) 165543
CORPO BANK 48.90 (49.95) 281740
COX & KINGS 279.30 (278.25) 414078
D B REALTY L 40.25 (42.55) 1324562
DELTA CORP L 167.30 (169.15) 2049509
DENA BANK 33.30 (34.05) 977298
DHANALAKBANK 38.20 (39.15) 956767
EDELWEISS CA 226.20 (215.00) 10264812
EDUCOMP SOLU 8.85 (9.25) 222698
EID PARRY 330.00 (334.75) 270100
EIH 132.90 (134.40) 73634
ESSAR SHIPPI 27.30 (27.25) 87264
ESTER INDUST 36.75 (37.15) 80010
EXIDE INDUST 222.15 (221.95) 2188652
FEDERAL BANK 113.40 (114.80) 9066621
FINOLEX CABL 475.65 (480.00) 29127
G E SHIP LTD 387.95 (388.95) 49102
GAMMON INDIA 9.10 (9.25) 457812
GAMMON INFRA 4.40 (4.55) 1013921
GATI LIMITED 116.05 (118.10) 362108
GAYATRI PROJ 164.75 (169.50) 36186
GITANJALIGEM 62.45 (62.90) 197589
GMR INFRASTR 17.90 (18.50) 28780056
GODREJ IND 654.45 (647.65) 633249
GRASIM IND 1126.20 (1105.15) 927111
GUJ ALK&CHEM 401.05 (398.05) 243255
HCL INFOSYS 46.90 (47.70) 695714
HEXA TECH 246.50 (249.75) 948075
HIMACHAL FUT 16.75 (17.35) 3424396
HINDU MOTORS 8.30 (8.45) 141272
HOUSING DEV 83.50 (85.85) 8430465
IDBI 56.65 (59.25) 3053102
IDFC 56.95 (58.20) 3419930
IFCI 25.90 (26.50) 3992609
IL&FS TRANS 89.65 (90.35) 284232
IND SWIFTLAB 36.70 (36.65) 6990
INDBULLS REL 241.40 (236.45) 13863018
INDIA CEM 192.45 (200.75) 6845546
INDIAN BANK 298.60 (311.55) 1145961
INDO RAMA SY 31.00 (31.45) 88330
INDRAPRASTHA 1184.45 (1176.90) 314099
IND-SWIFTLTD 9.65 (9.50) 172545
INGERSOLL-R 833.70 (857.50) 36982
IOB 24.60 (25.00) 788728
IPCA LAB 467.95 (478.60) 29527
IRB INFRA DE 220.00 (225.85) 1427243
J&K BANK 80.85 (82.35) 142397
JAI CORP 81.10 (83.60) 565417
JAIN IRRIGAT 101.60 (104.50) 2602834
JAYPEE INFRA 19.90 (20.50) 8606310
JAYSHREE TEA 101.70 (104.60) 63420
JET AIRWAYS 588.15 (591.35) 1121303
JINDAL SAW 94.35 (106.00) 3852116
JINDAL STEEL 142.10 (158.40) 28593865
JK LAKSHMI C 454.15 (455.15) 28103
JK PAPER LIM 91.30 (93.40) 1049907
JM FINANCIAL 123.40 (120.30) 1296270
JP ASSOCIATS 25.00 (25.95) 204551255
JSW ENERGY L 67.05 (69.65) 4898056
JUBILANT FOO 1254.80 (1280.75) 541181
JUBILANT ORG 715.30 (712.80) 215426
JYOTHY LABS 391.55 (375.00) 559173
KARNATA BANK 149.20 (152.90) 2384514
KEC INTL LTD 303.95 (298.30) 1204652
KOLTE PATIL 159.80 (163.85) 74043
KPIT CUMMINS 126.10 (128.15) 635727
L&TFIN.HOLD 170.90 (175.35) 3990422
LAK VIL BANK 176.95 (178.45) 1064471
M & M FINANC 395.10 (399.90) 2243319
M & M FINANC 395.10 (399.90) 2243319
MANAPPURAM G 102.70 (106.15) 3082480
MMTC LIMITED 57.80 (59.55) 465539
MOSER-BEAR 5.00 (5.05) 294079
MPHASIS LTD 601.35 (598.80) 85924
MRPL 128.00 (128.05) 2679182
MTNL 19.85 (20.65) 1059475
NAGARJUNA OI 4.00 (4.05) 331712
NCC LIMITED 88.60 (90.35) 3714447
NETWORK18 FI 53.90 (54.35) 382872
NEULAND LAB 1437.70 (1451.80) 5920
NIIT LTD 90.05 (94.65) 855893
NIIT TECHNOL 502.05 (510.60) 349679
OMAXE LTD 203.25 (202.55) 632548
ONMOBILE GLO 62.30 (62.80) 151372
ORIENT PAPER 95.30 (98.05) 303504
ORIENTALBANK 138.10 (143.95) 3239120
PARSVNATH DE 21.75 (22.50) 404556
PATEL ENGG 78.45 (80.15) 188545
PFIZER 1780.85 (1800.65) 21394
POLARIS SOFT 230.05 (231.25) 55102
POWERTRADING 116.95 (118.75) 1826341
PRAJ IND 74.35 (75.65) 218175
PRISM CEMENT 117.45 (119.25) 72907
PROVOGUE (IN 4.10 (4.25) 112184
PUNJ LLOYD 20.75 (20.60) 2132630
PUNJAB & SIN 52.90 (53.95) 61054
PURAVANKARA 74.65 (75.10) 175699
PVP VENTURES 5.15 (5.45) 308693
PVR LIMITED 1374.05 (1377.65) 202693
RADICO KHAIT 145.30 (149.30) 670380
RAJ OIL MILL 1.55 (1.50) 34947
RAJESH EXPOR 729.55 (729.25) 317089
RALLIS INDIA 244.30 (244.75) 186349
RAMCO IND 222.10 (229.70) 173960
RAMCO SYS 401.85 (434.75) 150971
RAMKY INFRA 96.55 (99.05) 80971
RAYMOND 763.60 (776.70) 524470
RELIANCE CAP 722.70 (730.45) 2232880
RELIANCE COM 23.10 (25.00) 33210562
RELIANCE INF 526.25 (532.35) 2532498
RELIANCE POW 42.55 (44.00) 3729984
ROLTA INDIA 57.10 (58.35) 361662
SAGAR CEMENT 836.20 (837.55) 3242
SAREGAMA 406.90 (411.70) 157313
SHANTHI GEAR 136.05 (138.50) 29892
SHIPPNG CORP 86.05 (84.65) 1659379
SHREE RENUKA 18.60 (18.75) 6997960
SINTEX IND 34.05 (35.35) 13282777
SOBHA DEVELO 385.20 (388.95) 94128
SOUTHINDBANK 28.95 (29.85) 13353186
STERLITE TEC 225.20 (220.70) 2158867
SUJANA METAL 2.00 (2.05) 60184
SUN PHARMA 369.60 (372.75) 313605
SUND FASTNER 398.50 (403.75) 141454
SUZLON ENERG 17.75 (18.45) 73282571
SYND. BANK 69.60 (72.90) 3764054
TATA CHEM 600.15 (612.25) 637146
TATA COFFEE 127.70 (128.40) 160351
TATA COMMUN 637.65 (659.55) 502741
TATA GLOBAL 166.65 (165.10) 2895078
TATA METALIK 632.05 (645.15) 179268
TATA TELESER 7.10 (7.50) 2523977
THE INDIAN H 126.90 (129.30) 146702
TORRENT POWE 183.70 (183.15) 2521679
TRIVENI ENGG 89.45 (86.05) 5361293
TTK PRESTIGE 6138.30 (6266.65) 4136
TV TODAY NET 240.85 (241.70) 80716
TV18 BROADCA 38.65 (38.85) 3809932
TVS MOTOR 586.70 (590.55) 426796
UCO BANK 32.75 (33.15) 782757
UNION BANK 143.60 (150.05) 7698675
UNITECH 7.50 (8.20) 75201873
UNITED BANK 19.05 (19.40) 445790
USHA MARTIN 21.40 (22.25) 856193
VADILAL INDU 912.10 (929.55) 16041
VENKYS 2052.40 (2125.35) 85707
V-GUARD IND 180.90 (181.45) 913299
VIJAYA BANK 68.45 (70.10) 1115172
VIP 185.95 (179.35) 1436186
VOLTAS 538.30 (542.35) 2375385
ZEE LEARN LI 43.70 (43.60) 316635
ZUARI GLOBAL 133.35 (134.20) 6781
ZYDUS WELLNE 886.10 (889.25) 2356

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 871.45 (869.90) 6489
AMAR RAJA BA 820.10 (840.45) 19148
ANDHRA BANK 55 (56.35) 159090
ANDHRA CEMEN 9.58 (9.80) 22865
ANDHRA PETRO 25.25 (26.05) 34537
ASTRA MICROW 131.25 (134.15) 51050
AUROBINDO PH 741.35 (730.85) 239850
AVANTEL SOFT 220.05 (229.35) 15432
AVANTI FEEDS 1786.15 (1726.40) 35799
AVON ORG 6 (6.33) 8219
BARTRONICS 15.25 (15.25) 13119
BHAGIRA CHEM 173.60 (178.60) 4081
BRILLIANT SE 7.73 (7.89) 279662
CONT COFFEE 284.75 (289.15) 26331
COROMAN FERT 457.15 (450.75) 42737
CYBERMATE 3.15 (3.31) 133216
DIVI'S LAB 670.45 (668.55) 56352
DIVYA GRANIT 101.80 (104.05) 6488
DR REDDY 2331.85 (2379.85) 58841
GATI CORPN 116.10 (118.05) 47503
GMR INFRASTR 17.95 (18.45) 2063621
GOLDST INFRA 75.70 (75.20) 88583
GOLDSTONE EN 9.45 (9) 63883
GRANULES (I) 132.45 (136.55) 86934
GVK POWER 12.05 (12.52) 3113164
HBL NIFE POW 47.25 (48.05) 30758
IDL INDUSTRS 498.25 (494.50) 5988
IKF SOFT 0.61 (0.62) 95917
ILFS ENGINEE 44.90 (45.20) 26156
INNAREDY COM 2.90 (3.13) 13001
IVRCL INFRAS 5.77 (6.27) 539915
KALLAM SPG 26.85 (27.60) 16020
KAVERI SEED 694.25 (689.70) 48726
KCP LTD 102.25 (102.05) 14701
KNR CONSTRUC 209 (212) 17315
KREBS BIO 99.15 (100.20) 6471
LANCO INDUS 368.65 (372.80) 11031
LOKESH MACH 84.05 (86.90) 28504
MADHUCON PRO 32.25 (32.25) 22936
MEGA SOFT 15.65 (16) 14514
MIC ELECTRON 7.98 (8.22) 65579
MOLD-TEK.TEC 50.10 (50) 6492
MOLDTK PLA 267.45 (279.95) 8455
MSR INDIA LT 22.75 (23.50) 218714
NAGARJAGRICH 37.05 (37.05) 11173
NATCO PHARMA 965.20 (961.70) 20684
NAVA BH VENT 132.55 (133.55) 45629
NCC 87.95 (90.25) 571646
NCL IND 204.80 (204.95) 21636
NEHA INTER 6.11 (6.18) 36601
NETTLINX 111.95 (104.90) 18446
NIHAR INFO 16.50 (16) 1487
PANKAJ POLY 8.25 (7.86) 258500
PANYAM CEMEN 62.90 (64.65) 14920
PENNER IND 55 (55.10) 156216
PRAJAY ENGS 9.63 (9.19) 28979
PRISM CEMENT 116.95 (119.40) 9047
PRUDENTL PHA 4.62 (4.64) 95471
RAIN INDUSTR 129.90 (128.60) 282346
RAJ PACKAGIN 55.25 (56.05) 19450
SATVAH. ISPA 44 (44.40) 8313
SOUTH BIO TE 3.73 (3.88) 48170
SPHERE GLOBA 50 (50.85) 82340
SREE RAYAL A 30.35 (31.55) 234361
STEEL EXCHAN 88.70 (90.55) 132985
SUJANA METAL 2.02 (2.05) 8497
SUJANA TOWER 4.52 (4.52) 3082
SUJANA UNIVE 1.18 (1.20) 15302
SURANA TELE 5.02 (5.13) 9960
SURYALAKSH.C 105.95 (108.05) 3352
SUVEN PHARMA 170.05 (170.15) 44143
TANLA 35.70 (36.50) 72551
TERA SOFTWAR 72 (73.30) 3170
TRANS BIOTEK 2.60 (2.51) 32592
TRENDY KNIT 0.21 (0.22) 86276
VAMSHI RUBB 68.50 (69.45) 2068
VBC FERRO 42.70 (40.75) 50
VICEROY HOTE 18.60 (19) 9284
VIJAY TEXTIL 63.10 (61.15) 37312
VIMTA LABS 137.75 (142) 29174
VISAKA IND 489.50 (485.90) 9713
VISTA PHARMA 30.60 (32.05) 11592
VIVIMED LABS 120.35 (119.80) 67183
XL TELENE 2.02 (1.82) 3710
YBRANT DIGIT 6.96 (6.96) 67247
ZENOTECH LAB 51.70 (54.25) 33207
ZENTECH 55.60 (56) 17698



వినూత్నంగా పనిచేస్తే 10000 డాలర్లు

- ఉద్యోగులకు ఇన్ఫీ బంపరాఫర్
- ప్రతి త్రైమాసికంలో 10 బృందాలకు నజరానా

దిల్లీ: ఉద్యోగుల ప్రతిభకు పెద్ద పీట వేస్తామని ఇన్ఫోసిస్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) విశాల్ సిక్కా వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి త్రైమాసికంలో వినూత్నంగా పనిచేసిన 10 అత్యుత్తమ బృందాల (టీమ్స్)కు 10000 డాలర్ల చొప్పున నజరానా ఇస్తామని తెలిపారు. కంపెనీ సీఈఓగా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగులకు రాసిన లేఖలో సిక్కా ఈ విషయాన్ని పేర్కొన్నారు. బృందాలు, ఉద్యోగుల కృషిని కంపెనీ గుర్తిస్తోందని, తాజా చర్య దీన్ని మరోస్థాయికి తీసుకెళ్లడమేనని అన్నారు. 'ప్రతిభను గుర్తించడంలో భాగంగా ప్రతి త్రైమాసికంలో 10 వినూత్న బృందాలకు 10000 డాలర్లు చొప్పున నజరానా ఇవ్వనున్నామ'ని పేర్కొన్నారు.

వలసలు తగ్గాయ్: కంపెనీలో ఉద్యోగుల వలసలు గణనీయంగా తగ్గాయని సిక్కా పేర్కొన్నారు. 'మన ఖాతాదారుల సంతృప్తి పెరిగింది. ఇదే సమయంలో వలసలు తగ్గాయి' అని అన్నారు. అత్యున్నత కార్యవర్గంలో ఉద్యోగులు వైదొలగడాన్ని పట్టించుకోకూడదని సూచించారు.

కంపెనీ చేతికి బ్రిలియంట్ బేసిక్స్: లండన్ కేంద్రంగా పనిచేసే ప్రోడక్ట్ డిజైన్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ కంపెనీ బ్రిలియంట్ బేసిక్స్‌ను కొనుగోలు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. అయితే కొనుగోలు మొత్తాన్ని మాత్రం వెల్లడించలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో ఈ కొనుగోలు పూర్తయ్యే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో క్షిపణి వ్యవస్థల తయారీ

- 'ప్రైవేటు'లో దేశంలోనే తొలి కంపెనీ
- రాఫెల్‌తో కళ్యాణి గ్రూప్ భాగస్వామ్యం
- రూ.60 కోట్ల పెట్టుబడులు
- 300 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు

ఈనాడు - హైదరాబాద్



గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రులు కేటీఆర్, మహేందర్ రెడ్డి. చిత్రంలో భారత్ ఫోర్జ్ ఛైర్మన్ బాబా కళ్యాణి, భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కార్మన్, రాఫెల్ సీఈఓ యోవా హార్ ఈవెన్, తెలంగాణ శాసన సభ్యుడు తీగల కృష్ణా రెడ్డి తదితరులు

రక్షణ, ఏరోస్పేస్ పరికరాల ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధికి కేంద్రమైన హైదరాబాద్ ఈ రంగంలో మరింతగా బలపడనుంది. క్షిపణుల ఉప వ్యవస్థలు (సబ్ సిస్టమ్స్), ఎలెక్ట్రో-ఆప్టిక్స్, రిమోట్ వెపన్ సిస్టమ్స్, అత్యాధునిక ఎలక్ట్రానిక్స్, క్షిపణిలో వినియోగించే పేలుడు పదార్థాలు మినహా అన్ని రకాల వ్యవస్థలను తయారు చేయడానికి కళ్యాణి గ్రూప్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. ఇజ్రాయెల్‌కు చెందిన రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్‌తో కలిసి కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ కంపెనీ- కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (కేఆర్ఏఎస్) సంయుక్త సంస్థ (జేవీ)ను ఏర్పాటు చేసింది. కేఆర్ఏఎస్ తయారీ యూనిట్‌ను తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ మంత్రి కె.టి.రామారావు లాంఛనంగా ప్రారంభించారు. సంయుక్త సంస్థలో కళ్యాణి గ్రూప్ కంపెనీకి 51 శాతం, రాఫెల్‌కు 49 శాతం వాటా ఉందని కళ్యాణి గ్రూప్ ఛైర్మన్ బాబా ఎన్ కళ్యాణి తెలిపారు. 'దేశంలో ప్రైవేటు రంగంలో అత్యాధునిక రక్షణ సబ్ సిస్టమ్‌లను తయారు చేయడానికి ఏర్పాటు చేసిన మొదటి కంపెనీ (జేవీ) ఇదే. రక్షణ రంగంలో కళ్యాణి గ్రూప్‌నకు ఇది రెండో సంయుక్త సంస్థ. హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుకు రూ.60-70 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఉత్పత్తి కొద్ది వారాల్లో ప్రారంభమవుతుంది. భవిష్యత్తులో ఈ యూనిట్ విస్తరణకు ఇంతే స్థాయిలో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నాం. ఉప వ్యవస్థల తయారీలో వినియోగించే పరికరాలను హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలను తయారు చేసే చిన్న, మధ్య స్థాయి కంపెనీల నుంచి సమకూర్చుకుంటాం. 90 శాతం పరికరాలను దాదాపు 100 చిన్న, మధ్య స్థాయి సంస్థలు సరఫరా చేయనున్నాయి. కొత్త యూనిట్ వల్ల ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా దాదాపు 1,000 మందికి ఉపాధి లభిస్తుంది. భవిష్యత్తులో ఇది వరుసగా 500 మందికి, 2,000-3,000 మందికి పెరిగే అవకాశం ఉందన్నా'రు. దేశీయ రక్షణ రంగం నుంచి దాదాపు రూ.6,000 కోట్ల ఆర్డర్లు రావడానికి అవకాశం ఉన్నందున ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశామని బాబా కళ్యాణ్ చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్ యూనిట్ నుంచి ఎగుమతులు కూడా చేయనున్నట్లు తెలిపారు. రక్షణ రంగంలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఇదొకటని, రాఫెల్ కంపెనీతో భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత పటిష్ఠం చేసుకుంటామని, సంయుక్తంగా మరిన్ని ఉత్పత్తులను తీసుకువస్తామని కళ్యాణి వివరించారు. ప్రధాని మోదీ నినాదం 'మేకిన్ ఇండియా'కు అనుగుణంగా దేశంలోనే అత్యాధునిక రక్షణ వ్యవస్థలు, రిమోట్ వెపన్ వ్యవస్థల తయారీకి కళ్యాణి గ్రూప్ కట్టుబడి ఉందని, ఇందుకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. వ్యూహాత్మక రంగంలో భారత్, ఇజ్రాయెల్‌ల సహకారంలో ఒక మైలురాయని పేర్కొన్నారు.

హైదరాబాదే ఎందుకు?

దేశంలో క్షిపణుల అభివృద్ధి, తయారీకి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. క్షిపణుల సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులు, ప్రభుత్వ రంగంలోని రక్షణ పరిశోధన సంస్థలు, పరికరాలను సరఫరా చేసే కంపెనీలు సమగ్రంగా చెప్పాలంటే క్షిపణుల రంగానికి చెందిన అన్నీ (ఎకోసిస్టమ్) ఇక్కడ ఉన్నాయని బాబా కళ్యాణి అన్నారు. అందుకే రాఫెల్‌తో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. కళ్యాణి గ్రూప్‌నకు ఈ ప్రాంతంలో (హైదరాబాద్‌లో) ఇది తొలి సంస్థ. భవిష్యత్తులో మరిన్ని వెంచర్లను ఇక్కడ ప్రారంభించడానికి సుముఖంగా ఉన్నామని వివరించారు. 'తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా కనిపిస్తోంది. వ్యాపార ఏర్పాటుకు సరళ విధానాలను అమలు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వ సహకారం వల్లే ఒప్పందం కుదుర్చుకున్న 10 నెలల్లోనే యూనిట్‌ను ప్రారంభించగలిగాం. స్థలం కొనుగోలు, భవన నిర్మాణం, అనుమతులు అన్నింటిలో తెలంగాణ ప్రభుత్వ సహకారం బాగుందన్నా'రు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కార్మన్, రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ప్రెసిడెంట్, సీఈఓ యోవ్ హార్-ఈవెన్, కళ్యాణి స్ట్రాటిజిక్ సిస్టమ్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

1,000 సంస్థలున్నాయ్

ప్రైవేటు రంగంలో తొలి క్షిపణి ఉప వ్యవస్థల తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంపై కళ్యాణి గ్రూప్‌నకు తెలంగాణ పరిశ్రమల మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే వేళ్లూనుకున్న రక్షణ ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమను ఈ తయారీ యూనిట్ తదుపరి దశకు తీసుకుపోగలదన్నారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ, బీడీఎల్ వంటి ప్రభుత్వ రక్షణ రంగ కంపెనీల్లో దాదాపు 30 వేల మంది పరిశోధకులు, శాస్త్రవేత్తలు పని చేస్తున్నారని, రక్షణ రంగానికి అవసరమైన పరికరాలు, ఎలక్ట్రానిక్స్‌ను తయారు చేసే 1,000కి పైగా చిన్న, మధ్య స్థాయి సంస్థలు ఇక్కడ ఉన్నాయని మంత్రి చెప్పారు. దేశంలో హైదరాబాద్ అత్యంత భద్రమైన ప్రదేశమని ఇజ్రాయెల్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని కోరారు. 'టీఎస్ఐపాస్' గురించి వివరించారు. హైదరాబాద్‌ను ఎలక్ట్రానిక్స్ తయారీకి కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కోరుకుంటోందని, పెట్టుబడులు పెట్టేందుకు ఇజ్రాయెల్ కంపెనీలు రావాలని సూచించారు.

నేడు అగ్రి ఉడాన్ ప్రారంభం

- వ్యవసాయ స్టార్టప్స్ ప్రోత్సాహానికి కొత్త విధానం
- హైదరాబాద్ వేదికగా శిక్షణ

దిల్లీ: సరికొత్త ఆలోచనలతో వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి మార్కెటింగ్ చేయాలనుకుంటున్న ఔత్సాహికుల కోసం కేంద్రం అగ్రిఉడాన్ పేరుతో కొత్త స్టార్టప్ విధానం తీసుకొచ్చింది. దీనికి ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని నేషనల్ అకాడెమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చి మేనేజ్‌మెంట్ (నార్మ్)లో 6నెలలపాటు శిక్షణ ఇస్తారు. ఔత్సాహికులకు ఆర్థిక, సాంకేతిక, మార్కెట్‌పరంగా మెళకువలను నేర్పుతారు. ఇందుకోసం ఔత్సాహికులను ఆకర్షించేందుకు అగ్రిఉడాన్ పేరుతో ఛండీగఢ్, అహ్మదాబాద్, పునే, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్‌ల్లో రోడ్‌షోలు నిర్వహిస్తారు. కనీస చదువు ఉన్న ఔత్సాహిక రైతులుకూడా ఈ పోటీలో పాల్గొనవచ్చు. తన సరికొత్త ఆలోచనలతో వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి పారిశ్రామికవేత్తగా ఎదగలగన్న నమ్మకం ఉన్నవారంతా అగ్రిఉడాన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన దరఖాస్తు పత్రాలు www.aidea.naarm.org.inలో దొరుకుతాయి. ఔత్సాహికులు సమర్పించిన దరఖాస్తులను వివిధ రంగాల నిపుణులు పరిశీలించి వారి శక్తిసామర్థ్యాలను మదించి మార్కులు వేస్తారు. తొలి 40 స్థానాల్లో నిలిచిన వారిని ఎంపికచేసి ఇంటర్వ్యూ చేస్తారు. అందులోనుంచి 8-12 మందిని స్టార్టప్స్ శిక్షణకోసం ఎంపికచేసి ఆరునెలలపాటు శిక్షణ ఇస్తారు. ఇందుకు అవసరమైన గ్రాంట్‌ను కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ అందిస్తున్నట్లు హైదరాబాద్ నార్మ్ డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు, జాయింట్‌డైరెక్టర్ కల్పన శాస్త్రిలు చెప్పారు. 2015లో తొలిసారి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో 8 మందికి శిక్షణ ఇవ్వగా అందులో మూడింటికి వెంచర్‌క్యాపిటలిస్ట్స్ సహకారం అందినట్లు చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధర లభించేలా చేయడంతోపాటు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే దీని ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని నేడు నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్‌చంద్ అధికారికంగా ప్రారంభిస్తారు.

5 నుంచి జులై రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు

వ్యాపారులకు జీఎస్‌టీఎన్ సూచన

దిల్లీ: వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ) విధానం కింద తొలి పన్ను రిటర్నులను శనివారం నుంచి దాఖలు చేసుకోవచ్చు. ఆగస్టు 20 వరకు గడువు ఉందని జీఎస్‌టీ నెట్‌వర్క్ ఛైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. జులై నెలకు సంబంధించిన తొలి జీఎస్‌టీ రిటర్నును జీఎస్‌టీ నెట్‌వర్క్ పోర్టల్‌ను సందర్శించి దాఖలు చేయొచ్చని వ్యాపారులకు సూచించారు. వ్యాపారాన్ని సులువుగా నిర్వహించుకునేందుకు వీలుగా తొలిసారి మొదటి రెండు నెలలకు స్వీయ మదింపు పద్ధతిలో రిటర్నులు దాఖలు చేసుకోవచ్చని అంటున్నారు. అంటే జులై, ఆగస్టు నెలకు జీఎస్‌టీ రిటర్నులను జీఎస్‌టీఆర్ 3బీ ఫారమ్‌ను పూర్తి చేయడం ద్వారా చేయవచ్చని వివరించారు.

బంగారు కొండ..భారత్

- ఏప్రిల్- జూన్‌లో 37% పెరిగిన పసిడి కొనుగోళ్లు
- ప్రపంచవ్యాప్త గిరాకీలో 10% క్షీణత
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

దిల్లీ

పసిడి.. పసిడి ఆభరణాల కొనుగోళ్ల విషయంలో భారత్ హవా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా బంగారానికి గిరాకీ చప్పగా ఉండగా.. మనదేశంలో మాత్రం అదరహో అనే రీతిలో ఉంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి ప్రపంచ స్వర్ణ మండలి విడుదల చేసిన నివేదికే ఇందుకు నిదర్శనం. పసిడి పెట్టుబడులకు సంబంధించి కూడా భారత్ వైభవం విరాజిల్లుతోంది. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలును దృష్టిలో ఉంచుకొని వినియోగదార్లు, వ్యాపారులు ముందస్తు కొనుగోళ్లకు మొగ్గు చూపడం పసిడి గిరాకీలో గణనీయ వృద్ధికి దోహదం చేసిందని డబ్ల్యూజీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా) సోమసుందరన్ తెలిపారు. అయితే 1% ఎక్సైజ్ సుంకం విధింపు నేపథ్యంలో ఆభరణ వర్తకులు సమ్మె బాట పట్టడం పసిడి కొనుగోళ్లపై పాక్షిక ప్రభావం చూపిందని చెప్పారు.

☛ కలిసొచ్చాయి..


- ✦ జీఎస్‌టీ అమలు నేపథ్యంలో ముందస్తు కొనుగోళ్లకు మొగ్గు చూపడం
- ✦ పెళ్లిళ్ల సీజను, అక్షయ తృతీయ
- ✦ గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ పుంజుకోవడం
- ✦ సానుకూల వర్షపాతంపై అంచనాలు
- ✦ నోట్ల చలామణి పరిస్థితులు మెరుగవడం

☛ ముున్ముందు ఎలా..

కొత్త పన్ను విధానానికి వినియోగదార్లు/ వ్యాపారులు అలవాటుపడాల్సి ఉండటంతో కొనుగోళ్లపై ప్రభావం పడొచ్చు. అయితే రానున్నది పండగ సీజను కావడం వల్ల గిరాకీ పెరిగేందుకే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ తెలిపింది. ఈ ప్రకారంగా పూర్తి సంవత్సరంలో పసిడి గిరాకీ 650- 750 టన్నుల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. అయితే పసిడి గ్రే మార్కెట్ వృద్ధిలో అనిశ్చితి కొనసాగొచ్చు.

☛ ఈటీఎఫ్‌లతో డీలా..

ఏప్రిల్- జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా పసిడి గిరాకీ, పసిడిపై పెట్టుబడులు తగ్గాయి. 2016 తొలి అర్ధభాగంలో ఈటీఎఫ్‌ల్లో భారీగా నిధులు తరలివెళ్లడంతో ఆ ప్రభావం ఇప్పటికీ పసిడి గిరాకీపై కొనసాగుతోందని డబ్ల్యూజీసీ తెలిపింది. అయితే ప్రపంచవ్యాప్తంగా పసిడి ఆభరణాల గిరాకీ పెరిగింది. భారత్‌లో ఆభరణాల కొనుగోళ్ల వృద్ధి ఇందుకు తోడ్పడింది. 2017 తొలి అర్ధభాగంలో ప్రపంచవ్యాప్తంగా పసిడి గిరాకీ 14 శాతం క్షీణించి 2004 టన్నులకు పరిమితమైంది. ఇది ఎనిమిదేళ్ల కనిష్ఠ స్థాయి.



మందగించిన వేతనాల పెంపు

- అధిక రంగాలపై అనిశ్చితి ప్రభావం
- కొన్ని ఐటీ కంపెనీల్లో పనితీరు అంచనా వాయిదా
- విజ్‌డమ్ జాబ్స్ అధ్యయనం



ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగావకాశాలు ఆశాజనకంగా లేకపోవడం.. అనిశ్చిత పరిస్థితులు వేతనాల పెంపుపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అధిక శాతం పరిశ్రమల్లో ఏడాది క్రితంతో పోలిస్తే 2017, జూలైతో ముగిసిన మూడు నెలల్లో వేతనాల పెరుగుదల రేటు రెండంకెల కంటే తక్కువగా ఉందని హైదరాబాద్‌కు చెందిన విజ్‌డమ్ జాబ్స్ డాట్‌కామ్ వెల్లడించింది. 2017-18 మొదటి త్రైమాసికానికి ప్రధాన రంగాల్లో వేతనాల పెంపు, ఉద్యోగుల వలసలపై అధ్యయనాన్ని నిర్వహించి నివేదికను విడుదల చేసింది. 8 ప్రధాన నగరాల్లో ఆరోగ్య సంరక్షణ, ఐటీ నుంచి మౌలిక సదుపాయాల రంగం వరకూ 10 రంగాలకు చెందిన 120 కంపెనీల్లో అధ్యయనం నిర్వహించి నివేదికను విడుదల చేసినట్లు విజ్‌డమ్ జాబ్స్ సీఈఓ అజేయ్ కొల్లా తెలిపారు. సాఫ్ట్‌వేర్ పరిశ్రమలోని అనేక కంపెనీలు మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల పనితీరును అంచనా వేసి వేతనాలు పెంచే ప్రక్రియను వాయిదా వేసినట్లు అధ్యయనంలో వెల్లడైందని పేర్కొన్నారు. 'అధిక శాతం రంగాల్లో ఆచితూచి వేతనాలను పెంచారు. నియామకాలపై ఆశావహ దృక్పథంతో ఉన్నప్పటికీ.. దేశీయ కంపెనీలు వేచి చూసే ధోరణిని అవలంబించాలని భావిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో ఆటోమేషన్ ప్రభావంపై స్పష్టత కోసం ఎదురు చేస్తున్నాయి. ఉద్యోగుల నైపుణ్యాల పెంపుపై దృష్టి పెడుతున్నాయి. మళ్లీ వేతనాల పెంపు పుంజుకోవడానికి మరో రెండు త్రైమాసికాలు పట్టే వీలుందన్నా'రు. నగరాల పరంగా తీసుకున్నా సగటు వేతనాల పెంపు ప్రోత్సాహకరంగా లేదని వివరించారు. విజ్‌డమ్ జాబ్స్ సమగ్ర ఆన్‌లైన్ నియామక సేవలందిస్తోంది.

రంగాలు..

- ✦ గత ఏడాదితో పోలిస్తే ప్రధాన రంగాలలో వేతనాల పెంపు శాతం తగ్గింది.
- ✦ 2017, జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఔషధ రంగంలో వేతనాల సగటు పెరుగుదల రేటు 10.9% ఉంది.
- ✦ ఆరోగ్య సంరక్షణ, రిటైల్ రంగాల్లో 10.8 శాతం, ఐటీలో 9.8 శాతం నమోదైంది.
- ✦ తయారీ రంగంలో 9 శాతం మాత్రమే ఉంది.

నగరాలు..

- ✦ బెంగళూరులో సగటు వేతనాల పెంపు 9.7 శాతం ఉంటే..చెన్నై, పుణెల్లో వరుసగా 9.1%, 9 శాతం ఉంది.
- ✦ హైదరాబాద్‌లో సగటున 8.5 శాతం వేతనం పెరిగింది.
- ✦ దిల్లీలో అతి తక్కువగా పెరుగుదల 7.7 శాతం ఉంది.

వలసలు..

- ✦ ఐటీ రంగంలో అత్యధికంగా వలసల రేటు 24 శాతం నమోదైంది.
- ✦ టెలికాంలో 22 శాతం ఉంది.
- ✦ తయారీ రంగంలో అతి తక్కువ వలసల రేటు 11.1 శాతం.



వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతాయ్

- మరిన్ని ఖాతాలపై దివాలా చర్యలు
- చిట్‌ఫండ్‌లపై కేంద్ర స్థాయి చట్టం త్వరలో
- లోక్‌సభలో అరుణ్ జైట్లీ

దిల్లీ: వడ్డీ రేట్లు క్రమంగా సహేతుక స్థాయికి చేరతాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. చిన్న మదుపర్ల కోసం ఎల్ఐసీ ఒక స్థిర వడ్డీ రేటుతో పింఛను పథకంతో ముందుకొచ్చిందని గుర్తు చేశారు. '14-15 శాతం రుణ రేట్లతో అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ పడలేకపోతోంది. అధిక వడ్డీ రేట్ల నేపథ్యంలో పరిశ్రమ కూడా పెట్టుబడులు పెట్టలేకపోతోంద'ని ఆయన అన్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) త్వరలోనే మరిన్ని దిగ్గజ ఖాతాలపై దివాలా చట్టాన్ని ప్రయోగించనుందని జైట్లీ పార్లమెంటుకు తెలిపారు. 'మరిన్ని కేసులను విచారించడానికి మన వ్యవస్థకు సామర్థ్యం ఉంది. ఆర్‌బీఐ ఇప్పటికే 12 పెద్ద ఖాతాల(డర్టీ డజన్)పై దివాలా ప్రక్రియను మొదలుపెట్టింది. మరిన్ని ఖాతాలపై ఆ ప్రక్రియను ప్రారంభిస్తుందన్న నమ్మకం నాకుంది. క్లిష్టమైన, పెద్ద ఖాతాలను ఆర్‌బీఐ పరిశీలిస్తుంద'ని బ్యాంకింగ్ రెగ్యులేషన్(సవరణ) బిల్, 2017పై చర్చ సందర్భంగా జైట్లీ పేర్కొన్నారు. బుధవారం ఈ బిల్లును లోక్‌సభలో జైట్లీ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

చిట్ ఫండ్‌ల నియంత్రణకు ముసాయిదా: చిట్‌ఫండ్ పథకాల్లో పెట్టుబడులు పెట్టే సామాన్య ప్రజలను రక్షించడం కోసం ప్రభుత్వం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక ముసాయిదాను రూపొందిస్తున్నట్లు జైట్లీ తెలిపారు.

ఎస్‌బీఐ నిర్ణయం సరైందే: రూ.కోటిలోపు పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి చేస్తూ ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని జైట్లీ సమర్థించారు. రుణ రేట్లలో తగ్గింపు నేపథ్యంలో ఆ నిర్ణయం తీసుకుందన్నారు.

వచ్చే అయిదేళ్లలో లక్ష కోట్ల వ్యయం

బీపీసీఎల్ పంచవర్ష ప్రణాళిక!

చెన్నై: వచ్చే పంచవర్ష ప్రణాళిక కింద అన్ని విస్తరణ కార్యకలాపాలపై రూ.లక్ష కోట్ల మేర వ్యయం చేయాలని భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్)లక్ష్యంగా పెట్టుకుంది. 'మేం మార్కెట్ విలువను రూ.2.5 లక్షల కోట్లకు చేర్చాలని అనుకుంటున్నాం. ప్రస్తుత స్థాయికి 2.5 రెట్లు ఇది. ఒక భాగస్వామ్యం ద్వారా గ్యాస్ వ్యాపారంలోకి అడుగుపెట్టాలని యోచిస్తున్నామ'ని కంపెనీ సీఎండీ డి.రాజ్‌కుమార్ గురువారం ఇక్కడ విలేకరులతో పేర్కొన్నారు. 'అమెరికా నుంచి ప్రయోగాత్మక పద్ధతిలో రెండు కార్గోల ముడి చమురును దిగుమతి చేసుకున్నాం. ధరలను అదుపులో పెట్టడమే మా ఉద్దేశమ'ని పేర్కొన్నారు.

డీలర్లకు కమీషన్ 50% దాకా పెంపు: ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చేలా మా డీలర్లకిచ్చే కమీషన్‌ను 50 శాతం దాకా పెంచుతున్నామని రాజ్‌కుమార్ తెలిపారు. కనీసం 20 శాతం పెంపు ఉంటుందన్నారు. ఈ పెంపు నేపథ్యంలో డీలర్లు తమ బంకుల్లో శుభ్రమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఈనాడు సినిమా



ఎన్టీఆర్

ఆ దేవుడికి ఏమివ్వగలను?



సమంత

"కొన్నేళ్ల తరవాత సమంత ఎవరు? అని అడిగితే 'సమంత ఓ మంచి కథానాయిక' అని కాకుండా... 'చాలా మంచి మనిషి' అని చెప్పుకోవాలన్నది నా ఆశ. నటిగా చేతిలో విజయాలు ఉంటే సరిపోతుంది. మనిషిగా గుర్తింపు దక్కాలంటే చాలా మంచి పనులు చేయాలి. ఆ స్థాయికి నేను చేరుకొంటానన్న నమ్మకం ఉంది" అంటోంది సమంత. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'రంగస్థలం'లో నటిస్తోంది. 'సావిత్రి', 'రాజుగారి గది 2'లో కీలక పాత్రలు పోషిస్తోంది. సమంత మాట్లాడుతూ "లక్షలమంది కలలుకనే జీవితాన్ని నేను ఆస్వాదిస్తున్నా. నేను కోరుకొన్నదానికంటే, నాకున్న అర్హత కంటే దేవుడు ఎక్కువే ఇచ్చాడు. కథానాయికగా నా ప్రయాణం చాలా సంతృప్తికరంగా ఉంది. మధ్యలో ఆటుపోట్లు ఎదురైనా, అవన్నీ మర్చిపోగలిగే శక్తినిచ్చాడు. ఇన్నిచ్చిన దేవుడికి నేనేం తిరిగి ఇవ్వలేను. కానీ సాటి మనిషికి సహాయపడగలను" అంటోంది.



బాలకృష్ణపై క్లాప్‌నిస్తున్న బోయపాటి శ్రీను

పోరాటంతో ప్రారంభం

రామోజీ ఫిలింసిటీలో మొదలైన బాలకృష్ణ చిత్రం

తన 101వ చిత్రం 'పైసా వసూల్'కి బుధవారం గుమ్మడికాయ కొట్టారు నందమూరి బాలకృష్ణ. మరుసటి రోజు 102వ చిత్రానికి కొబ్బరికాయ కొట్టేశారు. ఆయన కథానాయకుడిగా సికె ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. నయనతార కథానాయిక. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. గురువారం ఉదయం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ ప్రారంభమైంది. ఫిలింసిటీలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ మార్కెట్ సెట్‌లో పోరాట సన్నివేశంతో ఈ చిత్రానికి శ్రీకారం చుట్టారు. తొలి సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్‌నిచ్చారు. బి.గోపాల్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "బాలకృష్ణగారితో ఎప్పటి నుంచో పనిచేద్దామనుకొంటున్నా. అది ఈరోజు నెరవేరింది. చిత్రీకరణ మొదలుపెట్టకముందే ఈ సినిమా విజయంపై నమ్మకం పెరిగిపోయింది. నాచుట్టూ ఉన్న సాంకేతిక నిపుణులు అలాంటివారు. తప్పకుండా విజయవంతమైన చిత్రం అవుతుంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "రత్నం పదిహేను నిమిషాల పాటు ఈ కథ చెప్పారు. వినగానే నచ్చేసింది. నేనే వెళ్లి దర్శకుడికి వినిపించా. ఆయనకూ బాగా నచ్చింది. రవికుమార్ చేసిన ప్రతి సినిమా హిట్టే. దాదాపుగా 95 శాతం సక్సెస్ రేటు ఉన్న దర్శకుడు ఆయన. మాస్ అంశాలతో పాటు, మనసుల్ని కదిలించే సెంటిమెంట్ కూడా ఈ సినిమాలో ఉంది. చిరంతన్ భట్ తెలుగులో సంగీతం అందించిన రెండు చిత్రాలూ బాగా ఆడాయి. ఈ సినిమాతో ఆయన హ్యాట్రిక్ కొడతారు. బాలకృష్ణ - నయనతార ఈ సినిమాతో హ్యాట్రిక్ జోడీ అనిపించుకొంటారు. మరో ఇద్దరు కథానాయికలకు చోటుంది. వాళ్లెవరనేది రెండు మూడు రోజుల్లో చెబుతాం. ఈరోజు నుంచి నెలాఖరు వరకూ ఫిలింసిటీలోనే షూటింగ్ జరుగుతుంది. ఆ తరవాత కుంభకోణంలో కీలకమైన షెడ్యూల్ చిత్రీకరిస్తాం. అక్కడ నుంచి తిరిగొచ్చాకా విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో కొన్ని సన్నివేశాలు, పాటలు తెరకెక్కిస్తాం. 2018 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "బాలకృష్ణగారితో ఇది నా ఎనిమిదవ చిత్రం. చాలా కథలు అనుకొన్నా ఏదీ సంతృప్తినివ్వలేదు. చివరికి ఈ కథ ఓకే అయ్యింది. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో సూపర్ హిట్ చిత్రాల్ని అందించారు రవికుమార్. ఆయనకు బాలకృష్ణలాంటి గొప్ప కథానాయకుడు దొరికారు. వీరిద్దరి కలయిక సంచలనాలు సృష్టిస్తుంద"న్నారు రచయిత రత్నం. ప్రకాష్‌రాజ్, బ్రహ్మానందం, అశుతోష్ రాణా, ప్రభాకర్, శివ పార్వతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కళ: నారాయణరెడ్డి, ఛాయాగ్రహణం: రాంప్రసాద్.

'జై లవకుశ' రాఖీ కానుక

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయంలో తెరకెక్కుతున్న చిత్రం 'జై లవకుశ'. రాశీ ఖన్నా కథానాయిక. బాబి దర్శకత్వం వహిస్తున్నారు. కల్యాణ్‌రామ్ నిర్మాత. ఇటీవల 'జై' పాత్రకు సంబంధించిన టీజర్ విడుదల చేశారు. ఇప్పుడు లవకుమార్ పాత్రని పరిచయం చేయబోతున్నారు. రాఖీ పండగ సందర్భంగా ఈనెల 7న ఉదయం 10గం.35 నిమిషాలకు 'జై లవకుశ' రెండో టీజర్ విడుదల కానుంది. దసరాకి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుగుతోంది. అక్కడ ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. "ఎన్టీఆర్ అభిమానులకు పండగలాంటి చిత్రమిది. 'జై' పాత్రకు సంబంధించిన టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. త్వరలోనే మూడో టీజర్‌నీ విడుదల చేస్తామ"ని చిత్ర బృందం తెలిపింది. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్

పంచ్ డైలాగ్

ప్రతి తండ్రి తన కొడుకు గొప్పోడు అవ్వాలని కోరుకుంటాడు తప్ప గొప్ప మనిషి అవ్వాలని అనుకోడు!

చిత్రం: బ్రూస్‌లీ

- పంపినవారు: కూర్మాన పాపారావు, చినబడాం, శ్రీకాకుళం జిల్లా

హాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తా



'నేనే రాజు నేనే మంత్రి'లో రానా, కాజల్

"మా బాబాయ్ వెంకటేష్‌గారి అభిమానులు నా తోడుగా ఉన్నారన్న ధైర్యంతో కొత్త కథలు ఒప్పుకొంటున్నా. వాళ్ల ప్రోత్సాహం ఇలానే ఉంటే హాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తా" అన్నారు కథానాయకుడు రానా. ఆయన నటించిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. కాజల్ కథానాయిక. తేజ దర్శకుడు. డి.సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి నిర్మాతలు. అనూప్ సంగీతం అందించారు. ఇటీవల హైదరాబాద్‌లో 'జోగేంద్ర యువ గర్జన' పేరుతో ఓ కార్యక్రమం నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ "నా మనసుకి బాగా దగ్గరైన కథ ఇది. నాకు ఇష్టమైన వ్యక్తి ఎన్టీఆర్. ఆయనతో పాటు ఎంజీఆర్ ఫిలాసఫీ జోగేంద్ర పాత్రలో ఉంటాయి. అందుకే ఈ సినిమా ఒప్పుకొన్నా. నేను ఈ వేదికపై ఉన్నానంటే, సినిమాల గురించి తెలిసిందంటే మా తాతయ్యే కారణం. ఆయన ఈ సినిమా చూడలేకపోతున్నారన్న బాధ ఉంది. ఈమధ్య నా కెరీర్ బాగుంది. నా కెరీర్‌ని పైనుంచి తాతగారు సెట్ చేశారనిపిస్తోంది. ఈనెల 11న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "ఓ సినిమాని ఎలా చూడాలో, ఎలా ప్రేమించాలో తేజగారి నుంచి నేర్చుకొన్నా. ఈ చిత్రం నాకు చాలా ప్రత్యేకం" అని కాజల్ చెప్పింది. "కథలంటే నాకు భయం. అందులోనూ రానాతో సినిమా అంటే ఇంకా భయం. ఈ సినిమా ఎలా వస్తుందో అనుకొన్నా. కానీ రానా బాగా చేశాడ"న్నారు సురేష్‌బాబు. "కథ వినగానే రానాకి నచ్చింది. తేజగారికి నచ్చింది. కాజల్‌కి నచ్చింది. సినిమా అంతా పిక్నిక్‌లా జరిగింది.. ఇలాంటి మాటలు చెప్పను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. సాధారణంగా నేను కొత్తవారితో సినిమాలు చేస్తుంటా. వాళ్లతో బోర్ కొట్టి ఈ సినిమా తీశా" అన్నారు తేజ. 'నా కెరీర్ తేజ గారితో మొదలైంది. ఇప్పుడు మళ్లీ ఆయనతో కలసి పనిచేయడం ఆనందంగా ఉంద"న్నారు నవదీప్. ఈ కార్యక్రమంలో కేథరిన్, తనికెళ్ల భరణి, లక్ష్మీభూపాల్, జయప్రకాష్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు, శివాజీ రాజా, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

కథలో మలుపులు నచ్చాయి



సంపత్‌నంది, గోపీచంద్, కేథరిన్, జె.భగవాన్, పుల్లారావు

"చాలా రోజుల తరవాత నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశా. నా మనసుకు దగ్గరైన సినిమా ఇద"న్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గౌతమ్ నంద'. సంపత్‌నంది దర్శకుడు. జె.భగవాన్, పుల్లారావు నిర్మాతలు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి వస్తున్న స్పందన పట్ల చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపీచంద్ మాట్లాడుతూ "నా కెరీర్‌లో ఎక్కువ వసూళ్లు సాధించిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాలతో పాటు, భావోద్వేగ భరితమైన సన్నివేశాలకూ మంచి స్పందన వస్తోంద"న్నారు. 'కథను నమ్మి ఈ సినిమా చేశాం. పాత కథే అయినా కొత్తగా చెప్పాం. ఆ ప్రయత్నం నచ్చింది. కథలో మలుపులు ఆకట్టుకొన్నాయి. చివరి 45 నిమిషాల సన్నివేశాల గురించి ప్రత్యేకంగా మాట్లాడుకొంటున్నారు. కుటుంబ సన్నివేశాలు అందరినీ కదిలించాయ"న్నారు దర్శకుడు. "మంచి కథకు మంచి టీమ్ దొరికింది. ఈ చిత్రంలో నేనూ ఓ భాగం అయినందుకు సంతోషంగా ఉంద"ని కేథరిన్ చెప్పింది. "ఖర్చుకి ఎక్కడా వెనుకాడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. సాంకేతికంగా, కథాపరంగా మా సంస్థకు సంతృప్తినిచ్చిన చిత్రమిద"ని నిర్మాతలు తెలిపారు.

చలో అమెరికా

శతృఘ్న రాయపాటి, స్టెఫానీ, జోసెలిన్, రెబెకా, చలపతిరావు ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'గ్రీన్ కార్డ్'. రమ్స్ దర్శకుడు. శ్రీనివాస్ గుప్తా, మోహన్.ఆర్, నరసింహా, నాగ శ్రీనివాసరెడ్డి నిర్మాతలు. శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "యువతీ యువకుల్లో చాలామందికి అమెరికా వెళ్లాలన్న ఆశ ఉంటుంది. అక్కడకు వెళ్లాక గ్రీన్ కార్డ్ కోసం తహతహలాడతారు. అందుకోసం పడే సాధకబాధకాల్ని తెరపై చూపిస్తున్నాం. అమెరికాలో తెలుగువారి బతుకులు ఎలా ఉంటాయో కళ్లకు కట్టాం. 90 శాతం అమెరికాలోనే చిత్రీకరించాం. దాదాపుగా అక్కడివాళ్లే నటించార"న్నారు.



రమ్స్, చలపతిరావు

'మళ్లీ రావా' ప్రియతమా

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ రావా'. ఆకాంక్ష సింగ్ కథానాయిక. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. రాహుల్ యాదవ్ నక్క నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం టీజర్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడికి ఇదే తొలి చిత్రమైనా అనుభవజ్ఞుడిలా తెరకెక్కిస్తున్నాడు. హృదయానికి హత్తుకొనే ప్రేమకథ ఇది. సుమంత్ నటన, ఆయన పలికించే హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. సుమంత్ - ఆకాంక్ష జంట చూడముచ్చటగా ఉంటుంది. రాజోలు, పాలకొల్లు, భీమవరం, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో చిత్రీకరణ జరిపాం. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తామ"న్నారు. అన్నపూర్ణ, కాదంబరి కిరణ్, మిర్చి కిరణ్, కార్తీక్ అడుసుమిల్లి తదితరులు నటించారు. సంగీతం: శ్రావణ్ భరద్వాజ్



సుమంత్

గీతోపదేశం

మట్టియందే మాణిక్యం దాగియుండురా
మనిషి యందే మహాత్ముని కాంచగలమురా
ప్రతి గుండెలో గుడిగంటలు ప్రతిధ్వనించురా
ఆ దివ్య స్వరం న్యాయపథం చూపగలుగురా

గీతం: జన్మమెత్తితిరా..., చిత్రం: గుడి గంటలు
రచన: అనిసెట్టి సుబ్బారావు
- పంపినవారు: మోర మురహరి, నిజామాబాద్

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

సూపర్‌స్టార్..శక్తి కుమార్

ఇన్సియా.. పాటే లోకంగా బతికే 14 ఏళ్ల అమ్మాయి. తన గొంతుతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించాలని ఆరాటపడుతుంటుంది. కానీ ఆమె తండ్రికి అది ఇష్టం ఉండదు. ఆమె ప్రతిభను ప్రోత్సహించకపోగా నిరాశపరుస్తాడు. బాధను దిగమింగి ముందుకెళుతుంది ఆ అమ్మాయి. తనే ఓ పాట పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంది. ఆ వీడియోలో తన ముఖం కనబడకుండా బురఖా వేసుకుంటుంది. తండ్రికి భయపడి ఆ వీడియోలో తన పేరు కూడా చెప్పదు. ఆ వీడియో చాలా పాపులర్ అవుతుంది. ఈ క్రమంలో ఆమెకు ఓ ప్రముఖ సంగీత దర్శకుడు పరిచయం అవుతాడు. ఆ తర్వాత ఏమైంది.. ఆమె కల నెరవేరిందా? లేదా? ఇవన్నీ 'సీక్రెట్ సూపర్‌స్టార్'లో చూడాల్సిందే. ఆమీర్‌ఖాన్, జైరా వాసిం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రంలో మ్యూజిక్ డైరెక్టర్ శక్తికుమార్‌గా ఆమీర్‌ఖాన్ నటిస్తున్నాడు. 'దంగల్'లో ఆమీర్ కూతురు పాత్రలో నటించిన జైరా ఇందులో గాయని కావాలని తపనపడే అమ్మాయిగా నటిస్తోంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అక్టోబర్ 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఆమీర్‌ఖాన్

ఒకట్రెండు పరాజయాలు ఫర్వాలేదు!: "సల్మాన్, షారుఖ్.. ఇద్దరూ గొప్ప నటులే. వాళ్లిద్దరి నటనకు నేను అభిమానిని. ఇద్దరిలో ఎవరు గొప్పవారంటే చెప్పలేను. ఎవరి ప్రతిభ వారిది"అని చెప్పాడు ఆమీర్‌ఖాన్. ముంబయిలో జరిగిన 'సీక్రెట్ సూపర్‌స్టార్' ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆమీర్ మాట్లాడాడు. ఈ మధ్య సల్మాన్ 'ట్యూబ్‌లైట్' ఫ్లాప్ కాగా, షారుఖ్ చిత్రాలేవీ బాక్సాఫీసు వద్ద ఆశించిన వసూళ్లు సాధించలేదు. ఈ విషయమై ఆమీర్ మాట్లాడుతూ "సల్మాన్, షారుఖ్ ఇటీవలి కాలంలో నటించిన చిత్రాలు విజయం సాధించకపోయినా వాళ్ల స్టార్‌డమ్‌కు వచ్చిన ముప్పేమీ లేద"ని చెప్పాడు. ఖాన్‌త్రయంలో మీ చిత్రాలే ఎక్కువ వసూళ్లు సాధిస్తున్నాయి కదా.. అంటే "నటన సృజనాత్మకమైన కళ. దానికి విలువ కట్టలేం. నటులందరం ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలనే ప్రయత్నిస్తాం. అందులో ఒక్కోసారి విజయం సాధిస్తాం. ఒక్కోసారి పరాజయం ఎదుర్కొంటామ"న్నారు ఆమీర్.

అవార్డుల సంతోషం



సురేష్‌కొండేటి, ఆది, హెబ్బాపటేల్, రెజీనా

"నాగార్జునగారు ఇచ్చిన సలహాతో 'సంతోషం' అవార్డుల్ని ప్రదానం చేయడం మొదలెట్టా. పదిహేనేళ్ల నుంచీ పురస్కారాల్ని అందిస్తున్నాం. ఈ పరంపర ఇలానే కొనసాగుతుంద"న్నారు సురేష్‌కొండేటి. ఈనెల 12న హైదరాబాద్‌లో 'సంతోషం' పురస్కారాల వేడుక జరగబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'సంతోషం' లోగోని శివాజీరాజా, రెజీనా సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెజీనా మాట్లాడుతూ "ఏటా అవార్డులు ఇవ్వడం మామూలు విషయం కాదు. మరో పాతికేళ్లు ఈ పండగ ఇలానే జరగాల"ని ఆకాంక్షించింది. "మా నాన్న నా చిన్నప్పుడు సంతోషం పురస్కారం అందుకొన్నారు. ఆ అవార్డు నాకూ రావాలని ఆరోజే గట్టిగా అనుకొన్నా. 'ప్రేమ కావాలి'తో నా కల నెరవేరింద"న్నారు ఆది. "పదిహేనేళ్లుగా సంతోషం అవార్డులు ఇస్తున్నాం. ఈసారీ ఘనంగా చేయబోతున్నామ"ని సురేష్‌కొండేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెబ్బాపటేల్, కె.ఎస్.రామారావు, ఏడిద రాజా, ఏడిద శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో భానుడి ఉగ్రరూపం

తాజా అధ్యయనంలో వెల్లడి

బోస్టన్: భారత్‌లో ఉష్ణోగ్రతలు మరికొన్ని దశాబ్దాల్లో భరించలేని స్థాయికి పెరిగే అవకాశముందని తాజా అధ్యయనం హెచ్చరించింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లో దాదాపు 150 కోట్ల మందిపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొంది. ఆహార సంక్షోభం సైతం ఉగ్రరూపం దాలుస్తుందని తెలిపింది. అమెరికాలోని మసాచుసెట్స్ సాంకేతిక విద్యాసంస్థ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఈ శతాబ్దం చివరినాటికి వాతావరణ మార్పులు దక్షిణాసియాపై పెను ప్రభావాన్ని చూపిస్తాయని వారు అంచనావేశారు. ప్రపంచ జనాభాలో ఐదింట ఓ వంతు మంది నివసిస్తున్న ఈ ప్రాంతంలో వేసవి నిప్పుల కుంపటిగా పరిణమించబోతుందని వారు వివరించారు.

గంగ, సింధు బేసిన్లపైనా...

- కర్బన ఉద్గారాల స్థాయిలు గణనీయంగా తగ్గకపోతే.. మరికొన్ని దశాబ్దాల్లోనే ఈ భగభగలు మొదలవుతాయి. సింధు, గంగా నదీ బేసిన్లపైనా ప్రతాపాన్ని చూపిస్తాయి. దక్షిణాసియా ఆహార ఉత్పత్తిలో ఈ ప్రాంతాలు కీలకమైనవి.
- ఉత్తర భారత దేశం, బంగ్లాదేశ్, దక్షిణ పాకిస్థాన్‌లలో ఈ మార్పుల ప్రభావం విపరీతంగా ఉండబోతోంది. ఇక్కడ దాదాపు 150 కోట్ల మంది నివసిస్తున్నారు. వీరిలో చాలా మందికి వ్యవసాయమే జీవనాధారం. సాగు కోసం మండుటెండల్లో వీరు కఠోర శ్రమ పడుతుంటారు. వాతావరణ మార్పుల మొదటి పంజా వీరిపై పడేందుకు ఈ శ్రమే కారణమవుతుందని పరిశోధకుడు ఎల్ఫైత్ ఎల్తాహిర్ తెలిపారు.
- భూమిపై అత్యధిక ఉష్ణోగ్రతలు పర్షియన్ గల్ఫ్‌లోనే నమోదుకానున్నాయి. తర్వాతి స్థానంలో ఉత్తర భారతదేశం, తూర్పు చైనా ఉన్నాయి.
- పర్షియన్ గల్ఫ్‌లో వేడికి నీరు విపరీతంగా ఆవిరైపోతుంది. మానవ అవసరాలకు ఉపయోగపడే నీటి వనరులు గణనీయంగా పడిపోతాయి.
- అత్యధిక ఉష్ణోగ్రతలకు భారీగా తేమ కలిస్తే మానవులపై విపరీత ప్రభావం పడుతుందన్న పరిశోధన ఫలితాలను ప్రస్తుత అధ్యయనకర్తలు క్షుణ్నంగా విశ్లేషించారు. వీటిని వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులతో సరిపోల్చారు. దీంతో తాజా అంశాలు వెలుగులోకి వచ్చాయి.

వందేళ్లుగా మండుతున్న భూ గర్భం

ఝరియా బొగ్గు గనుల్లో అదుపులోకి రాని మంటలు

- మానవ ప్రయత్నాలకు లొంగని విపత్తు
- రైలు మార్గాలను తొలగించాల్సిన దుస్థితి
- ప్రజలను తరలించడం మినహా ప్రత్యామ్నాయం లేదు

ఇష్టారీతిన వ్యవహరిస్తే శక్తినిచ్చే ప్రకృతి సంపదే విపత్తుగా మారుతుంది. మానవ ప్రయత్నాలకు లొంగని మారణహోమమవుతుంది. ఖనిజ సంపదకు నిలయమైన ఝార్ఖండ్‌లో ఇదే జరుగుతోంది. భూ గర్భంలోని బొగ్గు అగ్నికీలలుగా మారింది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా పూర్తిగా అదుపులోకి రావడం లేదు. ఇదేదో ఈ మధ్యన తలెత్తిన ఉపద్రవం కాదు. అక్షరాలా వందేళ్లనాటిది. ప్రకృతి వైపరీత్యాలతో పాటు, మానవ తప్పిదాలూ ఈ దారుణానికి కారణాలు. బొగ్గు గనులను ప్రయివేటు సంస్థలకు అప్పగించాలని ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ అనుభవం నుంచి తప్పకుండా గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంటుంది.

ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ అంటే పరిశ్రమలకు కేంద్రం. సమీపంలో ఉన్న ఝరియా బొగ్గు గనులకు నిలయం. ఈస్ట్ ఇండియా కంపెనీ హయాంలో అంటే 1894లోనే ఇక్కడ బొగ్గు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందిన సేఠ్ ఖోరా రాం చావ్డా తొలిసారిగా ఇక్కడ బొగ్గుగని ఏర్పాటు చేశారు. ఈ రంగంలో ప్రవేశించిన తొలి భారతీయుడూ ఆయనే కావడం గమనార్హం. 1916లో తొలిసారిగా ఓ గనిలో మంటలు కనిపించాయి. 1930లో చావ్డాకు చెందిన ఖాస్ ఝరియా, గోల్డెన్ ఝరియా అనే రెండు గనులు కూలిపోయాయి. ఆయన బంగళా కూడా భూగర్భంలో కలిసిపోయింది. ఈ గనుల్లోనూ మంటలు వ్యాపించాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో మంటలు విస్తరిస్తునే ఉన్నాయి. భూమిలోనే మండుతుండడంతో కొన్ని చోట్ల మంటలు పైకి కనిపించవు. భూగర్భం నుంచి వచ్చే పొగలు కనిపిస్తుంటాయి. నేల బాగా వేడక్కడంతో చెప్పుల్లేకుండా నడవడమూ కష్టమే. కొన్ని సార్లు ఊపిరి తీసుకోవడానికీ ఇబ్బందే. 72 చోట్ల మంటలు కనిపిస్తుండగా, ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా అందులో కొన్ని చల్లబడ్డాయి. ఈ ప్రమాదం కారణంగా 3.7 కోట్ల టన్నుల బొగ్గు వృథా అయిందని అంచనా. మరో 200 కోట్ల టన్నుల బొగ్గును తవ్వడానికి వీలు లేకుండా పోయింది.

కారణాలు ఏమిటి?

సాధారణంగా బొగ్గు భూమిలో రెండుమూడు వందల మీటర్ల లోతున దొరుకుతుంది. కానీ ఇక్కడ 15 మీటర్ల లోతున కూడా లభిస్తుంది. దీన్నే శాస్త్రీయ పరిభాషలో అవుట్ క్రాప్ ఏరియాగా పిలుస్తారు. ఇదే ఇప్పుడు శాపంలా మారింది. పై పొరల్లో ఉన్న ఒత్తిడి కారణంగా నిప్పు పుడుతుంది. తొలి దశలో ప్రమాదాలకు ఇదే కారణం. బాగా పైభాగంలోనే బొగ్గు నిల్వలు ఉండడం వల్ల త్వరగా మంటలు వ్యాపించడానికి ఆస్కారం కలిగింది. 1934లో సంభవించిన నేపాల్-బిహార్ భూకంపం అనంతరం మంటలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయి. పిడుగులు పడడం వల్ల కూడా మంటలు చెలరేగిన సందర్భాలు ఉన్నాయి. మొదట్లో బొగ్గు తవ్వకాల్లో అంతగా శాస్త్రీయ ప్రమాణాలు పాటించేవారు కాదు. నిల్వలు పూర్తయిన గనులను మూసివేసేటప్పుడు కూడా కచ్చితమైన విధానాలను అమలు చేయాల్సి ఉంది. అప్పట్లో అవన్నీ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండడంతో దీనికి అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కాలక్రమంలో గనుల్లో మిగిలిన బొగ్గుకు మంటలు అంటుకొని సమీప ప్రాంతాలకు వ్యాపించాయి. అన్నింటికన్నా ముఖ్యమైనది అక్రమ తవ్వకాలు. సాధారణ పని ముట్లతో తవ్వినా బొగ్గు దొరికే అవకాశం ఉండడంతో చాలా మందికి ఇది స్వయం ఉపాధిలా మారింది. ఇటీవల కాలం ప్రమాదాలకు ఇదే అసలు కారణం. ఇష్టం వచ్చినట్టు గోతులు తవ్వడం, తరువాత వాటని అలాగే వదిలేయడంతో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదం ముంచుకొస్తోంది. ఇక్కడి పొలాలు, అడవులు బొగ్గు గనులుగా మారడం వల్లనే ఉపాధి కోసం ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని కొందరు చెబుతున్నారు. పెద్దగా కష్టపడకుండా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారని ఇంకొందరు విమర్శిస్తున్నారు.

నివారణ చర్యలు లేవా?

1971లో బొగ్గు గనులను జాతీయం చేసి వీటిని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ కోకింగ్ కోల్ సంస్థకు అప్పగించినప్పటి నుంచి పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. మంటలు విస్తరించకుండా వందల కోట్ల రూపాయలు వెచ్చించింది. గనుల్లోకి నీరు పంపించడం, ఇసుకతో నింపడం, నైట్రోజన్ గ్యాస్‌ను పంపించడం వంటి చర్యలతో కొన్ని చోట్ల మంటలు విస్తరించకుండా అదుపులోకి వచ్చాయి. ఇక్కడ వారికి సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించడానికి ఝరియా పునరావాసం, అభివృద్ధి ప్రాధికార సంస్థ (జేఆర్‌డీఏ) ఏర్పాటయింది. బాధితుల కోసం బహుళ అంతస్తుల భవనాలు నిర్మించింది. అయితే అక్కడా అవినీతి చోటు చేసుకోవడం, అర్హులకు ఫలాలు అందకపోవడంతో అక్రమ తవ్వకాలు ఆగలేదు.

– ఈనాడు ప్రత్యేకవిభాగం



రాత్రివేళ మండుతున్న బొగ్గు గనులు(పాతచిత్రం)

మళ్లీ ఇప్పుడు ఏమి జరిగింది?

భూ గర్భంలోని బొగ్గు మండుతూ పైకి వ్యాపించడంతో అది రైలు పట్టాలను తాకే పరిస్థితికి వచ్చింది. దాంతో గత నెలలో ధన్‌బాద్-చంద్రాపుర రైల్వే లైనును పూర్తిగా ఎత్తివేశారు. మొత్తం 35 కి.మీ. పొడవు ఉన్న ఈ మార్గంలో 14 కి.మీ. అత్యంత ప్రమాదకరంగా మారింది. కొన్ని చోట్ల 15 అడుగుల పొడవున మంటలు కనిపించాయి. బస్తోరా స్టేషన్ వద్ద వీటి ఉద్ధృతి అధికంగా ఉండడంతో ఈ లైనునే ఏకంగా రద్దు చేసి రైళ్లను వేరే మార్గంలో మళ్లించారు. ఇది శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వంటి 26 ప్రధాన రైళ్లు తిరిగే మార్గం కావడం గమనార్హం. ఝరియా ప్రాంతంలోని ఓ కాలనీని కూడా ఖాళీ చేయించాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో మంటలు క్రమేణా పెరుగుతున్నాయి. 2009లో పట్నా నుంచి హజారీబాగ్, కొడేరమా మీదుగా రాంచీ వెళ్లే జాతీయ రహదారిని మూసివేయాల్సి వచ్చింది.

నిత్య అప్రమత్తతతో శ్రీరామరక్ష

కొత్త ప్రాంతాలకు విస్తరించకుండా చూడడం తప్పించి ఎప్పటి నుంచో ఉన్న మంటలను పూర్తిగా ఆపడం దాదాపుగా సాధ్యం కాదు. కొన్ని చోట్ల ఉష్ణోగ్రత 700 డిగ్రీల సెల్సియస్ కూడా ఉంటుంది. పరిస్థితులను గమనిస్తూ నిత్యం అప్రమత్తంగా ఉండి ప్రజలను కాపాడవలసి ఉంటుంది. దీనిపై గోదావరిఖనిలోని సింగరేణి సంస్థకు చెందిన మైనింగ్, అగ్నిమాపక నిపుణుడు బి.మోహన్ మాట్లాడుతూ 'శాస్త్రీయంగా చెప్పాలంటే ఇంధనం, ఆక్సిజన్, ఉష్ణోగ్రత.. ఈ మూడు కలిసినప్పుడు అగ్ని పుడుతుంది. ఇక్కడి భూమికి పగుళ్లు ఉండడం కారణంగా వాయువు లోపలికి ప్రవేశిస్తోంది. బొగ్గు పొరల్లో సహజంగానే ఉండే ఒత్తిడికి వేడి ఉద్భవిస్తుంది. ఈ కారణంగానే మంటలు అదుపులోకి రావడం లేదు. భూమి పగుళ్లు కనిపించినప్పుడు దానిపై సిమెంట్ పూత రాసి గాలి చొరబడకుండా కొంతవరకు ప్రయత్నిస్తున్నారు. భూమిలోపలికి నీరు పంపిస్తున్నారు. ఇవన్నీ మంటలు విస్తరించకుండా చేయడానికే. తీవ్రతను గమనించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంద'ని వివరించారు.

చిన్నారి సహృదయత



కువైట్‌లో నివసిస్తున్న భారతీయుడు మాస్టర్ రిద్ధిరాజ్ రూ.18వేల చెక్కును ప్రధాని నరేంద్రమోదీకి దిల్లీలో అందిస్తున్న దృశ్యమిది. ఈ మొత్తాన్ని భారతీయ సైనికుల సంక్షేమ సంఘానికి వినియోగించాల్సిందిగా తన తల్లిదండ్రులతో కలసి కోరాడు. కువైట్‌లో నిర్వహించిన ఓ అంతర్జాతీయ మేధాపరీక్షలో లెక్కలు, సైన్స్‌లో రిద్ధిరాజ్ చూపిన ప్రతిభకు 80 కువైట్ దీనార్లు బహుమతిగా పొందాడు. వాటినే రూపాయల్లో విరాళంగా ఇచ్చాడు.

భారతీయ క్రీడాకారుడిపై అమెరికాలో నేరాభియోగం

- బాలికను లైంగికంగా వేధించాడని ఆరోపణ

న్యూయార్క్: మైనర్ బాలికను లైంగికంగా వేధించాడనే అభియోగాలపై భారతీయ స్నోషూ క్రీడాకారుడు తన్వీర్ హుస్సేన్(24)పై అమెరికాలో నేరం మోపారు. అతడు ఈ సంవత్సరం మొదట్లో సరనక్ లేక్‌కు చెందిన 12 ఏళ్ల బాలికతో అనుచితంగా ప్రవర్తించాడని ఎసెక్స్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ ఆరోపించింది. డీవే మౌంటెయిన్ రిక్రియేషన్ సెంటర్‌లో జరిగిన వరల్డ్ స్నోషూ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న రెండు రోజుల తర్వాత గత మార్చిలో హుస్సేన్‌ను అరెస్ట్ చేశారు. "హుస్సేన్ 12 ఏళ్ల బాలికతో లైంగిక సంబంధం పెట్టుకున్నాడు. సరనక్ లేక్‌లో ఉన్నప్పుడు ఆమెతో అసభ్యకరంగా మాట్లాడాడు' ' అని ఎసెక్స్ కౌంటీ డిస్ట్రిక్ అటార్నీ క్రిస్టీ స్ప్రాగూ ఒక ప్రకటనలో పేర్కొన్నారని అడిరోండక్ డెయిలీ ఎంటర్‌ప్రైజెస్ వెబ్‌సైట్ కథనం వివరించింది. స్నోషూ పోటీ జరిగిన రెండు రోజుల తర్వాత హుస్సేన్ తనను రెండు సార్లు ముద్దుపెట్టుకున్నాడని, తనను తడిమాడని ఆ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట్లో హుస్సేన్ ఈ అభియోగాలను ఖండించాడని వెబ్‌సైట్ పేర్కొంది. నేరం మోపిన విషయాన్ని తన దృష్టికి తీసుకురాకుండా ప్రతికా ప్రకటన ద్వారా వెల్లడించటంపై హుస్సేన్ న్యాయవాది అసంతృప్తి వ్యక్తం చేశారు.

భాషా పరిశోధనలతో ఉపాధి అవకాశాలు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

దిల్లీ: దేశంలో విభిన్నమైన భాషలు ఉండడం వరమని, ఈ వైవిధ్యాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. దేశంలో భాషా శాస్త్రాలపై తగిన పరిశోధనలు జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని భాషలపై పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ) నిర్వహించిన సర్వేకు సంబంధించిన 11 సంపుటాలను గురువారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. భాషా శాస్త్రాల్లో పరిశోధనలు జరిగితే కంప్యూటర్ సైన్స్ రంగంలో ఉపయోగపడుతుందని చెప్పారు. పీఎస్ఎల్ఐ మొత్తం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 50 సంపుటాల కింద 92 పుస్తకాలను తీసుకురానుంది. ఇప్పటికి 37 పుస్తకాలను ప్రచురించింది. 2020 నాటికి ఇవన్నీ ఈ-పుస్తకాల రూపంలో లభ్యం కానున్నాయి. ఈ సంపుటాలకు డాక్టర్ డి.ఎన్.డేవీ ప్రధాన సంపాదకునిగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలోనే ఈ సర్వే జరిగింది.

సీఎస్ ఎస్పీ సింగ్‌తో యూనిసెఫ్ ప్రతినిధుల భేటీ

ఈనాడు, హైదరాబాద్: యూనిసెఫ్ భారత దేశ ప్రతినిధిగా నియమితులైన యాస్మిన్ హక్ గురువారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌తో భేటీ అయ్యారు. సచివాలయంలో మర్యాదపూర్వకంగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆమెకు వివరించారు.

క్షీణించిన మేధా పాట్కర్ ఆరోగ్యం

భోపాల్/ దిల్లీ: సర్దార్ సరోవర్ డ్యామ్ నిర్వాసితులకు తగు పునరావాసం కల్పించాలంటూ మేధా పాట్కర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష 8వ రోజుకు చేరింది. ఆమె ఆరోగ్యం క్షీణించిందని, అయినా వైద్య పరీక్షలకు నిరాకరించారని సహాయకులు తెలిపారు. మరోవైపు- మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లాలో వందలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సర్దార్ సరోవర్ డ్యామ్ గేట్లను దశల వారీగా మూసేయటానికి కేంద్రం అనుమతించింది. ఈ డ్యామ్ అంశం గురువారం లోక్‌సభలోనూ ప్రస్తావనకు వచ్చింది.

అజహర్‌పై చైనా అదే వైఖరి

అంతర్జాతీయ ఉగ్రవాది ముద్రకు మరోసారి అడ్డంకి

ఐక్యరాజ్య సమితి: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైష్-ఏ-మహమ్మద్ అధినేత మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించాలన్న ఐరాస తీర్మానాన్ని చైనా మరోసారి తొక్కిపెట్టింది. అమెరికా, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్ మద్దతు తెలిపిన ఈ తీర్మానానికి ఆమోదం తెలపకుండా సాంకేతిక నిలుపుదలను మరో మూడు నెలల పాటు పొడిగించింది. పఠాన్‌కోట్ ఉగ్రవాదుల దాడులకు సూత్రధారి అయిన అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించాలని ఐరాసలో గత ఫిబ్రవరిలో అమెరికా తీర్మానాన్ని ప్రతిపాదించగా, ఒక్క చైనా మినహా మిగిలిన 14 సభ్యదేశాలు అంగీకరించాయి. ఆమోదించకుండా సాంకేతికంగా నిలుపుదల చేస్తున్నట్టు చైనా ప్రకటించింది. ఆ గడువు బుధవారంతో ముగిసింది. దాంతో మరో మూడు నెలలపాటు సాంకేతిక నిలుపుదలను పొడిగించనున్నట్టు చైనా ప్రకటించింది. అంటే నవంబరు రెండో తేదీ వరకు అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాది అని ప్రకటించడానికి వీల్లేదు.

పాక్ ప్రధానిగా అబ్బాసీనే కొనసాగుతారా!

లాహోర్: పాకిస్థాన్ ప్రధానిగా షాహీద్ ఖాకన్ అబ్బాసీనే కొనసాగే అవకాశం కన్పిస్తోంది. అక్రమాస్తుల కేసు వ్యవహారంలో నవాజ్ షరీఫ్ ప్రధాని పదవి నుంచి వైదొలగగా, ఆపద్ధర్మ ప్రధానిగా అబ్బాసీ నియామకమైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ రెండో వారం అంటే సుమారు 45 రోజుల తర్వాత మధ్యంతర ఎన్నికలకు వెళ్లి షరీఫ్ సోదరుడు షాబాజ్‌ను ప్రధానిగా చేయాలని ముందే అనుకున్నప్పటికీ అలా జరిగేలా లేదు. షాబాజ్‌ను ప్రధానిగా ఎన్నుకుంటే అతని స్థానంలో పంజాబ్ రాష్ట్రానికి సీఎంగా ఎవరిని నియమించాలన్న సందిగ్ధత నెలకొంది. ముర్రీలో నవాజ్ షరీఫ్ గురువారం సమీక్ష నిర్వహించారు. పంజాబ్ న్యాయ శాఖ మంత్రి సహా పార్టీ శాసనసభ్యులు షాబాజ్‌ను ప్రధాని చేసి పార్టీకి కీలక రాష్ట్రమైన పంజాబ్‌ను అనుభవం లేని నాయకుల చేతిలో పెట్టడం సరికాదనే అంశాన్ని షరీఫ్ దృష్టికి తీసికెళ్లినట్లు సమాచారం. దేశ సాధారణ ఎన్నికలకు ఇంకా 10 నెలలే గడువు ఉంది. అయితే షాబాజ్ మాత్రం తాను ప్రధాని పదవి చేపట్టి పంజాబ్ సీఎం పీఠాన్ని తన కుమారుడు హంజకు కట్టబెట్టాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్‌ను హంజ చేతిలో పెట్టడం నవాజ్ షరీఫ్ కుమార్తె మరియన్‌కు, ఇతర కార్యకర్తలకు ఏమాత్రం ఇష్టం లేదు. ప్రధానిగా నియమించాలా లేదా అనే అంశంపై మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని షాబాజ్ ప్రభుత్వ ప్రతినిధి మాలిక్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

లొంగను.. నా మార్గంలోనే వెళ్తా

- సైన్యాధికారికి స్పష్టం చేసిన ఉగ్రవాది దుజానా
- ఎన్‌కౌంటర్‌కు ముందు ఫోన్లో సంభాషించిన సైన్యం

శ్రీనగర్: కరుడుగట్టిన లష్కరే తొయిబా ఉగ్రవాది అబు దుజానాను ఎన్‌కౌంటర్ చేయడానికి ముందు.. అతడి లొంగుబాటు కోసం భద్రతా దళాలు తీవ్రంగా ప్రయత్నించాయి. అయితే దీనికి అతడు ససేమిరా అన్నాడు. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరగడానికి కొద్దిసేపటి ముందు.. భద్రతా దళాలకు చెందిన ఒక అధికారికి, దుజానాకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ తాజాగా వెలుగులోకి వచ్చింది. తొలుత దుజానాతో ఫోన్లో ఒక స్థానికుడు మాట్లాడాడు. అనంతరం ఫోన్‌ను సైనికాధికారికి ఇచ్చాడు. వారి మధ్య జరిగిన సంభాషణ సారాంశమిదీ..

దుజానా: ఎలా ఉన్నారు?

అధికారి: నా యోగక్షేమాల సంగతి పక్కనబెట్టు. నువ్వు లొంగిపో.

దుజానా: నేనెందుకు లొంగిపోవాలి? వీరమరణం కోసమే ఇల్లు విడిచి వచ్చా. నేడు కాకపోయినా.. రేపైనా నేను మరణించాల్సిందే.

అధికారి: ఆ అమ్మాయిని పెళ్లి చేసుకున్నావు. నువ్వు చేస్తున్న పనులు సరి కాదు. నీ తల్లిదండ్రుల గురించి కూడా ఆలోచించు.

దుజానా: నేను పెళ్లిచేసుకోలేదు. అదంతా నా మీద సాగిన దుష్ప్రచారమే. నేను ఇల్లు వదిలిన రోజే.. నా దృష్టిలో నా తల్లిదండ్రులు మరణించారు.



ఎన్‌కౌంటర్‌లో హతమైన సుహాయిల్ అహ్మద్ అనే ఉగ్రవాది అంత్యక్రియల్లో గన్ సెల్యూట్ చేస్తున్న తీవ్రవాది

అధికారి: కశ్మీర్‌లో పోరాటమంతా 'ఒక ఆట'.

దుజానా: వ్యవస్థ గురించి నాకు తెలుసు. నాకు అన్నీ తెలుసు. ఆట ఆడుకోవాలని ఎవరైనా అనుకుంటే నేనేం చేయగలను? నా మార్గంలోనే నేను పయనిస్తా.

అధికారి: నిన్ను పట్టుకోవడానికి చాలాదూరం ప్రయాణించా.

దుజానా: (నవ్వాడు) మీతో మాట్లాడి ఎన్నో ఏళ్లయింది. మనం చాలాకాలంగా దొంగ-పోలీసు ఆట ఆడుకున్నాం. కొన్నిసార్లు మేం ముందున్నాం. మరికొన్నిసార్లు మీరున్నారు. ఈ రోజు నన్ను పట్టుకున్నారు. అభినందనలు.

అధికారి: నా విధిని నేను నిర్వర్తిస్తున్నా.

దుజానా: నేనూ నా విధిని నిర్వర్తిస్తా.

అధికారి: ఇతరులను చంపాలని ఎవరూ అనుకోరు.

దుజానా: అది సరే. కానీ నా ఆచూకీని మీకు అందించినవారు నేను చావాలని కోరుకుంటున్నారు. అయినా వినండి. నేను లొంగిపోలేను. నా మీద మీకు శత్రుత్వం లేదని, మీ విధిని మాత్రమే మీరు నిర్వర్తిస్తున్నారని నాకు తెలుసు. అలాగే నా బాధ్యతను నేను నిర్వర్తిస్తున్నా. మీ విధిని మీరు నిర్వర్తించండి. నా తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుంది.

అధికారి: మీరు చేసేది జిహాద్ కాదు.

దుజానా: మిత్రమా.. మనమేం చేస్తాం?

అధికారి: నువ్వు ఇంట్లో నుంచి బయటకు వచ్చి. లొంగిపోయి, ప్రజలకు దాని గురించి వివరించు. దీనివల్ల రక్తపాతం ఆగిపోతుంది.

దుజానా: నేనెప్పుడూ రక్తపాత చర్యల్లో పాలుపంచుకోలేదు. ప్రజలకు ఆ విషయం తెలుసు.

అధికారి: కశ్మీర్ ప్రజలు నీ మాటలు వింటారు.

దుజానా: (ఫోన్ కట్ చేశాడు)

నియంతృత్వమే పాక్‌ను గాడిలో పెట్టగలదు

- మాజీ అధ్యక్షుడు ముషారఫ్ వ్యాఖ్యలు

ఇస్లామాబాద్, దిల్లీ: నియంతృత్వం, సైనిక పాలన ప్రతిసారీ పాకిస్థాన్‌ను సరైన మార్గంలోనే నడిపించిందని మాజీ అధ్యక్షుడు, సైనిక నియంత పర్వేజ్ ముషారఫ్ వ్యాఖ్యానించారు. పౌర ప్రభుత్వాలు మాత్రం దేశాన్ని అధోగతిపాలు చేశాయని చెప్పారు. ప్రముఖ వార్తా సంస్థ ముఖాముఖిలో బుధవారం ఆయన మాట్లాడారు. 'పౌర ప్రభుత్వాలు తప్పుదారి పట్టించినప్పుడు సైనిక పాలనే దేశాన్ని గాడిలో పెట్టింది. నియంతలు సరైన మార్గంలో నడిపించగలరు. పౌర ప్రభుత్వాలతో ఇది సాధ్యపడదు. సైనిక పాలన విధించిన ప్రతిసారీ దేశం అభివృద్ధి బాట పట్టింది'అని ఆయన వివరించారు. 'నియంతృత్వం, లేదా కమ్యూనిజం, లేదా సోషలిజం లేదా రాచరికం ఏ ప్రభుత్వమైనా అవ్వనివ్వండి.. అభివృద్ధి పథంలో ఉన్నంతవరకూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు'అని ముషారఫ్ పేర్కొన్నారు. 1999లో తాను లేవనెత్తిన తిరుగుబాటును ఆయన సమర్థించుకున్నారు. 'రాజ్యాంగానికి రక్షణ కల్పించే క్రమంలో దేశం అధోగతి పాలవుతుంటే మేం చూస్తూ ఊరుకోం. ప్రజలను రక్షించేందుకు మేం రాజ్యాంగాన్ని కూడా పక్కనపెట్టేసేలా చేయగలం'అని కూడా వ్యాఖ్యానించారు. కోర్టు ఉత్తర్వులతో ప్రధాన మంత్రి పదవి కోల్పోయిన నవాజ్ షరీఫ్.. భారత్‌తో అనుసరించిన విధానాలు సరైనవికాదనీ ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ వ్యాఖ్యలపై ముషారఫ్ వివరణ ఇవ్వలేదు. 1999లో ఆయన నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూలదోశారు. 2007లో రాజ్యాంగాన్ని అతిక్రమించడం, దేశంలో అత్యయిక స్థితి విధించడం తదితర చర్యలకుగాను ఆయన దేశద్రోహం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో హత్యవెనకా ఆయన హస్తముందని ఆరోపణలున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం పాక్ సైన్యం తిరుగుబాటుతో మూడుసార్లు దేశాన్ని పాలించింది. ఆ సమయంలో ప్రభుత్వ అధిపతిగా సైన్యం ఓ నియంతకు బాధ్యతలు కట్టబెట్టింది.

రైల్వే ప్రమాద పరిహార జాప్యాలపై.. స్థాయీ సంఘం అసంతృప్తి


దిల్లీ: రైల్వే ప్రమాద పరిహార చెల్లింపుల్లో జాప్యంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం అసంతృప్తి వ్యక్తంచేసింది. పెండింగ్ పడిన కేసులన్నీ ఆరు నెలల్లోగా పరిష్కరించాలని మంత్రిత్వ శాఖకు సూచించింది. ఈ అంశంపై సిద్ధం చేసిన నివేదికను సంఘం గురువారం పార్లమెంటులో సమర్పించింది. మార్చి 2015 నాటికి 230 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు దీనిలో పేర్కొంది. వీటిలో 46 కేసులు ఏడాది నాటివని, 63 కేసులు ఒకటి నుంచి మూడేళ్ల మధ్యవని, 89 కేసులు మూడు నుంచి ఐదేళ్ల మధ్యవని, 32 కేసులు ఐదేళ్లకంటే మునుపటివని సంఘం పేర్కొంది. 'ఇది చాలా ఆందోళనకర పరిణామం. మృతుల ఆప్తులకు వీలైనంత త్వరగా పరిహారం చెల్లించాలి'అని కమిటీ సూచించింది. అయితే పరిహార చెల్లింపు కేసుల పరిష్కారాలు గతంతో పోలిస్తే చాలా మెరుగుపడ్డాయని రైల్వే చెబుతోంది. నవంబరు 2016 నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 74కు తగ్గిందని వివరిస్తోంది.

ఉద్యోగ అవకాశాలు

ఫ్రాన్స్‌లో అలనాటి విలాసవంతమైన నగరం

- పురాతత్వశాస్త్ర వేత్తల తవ్వకాల్లో బయల్పడిన వైనం

లండన్: దాదాపు 300 సంవత్సరాలపాటు నాగరికత పరిఢవిల్లిన విలాసవంతమైన నగరాన్ని ఫ్రాన్స్‌లో పురాతత్వశాస్త్రవేత్తలు కనుగొన్నారు. వియెన్నే నగరానికి పొలిమేరల్లో భారీఎత్తున బూడిద కింద ఇది బయటపడింది. 75 వేల చదరపు అడుగుల్లో భారీ భవంతులు, మెరుగైన నీటి పారుదల వ్యవస్థ, మార్బుల్ టైలింగ్స్, అందమైన ఉద్యానవనాలకు నిలయమై ఉండేదని లియోన్ విశ్వవిద్యాలయానికి చెందిన బెంజమిన్ క్లైమెంట్ అనే పురాతత్వశాస్త్రవేత్త తెలిపారు. మొదటి శతాబ్దంలో ఇక్కడ విల్లాలు ఉండేవన్నారు. అప్పటి వ్యాపారులు ఎక్కువగా నివసించే ఈ నగరాన్ని 'చిన్న పోంపే'గా అభివర్ణించారు. పోంపే అనే నగరం ఒకప్పుడు రోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఇటలీలో ఉండేది. ధనవంతులకు ఆలవాలం. వెసువియస్ అనే అగ్నిపర్వతం క్రీ.శ.79లో బద్దలవ్వడంతో బూడిద కింద పోంపే నగరం సర్వనాశనమైంది. తరచూ అగ్నిప్రమాదాల కారణంగా ఫ్రాన్స్‌లోని తాజా నగరం కూడా మొదటి శతాబ్దంలో కనుమరుగవడం గమనార్హం.



తవ్వకాల్లో బయల్పడిన మార్బుల్ టైలింగ్‌పై అందమైన డిజైన్



ఫారం – సి
(10A మినహాయింపు యివ్వబడిన సెక్షన్ 11 క్రింద)
(రూల్ 6/12ని చూడండి)

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (ఎల్ఎ) డిపార్ట్‌మెంట్

నెం. Rev-G10LAG/80/2017 తేది: 03-8-2017
గెజిట్ నెం. 55 తేది: 3-8-2017

మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ డివిజన్, నవాబుపేట్ మండలం యొక్క తీగలపల్లి గ్రామంలోని మొత్తం 145-12 ఎకరాల విస్తీర్ణంగల భూమి ప్రజోపయోగార్థం, అనగా తీగలపల్లి గ్రామం వద్ద పాలమూర్-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద ఉద్ధండపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ యొక్క ముంపు ఏరియా నిర్మాణం నిమిత్తం అవసరమైయుందని తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్ భావిస్తున్నారు.

అందువలన, ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా పైన తెలిపిన ప్రాజెక్ట్ కొరకు మహబూబ్‌నగర్ జిల్లా, నవాబుపేట్ మండలం, తీగలపల్లి గ్రామంలో ప్రామాణిక కొలతల మేరకు సుమారు 145-12 ఎకరాలు, అనగా 58.727 హెక్టార్ల విస్తీర్ణంగల భూమిని సేకరించవలెనని ప్రతిపాదించడమైనది. సదరు భూమి వివరాలు దిగువ యివ్వబడినవి:

ఉద్ధండపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

గ్రామం: తీగలపల్లి మండలం: నవాబుపేట్ జిల్లా: మహబూబ్‌నగర్

క్రమ సంఖ్య	సర్వే నెం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ కొరకు ప్రతిపాదిత విస్తీర్ణం (ఎకరాలలో) ఎక. గుం.	ప్రయోజనం గల వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉ.	ద.	తూ.	ప.	చెట్లు సంఖ్య రకం	నిర్మాణాలు ప్లింత్ ఏరియా రకము
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	23/A	పట్టా	మెట్ట	0.07	ఎన్.వేణుగోపాల్‌రెడ్డి S/o వెంకట్‌రెడ్డి (ఎంఎం వెంచర్స్ Pri.li.)	25	84	24	22		
2	24	పట్టా	మెట్ట	1.05	ఎన్.వేణుగోపాల్‌రెడ్డి S/o వెంకట్‌రెడ్డి (ఎంఎం వెంచర్స్ Pri.li.)	25	51	రోడ్డు	23		
3	28/అ2	పట్టా	మెట్ట	1.28	సుంకరి క్రిష్ణయ్య S/o బాలయ్య	27	49	30	25		
4	28/అ2	పట్టా	మెట్ట	1.00	టి.శశిధర్‌రెడ్డి S/o క్రిష్టారెడ్డి	27	49	30	25		
5	28అ2	పట్టా	మెట్ట	1.21	టి.శశిధర్‌రెడ్డి S/o క్రిష్టారెడ్డి	27	49	30	25	నీలగిరి-1	
6	28అ4	పట్టా	మెట్ట	3.00	టి.శశిధర్‌రెడ్డి S/o క్రిష్టారెడ్డి	27	49	30	25		
7	32/1	పట్టా	మెట్ట	2.33	బ్యాగరి లక్ష్మమ్మ W/o పోశయ్య	33	44	34	29		
8	32/2	పట్టా	మెట్ట	2.32	బ్యాగరి ఎల్లయ్య S/o హన్మయ్య	33	44	34	29		
9	32	పట్టా	మెట్ట	0.34	బ్యాగరి లక్ష్మమ్మ W/o పోశయ్య	33	44	34	29		
10	32	పట్టా	మెట్ట	1.17	బ్యాగరి ఎల్లయ్య S/o హన్మయ్య	33	44	34	29	1-నేరేడు, 1-మామిడి, 1-మేడి, 10-టేకు	
11	33/A	పట్టా	మెట్ట	1.05	Mis శ్రీశైలం S/o రాములు	గ్రామ సరిహద్దు	32	34	30		
12	33/c	పట్టా	మెట్ట	1.06	మిస పెద్ద జంగయ్య S/o కిష్టయ్య		32	34	30		
13	33అ	పట్టా	మెట్ట	1.05	మిస మల్లయ్య S/o కిష్టయ్య		32	34	30		
14	33అ1	పట్టా	మెట్ట	1.06	మిస బీచుపల్లి S/o కిష్టయ్య		32	34	30		
15	33అ3	పట్టా	మెట్ట	1.06	మిస చిన్న జంగయ్య S/o కిష్టయ్య		32	34	30		
16	33అ4	పట్టా	మెట్ట	1.06	మిస హన్మంతు S/o కిష్టయ్య		32	34	30		
17	34/అ1/1/1/1	పట్టా	మెట్ట	0.275	పి.శారద W/o బాలు	37	36	35	32		
18	34/అ1/1/2	పట్టా	మెట్ట	0.08	పి.తిమ్మమ్మ W/o అనంతయ్య	37	36	35	32		
19	34/అ1/1/2	పట్టా	మెట్ట	0.355	పెద్దమోని కర్రెయ్య S/o జంగయ్య	37	36	35	32		
20	34అ	పట్టా	మెట్ట	0.35	గొడ్డ నాగయ్య S/o చెంద్రయ్య	37	36	35	32		
21	34అ/1/2/1	పట్టా	మెట్ట	0.18	పి.తిమ్మమ్మ W/o అనంతయ్య	37	36	35	32		
22	34అ/1/2/2	పట్టా	మెట్ట	0.26	పి.రాములు S/o అనంతయ్య	37	36	35	32		
23	34అ/1/2/3	పట్టా	మెట్ట	0.27	పి.చెన్నమ్మ W/o క్రిష్ణయ్య	37	36	35	32		
24	34అ/1/3	పట్టా	మెట్ట	1.31	పెద్దమోని కర్రెయ్య S/o జంగయ్య	37	36	35	32		
25	34అ1	పట్టా	మెట్ట	1.00	బజ్జ రాములు S/o నాగయ్య	37	36	35	32		
26	34అ5	పట్టా	మెట్ట	0.35	గోద లక్ష్మయ్య S/o చెంద్రయ్య	37	36	35	32		
27	34ఆ/2	పట్టా	మెట్ట	0.20	గోద లక్ష్మయ్య S/o చెంద్రయ్య	37	36	35	32		
28	34ఆ/3	పట్టా	మెట్ట	0.20	గోద నాగయ్య S/o చెంద్రయ్య	37	36	35	32		
29	35/A	పట్టా	మెట్ట	0.19	మీస శ్రీశైలం S/o రాములు	38/18	36	గ్రామ సరిహద్దు	34		
30	35/c	పట్టా	మెట్ట	0.18	మీస పెద్దజంగయ్య S/o కిష్టయ్య	38/18	36		34		
31	35/అ2/1	పట్టా	మెట్ట	0.13	మీస నర్సిములు S/o మల్లయ్య	38/18	36		34		
32	35/ఆ2/2	పట్టా	మెట్ట	0.13	మీస పెద్ద జంగయ్య S/o కిష్టయ్య	38/18	36		34		
33	35/ఆ2/3	పట్టా	మెట్ట	0.13	మీస బీచుపల్లి S/o కిష్టయ్య	38/18	36	గ్రామ సరిహద్దు	34		
34	35/ఆ2/4	పట్టా	మెట్ట	2.00	పెదగల్ల శంకరమ్మ W/o చిన్న నాగయ్య	38/18	36		34		
35	35అ2/1	పట్టా	మెట్ట	0.18	మీస చిన్న జంగయ్య S/o కిష్టయ్య	38/18	36		34		
36	35అ2/2	పట్టా	మెట్ట	0.18	మీస బీచుపల్లి S/o కిష్టయ్య	38/18	36		34		
37	35అ2/4	పట్టా	మెట్ట	0.18	మీస హన్మంతు S/o కిష్టయ్య	38/18	36	గ్రామ సరిహద్దు	34		
38	35అ2/5	పట్టా	మెట్ట	0.19	మీస మల్లయ్య S/o కిష్టయ్య	38/18	36		34		
39	36/A	పట్టా	మెట్ట	1.00	మీస పెద్ద జంగయ్య S/o కిష్టయ్య	34	37		32		
40	36B	పట్టా	మెట్ట	3.10	గోద ఆంజనేయులు S/o గోద హన్మయ్య	34	37	గ్రామ సరిహద్దు	32	2-మామిడి, 1-చింత, 2-టేకు, 5-వేప	
41	36C	పట్టా	మెట్ట	1.00	గోద నాగయ్య S/o చెద్రయ్య	34	37	గ్రామ సరిహద్దు	32	2-ఇప్ప, 1-మామిడి, 2-వేప	
42	36C1	పట్టా	మెట్ట	1.00	గోద లక్ష్మయ్య S/o చెంద్రయ్య	34	37		32		
43	37	పట్టా	మెట్ట	2.17	క్రిష్ణమాచారి S/o రామాచారి	36	38		43	Kavela Animal	
44	38	పట్టా	మెట్ట	13.08	రాఘవచారి, కిష్టమాచారి, వేణుగోపాలాచారి, రామాచారి	37	40	గ్రామ సరిహద్దు	42		
45	39	పట్టా	మాగాణి	0.07	గొల్ల ఆంజనేయులు S/o బీరయ్య	38	62		40		
46	39/1	పట్టా	మాగాణి	0.06	గొల్ల రాములు S/o బీరయ్య	38	62		40		
47	39/a/3	పట్టా	మాగాణి	0.07	గొల్ల వెంకటయ్య S/o బీరయ్య	38	62	గ్రామ సరిహద్దు	40		
48	39/A/4	పట్టా	మాగాణి	0.08	గొల్ల పెద్ద నాగయ్య S/o బీరయ్య	38	62		40		
49	39/అ	పట్టా	మాగాణి	0.06	గొల్ల చిన్న నాగయ్య S/o బీరయ్య	38	62		40		
50	39/అ/2	పట్టా	మాగాణి	0.13	గొల్ల శేఖరయ్య S/o పెంటయ్య	38	62		40		
51	39/లు	పట్టా	మాగాణి	0.14	గొల్ల భీమయ్య S/o పెంటయ్య	38	62		40		
52	39a	పట్టా	మాగాణి	0.08	గొల్ల హన్మంతు S/o బీరయ్య	38	62		40		
53	39ఆ	పట్టా	మాగాణి	0.14	గొల్ల వెంకటయ్య S/o పెంటయ్య	38	62		40		
54	40	పట్టా	మాగాణి	0.06	గొల్ల ఆంజనేయులు S/o బీరయ్య	38	62	39	41		
55	40/1	పట్టా	మాగాణి	0.06	గొల్ల రాములు S/o బీరయ్య	38	62	39	41		
56	40/a/2	పట్టా	మాగాణి	0.12	గొల్ల శంకరయ్య S/o పెంటయ్య	38	62	39	41		
57	40/A/3	పట్టా	మాగాణి	0.06	గొల్ల వెంకటయ్య S/o బీరయ్య	38	62	39	41		
58	40/A/6	పట్టా	మాగాణి	0.06	గొల్ల పెద్ద నాగయ్య S/o బీరయ్య	38	62	39	41		
59	40/అ	పట్టా	మాగాణి	0.06	గొల్ల చిన్న నాగయ్య S/o బీరయ్య	38	62	39	41		
60	40/లు	పట్టా	మాగాణి	0.12	గొల్ల భీమయ్య S/o పెంటయ్య	38	62	39	41		
61	40b	పట్టా	మాగాణి	0.06	గొల్ల హన్మంతు S/o బీరయ్య	38	62	39	41		
62	40ఆ	పట్టా	మాగాణి	0.12	గొల్ల వెంకటయ్య S/o పెంటయ్య	38	62	39	41		
63	41	పట్టా	మెట్ట	0.38	రాఘవచారి, కిష్టమ్మచారి, వేణుగోపాలచారి, రామాచారి	38	61	40	42		
64	42	పోరంపోగు	మెట్ట	4.33	ప్రభుత్వ భూమి/ కుంట శిఖం	45	61	38	46		
65	43	పట్టా	మెట్ట	0.32	రాఘవచారి, కిష్టమచారి, వేణుగోపాలచారి, రామాచారి రామాచారి	36	42	42	44		
66	44A	పట్టా	మెట్ట	2.00	కుమారి శంకరమ్మ W/o పెంటయ్య	32	45	43	49		
67	44A1	పట్టా	మెట్ట	2.00	పెద్దమోని వెంకన్న S/o పెంటయ్య	32	45	43	49	2-మామిడి 12-నీలగిరి 17-వేప, 5-టేకు	
68	44B	పట్టా	మెట్ట	1.39	పెద్దవోని వెంకన్న S/o పెంటయ్య	32	45	43	49		
69	45	పట్టా	మెట్ట	4.08	నేతి గొపుల నారాయణ S/o ఆశన్న	44	42	42	48		
70	46A	పట్టా	మెట్ట	0.17	పెద్దమోని యాదయ్య S/o చంద్రయ్య	45	48	42	47	2-కొబ్బరి 2-మామిడి, 1- టేకు	
71	46A1	పట్టా	మెట్ట	0.17	పెద్దమోని గోపాల్ S/o చంద్రయ్య	45	48	42	47		
72	46A3	పట్టా	మెట్ట	0.18	పెద్దమోని ఆంజనేయులు S/o చంద్రయ్య	45	48	42	47	1- కొబ్బరి, 1-మామిడి, 1-టేకు	
73	46A4	పట్టా	మెట్ట	0.17	పెద్దమోని నర్సింహులు S/o చంద్రయ్య	45	48	42	47		
74	46B1	పట్టా	మెట్ట	0.18	పెద్దమోని రాములు S/o వెంకన్న	45	48	42	47	2- తుమ్మ	
75	46B2	పట్టా	మెట్ట	0.18	పెద్దమోని అనంతయ్య S/o వెంకన్న	45	48	42	47	2-తుమ్మ	
76	46B3	పట్టా	మెట్ట	0.17	పెద్దమోని లక్ష్మయ్య S/o వెంకన్న	45	48	42	47		
77	46B4	పట్టా	మెట్ట	0.17	పెద్దమోని క్రిష్ణయ్య S/o వెంకన్న	45	48	42	47		
78	47	పట్టా	మెట్ట	3.28	పెద్దమోని అనంతయ్య S/o ఆశన్న	48	54	46	52		
79	49	పట్టా	మెట్ట	1.22	యాలాల యాదమ్మ W/o నర్సింహులు	28	50	48	28		
80	49అ	పట్టా	మెట్ట	1.21	యాలాల చంద్రయ్య S/o భీమయ్య	28	50	48	28		
81	50A	లావుని పట్టా	మెట్ట	1.00	నలంగి రామయ్య S/o పెద్ద ఎల్లయ్య	49	52	47	24	4-చింత, 1-టేకు	
82	50B	లావుని పట్టా	మెట్ట	1.17	పెద్దమోని కలమ్మ W/o పెంటయ్య	49	52	47	24		
83	52	పట్టా	మెట్ట	3.07	నలంగి రామయ్య S/o పెద్ద ఎల్లయ్య	50	53	47	51	16-టేకు, 2-జామ, 5-మామిడి, 6-వేప, 1-ఉసిరి	
84	54	పట్టా	మెట్ట	0.03	పెద్దమోని యాదయ్య S/o చంద్రయ్య	53	58	55	58	2-వేప	
85	54/1	పట్టా	మెట్ట	0.03	పెద్దమోని నర్సింహులు S/o చంద్రయ్య	53	58	55	58	1-మర్రి, 1-టేకు	
86	54/2	పట్టా	మెట్ట	0.04	పెద్దమోని గోపాల్ S/o చంద్రయ్య	53	58	55	58	2- వేప	
87	54/3	పట్టా	మెట్ట	0.04	పెద్దమోని ఆంజనేయులు S/o చంద్రయ్య	53	58	55	58	2- వేప	
88	54/4	పట్టా	మెట్ట	0.03	పెద్దమోని రాములు S/o వెంకన్న	53	58	55	58	1- చింత	
89	54/5	పట్టా	మెట్ట	0.03	పెద్దమోని అనంతయ్య S/o వెంకన్న	53	58	55	58	3- వేప	
90	54/6	పట్టా	మెట్ట	0.04	పెద్దమోని లక్ష్మయ్య S/o వెంకన్న	53	58	55	58	2- రేగు, 10 టేకు	
91	54/7	పట్టా	మెట్ట	0.04	పెద్దమోని క్రిష్ణయ్య S/o వెంకన్న	53	58	55	58	3-టేకు, 1-వేప	
92	54/8	పట్టా	మెట్ట	0.10	పెంటమ్మ W/o రాములు	53	58	55	58		
93	56	పట్టా	మెట్ట	0.03	పెద్దమోని యాదయ్య S/o చంద్రయ్య	54	79	57	55		
94	56అ	పట్టా	మెట్ట	0.18	పెద్దమోని గోపాల్ S/o చంద్రయ్య	54	79	57	55		
95	58అ	పట్టా	మెట్ట	1.02	పెద్దమోని శేఖర్ S/o నారాయణ	46	59	61	54		
96	58ఆ	పట్టా	మెట్ట	1.02	పెద్దమోని సత్యమ్మ W/o సాయన్న	46	59	61	54	2-తుమ్మ, 6- వేప	
97	58అ	పట్టా	మెట్ట	1.02	పెద్దమోని రాజశేఖర్ S/o సాయిలు	46	59	61	54		
98	58అ	పట్టా	మెట్ట	0.18	పెద్దమోని రాజశేఖర్ S/o సాయిలు	46	59	61	54		
99	58అ	పట్టా	మెట్ట	0.23	పెద్దమోని శేఖర్ S/o నారాయణ	46	59	61	54		
100	58ఉ	పట్టా	మెట్ట	4.07	పెద్దమోని రాములమ్మ W/o చిన్న బీమయ్య	46	59	61	54	2-చింత, 2-వేప	
101	59/1	పట్టా	మెట్ట	0.19	పెద్దమోని యాదయ్య S/o చంద్రయ్య	58	76	60	57	1- చింత, 1-మామిడి, 2- టేకు	
102	59/2	పట్టా	మెట్ట	0.20	పెద్దమోని నర్సింహులు S/o చంద్రయ్య	58	76	60	57		
103	59/3	పట్టా	మెట్ట	0.19	పెద్దమోని గోపాల్ S/o చంద్రయ్య	58	76	60	57	1-చింత, 2-మామిడి	
104	59/4	పట్టా	మెట్ట	0.20	పెద్దమోని ఆంజనేయులు S/o చంద్రయ్య	58	76	60	57		
105	59/6	పట్టా	మెట్ట	0.07	పెద్దమోని రాములు S/o వెంకన్న	58	76	60	57		
106	59/6	పట్టా	మెట్ట	0.08	పెద్దమోని అనంతయ్య S/o వెంకన్న	58	76	60	57	1-చింత	
107	59/6	పట్టా	మెట్ట	0.07	పెద్దమోని లక్ష్మయ్య S/o వెంకన్న	58	76	60	57	1-చింత	
108	59/6	పట్టా	మెట్ట	0.08	పెద్దమోని క్రిష్ణయ్య S/o వెంకన్న	58	76	60	57		
109	59/6/1	పట్టా	మెట్ట	0.12	పెద్దమోని రాములు S/o వెంకన్న	58	76	60	57		
110	59/6/2	పట్టా	మెట్ట	0.12	పెద్దమోని అనంతయ్య S/o వెంకన్న	58	76	60	57	1-మామిడి	
111	59/6/3	పట్టా	మెట్ట	0.12	పెద్దమోని లక్ష్మయ్య S/o వెంకన్న	58	76	60	57		
112	59/6/4	పట్టా	మెట్ట	0.12	పెద్దమోని క్రిష్ణయ్య S/o వెంకన్న	58	76	60	57		
113	60	పట్టా	మెట్ట	7.03	రాఘవచారి, కిష్టమాచారి, వేణుగోపాలచారి, రామాచారి	61	76	63	59		
114	61	పట్టా	మెట్ట	8.03	రాఘవచారి, కిష్టమాచారి, వేణుగోపాలచారి, రామాచారి	61	76	63	59	1- చింత, 5- వేప,	
115	62/అ	పట్టా	మెట్ట	0.33	గొల్ల పెద్దనాగయ్య S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61	1-మామిడి	
116	62/అ/9	పట్టా	మెట్ట	0.34	గొల్ల రాములు S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
117	62అ1	పట్టా	మెట్ట	0.34	గొల్ల ఆంజనేయులు S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61	1-మామిడి	
118	62అ2	పట్టా	మెట్ట	0.34	గొల్ల వెంకటయ్య S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
119	62అ4	పట్టా	మెట్ట	0.34	గొల్ల హన్మంతు S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61	1-మామిడి	
120	62అ5	పట్టా	మెట్ట	0.34	గొల్ల చిన్న నాగయ్య S/o భీరయ్య	40	63	గ్రామ సరిహద్దు	61	1-మామిడి	
121	62అ6	పట్టా	మెట్ట	1.28	గొల్ల శంకరయ్య S/o పెంటయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
122	62అ7/1	పట్టా	మెట్ట	0.15	గొల్ల అనసూయ W/o గొల్ల శ్రీనయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
123	62అ7/2	పట్టా	మెట్ట	0.01	గొల్ల వెంకయ్య S/o పెంటయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
124	62అ7/3	పట్టా	మెట్ట	1.11	గొల్ల భీమయ్య S/o పెంటయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
125	62అ8/1	పట్టా	మెట్ట	1.26	గొల్ల యాదమ్మ W/o గొల్ల వెంకటయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
126	62అ8/2	పట్టా	మెట్ట	0.02	గొల్ల భీమయ్య S/o పెంటయ్య	40	63	గ్రామ సరిహద్దు	61		
127	63అ	పట్టా	మెట్ట	0.33	గొల్ల పెద్ద నాగయ్య S/o భీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
128	63అ1	పట్టా	మెట్ట	0.33	గొల్ల వెంకటయ్య S/o బీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
129	63అ2	పట్టా	మెట్ట	0.33	గొల్ల ఆంజనేయులు S/o బీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
130	63అ3	పట్టా	మెట్ట	0.33	గొల్ల చిన్న నాగయ్య S/o బీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
131	63అ5	పట్టా	మెట్ట	0.33	గొల్ల రాములు S/o బీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
132	63అ6	పట్టా	మెట్ట	1.26	గొల్ల శంకరయ్య S/o పెంటయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
133	63అ7	పట్టా	మెట్ట	0.32	గొల్ల హన్మంతు S/o బీరయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
134	63అ8/1	పట్టా	మెట్ట	0.07	గొల్ల యాదమ్మ W/o గొల్ల వెంకటయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
135	63అ8/2	పట్టా	మెట్ట	1.19	గొల్ల వెంకటయ్య S/o పెంటయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
136	63అ9/1	పట్టా	మెట్ట	1.18	గొల్ల అనసూయ W/o గొల్ల శ్రీనయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
137	63అ9/2	పట్టా	మెట్ట	0.07	గొల్ల భీమయ్య S/o పెంటయ్య	62	64	గ్రామ సరిహద్దు	60		
			మొత్తం:	145.12							

ది రైట్ టు కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (తెలంగాణ అమెండ్‌మెంట్) యాక్ట్, 2016 (చట్టం నెం. 21/2017)చే సవరించబడిన ది రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) యొక్క సెక్షన్-11(1) యొక్క నిబంధనల క్రింద సంబంధితులందరికీ ఈ ప్రకటనను చేయడమైనది.

సదరు భూమి యొక్క ప్లానును జిల్లా కలెక్టర్ మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, LA & R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్/ EE PRLIS, Div-V, జడ్చెర్లవారి కార్యాలయం నందు ఏదేనీ పని దినమున పని వేళల్లో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టం యొక్క సెక్షన్-12లో నిర్దేశించబడిన మరియు పొందుపర్చబడిన విధంగా వారి పని యొక్క సక్రమ నిర్వహణ కొరకు అవసరమైన విధంగా సదరు భూమిలో ప్రవేశించటానికి మరియు భూమిని సర్వే చేయటానికి, ఏదేనీ భూమి యొక్క లెవెల్స్‌ను తీసుకోవటానికి, భూమి లోపలి పొరల్లోకి త్రవ్వటానికి లేదా బోర్ వేయటానికి మరియు అవసరమైన అన్ని యితర పనులను చేయటానికి అధికారికి, అనగా EE, PRLISవారికి మరియు ఆయన సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్-కం-తగిన ప్రభుత్వ అధికారి అధికారమిచ్చారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద, కలెక్టర్‌గారి నుండి ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి సదరు భూమికి సంబంధించి ఏవేనీ వ్యవహారాలు, అనగా అమ్మకం/కొనుగోలు, వగైరాలను జరపరాదు లేదా జరిపించరాదు లేదా ఎట్టి ఎన్‌కంబ్రెన్స్‌లను సృష్టించరాదు.

చర్చల ద్వారా పరిహారం సెటిల్‌మెంట్ కొరకు ప్రయోజనంగల/ప్రభావితమైన వ్యక్తులందరి నుండి క్లైమ్‌లు మరియు ఈ భూసేకరణ పట్ల గల ఏవేనీ ఆక్షేపణలను చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద నిర్దేశించిన విధంగా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోపు జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి సమక్షంలో దాఖలు చేయవలెను.

సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,
LA మరియు R&R యూనిట్-II,
ఇరిగేషన్ ప్రాజెక్ట్స్,
మహబూబ్‌నగర్.

సం/-
జాయింట్ కలెక్టర్,
మహబూబ్‌నగర్.

సం/-
జిల్లా కలెక్టర్,
మహబూబ్‌నగర్.

మీరు నాకు మార్గదర్శకులు

- తండ్రిలా ఆదరించారు
- మీ ఆత్మీయతతో నాలో విశ్వాసం పెరిగింది
- ప్రణబ్‌పై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం
- మోదీ రాసిన లేఖను ట్విటర్‌లో పంచుకున్న మాజీ రాష్ట్రపతి



దిల్లీ

ప్రణబ్ ముఖర్జీ, నరేంద్ర మోదీ.. వేర్వేరు రాజకీయ సిద్ధాంతాల నుంచి వచ్చి గొప్ప నేతలుగా ఎదిగారు. రాష్ట్రపతిగా ప్రణబ్ ఇటీవలి వరకు సేవలందించగా. . మోదీ ప్రధానిగా కొనసాగుతున్నారు. వీరిద్దరి మధ్య అనుబంధానికి దర్పణం పట్టే ఓ లేఖను ప్రణబ్ గురువారం ట్విటర్‌లో పంచుకున్నారు. రాష్ట్రపతిగా తన పదవీకాలం చివరిరోజున(జులై 24) మోదీ నుంచి అందిన ఆ భావోద్వేగపూరిత లేఖ తన హృదయాన్ని తాకిందని వ్యాఖ్యానించారు. దీనిపై మోదీ స్పందిస్తూ. . 'ప్రణబ్ దా.. మీతో పనిచేయడాన్ని నేనెప్పుడూ ఆస్వాదిస్తుంటా' అని ట్విటర్‌లో బదులిచ్చారు. ప్రణబ్ పట్ల మోదీకి ఉన్న గౌరవభావం లేఖలో ఉట్టిపడింది. అందులో ప్రణబ్‌ను ప్రధాని ప్రశంసల్లో ముంచెత్తారు. ప్రణబ్ తనను ఎలప్పుడూ తండ్రిలా ఆదరించారని వ్యాఖ్యానించారు. మార్గదర్శకుడిలా నిలిచారని తెలిపారు. మూడేళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు తాను ఓ బయటి వ్యక్తిలా దిల్లీకి వచ్చానన్నారు. "నా ముందున్న పని చాలా పెద్దది. సవాళ్లతో కూడుకున్నది. ఇన్నాళ్లూ మీరు నాకు తండ్రిలా, మార్గదర్శకుడిలా నిలిచారు. మీ జ్ఞానం, మార్గదర్శకత్వం, వ్యక్తిగత ఆత్మీయత కారణంగా నాలో విశ్వాసం, బలం పెరిగాయి" అని ప్రణబ్‌ను ఉద్దేశించి మోదీ పేర్కొన్నారు.

మీ ఫోన్‌కాల్‌తో నాలో నూతనోత్తేజం: "నాపై మీరెప్పుడూ గొప్ప ఆదరాభిమానాలు చూపారు. రోజంతా సమావేశాలు, పర్యటనలతో నేను ఎంత బిజీగా గడిపినాసరే.. 'మీ ఆరోగ్యంపై శ్రద్ధతీసుకుంటున్నారని ఆశిస్తున్నా..' అంటూ మీ నుంచి వచ్చే ఒక్కో ఫోన్ నాలో నూతనోత్తేజాన్నినింపేది" అని లేఖలో మోదీ తెలిపారు.

"ప్రణబ్ దా.. భిన్న రాజకీయ పార్టీల్లో మన రాజకీయ ప్రయాణం కొనసాగింది. కొన్నిసార్లు మన సిద్ధాంతాలు వేరుగా ఉన్నాయి. అనుభవాల్లోనూ తేడాలున్నాయి. నా పాలనానుభవమంతా మా రాష్ట్రం నుంచి వచ్చిందే. మీరు అలా కాదు. దశాబ్దాలుగా దేశ రాజకీయాలు, పరిపాలనా పద్ధతుల్లో మార్పులను మీరు చూశారు. అయినప్పటికీ.. మనం కలిసికట్టుగా పనిచేయగలిగాం. అందుకు మీ జ్ఞానం, మేధస్సే కారణం" అని ప్రణబ్‌పై మోదీ ప్రశంసలు కురిపించారు. యువత నైపుణ్యాలను గుర్తించేందుకు వీలుగా రాష్ట్రపతిభవన్‌లో ప్రణబ్ పలు కార్యక్రమాలు ఏర్పాటుచేశారంటూ మోదీ కొనియాడారు.

మిమ్మల్ని చూసి జాతి గర్విస్తోంది: "నిస్వార్థంగా సమాజానికి సేవ చేయడాన్నే రాజకీయరంగంగా భావించిన తరం నేతల కోవకు చెందినవారు మీరు. దేశ ప్రజలందరికీ మీరు గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు. నిజాయతీపరుడైన ప్రజాసేవకుడిగా, గొప్ప నేతగా మిమ్మల్ని చూసి జాతి యావత్తూ గర్విస్తోంది. మీ ప్రధానిగా మీతో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అంటూ ప్రణబ్‌ను మోదీ ప్రశంసల వర్షంలో ముంచెత్తారు.

కుటుంబ విలువలను పెంపొందించాలి

ఫిక్కీ మహిళా ప్రతినిధులకు ప్రధాని ఉద్బోధ

దిల్లీ: కుటుంబ విలువలు, వైవిధ్యం, పర్యావరణ జాగరూకతలు మనదేశ గొప్ప సంప్రదాయాలని.. వీటిని పెంపొందించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్బోధించారు. ఫిక్కీ మహిళా సంస్థ యువ ప్రతినిధులు గురువారం ఆయనతో భేటీ అయినప్పుడు ఈ అభిప్రాయాన్ని వెల్లడించారు. మహిళా సాధికారత, యాజమాన్యం వంటి అంశాలపై ప్రతినిధులు మోదీతో చర్చించారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విద్య, నైపుణ్య అభివృద్ధి, కళలు, సంస్కృతి, మహిళల భద్రత వంటి అంశాలూ చర్చకు వచ్చాయని వివరించింది. ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు మోదీ జవాబులిచ్చారు. వ్యర్థం నుంచి సంపదను సృష్టించే వ్యవస్థాపకతకు స్వచ్ఛ భారత్ ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. నీటిని జాగ్రత్తగా వాడుకోవటంపై.. సూక్ష్మ, బిందు సేద్యంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు.

దళితులకు అన్యాయం చేస్తున్న కేసీఆర్

నేరెళ్ల బాధితుల పరామర్శకు నేడు తెదేపా బస్సుయాత్ర: రమణ

డ్రగ్స్‌పై విచారణకు రాష్ట్రపతి, ప్రధానికి ఫిర్యాదు: రేవంత్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో దళితులకు కేసీఆర్ ప్రభుత్వం తీరని అన్యాయంచేస్తోందని తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. వారిని ఆదుకోవాల్సిన సర్కారు అక్రమకేసులు పెట్టి దాడులు చేయిస్తోందని ధ్వజమెత్తారు. పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి, అన్నమనేని నర్సింగరావు, విజయరమణారావు తదితరులతో కలసి గురువారం ఎన్టీఆర్ భవన్‌లో రమణ మీడియాతో మాట్లాడారు. ఇసుకలారీల కింద పేదలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం తెదేపా నేతలమంతా బస్సుయాత్రలో నేరెళ్ల వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శిస్తామన్నారు. రేవంత్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడినతీరు దోపిడీదారులను ప్రోత్సహించేలాఉందన్నారు. ఇసుక,భూమాఫియా... ఇలా ఏ కుంభకోణం తీసుకున్నా వాటి మూలాల్లో కేసీఆర్ బంధువులే ఉన్నారన్నారు. మంత్రి కేటీఆర్ బాధితులను పరామర్శించాల్సింది పోయి వారి వ్యాపారులకు అడ్డువస్తే కొడతామని నిరూపించారని విమర్శించారు. 2014ఎన్నికలప్పుడు కేటీఆర్ ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో హిమాంశు మోటార్స్ కంపెనీలో లక్షషేర్లు ఉన్నాయనితెలిపారని.. కేటీఆర్‌తోపాటు సీఎం కేసీఆర్ ఈ కంపెనీలో భాగస్వామి అని ఆయన ఆరోపించారు. డ్రగ్స్ బాగోతంపై జాతీయస్థాయి సంస్థలతో దర్యాప్తు చేయించాలని రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాచిగూడ-కాకినాడల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-కాకినాడ టౌన్‌ల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. కాచిగూడ నుంచి(నెం.07452) 10, 12, 14 తేదీల్లో సాయంత్రం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.40గంటలకు కాకినాడ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి(07453, 07457) 11, 13, 15 తేదీల్లో సాయంత్రం 6.10గంటలకు బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 5గంటలకు కాచిగూడ చేరుకుంటాయి. మల్కాజిగిరి, నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, సామర్లకోట మార్గంలో ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు.

నర్సాపూర్ రైలు ప్రయాణ వేళల్లో స్వల్ప మార్పు

హైదరాబాద్-నర్సాపూర్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ ప్రయాణ వేళలు విజయవాడ-నర్సాపూర్‌ల మధ్య మారినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. విజయవాడకు తెల్లవారుజామున 4.25కు బదులుగా 4.35కు చేరుకుని, 4.50కి బయల్దేరుతుంది. భీమవరం జంక్షన్‌కు 7.05కి బదులుగా 7.15గంటలకు చేరుకుంటుంది. నర్సాపూర్‌కు యథావిధిగా ఉదయం 8.40గంటలకు చేరుకుంటుంది.

తమిళనాడు సీఎంకు హైకోర్టు నోటీసులు

చెన్నై, న్యూస్‌టుడే: కర్ణాటక జైలులో ఉన్న శశికళను కలిసిన వ్యవహారంలో తమిళనాడు ముఖ్యమంత్రి, నలుగురు మంత్రులకు మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం నోటీసుల జారీకి ఆదేశించింది. అవినీతి కేసులో శిక్ష పడి.. జైలులో ఉన్న శశికళను రాష్ట్ర మంత్రులు సెంగోట్టయన్, సెల్లూర్ రాజు, దిండుకల్ శ్రీనివాసన్, కామరాజ్ కలవడం పదవీ స్వీకార సమయంలో చేసిన ప్రమాణానికి విరుద్ధమంటూ అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే తామరైకని కుమారుడు అన్బళగన్ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ మంత్రుల వైఖరిని ముఖ్యమంత్రి పళనిస్వామి కూడా ఖండించలేదని వ్యాజ్యంలో పేర్కొన్నారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తులు.. వివరణ కోరుతూ సదరు మంత్రులతో పాటు ముఖ్యమంత్రికీ నోటీసులు పంపాలని ఆదేశించారు.

శ్వేతసౌధంలో మరొకరికి ఉద్వాసన

ఎన్ఎస్‌సీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ వాత్నిక్ తొలగింపు

వాషింగ్టన్: శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపడుతున్న సమూల మార్పుల్లో భాగంగా జాతీయ భద్రత మండలి (ఎన్ఎస్‌సీ) ఉన్నతాధికారి, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ ఎజ్రా కోహెన్ వాత్నిక్ ఉద్వాసనకు గురయ్యారు. వాస్తవంగా మార్చిలోనే ట్రంప్ జాతీయ భద్రత సలహాదారు హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్... వాత్నిక్‌ను తొలగించేందుకు నిర్ణయించారు. అయితే తన పదవిని కాపాడాల్సిందిగా ఆయన మరో ఇద్దరు ఉన్నత సలహాదారులకు విజ్ఞప్తి చేయడంతో ఆగింది. తాజాగా వాత్నిక్ ఉద్వాసనను ధ్రువీకరించిన శ్వేతసౌధం అందుకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఆయన జాతీయ భద్రతలో మరో పదవిలో సేవలందిస్తారన్న విశ్వాసంతో జనరల్ మెక్‌మాస్టర్ ఉన్నట్లు శ్వేతసౌధం అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు అమెరికా దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ) కొత్త డైరెక్టర్‌గా క్రిస్టోఫర్ రే గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా ఉన్న కామేను ట్రంప్ అనూహ్యంగా తొలగించిన సంగతి తెలిసిందే. గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రాబల్యానికి అనుకూలంగా ఆయన పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

తొలిసారి సెలవుపై ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి కొద్ది రోజుల సెలవుపై వెళుతున్నారు. ఈమేరకు వార్షిక ఆగస్టు యాత్రకు బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన శుక్రవారం వాషింగ్టన్ నుంచి బయల్దేరి సెంట్రల్ న్యూజెర్సీలోని తన ప్రైవేటు గోల్ఫ్‌క్లబ్‌కు చేరుకుంటారు. సెలవు తీసుకోవడాన్ని గతంలో ఓ సందర్భంగా ప్రశ్నించిన ట్రంప్ తాజాగా 17 రోజులు వెళుతుండటం విశేషం.

జోగుతున్న భారతావని

- వరల్డ్ డ్రగ్ మాఫియాల దృష్టి ఇక్కడే
- ప్రపంచంలోని అనేక దేశాలనుంచి సరఫరా
- వాయు, సముద్ర మార్గాల్లో చొరబాటు
- అనేక విమానాశ్రయాల్లో నిఘా లోపం
- చాలాచోట్ల పసిగట్టే యంత్రాంగమే లేదు
- రూ.వందల కోట్లలో గుట్టుగా మత్తు వ్యాపారం

ఐ. ఆర్. శ్రీనివాసరావు
ఈనాడు, హైదరాబాద్

భారతావనిని మత్తు మాఫియా చుట్టుముడుతోంది. ప్రపంచంలోని పలు దేశాల నుంచి.. రకరకాల మార్గాల్లో మత్తుమందులను దేశంలోకి చొప్పిస్తోంది. పేదరికంలో మగ్గుతున్న ఆఫ్రికన్లు, నైజీరియన్లను పావులుగా చేసుకుని రూ. వందల కోట్ల విలువ చేసే మత్తుమందులను ఈ మాఫియా మన దేశంలోకి చేరవేస్తూ ఇక్కడి యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. వీటిని పసిగట్టే యంత్రాంగం.. రవాణాను నియంత్రించేందుకు పూర్తి స్థాయిలో నిఘా వ్యవస్థ లేకపోవడం ఈ వ్యాపార విస్తరణకు కీలకంగా మారుతోంది. దీంతో మత్తు మాఫియా ఇక్కడ రూ. వందల కోట్ల వ్యాపారాన్ని గుట్టుగా సాగిస్తోంది. ప్రపంచంలోని డ్రగ్ మాఫియాల దృష్టి ఇప్పుడు ఇక్కడే కేంద్రీకృతమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి.


హైదరాబాద్‌లో డ్రగ్స్ వినియోగం కొద్దిరోజులుగా కలకలం రేపుతుండటంతో దేశవ్యాప్తంగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దీంతో కళ్లు చెదిరే వాస్తవాలు బయటపడుతున్నాయి. దేశంలోనే భారీ స్థాయిలో రూ. 3,500 కోట్ల విలువైన హెరాయిన్‌ను ఇటీవలే గుజరాత్‌తో పట్టుకోవడం తెలిసిందే. ఇక పొరుగుదేశం నుంచి వచ్చిపడుతున్న మత్తుమందులతో పంజాబ్ యువత చిత్తవుతోంది. కచ్చితంగా చెప్పాలంటే ఇప్పుడు మత్తుమందుల విక్రయానికి ప్రపంచంలోని పలు దేశాలకు భారతదేశమే కేంద్రంగా తయారైంది. నిఘా లేకపోవడం.. వినియోగం పెరుగుతుండడంతో మత్తు మాఫియాకు కాసుల వర్షం కురుస్తోంది. లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఆసియా ఖండంలోని ఆగ్నేయ, నైరుతి ప్రాంతాల నుంచి మత్తుమందులు విచ్చలవిడిగా మనదేశంలోని వస్తున్నాయి. దేశ యువతను నిర్వీర్యం చేయడానికి ఇదోరకం కుట్ర కావచ్చని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. లాటిన్ అమెరికా, ఇటలీ, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో మత్తుమందుల మాఫియా అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తుంటుంది. వీటి నియంత్రణకు సిద్ధపడితే దేశాధ్యక్షులను, నేతలను కూడా లేపేసే స్థాయిలో ఈ మాఫియా అక్కడ వేళ్లూనుకుంది. అదే పరిస్థితి ఇక్కడ కూడా తయారైతే...? ఇది ఊహించడానికే భీతిగొల్పుతుంది.

దమ్ మారో దమ్..

ఏ మత్తుమందైనా.. ప్రపంచంలోని ఏ మూల నుంచి భారతదేశంలోకి వచ్చినా అది హైదరాబాద్ నేలను తాకాల్సిందే. ఇక్కడి వినియోగం కొంతైతే.. ఇక్కడి నుంచి రవాణా అయ్యేది మరింతగా ఉందని నిఘావర్గాలు గుర్తించాయి. మనదేశంలో తయారయ్యే నల్లమందు లాంటి కొన్ని రకాల మత్తుమందులు ఇతర దేశాలకూ అక్రమ మార్గంలో వెళుతున్నాయనేది మరో చేదు వాస్తవం. అయితే ఇటు నుంచి వెళ్లే వాటితో పోలిస్తే ఇక్కడికి వచ్చేవే అధికంగా ఉన్నట్లు అంచనా.

పంజాబ్, గోవా.. హైదరాబాద్

- మనదేశంలో రూ. వందల కోట్ల మత్తుమందులు వ్యాపారం జరుగుతున్నట్లు ఎక్సైజ్, నిఘా వర్గాల అంచనా.
- ఈ వ్యాపారంలో పంజాబ్, గోవా తర్వాత హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక్కడ వినియోగం ఎంత? ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా అయ్యేది ఎంత అన్నది చెప్పటం సాధ్యం కాదని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.
- ఇటీవల వరకు పాక్షిక కృత్రిమ (సెమీ సింథటిక్) మత్తుమందులైన హెరాయిన్, కొకైన్ అధిక మొత్తంలో చలామణి అయ్యేవి. ప్రస్తుతం అధిక మత్తును ఇచ్చే కృత్రిమ మత్తు మందులు (సింథటిక్ డ్రగ్స్) రవాణా, వినియోగం కూడా భారీగా పెరిగినట్లుగా అధికారులు గుర్తించారు.
- అత్యంత ఖరీదైన కొకైన్ లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్‌ల నుంచి ఇక్కడికి వస్తున్నాయి. అధికశాతం కొరియర్ వ్యవస్థ ద్వారా వస్తున్నట్లు అంచనా. కొన్ని సందర్భాల్లో సముద్రమార్గాల్లో గోవా, ముంబయి, చెన్నై, కోల్‌కతా, విశాఖల్లోకి ప్రవేశిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.




ఎక్కడెక్కడి నుంచి ఏ మత్తు?



- **కొకైన్:** లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్‌ల నుంచి... ముంబయి కేంద్రంగా దిల్లీ, కర్ణాటక, తమిళనాడులకు వస్తుంది. అక్కడి నుంచి వివిధ రూపాల్లో హైదరాబాద్‌కు చేరుతోంది.
- **వ్యాపారం:** మత్తుమందుల వ్యాపారంలో సింహభాగం దీనిదే. గ్రాము కనీసం రూ. మూడు నుంచి రూ. అయిదు వేలు పలుకుతుంది.



- **హెరాయిన్:** అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, మయన్మార్, లావోస్, థాయ్‌లాండ్‌ల నుంచి వస్తుంది. దిల్లీ, మధ్యప్రదేశ్, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబయి, కోల్‌కతా, చెన్నైలకు వస్తుంది. కొన్ని సందర్భాల్లో చెన్నై నుంచి శ్రీలంక దేశానికి పెద్ద మొత్తంలో హెరాయిన్ ఎగుమతి అవుతోంది.
- **వ్యాపారం:** కొకైన్‌తో పోలిస్తే హెరాయిన్ ధర కొంత తక్కువ. వినియోగించేవారి సంఖ్య ఎక్కువే. గోవాలో వినియోగం విస్తృతమన్నది అంచనా. అధిక వ్యాపారం అక్కడ జరుగుతుంది.



- **ఎల్ఎస్‌డీ:** రష్యా, యూరప్, దుబాయ్‌ల నుంచి గోవాకు వస్తుంది. అక్కడి నుంచి మంగుళూరు, బెంగళూరు, కోల్‌కత్తా ప్రధాన కేంద్రాలుగా వచ్చి అక్కడి నుంచి హైదరాబాద్‌లో చెలామణి అవుతోంది.
- **వ్యాపారం:** ఈ మధ్యనే ఇది హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. రేవ్ పార్టీలల్లో విస్తృతంగా వినియోగమవుతోంది. ఇటీవల కాలంలో వినియోగం పెరుగుతోంది.



- **నల్లమందు:** ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్ దేశాల నుంచి భారీగా రవాణా అవుతోంది. దీనిని మనదేశంలోని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో కూడా పండిస్తారు. కర్ణాటక, పశ్చిమబెంగాల్, నీలగిరి ప్రాంతాల్లో అక్కడక్కడ పండిస్తారు. మధ్యప్రదేశ్ నుంచి అమెరికా, యూరప్ దేశాలతోపాటు మాల్దీవులు శ్రీలంక, సింగపూర్‌లకు ఎగుమతి అవుతోంది.
- **వ్యాపారం:** భారీ మొత్తంలో సాగుతోంది. ఇతర మత్తుమందులతోపోలిస్తే ధర ఒకింత తక్కువ. వినియోగం కూడా అధికంగా ఉంటుంది. వ్యాపారం ఎంత మొత్తంలో అన్నది అంచనాలేదు.

ఆఫ్రికన్లు, నైజీరియన్లు..

హైదరాబాద్‌లో మాత్తు మాఫియాకు నైజీరియన్లు, ఆఫ్రికన్లు కీలక ప్రతినిధులుగా ఉన్నట్లు నిఘా వర్గాలు నిర్ధారిస్తున్నాయి. మనవాళ్లు కూడా రవాణా చేస్తున్నప్పటికీ వారి శాతం తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారికి సూత్రధారులెవరో తేల్చడానికి ఎక్సైజ్ శాఖ దృష్టిసారిస్తోంది. పర్యాటక వీసాపై మన దేశానికి వచ్చిన నైజీరియన్లల్లో చాలామంది వీసా కాలం తీరినా తిరిగి వెళ్లటం లేదని అధికారులు గుర్తించారు. మత్తుమందుల కేసుల్లో గత కొన్నేళ్లుగా పట్టుపడిన నైజీరియన్లు ఆఫ్రికాదేశ పౌరులే. అత్యధికులు వీసాల కాలం తీరినా ఇక్కడే ఉంటున్నారని పోలీసులు తెలిపారు. వారిని గుర్తించటం కూడా కష్టంగానే ఉందని వారు చెబుతున్నారు.

నిఘా లోపం...

మత్తు మందుల రవాణాను గుర్తించడానికి పూర్తి స్థాయిలో తగిన వ్యవస్థ లేకపోవటం వీటి విస్తృతి పెరగానికి ప్రధాన కారణం. దేశంలోని కొన్ని విమానాశ్రాయాలు మినహా మిగిలిన వాటిల్లో ఆ లోపం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అధునాత స్కానర్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి లోహాలను గుర్తించడానికే ఉపయోగపడుతున్నాయి. దేశంలోని ఏ విమానాశ్రయంలోని స్కానర్లలోనూ పొడుల (పౌడర్ లేదా చూర్ణం) రూపంలో వచ్చే మత్తుమందులను గుర్తించే ఏర్పాట్లు లేవు. దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మత్తుమందులను గుర్తించేందుకు శిక్షణ పొందిన కుక్కలును వినియోగిస్తున్నారు. మిగిలిన విమానాశ్రయాల్లో శునకాలను భద్రతాపరమైన తనిఖీలకు మాత్రమే వినియోగిస్తున్నారు. మత్తు మందులను రవాణా చేసే వారు తనిఖీలు విస్తృతంగా ఉండని విమానాశ్రయాలను ఎంచుకుని అక్కడి చేరుకుంటారు. ఆయా ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో నిర్ధారిత ప్రాంతాలకు మత్తుమందులను రవాణా చేస్తుంటారని కస్టమ్స్ విశ్రాంత ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.

పాత పద్ధతే దిక్కు...

విమానాశ్రయాల్లో బంగారాన్ని పట్టుకున్నంత సులువుగా మత్తుమందులు పట్టుకున్న సందర్భాలు ఉండవు. చాలా అరుదుగా.. అదీ ఎయిర్ ఇంటెలిజెన్స్‌కు ముందస్తు సమాచారం ఉన్న సందర్భాల్లోనే వీటిని పట్టుకుంటున్నారు. లేదంటే ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే విమానాలు, ఆయా దేశస్థులు వస్తున్నప్పుడు వారి పాస్‌పోర్టులపై కొంత నిఘా పెడుతున్నారు. వారు ఎక్కడి నుంచి వస్తున్నారు? ఏ పని మీద వస్తున్నారు? ఒకవేళ తరచూ వస్తుంటే, ఎంత వ్యవధిలో రాకపోకలు సాగిస్తున్నారు? అనే అంశాలపై దృష్టి పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నా.. వారి నడకలో తేడా ఉన్నట్లు గుర్తించినా వారిని విడిగా ప్రశ్నించి, ప్రత్యేకంగా తనిఖీలు చేస్తుంటారు. ఆలాంటి సందర్భాల్లో దొరికితే అక్రమ రవాణాదారులు దొరికినట్లు. లేదంటే అంతే సంగతులు!

యుద్ధం పరిష్కారం కాదు



గురువారం రాజ్యసభకు వచ్చిన కాంగ్రెస్ నామినేటెడ్ సభ్యుడు సచిన్ తెందుల్కర్

రాజ్యసభకు హాజరైన తెందూల్కర్

దిల్లీ: క్రికెట్ దిగ్గజం రాజ్యసభ సభ్యుడు సచిన్ తెందూల్కర్ గురువారం రాజ్యసభ సమావేశానికి హాజరయ్యారు. ప్రశ్నోత్తరాల సమయంలో జరిగిన చర్చలు విన్నారు. మరో నామినేటెడ్ సభ్యురాలు, ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారిణి మేరీ కోమ్ కూడా హాజరయ్యారు. రాజ్యసభకు నామినేట్ అయిన ప్రముఖుల గైర్హాజరుపై గతంలో సభ్యులు ప్రశ్నించారు.

పాఠశాలల్లో జామర్లు పెట్టే ఉద్దేశం లేదు

దిల్లీ: పాఠశాలల్లో విద్యార్థులు అశ్లీల చిత్రాలను చూడకుండా జామర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలిపింది. విద్యార్థులపై లైంగిక దాడులు పెరుగుతుండటంతో, అశ్లీల చిత్రాలు చూడకుండా జామర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుశ్వాహ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. విద్యార్థులు నీలిచిత్రాలను చూస్తున్నట్లు ఫిర్యాదులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

- చర్చల ద్వారానే చైనా వివాదానికి కళ్లెం: సుష్మా
- చైనాతో ఘర్షణపై రాజ్యసభలో చర్చ

దిల్లీ

ఏ సమస్యకైనా పరిష్కారం యుద్ధం మాత్రం కాదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ చెప్పారు. ద్వైపాక్షిక అంశాల్లో భిన్నాభిప్రాయాలను, వివాదాలను దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఒకవేళ యుద్ధానికే వెళ్లాలనుకున్నా జయాపజయాలను పక్కన పెట్టి చర్చలకు కూర్చోవాలని చెప్పారు. 'భారత దేశ విదేశాంగ విధానం- వ్యూహాత్మక శక్తులతో కలిసి పనిచేయడం' అనే అంశంపై గురువారం రాజ్యసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆమె సమాధానమిచ్చారు. ఒక్క డోక్లాం వివాదంపైనే కాకుండా ఇతరత్రా అన్ని విషయాలపైనా చైనాతో మన దేశం చర్చలు జరుపుతూనే ఉందనీ, సహనం-సంయమనాలతో ప్రస్తుత ప్రతిష్టంభనను పరిష్కరించుకోగలమనే విశ్వాసంతో ఉన్నామనీ తెలిపారు. ఉగ్రవాదానికి ఊతమివ్వడాన్ని పాకిస్థాన్ ఆపేస్తేనే ఆ దేశంతో చర్చలు జరుగుతాయని మంత్రి చెప్పారు. పొరుగుదేశాలతో స్నేహపూరిత సంబంధాలనే మనం కోరుకుంటున్నామన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక పొరుగు దేశాలతో సంబంధాలు క్షీణిస్తున్నాయని సభలో విపక్షాలు చేసిన ఆరోపణల్ని ఆమె తోసిపుచ్చారు. నేపాల్, భూటాన్, శ్రీలంకలతో సంబంధాలు చాలా బాగున్నాయనీ, ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలను కోరుకుంటున్నంత మాత్రాన పాలస్తీనాను విడిచిపెట్టేయబోమని మంత్రి తేల్చి చెప్పారు. రష్యాతో సంబంధాల్లోనూ ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. విదేశాంగ విధానం బలంగానే ఉందనీ, ప్రపంచానికే మనం దిశానిర్దేశం చేస్తున్నామనీ చెప్పారు. చైనా రాయబారితో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఇటీవల భేటీ కావడాన్ని సుష్మా ప్రస్తావిస్తూ... చైనా విషయంలో భారత ప్రభుత్వ వైఖరేమిటో రాహుల్ మొదట అర్థం చేసుకుని, ఆ తర్వాత ఆ దేశ రాయబారితో మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న సుష్మాస్వరాజ్

విపక్షాల ఆందోళన: అంతకుముందు విపక్ష సభ్యులు మాట్లాడుతూ- దేశానికి ఎలాంటి ముప్పు లేకుండా సైనికపరంగా తగినంత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. చైనా దూకుడు విషయంలో తామంతా భారత ప్రభుత్వానికి దన్నుగా నిలుస్తామని చెప్పారు. పాక్‌ను ఏకాకిని చేసే ప్రయత్నంలో మనం ఏకాకులుగా మిగిలిపోకూడదన్నారు. మనం వ్యూహాత్మక సంతులనాన్ని సాధించాలని కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ చెప్పారు. ప్రధాని విదేశీ పర్యటనలపైనా సభ్యులు కొన్ని విమర్శలు చేయగా సుష్మా స్వరాజ్ వాటిని తిప్పికొట్టారు.

సుష్మపై నేడు హక్కుల తీర్మానం!: భారత విదేశాంగ విధానంపై తప్పుడు సమాచారాన్ని సభకు తెలిపారనే ఆరోపణతో విదేశీ వ్యవహారాలశాఖమంత్రి సుష్మాస్వరాజ్‌పై సభాహక్కుల తీర్మానాన్ని శుక్రవారం ప్రవేశపెట్టడానికి విపక్షాలు రంగం సిద్ధం చేసుకున్నాయి. ఆసియా-ఆఫ్రికా సంబంధాల సదస్సు, ప్రధాని మోదీ లాహోర్‌లో నిర్వహించిన పర్యటనలపై ఆమె సభను తప్పుదారి పట్టించారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

నీట్ బాధ్యత రాష్ట్రాలకు ఇవ్వడం లేదు

ఈనాడు, దిల్లీ: ప్రాంతీయ భాషల్లో నీట్ నిర్వహించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకేమీ ఇవ్వడంలేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహ తెలిపారు. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ తరుపున సీబీఎస్ఈ ఈ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సిలబస్‌ను ఎంసీఐ నిర్దేశిస్తుందని చెప్పారు.

నవజాత శిశువులకు పాస్‌పోర్టు నిబంధనలు సడలింపు యోచన: నవజాత శిశువులకు పాస్‌పోర్టు జారీ విషయంలో ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను సడలించాలని యోచిస్తున్నట్లు విదేశాంగ శాఖ సహాయమంత్రి వీకేసింగ్ తెలిపారు.

కేంద్ర ఓబీసీ జాబితాలో 2,492 వర్గాలు: కేంద్ర ఓబీసీ జాబితాలో 2,492 వర్గాలున్నట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ సహాయమంత్రి కృష్ణపాల్ గుజ్జర్ తెలిపారు.

ఆదర్శ పాఠశాల వేతనాల బాధ్యత రాష్ట్రాలదే: ఆదర్శ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వ జాబితా నుంచి తొలగించి 2015 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేశామని ఉపేంద్ర కుష్వాహ తెలిపారు. అందువల్ల వాటి వేతనాల ఖర్చును రాష్ట్రాలే భరించాలని స్పష్టం చేశారు.

బ్లూవేల్ గేమ్‌పై గళమెత్తిన ఎంపీలు: 'బ్లూవేల్' వంటి ఆన్‌లైన్ గేమ్‌లపై చర్యలు తీసుకోవాలని రాజ్యసభలో ఎంపీలు గురువారం డిమాండ్ చేశారు.

ప్రమాదం అంచున వంతెనలు

దిల్లీ: దేశంలో వందకుపైగా వంతెనలు కూలిపోయే దశలో ఉన్నాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వంతెనలు, కల్వర్టులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే ప్రత్యేక కార్యక్రమాన్ని గతేడాది తమ శాఖ ప్రారంభించిందని ఆయన గురువారం లోక్‌సభలో వెల్లడించారు. దాదాపు 1.6 లక్షల వంతెనలపై భద్రతపరమైన తనిఖీలు పూర్తయ్యాయని.. వీటిలో వంద వంతెనలు ఏ క్షణమైనా కూలిపోయే దశలో ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ప్రమాదాలు నివారించేందుకు.. వీటిపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరముందని చెప్పారు. భూసేకరణ, ఆక్రమణలు, పర్యావరణ అనుమతులకు సంబంధించిన కారణాలతో.. రూ.3.85 లక్షల కోట్ల విలువైన వివిధ రహదారుల ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతోందని గడ్కరీ వివరించారు.

ఎన్‌హెచ్ఏఐ అధికారుల అవినీతిపై విచారణ: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు... అమెరికాకు చెందిన సీడీఎమ్ సంస్థ రూ.7.5కోట్ల మేర ముడుపులు ముట్టజెప్పినట్లు వచ్చిన ఆరోపణలపైనా గడ్కరీ స్పందించారు. ఈ అంశంలో విచారణకు కేంద్ర విజిలెన్స్ కమిషన్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. అమెరికా న్యాయ విభాగం జరిపిన విచారణలో.. సీడీఎమ్ సంస్థ వివిధ కాంట్రాక్టుల కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ముడుపులు ఇచ్చినట్లుగా వెల్లడైంది. దీనికి సంబంధించిన లేఖను.. అమెరికా న్యాయ విభాగం తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. అమెరికా నుంచి రికార్డులు, ఇతర సమాచారాన్ని తెప్పించుకునేందుకు విదేశాంగ శాఖ, అమెరికాలోని భారత దౌత్య కార్యాలయాలతో తమ శాఖ సంప్రదింపులు జరుపుతోందని గడ్కరీ చెప్పారు.

రహదారుల నిర్మాణంలో నదుల పూడికమట్టి

నదులు పూడికతీసే సమయంలో ఏర్పడే మట్టిని రహదారుల నిర్మాణంలో వినియోగించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతి గురువారం లోక్‌సభకు తెలిపారు.

జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలి

ఈనాడు, దిల్లీ: 82 కిలోమీటర్ల దూరంలో 60 మలుపులతో అత్యంత ప్రమాదకరంగా తయారైన రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో వినోద్‌కుమార్ ఈ అంశాన్ని ప్రత్యేకంగా లేవనెత్తారు. "జాతీయ రహదారికి మించి వాహనాల రాకపోకలు సాగుతున్నందున తక్షణం కేంద్రం దృష్టిపెట్టాలి." అని కోరారు. వినోద్‌కుమార్ విజ్ఞప్తిపై కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించారు. దీన్ని 100% జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా మళ్లీ పాపిరెడ్డి

- వైస్ ఛైర్మన్లుగా లింబాద్రి, వెంకటరమణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా తుమ్మల పాపిరెడ్డి రెండోసారి నియమితులయ్యారు. 2014లో ఛైర్మన్‌గా నియమితులైన ఆయన పదవీ కాలం శుక్రవారంతో ముగియనుంది. ఈ క్రమంలో ఆయన్ను మరో విడత అదే పదవిలో కొనసాగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. సంబంధిత దస్త్రంపై గురువారం రాత్రి సంతకం చేశారు. పాపిరెడ్డి మరో మూడేళ్ల పదవిలో కొనసాగనున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం ఆచార్యుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు.

వైస్ ఛైర్మన్లుగా కొత్తవారు

ప్రస్తుతం వైస్ ఛైర్మన్లుగా వెంకటాచలం, మల్లేశం కొనసాగుతుండగా వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. వైస్ ఛైర్మన్-1గా ఆచార్య లింబాద్రిని నియమించారు. ఈయన ప్రస్తుతం ఉస్మానియా వీసీకి ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం రావుట్లకు చెందిన లింబాద్రి గతంలో తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ వర్సిటీకి న్యాక్ గుర్తింపు దక్కడంలో కీలకంగా వ్యవహరించారు. ఇక వైస్ ఛైర్మన్-2గా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విభాగంలో ఆచార్యుడిగా ఉన్న వి.వెంకటరమణను నియమించారు. ఆయన ప్రస్తుతం ఆ విశ్వవిద్యాలయంలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. గతంలో డీన్‌గా పనిచేశారు. ఆయన తండ్రి రామకృష్ణ ఓయూ మాజీ వీసీ. ఇక ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా శ్రీనివాసరావు మరో విడత కొనసాగనున్నారు.




పాపిరెడ్డి ★ లింబాద్రి ★ వెంకటరమణ

పరీక్ష కేంద్రాలు ఖరారవగానే తేదీలు: టీఎస్‌పీఎస్సీ

గురుకులాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీల భర్తీకి సవరణ షెడ్యూలు ఖరారు చేసేందుకు టీఎస్‌పీఎస్సీ కసరత్తు చేస్తోంది. వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్న కమిషన్‌కు పరీక్ష కేంద్రాల కొరత సమస్యగా నిలిచింది. న్యాయవివాదాలు తొలగిపోవడంతో టీఎస్‌పీఎస్సీ అధికారులు ప్రధాన పరీక్షలు నిర్వహించేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల కలెక్టర్లతో చర్చలు జరుపుతున్నారు. పరీక్షల నిర్వహణకు కేంద్రాలు ఖరారు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్లు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసిన వెంటనే సవరణ షెడ్యూలు ఖరారు చేయాలని టీఎస్‌పీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి.

రక్తక్యాన్సర్లకూ కీళ్లవాతం మందు!



లండన్: కీళ్లవాతం (ఆర్థ్రయిటిస్) చికిత్సలో వాడే మెథోట్రెక్సేట్ మందు రక్త క్యాన్సర్లు తగ్గటానికీ తోడ్పడుతున్నట్లు బ్రిటన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది రక్త క్యాన్సర్లకు దోహదం చేస్తున్న కణ మార్గాన్ని నేరుగా అడ్డుకుంటుండటం విశేషం. రక్తక్యాన్సర్లు తలెత్తటంలో కణాలకు సంకేతాలను చేరవేసే జాక్/స్టాట్ వ్యవస్థ అస్తవ్యస్తం కావటం కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల దీన్ని సరిదిద్దే సూక్ష్మ అణువులను గుర్తించటంపై షెఫీల్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన మార్టిన్ జీల్డర్, బృందం దృష్టి సారించింది. మెథోట్రెక్సేట్ మందు జాక్/స్టాట్ సంకేత మార్గం ప్రేరేపితం కాకుండా సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్టు గుర్తించింది. రక్తకాన్సర్లకు దారితీసే జన్యుమార్పులు గల కణాల్లోనూ దీని ప్రభావం కనబడుతుండటం విశేషం. రక్తక్యాన్సర్ బాధితులకు మెథోట్రెక్సేట్ చవకైన, కొత్త చికిత్సగా ఎంతగానో తోడ్పడగలదని జీల్డర్ అభిప్రాయపడ్డారు. దీనిపై వచ్చే సంవత్సరంలో పూర్తిస్థాయిలో ప్రయోగ పరీక్షలు జరిపే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఇక మరింత మెరుగ్గా క్యాన్సర్ చికిత్స!



లాస్ఏంజిలెస్: క్యాన్సర్లు, స్వయం నిరోధక వ్యాధుల చికిత్సలను మరింత మెరుగుపర్చే దిశగా శాస్త్రవేత్తలు ముందంజ వేశారు. రోగ నిరోధక వ్యవస్థలో కీలకమైన టి-కణాలను అవసరానికి అనుగుణంగా పరివర్తనం చెందించగల విధానాన్ని వారు కనుగొన్నారు. సాధారణంగా వివిధ రోగ కారకాల నుంచి మన శరీరాన్ని రక్షించేలా రోగ నిరోధక వ్యవస్థను 'ఎఫెక్టార్ టి-కణాలు' క్రియాశీలం చేస్తాయి. మరోవైపు, ఆరోగ్యకరమైన అవయవాలపై స్వీయదాడి చేయకుండా రోగనిరోధక వ్యవస్థను 'రెగ్యులేటరీ టి-కణాలు' నియంత్రిస్తాయి. ఈ రెండు రకాల టి-కణాలపై అమెరికాలోని గ్లాడ్‌స్టోన్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు నిర్వహించారు. టి-కణాలను ఓ ఔషధం సాయంతో పరస్పరం పరివర్తనం చెందించగలమని గుర్తించారు. స్వయం నిరోధక వ్యాధుల్లో ఎఫెక్టార్ టి-కణాలు అతిగా క్రియాశీలమై శరీరానికి నష్టం కలిగిస్తుంటాయి కాబట్టి.. అలాంటి సందర్భాల్లో వాటిని రెగ్యులేటరీ టి-కణాలుగా మార్చడం ద్వారా రోగనిరోధక వ్యవస్థను సంతులన స్థితికి చేర్చవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. క్యాన్సర్ రోగుల్లో రెగ్యులేటరీ టి-కణాలను ఎఫెక్టార్ టి-కణాలుగా మార్చి.. క్యాన్సర్ కణాలపై పోరాడేలా రోగనిరోధక వ్యవస్థను క్రియాశీలం చేయవచ్చునని తెలిపారు.

ఉష్ణ వాహకంగా పనిచేసే కొత్త ప్లాస్టిక్



వాషింగ్టన్: ఉష్ణ వాహకంగా పనిచేసే కొత్త తరహా ప్లాస్టిక్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీని ద్వారా శక్తిని సమర్థంగా వాడుకునే, తేలికైన.. వాహనాలు, కంప్యూటర్ పరికరాలను రూపొందించేందుకు అవకాశముంది. అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ కొత్త ప్లాస్టిక్‌ను తయారు చేశారు. వీరిలో భారత్‌కు చెందిన అపూర్వ్ శంకర్ కూడా ఉన్నారు. లోహం, సిరామిక్‌లకు బదులుగా చాలా చోట్ల ప్లాస్టిక్ వాడకంలో ఉంది. అయితే ఉష్ణ వాహకత్వం ఎక్కువగా అవసరమైన చోట్ల దీన్ని వాడేందుకు అవకాశం ఉండట్లేదు. తాజాగా పరిశోధకులు థర్మల్ ఇంజినీరింగ్ ప్రక్రియను ఉపయోగించి.. ప్లాస్టిక్ అణు నిర్మాణక్రమాన్ని మార్చారు. ఫలితంగా ముందు కన్నా ఆ పదార్థ ఉష్ణ వాహక సామర్థ్యం ఆరు రెట్లు పెరిగింది. ప్లాస్టిక్‌లో అణువులతో కూడిన పొడవాటి గొలుసులు ఒకదానికొకటి దగ్గరగా ముడిపడి ఉంటాయి. రసాయన ప్రక్రియ ద్వారా పరిశోధకులు ఈ గొలుసులను సాగదీసి, తిన్నగా మార్చారు. దీంతో ఉష్ణం ప్రవహించేందుకు నేరుగా ఉండే మార్గాలు ఏర్పడ్డాయి.

బొగ్గుపులుసు వాయువు పెరుగుదలతో

మాంసకృత్తులు మాయం



బ్రిటన్: వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువు పెరిగితే మనం రోజూ తీసుకునే ఆహారంలో మాంసకృత్తుల (ప్రొటీన్) శాతం పడిపోనుంది. ఫలితంగా మరింత ఆహారం తీసుకోవడమో లేక ప్రత్యామ్నాయ ఆహారం వైపు చూడాల్సిన పరిస్థితి వస్తుందేమో. శాస్త్రవేత్తలు అంచనావేసినట్లుగా వాతావరణంలోని బొగ్గుపులుసువాయువు పెరుగుతూ పోతే.. 2050 నాటికి 18 దేశాల ప్రజలు తీసుకునే ఆహారంలోని మాంసకృత్తులు 5శాతానికిపైగా తగ్గిపోతాయి. బియ్యం, గోధుమలు, ఇతర ముఖ్య పంటల్లో పోషకాల శాతం పడిపోవడమే ఇందుకు కారణమని హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు పేర్కొంటున్నారు. వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువు స్థాయులు పెరగడం వల్ల మొత్తం 15కోట్ల మంది ప్రజలకు మాంసకృత్తుల లోపం తలెత్తే ప్రమాదం పొంచి ఉందని వెల్లడించారు. భారత్‌లోని 5.3 కోట్ల ప్రజలు రోజువారీ తీసుకునే ఆహారంలో 5.3% మేర మాంసకృత్తుల లోటు ఉంటుందని చెప్పారు. విపరీతంగా పెరిగిన బొగ్గుపులుసు వాయువు కారణంగా బియ్యంలో 7.6%, గోధుమల్లో 7.8%, బార్లీలో 14.1%, బంగాళాదుంపల్లో 6.4% మేర మాంసకృత్తుల శాతం పడిపోతుందని వివరించారు.

ఉల్లి ఎందుకు ఏడిపిస్తుందంటే?



వాషింగ్టన్: ఆహారంలో ఉల్లిపాయలు లేకుంటే ముద్ద దిగడం కష్టమే. వంటకాలకు అంత రుచి చేకూరుతుంది మరి. అదే వంట చేసేసమయంలో ఉల్లిపాయలు కోయాలంటే.. ఎవర్కైనా మంటే. ఎందుకంటే రెండు కళ్లు మండడంతో ధారలా నీరు ఉబికివస్తుంటుంది. ఉల్లిపాయను కోయగానే కన్నీటికి కారకమయ్యే రసాయనాన్ని ఉల్లిపాయ విడుదలచేస్తుంది. కళ్లు మండడానికి ఓ ఎంజైమ్ కారణమని ఇప్పటివరకు శాస్త్రవేత్తలకు తెలిసినా.. కన్నీటి కారకం ఏర్పడడానికి అది ఎలా ఉపయోగపడుతుందనేది అంతుచిక్కని ప్రశ్న. ఈ ప్రశ్నకు తాము సమాధానం కనుగొన్నామని చెబుతున్నారు అమెరికా శాస్త్రవేత్తలు. సాధారణంగా ఉల్లిపాయను కోయగానే సహజసిద్ధ రక్షణ ప్రక్రియలో భాగంగా కన్నీటి కారకాన్ని ఎగజిమ్ముతుంది. లాక్రోమేటరి ఫాక్టర్ సింతేస్ (ఎల్‌ఎఫ్ఎస్) అనే స్ఫటికాకార ఎంజైమ్ వల్లే కన్నీటి కారకం సిద్ధమవుతుందని శాస్త్రవేత్తలు తాజాగా చెబుతున్నారు.

నీటి నుంచి బీపీఏను తొలగించే ఉత్ప్రేరకం



పిట్స్‌బర్గ్: ప్రపంచవ్యాప్తంగా నీటిలో వ్యాపించిన అత్యంత ప్రమాదకర బిస్ఫెనాల్ ఏ (బీపీఏ)ను 99 శాతం తొలగించగలిగే అత్యంత వేగవంతమైన, చౌకైన విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వివిధ రకాల ప్లాస్టిక్ తయారుచేసే సమయంలో బీపీఏను ఉపయోగిస్తారు. బీపీఏ కారణంగా మానవుల ఆరోగ్యం దెబ్బతింటుందనే ఆందోళనలతో 2010 నుంచి బీపీఏ రహిత ఉత్పత్తులు (శిశువుల పాలసీసాలు, నీటి సీసాలు వంటివి) ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఈ ఉత్పత్తుల్లోనూ చాలామటుకు బీపీఏ తరహా విషతుల్యాలను కలిగి ఉంటున్నాయి. కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రజ్ఞుడు టెరెన్స్ జె కొలిన్స్ బీపీఏను తొలగించే చౌకైన విధానాన్ని తాజాగా అభివృద్ధిచేశారు. ఆక్సిడైజింగ్ ఎంజైంల తరహాలో ఉండే టీఏఎంఎల్ యాక్టివేటర్లను ఇందుకు వినియోగించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో టీఏఎంఎల్ యాక్టివేటర్లు కలిసినప్పుడు నీటిలోని విషతుల్యాలను సమర్థంగా తొలగిస్తాయి. తమ విధానాన్ని వివరించడంలో భాగంగా శాస్త్రవేత్తలు అత్యంత ఎక్కువగా బీపీఏ కల నీటిలో టీఏఎంఎల్ యాక్టివేటర్లు, హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కలపగా.. 30 నిమిషాల్లో నీటిలోని బీపీఏ 99%మేర తొలగిపోయింది.

డివిడెండ్.. గ్రోత్.. మదుపరికి ఏది సరి?



స్టాక్ మార్కెట్లు కొత్త స్థాయిలను చేరుతున్నాయి. మంచి రాబడులను అందిస్తుండటంతో చాలామంది ఇప్పుడు ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే వారి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. మొదటిసారి ఫండ్లలో మదుపు చేయాలని ప్రయత్నిస్తున్న వారికైనా.. ఇప్పటికే మదుపు చేస్తున్నవారికైనా తరచూ ఒక విషయంలో సందేహం ఉంటుంది.. అదే.. గ్రోత్, డివిడెండ్ ఐచ్ఛికాల్లో దేన్ని ఎంచుకోవాలి? ఈ సందేహానికి సమాధానం తెలుసుకుందామా!

క్రమానుగత పెట్టుబడి విధానం ద్వారా దీర్ఘకాలంలో మంచి సంపదను సృష్టించేందుకు మ్యూచువల్ ఫండ్లు ఒక మార్గం. రకరకాల ఫండ్లు.. అందులో పలు రకాల ఆప్షన్లు ఉంటాయి. ఇందులో ఏది మనకు సరైనదో నిర్ణయించుకోవడమే కీలకం. అందులోనూ గ్రోత్ ఆప్షన్, డివిడెండ్ ఆప్షన్‌ను ఎంచుకోవడంలో పూర్తి అవగాహనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఏది ఎంపిక చేసుకోవాలి?

గ్రోత్, డివిడెండ్ ఆప్షన్లను ఎంచుకునేందుకు రెండు కీలక అంశాలను పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది.

- నగదు అవసరం, ఎంత వ్యవధిలో కావాలి
- పన్ను ప్రయోజనాలు.

చాలామంది పన్ను ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఆప్షన్ ఎంపికను నిర్ణయించుకుంటారు. ఇది, ప్రధానమే అయినప్పటికీ.. దీనితోపాటు పరిశీలించాల్సిన ఇతర విషయాలూ కొన్ని ఉన్నాయి.

ఈక్విటీ ఫండ్లలో..

సులభంగా అర్థం చేసుకునేందుకు ఈక్విటీ ఫండ్ల పనితీరును పరిశీలిద్దాం.. సాధారణంగా ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పెట్టుబడులు అంటే.. దీర్ఘకాలానికి ఉద్దేశించినవి. వీటిని ఎంపిక చేసుకునేప్పుడే ఏదైనా కొన్ని సంవత్సరాల తర్వాత నిర్ణీత ఆర్థిక లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టేందుకు అని భావించాలి. అంటే, ఈ ఫండ్లలో మదుపు చేసినప్పుడు పెట్టుబడులను కొనసాగిస్తూనే ఉండాలి. కానీ, వెనక్కి తీసుకునే ప్రయత్నాలు చేయకూడదు. అప్పుడే ఈ ఫండ్ల ద్వారా వచ్చే చక్రవడ్డీ ప్రభావం మనకు మంచి లాభాలను సంపాదించి పెడుతుంది. అదే సమయంలో దీర్ఘకాలిక మూలధన లాభానికి ఎలాంటి పన్నూ వర్తించదు. అందుకే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకునేప్పుడు.. గ్రోత్ ఆప్షన్‌ను లేదా డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవడమే ఉత్తమం.

అయితే ఇక్కడా కొన్ని మినహాయింపులు ఉన్నాయి. ఇందులో ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టార్ ఫండ్లు, థీమ్ ఫండ్లను ఎంచుకునేప్పుడు డివిడెండ్ పే ఔట్ ఐచ్ఛికాన్ని ఎంచుకోవడమే మంచిది. లేదా సమయానుకూలంగా మంచి రాబడులు వచ్చినప్పుడు ఆ లాభాలను స్వీకరిస్తుండాలి. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందేందుకు ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో (ఈఎల్ఎస్ఎస్) మదుపు చేసినప్పుడు కనీసం మూడేళ్లపాటు పెట్టుబడిని కొనసాగించాల్సి ఉంటుంది. ఈ లాకిన్ వ్యవధిలో వచ్చిన రాబడులు వెంటవెంటనే స్వీకరించేందుకు డివిడెండ్ పేఔట్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. ముఖ్యంగా 50ఏళ్లకు పైబడినవారు, నష్టభయాన్ని భరించే శక్తి తక్కువగా ఉన్నవారు ఈ ఆప్షన్‌ను ఎంచుకోవడం మేలు.

యువ మదుపరులు ఈఎల్ఎస్ఎస్‌లలో గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకోవడమే సరైనది.

డెట్ పథకాల్లో....

ఈక్విటీ పథకాల్లో ఏ ఆప్షన్‌ను ఎంచుకోవాలో అర్థం చేసుకోవడం సులభమే. కానీ, డెట్ పథకాల విషయానికి వచ్చేసరికి ఇందులో కొంత సంక్లిష్టత ఉంటుంది. ఇందులో అందే డివిడెండుకు.. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) వర్తిస్తుంది. అంటే మరేమిటో కాదు.. మీకు అందే డివిడెండ్లపైన పన్ను అన్నమాట. అయితే, ఇది మీకు అందిన డివిడెండ్ల నుంచి కాకుండా.. ఎన్ఏవీ నుంచి తగ్గిస్తారు. ఈ నేపథ్యంలో. . డివిడెండ్ పేఔట్, డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లు పన్ను పరంగా అంత కలిసొచ్చే వీలుండదు. మరి, ఇలాంటప్పుడు ఏ ఆప్షన్ ఎంచుకోవడం కలిసొస్తుంది?

- ఎప్పటికప్పుడు నగదు తీసుకోవాలనుకుంటే.. డెట్ పథకాల్లో మదుపు చేసిన తర్వాత.. నిర్ణీత వ్యవధుల్లో కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకోవాలని భావించే వారు డెట్ ఫండ్లలోని ఈక్విటీ ఆప్షన్‌లో మదుపు చేసి, క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడాన్ని (ఎస్‌డబ్ల్యూపీ) పరిశీలించవచ్చు. ముఖ్యంగా 10%, 20% పన్ను శ్లాబులో ఉన్నవారు దీన్ని పాటించడం కలిసొస్తుంది. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మీరు వెనక్కి తీసుకునే మొత్తానికి అమ్మకపు రుసుము లేకుండా చూసుకోవాలి. దీనికోసం ఫండ్ ఎన్నాళ్ల తర్వాత అమ్మకపు రుసుము విధించడం లేదనే విషయాన్ని తెలుసుకోవాలి.

ఎప్పటికప్పుడు పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలనుకుంటే... ఎవరు ఏ ఆప్షన్‌ను ఎంచుకోవాలో చూద్దాం!

ఉపసంహరణ వ్యవధి	10-20% శ్లాబు పన్ను	30% పన్ను శ్లాబు
కొన్న తర్వాత 3ఏళ్లలోపు	ఎస్‌డబ్ల్యూపీ	డివిడెండ్ చెల్లింపు
కొన్నాక 3ఏళ్ల తర్వాత	ఎస్‌డబ్ల్యూపీ	ఎస్‌డబ్ల్యూపీ

30శాతం పన్ను శ్లాబులో ఉన్నవారు.. మూడేళ్లలోపే పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని భావించినప్పుడు డివిడెండ్ చెల్లింపు ఐచ్ఛికాన్ని ఎంచుకోవచ్చు. అదే సమయంలో మూడేళ్లకు మించి పెట్టుబడులను కొనసాగించాలనుకున్నప్పుడు గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకోవడమే మంచిది. దీనిద్వారా మూలధన రాబడిపై ద్రవ్యోల్బణ సూచీ సర్దుబాటు ప్రయోజనం లభిస్తుంది. ఇలాంటి సందర్భంలో క్రమం తప్పకుండా పెట్టుబడిని వెనక్కి తీసుకునేందుకు ఎస్‌డబ్ల్యూపీని ఎంచుకోవచ్చు. మీరు పెట్టిన ప్రతి పెట్టుబడీ మూడేళ్లకు మించి కొనసాగేలా చూసుకోండి.

ఆప్షన్లలో ఒకదాని నుంచి మరొకదానికి మారే అవకాశం ఉన్నప్పటికీ.. లాభాలు ఆర్జించినప్పుడు అనవసరంగా పన్ను చెల్లించాల్సిన అవసరం రావచ్చు. దీన్ని నివారించేందుకు పెట్టుబడులు ప్రారంభించేప్పుడే.. దాన్ని ఎంత వ్యవధి వరకూ కొనసాగిస్తారనే అంశంలో ఒక స్పష్టత ఉండాలి.

డెట్ ఫండ్లలో దీర్ఘకాలం కొనసాగుతూ.. పెట్టుబడులను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేదనుకున్నప్పుడు వ్యూహం వేరే విధంగా ఉంటుంది. ఇలాంటి వారు డివిడెండ్ చెల్లింపు, ఎస్‌డబ్ల్యూపీలను ఎంచుకోవాల్సిన అవసరం లేదు. గ్రోత్ లేదా డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌ను పరిశీలించాలి.

పెట్టుబడిని కొనసాగించాలని భావించే వారు గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా ప్రయోజనాన్ని పొందే అవకాశం ఉంది. మూడేళ్లలోపే వెనక్కి తీసుకోవాలని భావించే 30శాతం పన్ను శ్లాబులో ఉన్నవారు.. డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిశీలించవచ్చు. వీరితోపాటు స్వల్పకాలిక వ్యవధికి లిక్విడ్, అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్లను ఎంచుకోవాలని భావించేవారికి డీడీటీ 28.33 (సర్‌ఛార్జి, సెస్సులతో కలిపి) వర్తిస్తుంది. 30.9శాతం ఆదాయపు పన్ను శ్లాబు కన్నా ఇది కొంత తక్కువే.

పెట్టుబడుల నుంచి సొమ్మును వెనక్కి తీసుకోకూడదు అనుకునే వారు ఏ ఆప్షన్‌ను ఎంచుకోవాలో చూద్దాం!

ఉపసంహరణ వ్యవధి	10-20% శ్లాబు పన్ను	30% పన్ను శ్లాబు
కొన్న తర్వాత 3ఏళ్లలోపు	గ్రోత్ ఆప్షన్	డివిడెండ్ తిరిగి పెట్టుబడి
కొన్నాక 3ఏళ్ల తర్వాత	గ్రోత్ ఆప్షన్	గ్రోత్ ఆప్షన్

మీరు కొత్తగా పెట్టుబడి పెడుతూ.. ఏ ఆప్షన్‌ను ఎంచుకోవాలనే ప్రశ్న వచ్చినప్పుడు ఈ అంశాలన్నీ పరిశీలించండి. ఒకవేళ ఇప్పుడు ఫండ్ ఆప్షన్‌ను మార్చుకోవాలనుకుంటే.. వర్తించే రుసుములను, పన్ను భారాన్నీ పరిశీలించండి.

- విద్యా బాల, హెడ్, మ్యూచువల్ ఫండ్ రీసెర్చ్, FundsIndia.com

సిరి ఇన్వెస్టర్స్ క్లబ్

RELIANCE MUTUAL FUND

షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలా? భవిష్యత్తు లక్ష్యాల కోసం ఏ పథకాలు ఎంచుకోవాలో తెలియడం లేదా? అయితే, సిరి ఇన్వెస్టర్స్ క్లబ్, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మదుపరుల అవగాహన సదస్సుకు హాజరవ్వండి.

విజయవాడ

వేదిక: వేదిక కల్యాణ మండపం
తేదీ: ఆగస్టు 05, 2017 (శనివారం)
సమయం: 05:00 pm to 8:00pm
ఉచిత సభ్యత్వ నమోదు కోసం.. ఫోన్:8008551055 లేదా SIRIVJA<SPACE> NAME టైప్ చేసి 9246190909కు సందేశం పంపించండి.

రాజమహేంద్రవరం

వేదిక: రివర్ బే రిసార్ట్స్, గౌతమి ఘాట్ దగ్గర, రాజమహేంద్రవరం.
తేదీ: ఆగస్టు 06, 2017 (ఆదివారం)
సమయం: 10:00 am to 1:00 pm ఫోన్:8008376262 లేదా SIRIRJY<SPACE> NAME టైప్ చేసి 9246190909కు సందేశం పంపించండి.

విదేశీ ప్రయాణాల్లో తోడు..

తరచూ విదేశీ ప్రయాణాలు చేసే వారికి ఉపయోగపడేలా స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు ఒక కొత్త కరెన్సీ కార్డును విడుదల చేసింది. 'మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్' పేరుతో అందిస్తోన్న ఈ కార్డు దాదాపు 20దేశాల్లో చెల్లుబాటు అవుతుంది. వినియోగదారులు తాము అత్యధికంగా ప్రయాణించే దేశాలకు సంబంధించిన కరెన్సీలను ఈ కార్డులో నింపుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా దీనిలో నగదును నింపుకొనే వెసులుబాటు ఉంది. అమెరికా, బ్రిటన్, సింగపూర్, స్విట్జర్లాండ్, థాయ్‌లాండ్, జపాన్, దక్షిణాఫ్రికా తదితర దేశాల కరెన్సీని ఒకే కార్డుతో వాడుకునేందుకు వీలుగా దీన్ని అందిస్తోంది. విదేశీ ప్రయాణాల్లో తరచుగా ఎదురయ్యే కరెన్సీ ఒడిదుడుకుల నుంచి కూడా ఈ కార్డు రక్షణ కల్పిస్తుంది. కార్డులో కరెన్సీ నింపేప్పుడు ఏ మార్పిడి రేటు ఉందో.. ఆ రేటు ప్రకారమే చెల్లింపులు చేయవచ్చు. ఈ కార్డు తీసుకున్న వారికి ప్రయాణ బీమా సౌకర్యాన్ని కూడా అందిస్తోంది. కార్డు పోయినప్పుడు, లేదా ఏదైనా మోసం జరిగినప్పుడు రూ. 5లక్షల వరకూ రక్షణ కల్పిస్తుంది. బ్యాగులు, వ్యక్తిగత పత్రాలు పోయినప్పుడు రూ. 1లక్ష వరకూ పరిహారం ఇస్తుంది. వ్యక్తిగత ప్రమాద బీమాతోపాటు.. విమాన ప్రమాదం వల్ల ఏదైనా జరిగితే రూ. 50లక్షల వరకూ పరిహారం చెల్లిస్తుంది.

క్యాన్సర్.. కాదిక భారం!

క్యాన్సర్ బారిన పడితే.. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఆర్థికంగా కొంత అండగా ఉండాలని భావించేవారికి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఒక వినూత్న పాలసీని అందుబాటులోకి తెచ్చింది. దీనిపేరు 'ఎస్‌బీఐ లైఫ్ సంపూర్ణ క్యాన్సర్ సురక్ష' పాలసీ. దీని వివరాలేమిటో చూద్దామా!

కొత్త పథకం

క్యాన్సర్ వచ్చినప్పుడు.. దాన్ని గుర్తించిన వెంటనే నిర్ణీత పరిహారాన్ని అందించే పాలసీ ఇది. స్టాండర్డ్, క్లాసిక్, ఎన్‌హాన్స్‌డ్ పేర్లతో ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎన్‌హాన్స్‌డ్ ఎంచుకున్నప్పుడు మైనర్, మేజర్ దశల్లో పరిహారం అందించడంతోపాటు, అడ్వాన్స్‌డ్ దశలో అదనపు పరిహారం అందిస్తుంది. దీంతోపాటు పాలసీ విలువ తిరిగి యథాతథ స్థితికి చేరుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది. పాలసీ తీసుకునేందుకు ఎలాంటి ఆరోగ్య పరీక్షలు అక్కర్లేదు. వైద్య ఖర్చులతో నిమిత్తం లేకుండా పరిహారం ఇస్తుంది. మేజర్ దశ క్యాన్సర్‌ను గుర్తించినప్పుడు నెలవారీ చెల్లింపుల విధానంలో పరిహారాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఇలా మూడేళ్లపాటు పరిహారం పొందవచ్చు. ప్రీమియం వైవర్ రైడర్‌ను కూడా జోడించుకునే వీలుంది. మరో వైద్యుణ్ని సంప్రదించి, సలహా తీసుకునేందుకు అయ్యే ఖర్చును కూడా పాలసీ భరిస్తుంది.


పాలసీని కనీసం 6ఏళ్ల వయసు నుంచి గరిష్ఠంగా 65 ఏళ్ల వరకూ ఎవరైనా తీసుకోవచ్చు. పాలసీ గరిష్ఠంగా 75ఏళ్ల వరకూ వర్తింపచేస్తారు. కనీసం 5ఏళ్లపాటు, గరిష్ఠంగా 30ఏళ్ల పాటు పాలసీ వ్యవధిని ఎంచుకోవాలి. పాలసీ విలువ కనీసం రూ. 10లక్షలు.. గరిష్ఠంగా రూ. 50లక్షలు. వ్యాధి వివిధ దశలను బట్టి, మూడు అంచెల్లో చెల్లింపులను చేస్తుంది పాలసీ. ఎంచుకున్న మొత్తం, పాలసీని బట్టి 30%, 150%, 150% వరకూ చెల్లింపులను చేస్తుంది. క్యాన్సర్‌ను గుర్తించినప్పుడు ఇచ్చే పరిహారంలో 60శాతాన్ని ఒకేసారి చెల్లించేలా.. మిగతా 40శాతాన్ని నెలకు ఇంత చొప్పున చెల్లించే ఏర్పాటును పాలసీ తీసుకునేప్పుడే చేసుకోవచ్చు.

30 ఏళ్ల వ్యక్తి రూ. 50లక్షల పాలసీని 30ఏళ్ల వ్యవధికి తీసుకుంటే.. స్టాండర్డ్‌లో రూ. 4,870, క్లాసిక్‌లో రూ. 5,725, ఎన్‌హాన్స్‌డ్‌లో రూ. 7,015 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. (జీఎస్‌టీ అదనం). 40ఏళ్ల వ్యక్తికి ఈ ప్రీమియాలు వరుసగా.. రూ. 13,355; రూ. 16,105; రూ. 20,470. చెల్లించిన ప్రీమియాలకు సెక్షన్ 80డీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు పొందే అవకాశం ఉంది.

(పాలసీకి సంబంధించిన పూర్తి వివరాలకు www.eenadusiri.net చూడండి.)

తీవ్ర వ్యాధులు వచ్చినా.. చింత లేకుండా!

తీవ్ర వ్యాధులు సోకితే ఉండే మానసిక, శారీరక బాధలు వర్ణనాతీతం. దీంతోపాటు ఆర్థికంగా వచ్చే ఇబ్బందులు కోలుకోలేని దెబ్బ తీస్తాయి. గుండె, క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధులు వచ్చినప్పుడు అటు సంపాదనపై ప్రభావం పడుతుంది. ఇటు వైద్య చికిత్సలకు లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఆర్థికంగా ఆదుకునే ప్రత్యేక బీమా పాలసీల అవసరం ఎంతైనా ఉంది.



నేటి యువత కాలంతోపాటు పోటీ పడుతోంది. ఈ నేపథ్యంలో సంపాదన గురించి ఆలోచిస్తూ.. వారు తమ ఆరోగ్య విషయాలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆహార అలవాట్లు మారుతున్నాయి. జీవన శైలిలో తేడా వస్తోంది. ఈ నేపథ్యంలో గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధుల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దాదాపు 50శాతం మరణాలు ఈ రెండు వ్యాధులతోనే అనేది ఆందోళన కలిగించే విషయమే. నివేదికల ప్రకారం మన దేశంలో అత్యధిక గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. ఏటా దాదాపు 2లక్షలకు మించి గుండె శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఇక క్యాన్సర్ కూడా మన దేశంలో తీవ్రంగానే ప్రభావం చూపిస్తోంది. 2020నాటికి క్యాన్సర్ కేసులు 25శాతం పెరిగే ప్రమాదం ఉందని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి.

క్యాన్సర్, గుండె వ్యాధులకు సంబంధించిన ఈ గణాంకాలు ఆందోళన కలిగించే మాట వాస్తవమే. అయితే, వీటిని ఎదుర్కోవడానికి వైద్య పరిశోధనలు కూడా తీవ్రంగానే కొనసాగుతున్నాయి. వీటికి చికిత్స కూడా ఇప్పుడు పూర్తిస్థాయిలో సాధ్యమే. సరైన సమయానికి సరైన వైద్యం అందడమే ఇక్కడ ముఖ్యం. అయితే, ఈ వైద్యం కాస్త ఖరీదైనదే. ఈ రెండు వ్యాధులను కూడా తీవ్ర వ్యాధులుగానే పరిగణించాలి. పైగా వీటికి దీర్ఘకాలంపాటు వైద్య చికిత్స, ఔషధాలను వాడాలి. తరచూ ఆసుపత్రికి వెళ్లాలి. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందన్నది కూడా కచ్చితంగా చెప్పడం కష్టమే.

ఒకసారి ఇవి సోకితే.. చికిత్స కోసం ఎంత ఖర్చవుతుందనేది ప్రతి కుటుంబానికీ తెలిసి ఉండాలి. ఆర్జించే ప్రతి వ్యక్తీ తాను దీనికి సిద్ధంగా ఉన్నానా అనేది పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. గుండెపోటు వచ్చినప్పుడు ఆసుపత్రిలో చేరితే.. బైపాస్ లాంటివి అవసరం అయినప్పుడు దాదాపు రూ. 10లక్షల వరకూ ఖర్చవుతుంది. క్యాన్సర్ బారినపడ్డప్పుడు కీమోథెరపీ కోసం దాదాపు రూ. 15లక్షల వరకూ కావాల్సి వస్తుంది. చేరిన ఆసుపత్రి, కీమోథెరపీలను బట్టి, ఇంతకన్నా అధికంగానే అవసరపడొచ్చు.

కుటుంబంలో ఆర్జించే వ్యక్తికే ఇలాంటి వ్యాధులు వస్తే.. పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. కుటుంబానికి క్రమం తప్పకుండా రావాల్సిన ఆదాయం కూడా ఆగిపోవచ్చు. అదే సమయంలో భవిష్యత్తులో ఆర్జన శక్తి కూడా సన్నగిల్లే అవకాశం లేకపోలేదు. దీనివల్ల కుటుంబం ఆర్థిక జీవన శైలి దెబ్బతింటుంది.

ఆరోగ్య బీమా ఉన్నా..

ప్రతి వ్యక్తికీ ఆరోగ్య బీమా ఉండాలనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే, సాధారణంగా ఒక వ్యక్తి దాదాపు రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షల వరకూ మాత్రమే ఆరోగ్య బీమా తీసుకుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఏ మాత్రం సరిపోదనే చెప్పుకోవాలి. ముఖ్యంగా గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చినప్పుడు అయ్యే ఖర్చుకూ.. ఉన్న బీమాకూ ఏ మాత్రం పొంతన ఉండదు. అందులోనూ ఆరోగ్య బీమా పాలసీ ఆసుపత్రిలో చేరినప్పుడు అయ్యే ఖర్చులకు మాత్రమే పరిహారం ఇస్తుంది. దీర్ఘకాలిక అవసరాలకు సరిపోయేలా ఆర్థిక భద్రత లభించదు. ఈ నేపథ్యంలోనే గుండె, క్యాన్సర్ వ్యాధులకు ప్రత్యేక పాలసీల అవసరం పెరుగుతోంది. ఇవి అందుబాటు ధరల్లోనే లభిస్తాయి. ఉదాహరణకు 30 ఏళ్ల పొగతాగని వ్యక్తి ఏడాదికి రూ. 1200 వరకూ చెల్లిస్తే చాలు.. రూ. 10లక్షల హార్ట్ కవర్ తీసుకోవచ్చు. అదే క్యాన్సర్ కవర్ అయితే రూ. 20 లక్షల వరకూ లభిస్తుంది.

- ప్రస్తుతం కొన్ని జీవిత బీమా సంస్థలు గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించగానే పరిహారం అందించేలా పాలసీలను అందిస్తున్నాయి. దీనివల్ల పాలసీదారుడు తనకు ఇష్టం వచ్చిన చోట మంచి చికిత్స పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడులు, పిల్లల చదువులకు దాచుకున్న మొత్తం, ఇంటి కొనుగోలు, పదవీ విరమణకు దాచుకున్న మొత్తాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవచ్చు.
- ప్రస్తుత డిజిటల్ యుగంలో సరైన పాలసీని ఎంపిక చేసుకోవడం ఏమంత కష్టం కాదు. సరైన పాలసీని, సరైన మొత్తానికి క్షణాల్లో ఎంచుకోవచ్చు. పాలసీలను ఎంచుకునేప్పుడు ఈ వ్యాధులు సోకినప్పుడు పూర్తి స్థాయిలో పరిహారం లభించే పాలసీలను పరిశీలించడం తప్పనిసరి.

- పునీత్ నందా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్.

రెండు సార్లు పరిహారం...

పాలసీదారుడికి అనుకోనిదేదైనా జరిగినప్పుడు పరిహారం అందించడంతోపాటు, పాలసీ వ్యవధి తర్వాత మరోసారి పాలసీ విలువను చెల్లించేలా సరికొత్త పాలసీని ఫ్యూచర్ జెనరలీ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ విడుదల చేసింది. దీనిపేరు న్యూ అస్యూర్ ప్లస్. ఈ పాలసీలో పరిహారాన్ని రెండు విధాలుగా ఎంచుకోవచ్చు. కనీసం 3ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయసువారు ఈ పాలసీని తీసుకునే అవకాశముంది. చెల్లించిన ప్రీమియానికి 10రెట్ల వరకూ బీమా రక్షణ ఉంటుంది. కనీస ప్రీమియం రూ. 10వేలు. ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. పాలసీని 10 నుంచి 30ఏళ్ల వ్యవధికి ఎంచుకోవచ్చు. పాలసీదారుడు మరణిస్తే.. వెంటనే పాలసీ మొత్తాన్ని పరిహారంగా నామినీకి అందిస్తారు. పాలసీ వ్యవధి ముగిసేంత వరకూ ఎలాంటి ప్రీమియాలు కట్టక్కర్లేదు. వ్యవధి ముగిసిన తర్వాత మరోసారి ఆ విలువను అందిస్తారు. ప్రీమియాన్ని ఏడాదికోసారి, ఆరు, మూడు నెలలు, నెలకోసారి చెల్లించే వీలుంది.

రక్షణ.. రాబడి కోసం..

తగ్గుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో.. మదుపరులకు కాస్త అధిక రాబడి అందించేందుకోసం స్థిరాదాయ పథకాల్లో మదుపు చేసే వ్యూహంతో రిలయన్స్ డ్యూయల్ అడ్వాంటేజ్ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఫండ్ -9 ప్లాన్ డి అందుబాటులోకి వచ్చింది. పెట్టుబడి మొత్తంలో కొంత భాగాన్ని స్థిరంగా రాబడినిచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా కచ్చితమైన రాబడి, పెట్టుబడికి రక్షణ కల్పించడం దీని లక్ష్యం. అదే సమయంలో పెట్టుబడి వృద్ధి కోసం ఈక్విటీ ఆధారిత పథకాల్లో కూడా మదుపు చేస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 5వేలు. ఆగస్టు 14 వరకూ మదుపు చేసేందుకు వీలుంది.

- డెట్, స్థిరాదాయ పథకాల్లో మదుపు చేసే లక్ష్యంతో.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ సిరీస్ 81 ఫండ్‌ను విడుదల చేసింది. ఇది క్లోజ్ ఎండెడ్ పథకం. పెట్టుబడిని 1100 రోజులపాటు కొనసాగించాల్సి ఉంటుంది. కనీస పెట్టుబడి రూ. 5వేలు. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఆగస్టు 10.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వడ్డీ రేట్లు...

పెట్టుబడికి రక్షణ, రాబడికి కచ్చితమైన హామీ ఉండే పథకాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లే ముందు వరుసలో ఉంటాయి. ఇటీవల ఆర్‌బీఐ రెపో రేటును పావుశాతం తగ్గించడంతో వీటిపై వడ్డీ తగ్గే అవకాశం ఉంది. అయినప్పటికీ స్వల్పకాలిక అవసరాల కోసం వీటిలో పొదుపు చేసేవారు అధికంగానే ఉంటారు. చాలా బ్యాంకులు కనీసం 7 రోజుల వ్యవధికీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందిస్తున్నాయి. పొదుపు ఖాతాలో అధిక మొత్తం నిల్వ ఉన్నవారు ఫ్లెక్సీ డిపాజిట్లుగా వాటిని మార్చుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో వివిధ వ్యవధులకు కొన్ని బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్ల వివరాలు మీ కోసం...

బ్యాంకు	వ్యవధి (ఏళ్లలో)			
	180-364రోజులు	1-2	2-3	3-5
యాక్సిస్ బ్యాంక్	6.50	6.25-6.75	6.25	6.25
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50-6.75	6.50	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25- 6.40	6.50-6.65	6.50	6.50
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.70	6.65	6.60
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.50-6.60	6.50	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6.25-6.35	6.60	6.60	6.50
ఇండియన్ బ్యాంక్	5.25-6.25	6.25-6.50	6.25	6.00
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.50-6.75	6.85	6.50	6.50
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.50-6.75	6.25	6.25
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.50-6.75	7.05-7.15	6.75	6.75
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.90-7.00	6.80-7.00	6.80	6.80
విజయ బ్యాంక్	5.25-6.25	6.50	6.50	6.50
ద ఫెడరల్ బ్యాంక్	6.25-6.50	6.60-6.70	6.50	6.50-7.00
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25-6.80	6.00	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6.00-6.50	6.75	6.50	6.50
ఐడీబీఐ బ్యాంక్	6.00- 6.50	6.50-6.75	6.25	6.25
కెనరా బ్యాంక్	6.35	6.65-6.75	6.65	6.65
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.50-6.75	6.50-6.75	6.50	6.25
సౌత్ ఇండియన్ బ్యాంక్	6.00	6.75	6.50	6.50
దేనా బ్యాంక్	6.50-6.80	6.80	6.80	6.80
యూకో బ్యాంక్	6.00- 6.35	6.55-6.65	6.40	6.40
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.50-6.60	6.60
ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్	6.80-6.90	7.00-7.10	6.90	6.80
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	6.85-7.10	7.10	7.00	6.60
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్	6.50-7.00	6.80	6.60	6.50
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	6.50	7.50	7.00	7.00

వడ్డీ రేట్లు శాతాల్లో. ఆగస్టు 3, 2017 నాటికి. (సీనియర్ సిటిజన్లకు 0.25 నుంచి 0.75 శాతం అదనం). ఇవి ఎప్పటికప్పుడు మారవచ్చు. పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పూర్తి వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. - www.apnapaisa.com

మూగవేదన.. ఏదీ సాంత్వన



■ రోగమొస్తే బతికించే పశువైద్యం గగనం ■ ఒక్కో పశువుకు ఏటా రూ. 7
■ అరకొర బడ్జెట్.. అదీ ఆలస్యంగా విడుదల ■ మందుల ధరలు ఏటా భారీగా పెరుగుదల
■ రాష్ట్రంలో 73 పశువైద్యుల పోస్టులు ఖాళీ ■ పోస్టులిస్తామన్నా అర్హతలున్నవారూ కరవే
■ వైద్యుడు సెలవు పెడితే.. అటెండరే పెద్దదిక్కు ■ పాడి పశువు చనిపోతే రైతుకు తీవ్ర నష్టం

మంగమూరి శ్రీనివాస్
ఈనాడు - హైదరాబాద్

ఒకవైపు పాడి భారమవుతోంది.. పశుపోషణ కొండెక్కుతోంది.. దీనికి తోడు పశువైద్యం లభించక రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వపరంగా సరైన చేయూత లభించక ఆందోళన చెందుతున్నారు. పశువుల ధరలు ఆకాశాన్నంటుతున్నందున ఇప్పటికే రైతుకు పాడి ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. దీనికితోడు అవి రోగాల బారిన పడి మరణిస్తే రైతు కుటుంబం తీవ్రంగా దెబ్బతింటోంది. పలు గ్రామాలకు పశువైద్యశాలలు సుదూరంగా ఉండటం వల్ల అత్యవసర వైద్యం అందడం లేదు. ఒకవేళ వైద్యశాలలు అందుబాటులో ఉన్నా సరైన మందులు దొరకడంలేదు. ఖరీదైన మందులను బయట కొని తెచ్చుకోమంటున్నారు. తెలంగాణలో కోట్ల సంఖ్యలో వివిధ రకాల మూగజీవాలున్నాయి. కానీ రైతులకు ఆదాయాన్నిచ్చే ఆవులు, గేదెలు, దున్నలు, గిత్తలు, గొర్రెలు, మేకల లెక్కలనే పరిగణలోకి తీసుకుని మందులకు బడ్జెట్ కేటాయిస్తున్నారు. వీటిలోనూ ఏటా 20 శాతం లోపే రోగాలతో పశువైద్యశాలలకు వస్తున్నాయని, వాటి వరకూ రూ. 20 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్ లెక్కలు చెబుతున్నారు. ఒక్కో మూగజీవి వైద్యానికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న సగటు బడ్జెట్ రూ. 7 మాత్రమే. ఈ సొమ్మయినా సకాలంలో ఇస్తున్నారా అంటే అదీ లేదు. పశువుల లెక్కలకు సంబంధం లేకుండా నిధులు మంజూరు చేస్తుండటంతో వాటిని ఏలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అందుబాటులో లేని వైద్యశాలలు..

పలు గ్రామాలకు పశువైద్యశాలలు సుదూరంగా ఉండటం వల్ల అత్యవసర వైద్యం అందడం లేదు. ఉదాహరణకు మంచిర్యాల జిల్లాలో విస్తీర్ణంలో అతిపెద్దదైన కోటపల్లి మండలంలో మండల కేంద్రం తప్పితే ఏ గ్రామంలోనూ గ్రామీణ పశువైద్యశాల లేదు. మండల కేంద్రానికి సుమారు 35 కిలోమీటర్ల మేర దూరం ఉన్న వెంచపల్లి, సూపాక, జనగామ, ఆల్‌గామ, అర్జునగుట్ట, అన్నారం, సిర్సా తదితర గ్రామాల్లో పశువులకు ఏ రోగం వచ్చినా మండల కేంద్రంలో ఉన్న వైద్యుడే వెళ్లాలి. అనేక సందర్భాల్లో వైద్యుడు అందుబాటులోకి లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇక పశువైద్యుడు గ్రామాల్లో తిరిగే సమయంలో ఆసుపత్రి మూత వేయాల్సి వస్తోంది. సుదూరంలోని గ్రామాల నుంచి పశువులను ఆస్పత్రికి తీసుకురావడం రైతులకు తలకుమించిన భారమవుతోంది.

5 వేల పశువులకొక వైద్యుడుండాలి

దేశంలో ప్రతీ 5 వేల పశువులకు ఒక పశువైద్యుడిని నియమించాలని జాతీయ వ్యవసాయ కమిషన్ 1976లోనే సిఫార్సు చేసింది. గేదె, దున్న, ఆవు, గిత్త కలిపి ఒక్కోటీ ఒక్కో యూనిట్ అని అర్థం. అంటే ఏదైనా గ్రామంలో 5 వేల ఆవులుంటే ఒక వైద్యుడుండాలి. ఈ 4 రకాల పశువుల్లో ప్రతీ 5 వేల కొకరు ఉండాలి. కానీ గొర్రె లేదా మేకలైతే ప్రతీ ఐదింటిని ఒక యూనిట్‌గా లెక్కిస్తారు. అంటే 5 వేల గొర్రెల యూనిట్లు అంటే 25 వేల గొర్రెలని అర్థం. రాష్ట్రంలో కేవలం గేదె, దున్న, ఆవు, గిత్త, గొర్రె, మేకలు మాత్రమే కోటీ 21 లక్షల యూనిట్లు ఉన్నాయి. వీటికి మాత్రమే పశువైద్యం అందిస్తున్నట్లు లెక్కలు రాస్తున్నారు. వీటికైనా 2100 మంది పశువైద్యులుండాలి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారు 887 మంది మాత్రమే. మరో 73 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర జంతువులను కూడా కలిపి లెక్కిస్తే పశువైద్యుల సంఖ్య వేలల్లో పెరుగుతుంది. ఉదాహరణకు రాష్ట్రంలో 8.17 కోట్ల బ్రాయిలర్ కోళ్లు ఉన్నాయి. వీటిని ప్రతీ 100 కోళ్లను ఒక యూనిట్‌గా లెక్కించాలి. ఈ లెక్కన ప్రతీ 5 లక్షల కోళ్లకొక వైద్యుడుండాలి. కానీ బ్రాయిలర్ కోళ్లను ప్రైవేటు వ్యక్తులు పెంచుతున్నారని, వాటిని పశువైద్యం లెక్కల్లో చూపడం లేదు.

పశువైద్య సహాయకులు ఏరీ..

రాష్ట్రంలో పశువైద్యశాలల్లో 744 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉదాహరణకు ఆదిలాబాద్ జిల్లాలో 27 మంది పశువైద్యులు అవసరం కాగా 19 మంది పని చేస్తున్నారు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన పశువైద్య సహాయకులు 21 మందికి ఒక్కరు మాత్రమే ఉన్నారు. పశు గణాభివృద్ధి సహాయకుల పోస్టులు ఎనిమిది ఉండగా, ఒక్కరు కూడా లేరు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో గోపాల మిత్రలతోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంది. ఈ జిల్లా మొత్తంలో 27 పశువైద్యశాలలకు గాను ఆరు మాత్రమే బాగున్నాయి. మిగిలిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పశువైద్యశాలల్లో ఖాళీల భర్తీకి ఇటీవలే ప్రభుత్వం అనుమతించింది.

చర్మం కాలినా మందులివ్వలేకపోయారు

హైదరాబాద్ చుట్టుపక్కల సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట తదితర జిల్లాల పరిధిలోని వివిధ రసాయన పరిశ్రమల నుంచి విషపూరిత కాలుష్య రసాయనాలను రాత్రిపూట లారీల్లో తీసుకెళ్లి గ్రామాల వద్ద పారబోస్తున్నారు. పశువులు వాటిలోకి దిగగానే చర్మమంతా కాలిపోయి నరక యాతన అనుభవిస్తున్నాయి. పశువైద్యులకు సమాచారం అందినా మందులు లేక ఏం చేయలేకపోతున్నారు.

2012 లెక్కల ప్రకారం రాష్ట్రంలో మూగజీవాల లెక్కలు..

మొత్తం ఆవులు	29,17,701
ఎద్దులు	19,62,592
గేదెలు	40,40,965
దున్నలు	1,19,454
గొర్రెలు	1,28,35,782
మేకలు	45,75,695
పందులు	2,37,063
గుర్రాలు	3,286
గాడిదలు	2,902
ఒంటెలు	328
కుక్కలు	3,64,210
కుందేళ్లు	32,566

పశుగణన తేలేది ఎన్నడు?

2012లో దేశవ్యాప్తంగా మూగజీవాల గణాంకాలను సేకరించారు. తిరిగి ఇప్పుడు ఈ లెక్కల సేకరణ ప్రారంభించారు. ఇది పూర్తయి వెల్లడించడానికి మరో 6 నెలలు పడుతుంది.

రూ.30 కోట్లు అడిగితే రూ.20 కోట్లు ఇచ్చారు



ఈ ఏడాది పశువైద్యానికి రూ.30 కోట్లు కావాలని బడ్జెట్‌కు పశుసంవర్ధకశాఖ ప్రతిపాదనలు పంపింది. కానీ బడ్జెట్‌లో రూ.20 కోట్లు మంజూరు చేసి 4 నెలలకు గాను ఇప్పటికి రూ.3 కోట్లు విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్న కోట్లాది పశువులకు ఒక మాదిరి స్థాయిలో వైద్యం అందించాలంటే కనీసం రూ.80 కోట్లు ఇవ్వాలని ఓ అధికారి 'ఈనాడు'కు చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు చాలక ఆస్పత్రులకు వచ్చే పశువుల్లో సుమారు 30 శాతం వరకే మందులు ఇస్తున్నారు. ఉదాహరణకు ఈ ఏడాది (2017-18) రాష్ట్ర బడ్జెట్‌లో టీకాలకు కాకుండా.. సాధారణ పశువైద్యానికి రూ. 20 కోట్లు కేటాయించారు. నిబంధనల ప్రకారం నిధులను ప్రతీ 3 నెలలకు 25 శాతం చొప్పున విడుదల చేస్తే పశువైద్యశాలలకు సకాలంలో మందులు, పశువులకు వైద్యం అందుతాయి. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తొలి త్రైమాసికం గడిచింది. తొలి 25 శాతం కింద రూ. 5 కోట్లకు బదులు రూ. 3 కోట్లను మాత్రమే విడుదల చేశారు. వీటితో మందులను కొని తీరిగ్గా గత నెలలో గ్రామాల్లోని పశువైద్యశాలలకు పంపారు. ఇప్పుడు జులై, ఆగస్టు, సెప్టెంబరు రెండో త్రైమాసికంలోనూ ఒక నెల గడిచింది. దీనికి సంబంధించి మరో రూ. 5 కోట్లు, గత త్రైమాసికంలో మిగిలిన రూ. 2 కోట్లు ఎప్పుడొస్తాయో తెలియదు. అవి రావాలి.. మందులు కొనాలి.. మూగజీవాల రోగానికి వైద్యం చేయాలి. ఒకవేళ రైతులకు సొంతంగా మందులు కొనే స్థోమత లేక.. అప్పటిదాకా అవి బతికి ఉండకపోతే ఎవరూ చేసేదేమీ లేదు.

గొర్రెల పంపిణీ పథకంతో పశువైద్యులు కరవు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం కారణంగా పశువైద్యులు ఆస్పత్రులకు రావడం తగ్గిపోయింది. ఇతర రాష్ట్రాల్లో గొర్రెల కొనుగోలుకు పశువైద్యులు తప్పనిసరిగా వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రోజుల తరబడి వారు అటు వెళ్లడంతో ఆస్పత్రుల్లో వైద్యం చేసేవారు ఉండడంలేదు. కొన్నిచోట్ల అటెండర్లు తమకు తోచిన వైద్యం చేస్తున్నారు.

పాల కొరత తీవ్రం

వైద్యం సరిగా అందక పాడి పశువులు చనిపోయినప్పుడు నష్టపోయిన రైతులు పాడిని పూర్తిగా వదిలేస్తున్నారు. దీని వల్ల తెలంగాణలో పాల కొరత తీవ్రమై కల్తీ పాల తయారీ పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తోంది. పాడి పశువులు కొని రైతులకు ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలుచేస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొని ఇస్తున్నా వాటి ఆరోగ్య పరిరక్షణకు సరైన మందులు, సకాలంలో వైద్యులు అందుబాటులో లేక చనిపోతున్నాయి.

ఏటా లక్షకు పైగా దూడలు మృత్యువాత

తెలంగాణలో సగటున ఏటా 10 లక్షలకు పైగా దూడలు పుడుతున్నాయి. వీటిలో లక్షకు పైగా ఏడాదిలోపే మరణిస్తున్నాయని అంచనా. వీటిని కాపాడేందుకు వైద్యసేవలు అందుబాటులో లేవు. ప్రభుత్వం ఖరీదైన వీర్యం పంపిణీతో చేపడుతున్న కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో 2015-16లో 5.24 లక్షల దూడలు పుట్టాయి. కాని వాటిలో ఎన్ని బతికి ఉన్నాయనే లెక్కల్లేవు. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 53,711 దూడలు పుడితే 42,124 మాత్రమే మిగిలినట్లు తేలింది. రైతుల ఇళ్లలో పుడుతున్న వాటిలో ఎన్ని మరణిస్తున్నాయనే లెక్కలు కూడా పక్కాగా సేకరించడం లేదు.

600 పశువైద్యుల పోస్టులిస్తారా?

తెలంగాణలో రెండేళ్లలోగా కోటిన్నర గొర్రెలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే 7 లక్షల గొర్రెలు పంపిణీ పూర్తయింది. ప్రతీ 25 వేల గొర్రెలకొక వైద్యుడి చొప్పున కొత్తగా వచ్చే కోటిన్నర గొర్రెలకే అదనంగా 600 మంది పశువైద్యుల పోస్టులు మంజూరుచేసి నియమించాలి.

సర్కారుకే పట్టని నిబంధనలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చూస్తే.. ప్రజలకు మాంసం అమ్మడానికి ఉద్దేశించే ప్రతీ మేక, గొర్రె, కోడి లేదా ఇతర జంతువు ఏదైనా సరే కచ్చితంగా పశువైద్యుడు పరిశీలించి అవి ఆరోగ్యంగా ఉన్నాయని నిర్ధారించాకనే కోసి మాంసం అమ్మాలి. మాంసం దుకాణాల్లో ప్రతీ 200 గొర్రెలు లేదా మేకలకొక వైద్యుడుండాలి. వీరిని పంచాయతీలు, మున్సిపాలిటీలు నియమించాలి. కానీ రాష్ట్రంలో వేలాది మేకలు, గొర్రెలు, లక్షలాది కోళ్లు, ఇతర జంతువుల మాంసం అమ్ముతున్నా ఎవరూ తనిఖీ చేయడం లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో పశువైద్యుడు కచ్చితంగా పరిశీలించి సర్టిఫై చేసిన వాటినే కోసి ప్రజలకు అమ్ముతారు. ఇక్కడ ప్రభుత్వాలు తాము పెట్టిన నిబంధనలను తామే పట్టించుకోకపోవడం విశేషం.

తెలంగాణ పశువైద్యశాలల గణాంకాలు

పశువైద్య ఆస్పత్రులు - 1,020 | జిల్లా కేంద్ర ఆస్పత్రులు - 8

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు	గ్రామీణ పశుగణ సేవా కేంద్రాలు	గోపాలమిత్రులు
1	1,114	1,344
(ఇది రైతులకు దూరంగా హైదరాబాద్‌లో మాత్రమే ఉంది)	(వీటిలో వైద్యులుండరు.. పశువైద్య సహాయకులే ఉంటారు)	(వీరు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు)

పశువైద్యానికి బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లు)

సంవత్సరం	కేటాయింపు	విడుదల
2014-15	16	15.53
2015-16	16	15.35
2016-17	16.14	15.80
2017-18	20	3

రైతు ఇంటి వద్దకే వైద్యులను పంపుతాం



రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికొక సంచార పశువైద్యశాలలు ప్రారంభిస్తున్నాం. భవిష్యత్తులో వీటిని ప్రతీ మండలానికొకటి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. రోగాలబారిన పడిన పశువులను ఆస్పత్రికి తీసుకురావడం రైతులకు భారమవుతుందని వారి ఇళ్ల వద్దకే ఈ వైద్యశాల వెళుతుంది. రోగం ముదిరిన పశువును ఆస్పత్రికి వాహనంలో తరలించి అక్కడ ఉంచి వైద్యం చేసే స్థాయికి వైద్యశాలలను అభివృద్ధి చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. రోగాలు వచ్చిన తరవాత వైద్యం చేయడానికన్నా అవి రాకుండా టీకాలు వేయడంపై దృష్టి పెడుతున్నాం. రోగ నియంత్రణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా పనిచేస్తోంది.

– డాక్టర్ వెంకటేశ్వర్లు,
సంచాలకుడు, తెలంగాణ పశుసంవర్ధకశాఖ

సకాలంలో వైద్యం అందక ఎద్దు మృతి



నాకు ఒక గేదె, రెండు ఎద్దులున్నాయి. రెండు నెలల క్రితం ఒక ఎద్దు జబ్బుపడి నీరసంగా మారింది. రెండు మూడుసార్లు మండల కేంద్రం వెళ్లినప్పటికి ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ప్రైవేటుగా వైద్యం అందించాను. సకాలంలో వైద్యం అందకపోవడంతో ఎద్దు మృతిచెంది రూ. 25 వేల ఆర్థిక నష్టం వాటిల్లింది. సాగు పనుల కాలంలో రెండు ఎడ్లలో ఒకటి మృతి చెందడంతో చేతిలో డబ్బులేక మరొకటి కొనలేక సాగు మానుకోవాల్సి వచ్చింది.

– రావుల సత్తెన్న, నక్కలపల్లి, మంచిర్యాల జిల్లా

మేకలు చనిపోయి.. సర్వం కోల్పోయా..



మేకలపెంపకం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వాటిని మేతకోసం రోజు అడవికి తీసుకెళుతున్నాను రెండు నెలలక్రితం ఇప్పపువ్వును తినడంతో ఎనిమిది మేకలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వాటిని బతికించుకునేందుకు పశువైద్యుని కోసం ఎన్నిప్రయత్నాలు చేసినా దొరకలేదు. స్థానికంగా ఎలాంటి మందులు లభించకపోవడంతో గంటల వ్యవధిలోనే మేకలన్నీ మృతిచెందాయి. ఉన్న జీవనాధారం పోవడంతో కూలి పనులకు వెళ్లాల్సి వస్తోంది.

– ముల్కల్ల బాపు, వెంచపల్లి, మంచిర్యాల జిల్లా

చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా ఫర్వాలేదనిపిస్తోంది

- ముఖ్యమంత్రి కాదు.. ముఖ్య కంత్రి
- వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి



సభలో ప్రసంగిస్తున్న జగన్

కర్నూలు: హామీలిచ్చి నెరవేర్చని చంద్రబాబు చేస్తున్నది ప్రజా పాలనా? ..దొంగ పాలనా? అని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాదని.. ముఖ్య కంత్రి అని అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల పట్టణం ఎస్పీజీ మైదానంలో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. చంద్రబాబును చూసి అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఓ పిట్ట కథ చెప్పారన్నారు. 'అనగనగా ఓ ముద్దాయి.. జడ్జి రాగానే కోర్టులో వెక్కివెక్కి ఏడుస్తూ తాను తల్లీదండ్రిలేని అనాథనని, వదిలేయాలని ప్రాధేయపడ్డారు. తీరా జడ్జి లాయర్లను అడగ్గా తల్లిదండ్రులను చంపి వచ్చి ఈ బోనులో నిలబడ్డారు' అని చెప్పారన్నారు. ఇదీ చంద్రబాబు నైజమని, ఇలాంటి వాళ్లను నడిరోడ్డుపై కాల్చినా ఫర్వాలేదనిపిస్తోందన్నారు. ఇసుక నుంచి రాజధాని భూముల వరకు రూ.3.50 లక్షల కోట్లు దోచుకున్న చంద్రబాబు అధికార దుర్వినియోగం చేస్తూ డబ్బు, పదవుల ఆశ చూపుతూ రేటు కట్టి ఎమ్మెల్యేలను కొనుక్కుంటున్నారని విమర్శించారు. 'కలియుగ రాక్షసుడిని హతమార్చేందుకు ప్రజలు కంకణం కట్టుకోవాలి' అంటూ వ్యాఖ్యానించారు. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని, పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే బాధితుల సొమ్ము ఇస్తామన్నారు. కేసులు తిరగదోడి చంద్రబాబు చొక్కా, ఆదినారాయణరెడ్డి నిక్కరు వదిలించైనా డబ్బులు వసూలు చేస్తామన్నారు.

రాజీనామా చేసి రమ్మన్నా..: శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీలో చేరుతానని నా దగ్గరికి వచ్చినప్పుడు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రావాలని సూచించానని, చెప్పినట్లుగా ఆయన రాజీనామా చేశారని, దీనిని పులి, సింహం అంటారని, మంచి రాజకీయాలంటారని జగన్ అన్నారు.

నిరుద్యోగులకు 'జాబ్ కనెక్ట్'

ఈనాడు, హైదరాబాద్: విద్యార్హతలు, నైపుణ్యం ఉండి ఉద్యోగాల్లేని యువకులకు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'జాబ్ కనెక్ట్' పేరుతో సంచార ఉద్యోగ సమాచార వాహనాన్ని రూపొందించారు. ప్రతి పోలీస్ ఠాణా పరిధిలో తిరిగే ఈ వాహన సేవలను డీజీపీ అనురాగ్ శర్మ గురువారమిక్కడ జెండా ఊపి ప్రారంభించారు. అర్హులైన నిరుద్యోగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వివిధ కంపెనీలు, పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగాల వివరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీఎంఐ గ్రూపు అందించడం అభినందనీయమన్నారు. మొబైల్ యాప్ ద్వారా కూడా ఉద్యోగార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని డీజీపీ తెలిపారు. వేల సంఖ్యలో ఉన్న నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలిప్పించాలన్న లక్ష్యంతో 'జాబ్ కనెక్ట్' వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని నగర కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి చెప్పారు. సంచార వాహనంలోని హెల్ప్‌డెస్క్‌లో విద్యార్హతలను నమోదు చేసిన వెంటనే ఎక్కడెక్కడ ఉద్యోగాలున్నాయన్న వివరాలు వస్తాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ విద్యార్హతలుండి నైపుణ్యమున్న వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు అనేక కంపెనీల వివరాలను సేకరించామని టీఎంఐ గ్రూప్ ఛైర్మన్ మురళీధరన్ తెలిపారు. ఉద్యోగార్థులు www.hyderabadcitypolice.gov.in/jobs.html అన్న వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

అమ్మ చెంతకు నయీం పిల్లలు

ఈనాడు, హైదరాబాద్: తండ్రి ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తల్లిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అప్పటివరకు అమ్మానాన్నల నేరచరిత గురించి ఏమాత్రం తెలియని పసి హృదయాలను ఆ పరిణామాలు ఒక్కసారిగా హతాశుల్ని చేశాయి. అయినవాళ్ల ఆత్మీయ పలకరింపు కరవై ఆవేదనను రగిల్చాయి. రమారమి ఏడాది పాటు కుటుంబసభ్యుల ప్రేమానురాగాలకూ.. పుట్టి పెరిగిన పరిసరాలకు దూరమై, క్షణమొక యుగంలా కలవరించారు. ఎట్టకేలకు తల్లికి బెయిల్ రావడంతో, ఆమె చెంతకు చేరి ఆనంద పరవశులయ్యారు. వారే... కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ నయీం పిల్లలు!

షాద్‌నగర్‌లో గత ఏడాది ఆగస్టు 9న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీం హతమైన సంగతి తెలిసిందే. ఆ ఘటన అనంతరం అతని భార్య హసీనాను పోలీసులు అరెస్ట్ చేయడం... దాదాపు సమీప బంధువులంతా కారాగారాల బాట పట్టడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. అప్పట్లో నయీం పెద్ద కుమారుడు(15) పదోతరగతి, చిన్న కొడుకు 7, కుమార్తె రెండో తరగతిలో ఉన్నారు. ఎవరూ లేకపోవడంతో రంగారెడ్డి జిల్లా శిశు సంరక్షణ సమితి ఆ పిల్లల్ని తమ సంరక్షణలోకి తీసుకుంది. నయీం తనయుల్ని సైదాబాద్‌లోని బాలుర హోంలో, కూతురిని నార్సింగి హైదర్షాకోట్‌లోని కస్తూర్బా ట్రస్ట్‌లో ఉంచి, చదివించారు. అమ్మానాన్నలు దూరమై కలత చెందినా, నయీం పెద్దకుమారుడు పట్టుదలతో చదివాడు. మేలో వెలువడిన సీబీఎస్ఈ ఫలితాల్లో 5.7 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఏడాదిపాటు అయినవాళ్లకు దూరమైన ఆ చిన్నారులకు.. ఎట్టకేలకు గురువారం ఆత్మీయ స్పర్శ దొరికింది. బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన హసీనా.. శిశు సంరక్షణ సమితిని ఆశ్రయించి, పిల్లలను అప్పగించాలని దరఖాస్తు చేసుకుంది. గురువారం చిన్నారులు ఒక్కసారిగా తల్లిని కౌగిలించుకొని ఆనంద డోలికల్లో మునిగిపోయినట్లు సమితి సభ్యులు తెలిపారు. రెండు నెలల క్రితమే బెయిల్ పొందిన నయీం మేనకోడలు ఫర్హానా భర్త ఫయీమ్ మాత్రం.. ఈ రెండు నెలల కాలంలో అప్పుడప్పుడు వచ్చి పిల్లల్ని పలకరించేవాడు.

నయీం... ఓ మంచి నాన్న

హోముల్లో నయీం పిల్లలు తమ సత్ప్రవర్తనతో అందర్నీ ఆకట్టుకున్నారు. అప్పుడప్పుడు తల్లిదండ్రులను తలుచుకొని కుమిలిపోయినా, క్రమశిక్షణలో మాత్రం అక్కడి సిబ్బందిని ఆశ్చర్యపోయేలా చేశారు. నయీం క్రూరత్వానికి మారుపేరని చెప్పుకొంటున్నా, అతని పిల్లలు చాలా హుందాగా ప్రవర్తించడం వారిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. తోటి చిన్నారులతో వారు ఎంతో కలుపుగోలుగా ఉండేవారని హోం సిబ్బంది గుర్తుచేసుకున్నారు. "పిల్లల పెంపకం విషయంలో నయీంను మంచి తండ్రి అని చెప్పొచ్చు. తండ్రి నేర ప్రవర్తన పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతుందనుకున్నాం. కానీ ఆ ఛాయలేవీ వారిలో కనిపించలేదు. ఆ మాటకొస్తే... అమ్మానాన్నల చర్యలు ఆ పిల్లలకు ఏమాత్రం తెలిసినట్లు లేదు" అని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారిణి వెల్లడించారు.

భారీ గ్రహంలో నీటి ధగధగలు

'హబుల్' సాయంతో గుర్తించిన శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: గురుడిని పోలిన ఓ గ్రహంలో.. నీటి అణువుల ధగధగలను శాస్త్రవేత్తలు గుర్తించారు. భూమికి 900 కాంతి సంవత్సరాల దూరంలో డబ్ల్యూఏఎస్‌పీ-121బీ అనే ఈ భారీ వాయుగ్రహం ఉంది. దీనిపై ఇనుము సైతం కరిగేంతగా ఉష్ణోగ్రతలున్నట్లు శాస్త్రవేత్తలు చెప్పారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన హబుల్ టెలిస్కోప్ ద్వారా దీన్ని వారు పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా ఈ గ్రహం వాతావరణ పొరల్లో నీటి ఆవిరి మెరుస్తూ కనిపిస్తోందని అమెరికాలోని మేరీల్యాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తెలిపారు. స్పెక్ట్రోస్కోపీ అనే ప్రక్రియను ఉపయోగించి.. వివిధ కాంతి తరంగ దైర్ఘ్యాల వద్ద గ్రహం ప్రకాశిస్తున్న తీరును వారు విశ్లేషించారు. మాతృతారకు అత్యంత దగ్గరగా ఉండటంతో ఈ గ్రహంపై 2500 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్నట్లు వెల్లడించారు.

పొదుపు సంఘాల సహాయకురాలికి రూ.5 వేల వేతనం

- రూ.3 వేలు ప్రభుత్వం నుంచి..

ఈనాడు, హైదరాబాద్: స్వయం సహాయక (పొదుపు) సంఘాలకు తోడ్పడే గ్రామ సహాయకురాలికి (వీవోఏ) ఇకపై నెలకు రూ.5 వేల చొప్పున వేతనం అందనుంది. ఇందులో రూ.3 వేలను ప్రభుత్వం ఆర్థికసాయం పేరిట చెల్లిస్తుంది. ఇటువంటి ప్రభుత్వ చెల్లింపు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటుంది. వీవోఏల వేతనాలను పెంచనున్నట్లు ఇంతకు ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా గ్రామీణాభివృద్ధి శాఖ గురువారం పలు మార్గదర్శకాలతో ఒక ఉత్తర్వును జారీ చేసింది. గ్రామంలోని స్వయం సహాయక సంఘాలన్నీ కలిపి గ్రామ సంఘం(వీఓ)గా ఏర్పాటై తమ బృందాల్లోని చదువుకొన్న వారిని ఒకరిని సహాయకులుగా నియమించుకొంటూ ఉంటాయి. ఆయా బృందాల ఖాతాలను, పుస్తకాలను నిర్వహించటం, సభ్యులతో సమావేశాలను ఏర్పాటు చేయటం, రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ వంటి పనులను వీవోఏలు చేపడుతుంటారు. ఆయా స్వయం సహాయక సంఘాలు వివిధ పనుల ద్వారా ఆర్జించిన లాభాల నుంచి నెలవారీ కొంత మొత్తాన్ని ఈ సహాయకులకు చెల్లిస్తుంటాయి. అలా ఇచ్చేది నామమాత్రంగా ఉంటుండటంతో ఖాతాల నిర్వహణ వంటి ప్రధాన విధులపై ప్రభావం పడుతోంది. సంఘాలు బలోపేతం కావాలంటే తొలుత వీవోఏలకు వేతనాన్ని పెంచాల్సి ఉందని భావించిన సర్కారు.. తాను నెలకు రూ.3 వేల చొప్పున చెల్లించేందుకు ముందుకొచ్చింది. దీనికి ఆయా సంఘాలు మరో రూ.2 వేలను చేర్చి మొత్తం రూ. 5 వేల చొప్పున అందజేయాలి. వీఓఏ బాధ్యతలు, వారి ఎంపిక, ప్రస్తుతం విధుల్లో ఉన్నవారిని కొనసాగించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, కొత్త వారి ఎంపికకు అర్హతలు, తొలగింపు తదితరాలను తాజా ఉత్తర్వుల్లో గ్రామీణాభివృద్ధి శాఖ వివరించింది. ప్రభుత్వమిచ్చే రూ.3 వేలకు అదనంగా చెల్లించే మొత్తం కేవలం లాభాల నుంచి మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది.


చంచల్‌గూడ జైలుకు విక్రమ్‌గౌడ్

- బెయిల్ నిరాకరించిన కోర్టు
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



విక్రమ్‌గౌడ్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

ఫిల్మ్‌నగర్, చంచల్‌గూడ, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన కాల్పుల కేసులో మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌ను బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడి జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకున్న విక్రమ్‌గౌడ్ గురువారం డిశ్చార్జి అయ్యారు. వెంటనే బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. చక్రాల కుర్చీ మీదనే మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పోలీసు వాహనంలో నాంపల్లి కోర్టుకు తీసుకురాగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పోలీసులు అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. విక్రమ్‌గౌడ్ తరపు న్యాయవాదులు బెయిలుకోసం దరఖాస్తు చేసుకోగా న్యాయమూర్తి బెయిల్ నిరాకరించారు. బెయిల్ పిటిషన్‌ను మరోసారి శుక్రవారం విచారించనున్నట్లు తెలిసింది. జైలు అధికారులు నిబంధనల ప్రకారం విక్రమ్‌గౌడ్ నుంచి అవసరమైన వివరాలు సేకరించి, వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అపోలో వైద్యులు అందించిన కేషీటుకు అనుగుణంగా చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జైలు పర్యవేక్షణాధికారి సైదయ్య తెలిపారు.



నేటి నుంచే ఐఏఏఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్

పురుషుల 100మీ. హీట్స్ రాత్రి 12.50 నుంచి

అంతా బోల్ట్ మయం

రాత్రి 11.10 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో

క్రీడాభిమానులకు అంతులేని వినోదానికి హామీ ఇస్తూ అథ్లెటిక్స్ పండగొచ్చేసింది. అథ్లెట్లంతా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఏఏఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ నేటి నుంచే. ఎందరో మేటి ఆటగాళ్లు, ఎందరో రికార్డు స్థాపకులు లండన్ వేదికగా తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నా అందరి దృష్టీ ఒకే ఒక్కడిపైనే. చిరుత వేగంతో ఇన్నాళ్లు తమను అలరించి, మైమరపించి, అబ్బురపరిచిన అతడిపైనే. అవును.. స్ప్రింట్ రారాజు, జమైకా పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ తన ఆఖరి పోరాటానికి సిద్ధమవుతున్న వేళ ఆటల ప్రపంచమంతా ఉద్విగ్నతతో, ఆరాధనతో అతణ్నే చూస్తోంది. ఒలింపిక్ కింగ్ కడసరి విన్యాసాలను కనులారా వీక్షించి.. జ్ఞాపకాలను శాశ్వతంగా చేసుకోవాలన్నది ప్రతి అభిమాని ఆశ. దశాబ్ద కాలం ట్రాక్‌ను శాసించి.. చరిత్రలో తన అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న ఈ జమైకా యోధుడి ముగింపూ అంతే ఘనంగా ఉండాలన్నది ప్రతి ఒక్కరి ఆకాంక్ష. శుక్రవారం 100మీ హీట్స్‌లో పోటీపడే బోల్ట్.. శనివారం ఫైనల్స్‌లో ఉర్రూతలూగించనున్నాడు. తర్వాత 4×100లోనూ మెరవనున్నాడు.



ఖేల్‌రత్నకు జజారియా, సర్దార్

జ్యోతి సురేఖ, సాకేత్ మైనేని, పుజారా సహా 17 మందికి అర్జున!



జ్యోతి సురేఖ

సర్దార్, జజారియా

భారత బ్యాట్స్‌మెన్ దూకుడు మీదున్నారు.. గాలెలో పరుగుల వరద పారించిన కోహ్లి సేన.. రెండో టెస్టులోనూ జోరు షురూ చేసింది. కెరీర్‌లో 50వ టెస్టు ఆడుతున్న చెతేశ్వర్ పుజారా (128 బ్యాటింగ్; 225 బంతుల్లో 10×4, 1×6) అజేయ సెంచరీకి తోడు, అజింక్య రహానె (103 బ్యాటింగ్; 168 బంతుల్లో 12×4) శతకంతో మెరవడంతో గురువారం కొలంబోలో ప్రారంభమైన రెండో టెస్టులో భారత్ భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. తొలి రోజు ఆట ఆఖరికి టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 344 పరుగులు చేసింది.

50లో వందేశాడు

శతకంతో మెరిసిన చెతేశ్వర్

2 టెస్టుల్లో 4000 పరుగులు పూర్తి చేసిన పుజారా.. వేగంగా (84 ఇన్నింగ్స్‌ల్లో) ఈ మైలురాయిని అందుకున్న భారత బ్యాట్స్‌మెన్ జాబితాలో ద్రవిడ్‌తో కలిసి రెండో స్థానంలో నిలిచాడు



పుజారా 128 బ్యాటింగ్

రహానె 103 బ్యాటింగ్

రహానె సెంచరీ ● లంకతో రెండో టెస్టులో భారత్ 344/3

కొలంబో

తొలి టెస్టులో శ్రీలంకను చిత్తుగా ఓడించిన భారత్.. రెండో టెస్టునూ అదే ఉత్సాహంతో మొదలుపెట్టింది. చెతేశ్వర్ పుజారా, అజింక్య రహానె అజేయ సెంచరీలతో మెరిసిన వేళ.. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా కదులుతోంది. వీళ్లిద్దరు అభేద్యమైన నాలుగో వికెట్‌కు 211 పరుగులు జోడించి జట్టు ఇన్నింగ్స్‌ను పటిష్ఠపరిచారు.

ఐదు రన్‌రేట్‌తో..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ధావన్ (35; 37 బంతుల్లో 5×4, 1×6), కేఎల్ రాహుల్ (57; 82 బంతుల్లో 7×4) శుభారంభం అందించారు. దూకుడుగా ఆడిన ఈ జోడీ.. 5 రన్‌రేట్‌తో పరుగులు సాధించింది. తొలి టెస్టు వీరుడు ధావన్ మరోసారి వేగంగా పరుగులు రాబట్టాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే సిక్స్ బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. రాహుల్ కూడా ఆఫ్ సైడ్ డ్రైవ్‌లు, కట్ షాట్లతో అలరించడంతో భారత స్కోరు పరుగులెత్తింది. తొమ్మిదో ఓవర్లో భారత్ స్కోరు 50 పరుగులు దాటింది. ఈ స్థితిలో పెరీరా వేసిన బంతి ధావన్ ప్యాడ్లకు తాకినా.. అంపైర్ టకర్ ఔట్ ఇవ్వలేదు. కానీ రివ్యూలో ఔట్‌గా తేలడంతో శిఖర్ వెనుదిరిగాడు. ఈ స్థితిలో రాహుల్, కెరీర్‌లో 50వ టెస్టు ఆడుతున్న పుజారా మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడడంతో భారత్ 101/1తో లంచ్‌కు వెళ్లింది.

వరుసగా ఆరో అర్ధసెంచరీ: విరామం తర్వాత రాహుల్, పుజారాతో కలిసి నెమ్మదిగా పరుగులు రాబట్టాడు. వీలుచిక్కినప్పుడల్లా అద్భుత షాట్లు ఆడిన అతను.. హెరాత్ బౌలింగ్‌లో మిడాఫ్ మీదుగా బౌండరీ సాధించి 72 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇది అతనికి టెస్టుల్లో వరుసగా ఆరో అర్ధ శతకం. ఈ జోడీ బలపడుతున్న దశలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. హెరాత్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ దిశగా బంతిని నెట్టి రాహుల్ పరుగు కోసం ప్రయత్నించాడు. అవతలి ఎండ్‌లో ఉన్న పుజారా మొదట స్పందించి.. ఆ తర్వాత నిర్ణయం మార్చుకున్నాడు. అప్పటికే రాహుల్ సగం దూరం వచ్చేయడంతో అతను రనౌట్‌గా వెనుదిరగక తప్పలేదు. తొలి టెస్టులో సెంచరీ సాధించిన కెప్టెన్ కోహ్లి (13; 29 బంతుల్లో 2×4) కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. హెరాత్ ఆఫ్ సైడ్ ఊరిస్తూ వేసిన ఫ్లయిటెడ్ డెలివరీని వెంటాడి స్లిప్‌లో మాథ్యూస్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పటికి భారత్ స్కోరు 133/3. ఈ స్థితిలో పుజారా, రహానె లంక బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. పుజారా ఒకవైపు అడ్డుగోడగా నిలబడగా.. రహానె వేగంగా పరుగులు సాధించాడు. టీ విరామానికి భారత్ 238/3తో నిలిచింది.

ఫినిషింగ్ అదిరింది: ఆఖరి సెషన్లో పుజారా, రహానె స్వేచ్ఛగా ఆడారు. కళ్లుచెదిరే షాట్లు కొట్టిన ఈ జోడీ అలవోకగా పరుగులు రాబట్టింది. పిచ్ నెమ్మదిగా ఉన్నా.. బంతిని జాగ్రత్తగా అంచనా వేస్తూ.. కొలిచి షాట్లు కొట్టిన వీళ్లిద్దరు భారత్ స్కోరును వేగంగా పెంచారు. టీ విరామం తర్వాత పుజారా 164 బంతుల్లో ఈ సిరీస్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పుజారా శతకం చేసినప్పుడు అర్ధసెంచరీతో ఉన్న రహానె.. ఆ తర్వాత గేరు మార్చాడు. హెరాత్ బౌలింగ్‌లో సింగిల్ తీసి టెస్టుల్లో తొమ్మిదో సెంచరీ సాధించాడు. ఈ సెంచరీల్లో ఆరు విదేశాల్లో సాధించినవే. ఆఖరి సెషన్లో భారత్.. వికెట్లేమీ కోల్పోకుండా 106 పరుగులు చేసింది. లంక జట్టులో ఏకైక పేసర్ నువాన్ ప్రదీప్ గాయం కారణంగా తొలి రోజు ఆట మధ్యలోనే మైదానం వీడాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ ఎల్బీ (బి) పెరీరా 35; రాహుల్ రనౌట్ 57; పుజారా బ్యాటింగ్ 128; కోహ్లి (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13; రహానె బ్యాటింగ్ 103; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం:** (90 ఓవర్లలో 3 వికెట్లకు) **344;** **వికెట్ల పతనం:** 1-56, 2-109, 3-133; **బౌలింగ్:** నువాన్ ప్రదీప్ 17.4-2-63-0; హెరాత్ 24-3-83-1; కరుణరత్నే 3-0-10-0; దిల్‌రువాన్ పెరీరా 18-2-68-1; పుష్పకుమార 19.2-0-82-0; ధనుంజయ డిసిల్వా 8-0-31-0

6 కేఎల్ రాహుల్ వరుసగా సాధించిన అర్ధసెంచరీలు. రాహుల్ ద్రవిడ్, గుండప్ప విశ్వనాథ్ తర్వాత టెస్టుల్లో ఈ ఘనత అతనికే దక్కింది

7 50వ టెస్టులో సెంచరీ చేసిన ఏడో భారత బ్యాట్స్‌మెన్ పుజారా

13 పుజారాకు ఇది పదమూడో టెస్టు శతకం

● ఈ సీజన్లో 1000 టెస్టు పరుగులు పూర్తి చేసిన నాలుగో భారత ఆటగాడు రాహుల్. ఇంతకుముందు కోహ్లి, పుజారా, రహానె ఈ ఘనత సాధించారు.

దిల్లీ

భారత అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్‌రత్నకు నామినేట్ అయిన తొలి పారాలింపియన్‌గా జావెలెన్ త్రోయర్ దేవేంద్ర జజారియా ఘనత సాధించాడు. 36 ఏళ్ల జజారియా రెండు పారాలింపిక్ స్వర్ణాలు గెలుచుకున్న తొలి భారతీయుడు. జస్టిస్ (రిటైర్డ్) సీకే ఠక్కర్ నేతృత్వంలోని అవార్డుల కమిటీ అతడితో పాటు హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్‌ను కూడా ఖేల్‌రత్నకు నామినేట్ చేసింది. తెలుగు తేజాలు వెన్నం జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్).. క్రికెటర్ చెతేశ్వర్ పుజారా సహా 17 మంది క్రీడాకారులను అర్జున అవార్డుకు ప్రతిపాదించింది.

అవార్డుల కమిటీ జజారియాను తొలి ప్రాధాన్యతగా ఖేల్‌రత్న పురస్కారానికి ఎంపిక చేసింది. 31 ఏళ్ల సర్దార్‌ను రెండో ప్రాధాన్యతగా ఎంచుకుంది. ఐతే ఇద్దరికీ సంయుక్తంగా అవార్డు ఇవ్వాలని సూచించింది. జజారియా 2004, 2016 పారాలింపిక్స్‌ల్లో పసిడి పతకాలు నెగ్గగా.. మిడ్‌ఫీల్డర్ సర్దార్ నిలకడైన ప్రదర్శనతో అంతర్జాతీయ హాకీలో భారత్ ఎదుగుదలలో తనదైన పాత్ర పోషించాడు. సర్దార్.. 2008లో భారత హాకీ జట్టుకు అత్యంత పిన్నవయసు కెప్టెనయ్యాడు. 2015లో పద్మశ్రీ అవార్డును అందుకున్నాడు. గురువారం కమిటీ సమావేశం సందర్భంగా అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలపై చర్చ జరిగింది. కానీ హాకీలో అతడు సాధించిన ఘనతలను కమిటీ విస్మరించలేకపోయింది. జజారియా, సర్దార్‌లు ఇద్దరికీ అవార్డు ఇవ్వాలా లేదా ఒక్కరికే ఇవ్వాలా అన్నది క్రీడా మంత్రిత్వ శాఖ వచ్చే కొన్ని రోజుల్లో నిర్ణయిస్తుంది.

అర్జున.. హర్మన్‌ప్రీత్: ఇక అర్జున అవార్డుకు నామినేట్ అయిన వారి జాబితాలో టెస్టు క్రికెటర్ పుజారా, మహిళల ప్రపంచకప్ స్టార్ హర్మన్‌ప్రీత్ కౌర్.. పారాలింపిక్స్ పతక విజేతలు తంగవేలు మరియప్పన్, ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ, టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేని ఉన్నారు. 29 ఏళ్ల పుజారా నిరుడు భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు (1350) చేసిన ఆటగాడిగా నిలిచాడు. రియో పారాలింపిక్స్ హైజంప్ (ఎఫ్46)లో మరియప్పన్ స్వర్ణం నెగ్గాడు.

అర్జున అవార్డుకు నామినేటైంది వీళ్లే: వెన్నం జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్), కుష్‌బీర్ కౌర్ (అథ్లెటిక్స్), అరోకిన్ రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), పుజారా (క్రికెట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), బెంబెమ్ దేవి (ఫుట్‌బాల్), ఎస్.ఎస్.పి. చౌరాసియా (గోల్ఫ్), ఎస్వీ సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పీఎన్ ప్రకాశ్ (షూటింగ్), ఆంటోని అమల్‌రాజ్ (టీటీ), సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్), తంగవేలు (పారా-అథ్లెట్), వరుణ్ బట్టి (పారా -అథ్లెట్).

మన అర్జునులు



సాకేత్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఉయ్యూరు. విశాఖపట్నంలో స్థిరపడిన సాకేత్.. ప్రస్తుతం భారత డేవిస్ కప్ జట్టులో సభ్యుడు. ఇప్పటివరకు 9 ఐటీఎఫ్, 2 ఏటీపీ ఛాలెంజర్ సింగిల్స్ టైటిళ్లు కైవసం చేసుకున్నాడు.

ఆర్చరీలో లెక్కలేనన్ని పతకాలు జ్యోతిసురేఖ (విజయవాడ) సొంతం. 2008లో ఆర్చరీలో అడుగుపెట్టిన జ్యోతిసురేఖ ఇప్పటివరకు 70 అంతర్జాతీయ పతకాలు (ఆసియా క్రీడలతో సహా), 50 జాతీయ స్థాయి పతకాలు గెల్చుకుంది.

మంజుకు కాంస్యం

దిల్లీ: ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ (ఫిన్లాండ్)లో మంజు కుమారి (59 కిలోలు) కాంస్యం గెలుచుకుంది. మంజు రెండో బౌట్లో కుమానొ (జపాన్) చేతిలో ఓడింది. ఐతే కుమానొ ఫైనల్ చేరడంతో మంజుకు రెపిచేజ్ ఆడే అవకాశం దక్కింది. రెపిచేజ్ తొలి బౌట్లో 4-0తో గ్రేస్ కెనెట్ (కెనడా)పై గెలిచిన మంజు.. ఆపై ప్రొకొపెవ్‌నిక్ (ఉక్రెయిన్)ను ఓడించి కాంస్యం సొంతం చేసుకుంది.

ఆసీస్ ఆడుతుంది

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెట్లో జీతాల గొడవ ఎట్టకేలకు ముగిసింది. కొన్ని నెలల పాటు.. క్రికెటర్ల డిమాండ్‌ను పెడచెవిన పెట్టిన క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) చివరకు వెనక్కి తగ్గక తప్పలేదు. తమ వాటా తమకు దక్కకుంటే క్రికెట్ ఆడమని తెగేసి చెప్పడంతో పాటు నెల రోజులుగా ఆటకు దూరంగా ఉన్న క్రికెటర్లతో.. ఆస్ట్రేలియా బోర్డు గురువారం రాజీకి వచ్చింది. ఒప్పందంలో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆస్ట్రేలియా క్రికెటర్లు.. సీఏ ఆదాయంలో 30 శాతం వాటా అంటే దాదాపుగా 500 మిలియన్ల ఆస్ట్రేలియా డాలర్లు పొందనున్నారు.

అవమానం ఐదు

● సొంతగడ్డపై తేలిపోయిన తెలుగు జట్టు ● పట్నా చేతిలో చిత్తు ● వరుసగా ఐదో ఓటమి



ప్రొ కబడ్డీలో ఈనాడు

పుణేరీ పల్టన్× దబాంగ్ దిల్లీ రాత్రి 8 నుంచి

బెంగళూరు బుల్స్ × తమిళ్ తలైవాస్ రాత్రి 9 నుంచి

వేదిక: నాగ్‌పూర్; ప్రసారం: స్టార్ స్పోర్ట్స్-2లో

ఈనాడు - హైదరాబాద్

రైడింగ్‌లో రాణిస్తే.. డిఫెన్స్‌లో వైఫలం. డిఫెన్స్‌లో మెరిస్తే.. రైడింగ్‌లో నిర్లక్ష్యం. కలిసికట్టుగా ఆడింది లేదు.. సమష్టిగా సత్తాచాటింది లేదు.. జట్టుగా రాణించిన సందర్భం అసలే లేదు. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ తీరిది. పేలవమైన ప్రదర్శనతో ఆ జట్టు మరో ఓటమిని మూటగట్టుకుంది. ఆరింట్లో కేవలం ఒక్క మ్యాచ్‌లోనే నెగ్గి.. ఐదింట్లో ఓడిన టైటాన్స్ సొంతగడ్డపై పూర్తిగా తేలిపోయింది.

స్టార్ ఆటగాళ్ళతో ఉన్న తెలుగు టైటాన్స్ వరుస వైఫల్యాలతో అభిమానుల్ని నిరాశ పరుస్తూనే ఉంది. నిలకడలేమి, నిర్లక్ష్యం, ప్రణాళికలోపంతో వరుసగా ఐదో ఓటమితో ఉసూరుమనిపించింది. గురువారం గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో టైటాన్స్ 36-43తో డిఫెండింగ్ ఛాంపియన్స్ పట్నా పైరేట్స్ చేతిలో చిత్తయింది. పట్నా కెప్టెన్ ప్రదీప్ నర్వాల్, ప్రధాన రైడర్ మోను దెబ్బకు టైటాన్స్ విలవిల్లాడింది. టైటాన్స్‌ను రెండు సార్లు ఆలౌట్ చేసిన పట్నా.. మూడు సార్లు సూపర్ ట్యాకిల్స్‌తో అదరగొట్టింది. ప్రథమార్ధంలో పట్నాదే పైచేయి. ఆరంభంలో ఇరుజట్లు సమంగా కనిపించినా.. పట్నా గేరు మార్చి ముందుకెళ్ళింది. టైటాన్స్‌ను ఆలౌట్ చేసి 19-15తో ఆధిక్యంలోకి దూసుకెళ్ళింది. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరిని లక్ష్యంగా చేసుకున్న పట్నా.. అతడిని వీలైనంత ఎక్కువసేపు బెంచ్‌పై కూర్చునేలా చేయడంలో విజయవంతమైంది. ప్రథమార్ధం ముగిసేసరికి పట్నా 23-16తో ముందంజ వేసింది.

ద్వితీయార్ధం ఆరంభమయ్యే సమయానికి రాహుల్ 10 నిమిషాలు కోర్టు బయటే ఉన్నాడు. దీన్ని అనుకూలంగా మలుచుకున్న పట్నా రెచ్చిపోయింది. ప్రదీప్ (12 పాయింట్లు), మోను (10) రైడ్ పాయింట్లతో చెలరేగగా.. వినోద్‌కుమార్ (4), జైదీప్ (4) దుర్భేధ్యమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఒకదశలో పట్నా 16 పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. మరో 5 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా రాహుల్ (12) ఫామ్‌లోకి వచ్చాడు. వరుసగా రైడ్ పాయింట్లు సాధించి ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించాడు. చూస్తుండగానే 10 రైడ్ పాయింట్లు సంపాదించాడు. సబ్‌స్టిట్యూట్ రక్షిత్ (4).. ఆల్‌రౌండర్ రాకేశ్‌కుమార్ (6) కూడా రాణించడంతో పట్నా ఆలౌటైంది. చివరి 5 నిమిషాల్లో టైటాన్స్ 12 పాయింట్లు గెల్చుకోగా.. పట్నా 3 పాయింట్లే సాధించింది. అయినా టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. ఆఖర్లో టైటాన్స్ పోరాటం అంతరాన్ని తగ్గించిందే తప్ప ఆ జట్టును ఓటమి నుంచి కాపాడలేకపోయింది. ఈ సీజన్‌లో పట్నా చేతిలో టైటాన్స్‌కు ఇది రెండో ఓటమి.

● బాంబ్రి సంచలనం



వాషింగ్టన్: భారత యువ టెన్నిస్ ఆటగాడు యుకి బాంబ్రి సంచలన విజయం సాధించాడు. సీటీ ఓపెన్ ఏటీపీ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నం.22 ఆటగాడు గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)కు షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్లో యుకి 6-3, 4-6, 7-5తో ఆరోసీడ్ మోన్‌ఫిల్స్‌ను ఓడించాడు. కెరీర్లో అతడికిది రెండో అతి పెద్ద విజయం. 2014 చెన్నై ఓపెన్‌లో బాంబ్రి ప్రపంచ నం.15 ఫాబియో ఫాగ్నిని (ఇటలీ)పై గెలిచాడు.

● మెరిసిన మనీష్; భారత్-ఎ విజయం

ప్రిటోరియా: మనీష్ పాండే (93 నాటౌట్; 85 బంతుల్లో 5×4, 2×6) మెరవడంతో మూడు దేశాల వన్డే టోర్నీలో భారత్-ఎ ఒక వికెట్ తేడాతో దక్షిణాఫ్రికా-ఎను ఓడించింది. మొదట దక్షిణాఫ్రికా 48.2 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. శార్దూల్ (4/35), సిద్దార్థ్ (3/41) ప్రత్యర్థిని కట్టడి చేశారు. భారత్ జట్టు 49.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఒక దశలో 71 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఐతే శాంసన్ (68) తోడుగా పాండే ఇన్నింగ్స్ నిలబెట్టాడు. శాంసన్ నిష్క్రమించినా ఆఖరి వరకు నిలిచి మనీష్ జట్టును గెలిపించాడు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00